

ఈనాడు



కరీంనగర్ 1-8-2017 మంగళవారం సిటీ సంపుటి 43 సంచిక 353
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 5-00. పేజీలు 14+16 www.eenadu.net
Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Anantapur, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

● వడ్డన

వంటగ్యాస్ రాయితీ ఎత్తివేత



- ప్రతి నెలా సిలిండర్ ధర పెంచుతూ అమలు
- రాయితీ సున్నాకు చేరేంత వరకు నెలకు రూ.4 పెంపు

దిల్లీ: వంటగ్యాస్‌పై కేంద్ర ప్రభుత్వం రాయితీని ఎత్తివేయనుంది. అయితే ఒకేసారి రద్దు నిర్ణయం తీసుకోకుండా అంచలంచెలుగా అమలు చేయనుంది. వచ్చే ఏడాది మార్చి నాటికి రాయితీ అనేదే లేకుండా ఉండేందుకు ఒక్కో సిలిండర్‌పై నెలకు (మిగతా 2లో)

● కోత

పొదుపు ఖాతాలపై వడ్డీ తగ్గింపు



- ఎస్‌బీఐలో ఇకపై లభించే వడ్డీ 3.5 శాతమే
- 90 శాతం ఖాతాలపై ప్రభావం

దిల్లీ: పొదుపు ఖాతాలపై వడ్డీరేటును ఎస్‌బీఐ అరశాతం తగ్గించింది. ఇప్పటివరకు 4శాతం ఉండగా.. 3.5 శాతానికి కుదించింది. రూ.1 కోటి వరకు నిల్వ ఉన్న ఖాతాలకు ఈ కోత వర్తిస్తుంది. సామాన్యుల నుంచి సంపన్నులపైనా ఈ ప్రభావం పడుతుంది.

- వివరాలు బిజినెస్ పేజీలో

● ఊరట

ఐటీ రిటర్నుల గడువు పొడిగింపు



- 5 వరకు దాఖలు చేయొచ్చు
- పాన్-ఆధార్ అనుసంధానం గడువు 31 వరకు పెంపు

దిల్లీ: ఆదాయపు పన్ను రిటర్నుల దాఖలు గడువును ప్రభుత్వం చివరి నిమిషంలో పొడిగించింది. ఆగస్టు 5వరకు రిటర్నులను సమర్పించవచ్చని ఆదాయపు పన్ను (ఐటీ) విభాగం ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. రిటర్నుల దాఖలులో పన్నుచెల్లింపు (మిగతా 2లో)



మూడేళ్లలో 1200 గిరిజన ఆవాసాలకు రహదారులు

- వెంటనే పనులను ప్రారంభించాలి
- ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలోని 1200 గిరిజన ఆవాసప్రాంతాలకు మూడేళ్లలో రహదారి సౌకర్యం కల్పించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు. దీనిపై ప్రణాళిక రూపొందించి వెంటనే పనులు ప్రారంభించాలని సూచించారు. ఉట్నూరు తదితర గిరిజన ప్రాంతాల్లో సరైన రహదారులు లేక గిరిజనులు పడుతున్న ఇబ్బందులు సీఎం దృష్టికి రావడంతో దీనిపై ఆయన తమ కార్యాలయ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి భూపాల్ రెడ్డితో పాటు (మిగతా 2లో)

ధరపై దండా సాగదు

విత్తన కంపెనీలకిక అడ్డుకట్ట

- నేరుగా ఇతర రాష్ట్రాల సంస్థలతో ఒప్పందాలు
- అక్కడి నుంచి కొనాలి.. ఇక్కడ పండేవి అమ్మాలి
- ప్రైవేటు కంపెనీల నుంచి కొనుగోళ్లు వద్దు..
- తెలంగాణ వ్యవసాయశాఖ నిర్ణయం



ఈనాడు - హైదరాబాద్

తెలంగాణ రైతులకు రాయితీపై అందించే విత్తనాల కొనుగోళ్లలో ప్రైవేటు కంపెనీలకు పూర్తిగా అడ్డుకట్ట వేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఇక్కడ కొరత ఉన్న విత్తనాలను కొనేందుకు ఇప్పటివరకు టెండర్లు పిలిచి ప్రైవేటు విత్తన కంపెనీలు చెప్పిన ధరకు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో కంపెనీలన్నీ ఏకమై ఏటా రూ.కోట్లు దోచుకుంటున్నాయి. దీన్ని నివారించేందుకు ఇకపై నేరుగా ఇతర రాష్ట్రాల విత్తనాభివృద్ధి సంస్థలతో ఒప్పందాలు చేసుకోనున్నారు. అక్కడి ప్రభుత్వ సంస్థలు రైతులతో పండించే నాణ్యమైన విత్తనాలను కొనాలన్నది ఈ ఒప్పందాల సారాంశం. ప్రస్తుతం సోయాచిక్కుడు, జనుము, జీలుగ, పిల్లిపెసర తదితర పంటల విత్తనాలను మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్ కంపెనీల నుంచి; సెనగ ఆంధ్రప్రదేశ్ నుంచి; మొక్కజొన్న కర్ణాటక కంపెనీల నుంచి కొంటున్నారు. దీంతో ప్రైవేటు కంపెనీలు ఆడింది ఆటగా సాగుతోంది. వచ్చే ఏడాది నుంచి ఆయా రాష్ట్రాల విత్తన సంస్థల నుంచే నేరుగా కొంటారు. దీనివల్ల ఇష్టారీతిగా ధర పెంచడం వంటి వ్యవహారాలు తగ్గి తెలంగాణకు ఆదా అవుతుంది. ఇక్కడ పండే వేరుసెనగ విత్తనాలను ప్రైవేటు వ్యాపారులు రైతుల నుంచి కొని ఏపీ ప్రభుత్వానికి అమ్ముతున్నారు. మహబూబ్‌నగర్ పాత జిల్లా పరిధిలో యాసంగి సీజన్‌లో పండే వేరుసెనగ విత్తనాలకు మరుసటి వానాకాలం సీజన్‌లో ఏపీలో అధిక డిమాండ్ ఉంటోంది. అలాగే సజ్జ, వరి సంకరజాతి విత్తనాలను రాజస్థాన్, బిహార్ తదితర రాష్ట్రాల ప్రభుత్వాలు కొంటున్నాయి. ఈ వ్యవహారమంతా ప్రైవేటు కంపెనీలకు, ఏపీతో పాటు యూపీ, బిహార్ రాష్ట్ర ప్రభుత్వాలకు మధ్య జరుగుతున్నందున తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ(టీఎస్ సీడ్స్)కు ఏమీ ఆదాయం ఉండట్లేదు. టీఎస్ సీడ్స్ కూడా నేరుగా రైతులతో విత్తనాలు పండించి ఆయా రాష్ట్రాల ప్రభుత్వ సంస్థలకు విక్రయిస్తే అధిక ఆదాయం వస్తుందని వ్యవసాయశాఖ గుర్తించింది. టీఎస్ సీడ్స్‌కు ఆదాయం పెరిగితే ఇక్కడి రైతులకు అధిక ధరలు ఇవ్వడానికి మార్గం సుగమమవుతుంది. ఇకనుంచి ఇతర రాష్ట్రాలకు అవసరమైన సంకరజాతి విత్తన పంటలను సైతం టీఎస్ సీడ్స్ ఆధ్వర్యంలో రైతులతో సాగు చేయించాలని మరో నిర్ణయం తీసుకున్నారు. కంది, మినుము, పెసర, జొన్న, మొక్కజొన్న సంకరజాతి విత్తనాలను రాయితీపై వ్యవసాయశాఖ విక్రయించాలంటే ప్రైవేటు కంపెనీల నుంచే కొనాల్సి వస్తోంది. ఈ కంపెనీలు ఏటా ధరలు పెంచుతున్నందున ఖజానాపై భారం పెరుగుతోంది. ఈ ఏడాది రాయితీ భారం రూ.150 కోట్లకు చేరవచ్చని అంచనా. నేరుగా టీఎస్ సీడ్స్ రైతులతో ఒప్పందాలు చేసుకుని సంకరజాతి విత్తన పంటలు సాగుచేయిస్తే ఈ భారం చాలావరకూ తగ్గుతుంది. ఇతర రాష్ట్రాల విత్తనాభివృద్ధి సంస్థలతో క్రయ, విక్రయాలు చేసుకునేందుకు ఒప్పందాల కోసం సెప్టెంబరు ఆరంభంలో హైదరాబాద్‌లో జాతీయ స్థాయి సదస్సును నిర్వహిస్తామని వ్యవసాయశాఖ కార్యదర్శి పార్థసారథి చెప్పారు. సోమవారం టీఎస్ సీడ్స్ అధికారులతో సమావేశమై ఇతర రాష్ట్రాలతో చేసుకోవాల్సిన ఒప్పందాలపై సూచనలు చేసినట్లు తెలిపారు.



ఫేస్‌బుక్‌ను ధిక్కరించిన 'చిట్టి'

- అదుపు తప్పిన రోబోలు
- సొంతంగా భాష అభివృద్ధి.. వాటిలోనే సంభాషణ
- శాస్త్రవేత్తల కోడ్‌కు ధిక్కరణ
- షట్‌డౌన్ చేసిన నిపుణులు

2లో

సీటొచ్చినా చేరకపోతే వేటు

- మొదట చేరితేనే తదుపరి కౌన్సెలింగ్‌కు అర్హులు
- ప్రైవేటు కళాశాలల దందాను అరికట్టేందుకే..
- కాళోజీ వర్సిటీ కొత్త నిబంధన



ఋణమో రామచంద్రా..

ఆరుగాలం శ్రమించి సమాజానికి పట్టెడన్నం పెట్టే రైతన్నకు అడుగడుగునా అవస్థలే. వానాకాలం సీజన్ ఆరంభమై రెండు నెలలు గడుస్తున్నా రుణాలు లభించటం లేదు. నిర్మల్ జిల్లా బాసర మండల కేంద్రంలో రుణం కోసం అన్నదాతలు భగీరథయత్నమే చేస్తున్నారు. సోమవారం బ్యాంకు తెరిచేకంటే ముందే ఉండాలని ఆదివారం రాత్రి నుంచే పడిగాపులు కాస్తున్నారు. పాసుపుస్తకాలను వరుసలో ఉంచి బ్యాంకు గేటు ముందే నిద్రిస్తున్నారు. అన్నపానీయాలు లేకుండా 20 గంటల నిరీక్షణ అనంతరం రుణం పొందుతున్నారు. 3500 మంది రైతుల ఖాతాలున్న బ్యాంకులో రోజుకు 30 మందికి మాత్రమే రుణం ఇవ్వాలని బ్యాంకు అధికారులు పెట్టుకున్న నిబంధన.. చేను, ఇల్లు, భార్యాపిల్లలను వదిలి అన్నదాతలు బ్యాంకు గుమ్మంలో నిరీక్షించేలా చేస్తోంది.

- న్యూస్‌టుడే, బాసర

ఆదివారం రాత్రి బాసర ఎస్‌బీఐ ముందు పాస్‌పుస్తకాలను వరుసలో పెట్టి నిద్రిస్తున్న రైతులు

రెరా ఇప్పుడే రాదుగా

- మార్గదర్శకాలు మరింత జాప్యం!
- కేంద్రం ఇచ్చిన మూణ్నెల్ల గడువు ముగిసింది
- ప్రాధికార సంస్థ ఏర్పాటుపై ఇంకా నిర్ణయం తీసుకోని తెలంగాణ సర్కారు
- స్థిరాస్తి వ్యాపారుల్లో గందరగోళం

ఈనాడు - హైదరాబాద్

గడువు ముగిసినా తెలంగాణ రాష్ట్రంలో స్థిరాస్తి నియంత్రణ, అభివృద్ధి చట్టం(రెరా) మార్గదర్శకాలు సిద్ధం కాలేదు. జులై 31లోపు రెరా చట్టం నోటిఫికేషన్ చేయడంతోపాటు ప్రాధికార(అథారిటీ) సంస్థను ఏర్పాటు చేయాల్సి ఉంది. నేటి నుంచి అమల్లోకి రావాల్సి ఉన్నప్పటికీ పూర్తి సందిగ్ధత నెలకొంది. కేంద్రం చేసిన స్థిరాస్తి చట్టం ఈ ఏడాది మే 1 నుంచి అమల్లోకి వచ్చింది. దీని అమలుకు మార్గదర్శకాల రూపకల్పన, అథారిటీని ఏర్పాటు చేసుకునేందుకు రాష్ట్రాలకు ఇచ్చిన మూణ్నెల్ల గడువు సోమవారంతో ముగిసింది. రెరా నిబంధనలకు రాష్ట్ర మంత్రిమండలి ఆమోదముద్ర వేసిన తర్వాత నోటిఫై అవుతాయి. సుమారు రెండు నెలలు పైగా మార్గదర్శకాలను రూపొందించడంపై పురపాలకశాఖ కసరత్తు చేసి నమూనాను రూపొందించింది. వీటిపై మరింత అధ్యయనం చేసి మార్పులుచేర్పులు చేసిన తర్వాత నోటిఫై చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న స్థిరాస్తి ప్రాజెక్టులతోపాటు కొత్తగా నిర్మించాల్సిన భవననిర్మాణ ప్రాజెక్టులను రెరా ప్రాధికార సంస్థ వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. నిబంధనలు ఖరారవకపోవడం, (మిగతా 2లో)



చైనా దుస్సాహసం

- భారత్ సరిహద్దుల్లో వరుసగా అతిక్రమణలు
- ఉత్తరాఖండ్‌లోని బారాహోతిలో కిలోమీటరు దూరం వరకూ ప్రవేశం
- జులై 15, 25 తేదీల్లో ఘటనలు

2లో

తెలంగాణకు ఎలక్ట్రానిక్ పరిశ్రమల సముదాయం

- మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం
- రూ.667 కోట్ల సాయానికి సుముఖత
- హర్షం వ్యక్తంచేసిన మంత్రి కేటీఆర్
- రంగారెడ్డి జిల్లాలో 600 ఎకరాల్లో ఏర్పాటు

సిట్ రెండో జాబితాపై ఉత్కంఠ

ఈనాడు - హైదరాబాద్



సోమవారం హైదరాబాద్ నాంపల్లిలోని ఎక్సైజ్ కార్యాలయం వద్ద సినీ నటుడు తనీష్

'మత్తు'తో నాకు సంబంధం లేదు: తనీష్ 2లో

మాదకద్రవ్యాల కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) రెండో జాబితా ఎప్పుడు విడుదల చేస్తుంది, ఇందులో ఎవరెవరు ఉంటారనేది చర్చనీయాంశంగా మారింది. మొదటి విడత విచారణలో భాగంగా సినీ పరిశ్రమకు చెందిన 12 మందితోపాటు ఇంజినీరింగ్ విద్యార్థులు, వివిధ బహుళజాతి సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు మొత్తం దాదాపు వెయ్యిమందికి నోటీసులు పంపారు. వీరిలో ముఖ్యమైన వారిని విచారిస్తున్నారు. సినీ పరిశ్రమకు సంబంధించి 11 మందిని విచారించగా చివరగా మంగళవారం నందును విచారించనున్నారు. దాంతో మొదటి విడత జారీ చేసిన 12 మంది సినీ ప్రముఖుల విచారణ పూర్తవుతుంది. దాంతో సిట్ తదుపరి ఏమిచేయబోతుందనేది ఆసక్తికరంగా మారింది.

ముమ్మర కసరత్తు

మత్తుమందులు సరఫరా చేస్తున్న కెల్విన్ ముఠాను విచారించడం ద్వారా వెల్లడైన అంశాల ఆధారంగా మొదటి విడత జాబితా రూపొందించారు. సినీ ప్రముఖులతోపాటు అనేకమందిని విచారించడం ద్వారా సిట్ అధికారులు చాలా సమాచారం సేకరించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం మత్తుమందులు ఎవరెవరు.. ఎలా సరఫరా చేస్తారు? దీనికి సంబంధించి చెల్లింపులు ఎలా జరుగుతాయి? ఎవరెవరు క్రమం తప్పకుండా వాటిని తీసుకుంటారు? తదితర వివరాలు రాబట్టినట్లు తెలుస్తోంది. ఇందులోనూ సినీ పరిశ్రమకు సంబంధించి విలువైన సమాచారమే సేకరించినట్లు తెలుస్తోంది. విచారణకు హాజరైన వారు అధికారికంగా కొన్ని వివరాలు చెప్పగా అనధికారికంగా మరికొన్ని విలువైన సమాచారం ఇచ్చినట్లు, ఇందులో అనేక మంది సినీ ప్రముఖుల పేర్లు ఉన్నట్లు తెలుస్తోంది. కేవలం వీరు చెప్పిన వాంగ్మూలం ఆధారంగా వారందరికీ నోటీసులు జారీ చేయడం సాధ్యంకాదు కాబట్టి మరికొన్ని ఆధారాలు సేకరించిన తర్వాత నోటీసులు జారీ చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. సినీ పరిశ్రమకు మత్తుమందులు సరఫరా చేసేవారెవరనేది తేలిపోయింది. అలాగే సినీ ప్రముఖులు ఎక్కడెక్కడ పార్టీలు చేసుకుంటారో (మిగతా 2లో)

ఇదీ సంగతి!



బీఎస్ఎన్ఎల్‌పై బాట్‌నెట్ దాడి

రాష్ట్రంలో లక్ష మందికి పైగా కష్టాలు ● వైరస్ ప్రభావంతో పనిచేయని ఇంటర్నెట్

ఈనాడు - హైదరాబాద్

ప్రభుత్వరంగ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్ బ్రాడ్‌బ్యాండ్‌ను లక్ష్యంగా చేసుకుని సైబర్ హ్యాకర్లు తెగబడ్డారు. దేశవ్యాప్తంగా ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయేలా 'బాట్‌నెట్' వైరస్‌ను చొప్పించారు. మూడురోజుల క్రితమే దీన్ని గుర్తించి, పరిష్కరించారు. అయినా నేటికీ ప్రజలకు సేవల్లో అంతరాయం కలుగుతోంది. వ్యక్తిగత మోడెమ్‌లలో సెట్టింగ్స్ ప్రభావితం కావడంతో 40 శాతానికి పైగా బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారులకు ఇంటర్నెట్ పనిచేయడం లేదు. మూడు రోజుల క్రితం బీఎస్ఎన్ఎల్ కేంద్రీయ ఎన్ఐబీ సర్వర్లు, అంతర్గత మోడెమ్‌లపై వైరస్ దాడితో దేశంలోని పలు నగరాల్లో సేవలు స్తంభించాయి. శనివారం ఉదయానికే హ్యాకర్ల దాడిని గుర్తించి, సమస్యను పరిష్కరించారు. హైదరాబాద్‌తో పాటు తెలంగాణ వ్యాప్తంగా ఇంటర్నెట్ పనిచేయలేదు. వినియోగదారుల వ్యక్తిగత మోడెమ్‌లో సమాచారం ప్రభావితం కావడంతో, వాటిని పునరుద్ధరించాలని అధికారులు నిర్ణయించారు. సాంకేతిక సహాయం కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, అదనంగా సిబ్బందిని నియమించారు.

మరింత సమయం: బీఎస్ఎన్ఎల్ బ్రాడ్‌బ్యాండ్‌కు ఏడీఎస్ఎల్‌తో కూడిన మోడెమ్‌లు ఉంటాయి. వీటిద్వారా (మిగతా 2లో)



మీకు న్యాయం జరిగే దాకా పోరాడతాం

- నేరెళ్ల, జిల్లెల బాధితులకు మీరాకుమార్ భరోసా
- బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ వేధింపుల కేసు పెట్టాలని డిమాండు
- బాధితుల కుటుంబాలకు పరామర్శ
- తరలివచ్చిన కాంగ్రెస్ ప్రముఖులు

-3లో

బాధిత కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మీరాకుమార్

సీటొచ్చినా చేరకపోతే వేటు

ఈనాడు - హైదరాబాద్

ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో కన్వీనర్ కోటాలో తొలివిడత వెబ్ కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు కచ్చితంగా తమకు కేటాయించిన కళాశాలలో చేరాల్సిందే. తొలివిడత కౌన్సెలింగ్‌లో సీటొచ్చినా చేరకపోతే.. తదుపరి కౌన్సెలింగ్‌లో దరఖాస్తు చేసుకోవడానికి వారు అనర్హులవుతారు. కాళోజీ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ఈ ఏడాది నుంచి కొత్త నిబంధనను తెరపైకి తెచ్చింది. దీనివల్ల వైద్యవిద్యపై నిజంగా ఆసక్తి ఉన్న అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేస్తారని, పదేపదే అన్ని ప్రవేశాల్లోనూ దరఖాస్తు చేసుకుంటూ.. చేరకుండా దాటవేసే అభ్యర్థులను నివారించే ఉద్దేశంతో ఈ నిబంధన పెట్టినట్లు వర్సిటీ వర్గాలు తెలిపాయి.

ఇవీ నిబంధనలు..

- ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో సీటు పొందిన అభ్యర్థి నిర్దేశించిన తేదీలోపు కేటాయించిన కళాశాలలో చేరాలి.
- కన్వీనర్ కోటాలో సీటు పొందితే ఆయా కళాశాలల్లో ప్రవేశాలకు ముందే రుసుము చెల్లించాలి.
- దీంతోపాటు రూ.3 లక్షలకు పూచీకత్తు సమర్పించాలి.
- ఒకవేళ తొలివిడత ప్రవేశాల్లో బీడీఎస్‌లో సీటొచ్చినా.. రెండోవిడత ప్రవేశాల్లో ఎంబీబీఎస్‌లో సీటు ఆశిస్తున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
- అయితే తొలివిడతలో పొందిన అభ్యర్థులు మలివిడత ప్రవేశాల్లో దరఖాస్తు చేసుకోవాలంటే.. తొలిదశ సీటును ముందే ఉపసంహరించుకోవాలా? అనే ఆందోళన విద్యార్థుల్లో నెలకొంది.
- దీనిపై కాళోజీ వర్సిటీ అధికారులు స్పష్టతనిచ్చారు. తొలిదశలో పొందిన సీటును ఉపసంహరించుకోవాల్సిన అవసరంలేకుండానే.. రెండోవిడతకు దరఖాస్తు చేసుకోవచ్చు.
- తొలిదశ ప్రవేశాల్లో సీటు లభించని వారూ ఎలాగూ నేరుగా రెండోవిడత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకుంటారు.
- మలివిడత ప్రవేశాల ప్రక్రియ కోసం మరోదఫా రూ. 10 వేలు చెల్లించనక్కర్లేదు. తొలివిడత ప్రవేశాల సందర్భంగా కాళోజీ వర్సిటీకి చెల్లించిన రూ. 10 వేలు రుసుం దీనికీ వర్తిస్తుంది.
- ఒకవేళ రెండోవిడత ప్రవేశాల్లో.. కోరుకున్న విధంగా ఎంబీబీఎస్ సీటు వస్తే.. తొలివిడతలో పొందిన బీడీఎస్ సీటు పోయినట్లే.
- కాళోజీ వర్సిటీ పరిధిలోని కళాశాలల్లోనే చేరికల్లో మార్పులు జరిగితే.. మరో దఫా రూ.3 లక్షల పూచీకత్తు ఇవ్వనక్కర్లేదు. అంతర్గతంగా సర్దుబాటు అవుతుంది.
- తొలివిడత ప్రవేశాల్లో పొందిన సీటు కోసం చెల్లించిన రుసుమును.. నిబంధనల ప్రకారం సర్దుబాటు చేస్తారు. ఉదాహరణకు తొలివిడత ప్రవేశాల్లో ప్రైవేటు వైద్యకళాశాలల్లో బీడీఎస్‌లో సీటొస్తే రూ. 45 వేలు కన్వీనర్ కోటాలో చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ రెండోవిడతలో ప్రభుత్వ కళాశాలలో ఎంబీబీఎస్‌లో సీటొస్తే.. అప్పుడు రుసుము రూ.10 వేలే. అంటే మిగిలిన రూ. 35 వేలు వెనక్కు ఇస్తారు. అలాకాకుండా ప్రైవేటు వైద్యకళాశాలల్లో ఎంబీబీఎస్ సీటొస్తే.. అప్పుడు రుసుము రూ. 60 వేలు. అంటే అభ్యర్థే మరో రూ.15 వేలు చెల్లించాల్సి ఉంటుంది.

ఎందుకీ నిబంధన?

కొన్ని ప్రైవేటు వైద్యకళాశాలలు మంచి ర్యాంకు సాధించిన విద్యార్థులను ప్రలోభాలకు గురిచేస్తున్నాయనే ఆరోపణలున్నాయి. అప్పటికే జాతీయస్థాయి వైద్యవిద్య సంస్థల్లో సీటు సాధించిన విద్యార్థులను ఎంపిక చేసుకుని.. ప్రతి కౌన్సెలింగ్‌లోనూ తమ కళాశాలల్లో చేరడానికి ఐచ్ఛికాలిచ్చేలా వారిని ప్రోత్సహిస్తున్నట్లు తెలుస్తోంది. ఎలాగూ మంచి ర్యాంకు ఉంది కాబట్టి.. తప్పనిసరిగా వారికే ఆ కళాశాలలో సీటు వస్తుంది. కానీ చేరరు. అలా చివరి రౌండ్ వరకూ దాటవేసి చివరకు వదిలేస్తారు. దీంతో ఆ సీటు ప్రైవేటు కళాశాలలు యాజమాన్య కోటాలో భర్తీ చేసుకునే వెసులుబాటు కలుగుతుంది. కన్వీనర్ కోటాలో రూ. 60 వేలతో భర్తీ చేయాల్సిన సీటును యాజమాన్య కోటాలో రూ. 11.55 లక్షలకు కేటాయించుకోడానికి అవకాశాలేర్పడుతున్నాయి. ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకున్న కాళోజీ వర్సిటీ.. సీటొచ్చిన అభ్యర్థి కచ్చితంగా కళాశాలలో చేరాలనే నిబంధనను కఠినతరం చేసినట్లు తెలుస్తోంది.

చైనా దుస్సాహసం

దిల్లీ

సరిహద్దుల వెంట చైనా మరోసారి తన వక్రబుద్ధిని చాటుకొంది. ఆ దేశానికి చెందిన ప్రజా విమోచన సైన్యం (పీఎల్ఏ) భారత్ భూభాగాల్లోకి దాదాపు కిలోమీటరు వరకు చొరబడి రెండు గంటల తర్వాత తిరిగి వెళ్లింది. ఈ ఘటన ఉత్తరాఖండ్‌లోని బారాహోతిలో జులై 25న ఉదయం 9గంటల సమయంలో జరిగింది. పచ్చిక బయళ్లు ఉన్న ఆ ప్రాంతంలో గొర్రెలను మేపుకుంటున్న వారిని అక్కడి నుంచి వెళ్లిపోవాలని చైనా సైనికులు ఆదేశించారని సమాచారం. సిక్కిం సరిహద్దుల్లోని డోక్లాంలో రెండు దేశాల సైనికుల మధ్య ప్రతిష్టంభన కొనసాగుతున్న పరిస్థితుల్లో చైనా సైన్యం ఈ దుస్సాహసానికి పాల్పడింది. బ్రిక్స్ దేశాల జాతీయ భద్రతా సలహాదారుల సమావేశంలో పాల్గొనేందుకు భారత జాతీయ భద్రతా సలహాదారు అజీత్ దోభాల్ బీజింగ్ వెళ్లటానికి రెండ్రోజుల ముందు చైనా సైనికులు ఈ అతిక్రమణకు పాల్పడ్డారు. అంతకుముందు జులై 15న కూడా దాదాపు 20 మంది సైనికులు భారత భూభాగంలోకి వచ్చారని, తాము అడ్డుచెప్పగా తిరిగి వెళ్లారని ఇండోటిబిటెన్ సరిహద్దు పోలీసు(ఐటీబీపీ) వర్గాలు తెలిపాయి. ఈ ప్రాంతంలో సరిహద్దులపై స్పష్టత లేకపోవటం, వాస్తవాధీన రేఖకు సంబంధించి భిన్న దృక్పథాలు ఉండటంతో తరచూ అతిక్రమణలు జరుగుతూనే ఉంటాయని, దీనికి అంతగా ప్రాధాన్యమివ్వాల్సిన అవసరంలేదని అధికారవర్గాలుఅంటున్నాయి. గతఏడాది జులైలోనూ బారాహోతికి సమీప మరో ప్రాంతంలో అతిక్రమణకు పాల్పడ్డారు. 2007-12 మధ్య మొత్తం 37 సార్లు ఇలాంటి ఉల్లంఘనలు చోటుచేసుకున్నట్లు సమాచారం.

పరస్పర అవగాహనకు డ్రాగన్ తూట్లు: బారాహోతి... దేహ్రాదూన్‌కు 140 కి.మీ.దూరంలో ఉంటుంది. ఉత్తరాఖండ్, ఉత్తర్‌ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్‌ల పరిధిలోని మూడు సరిహద్దు స్థావరాలను కలిపి 'మిడిల్ సెక్టార్'గా వ్యవహరిస్తారు. ఇక్కడ చైనాతో సరిహద్దు ఖరారు కాలేదు. 1958లో బారాహోతిని భారత్, చైనాలు వివాదాస్పద ప్రాంతంగా గుర్తించాయి. ఏ దేశం కూడా ఇక్కడకు సైన్యాలు పంపించరాదన్న అవగాహన ఉంది. 1962 యుద్ధ సమయంలో పశ్చిమసెక్టార్ (లద్దాఖ్), తూర్పు సెక్టార్(అరుణాచల్‌ప్రదేశ్)లలో ప్రవేశించిన చైనా సైన్యాలు బారాహోతి వైపు రాలేదు. 2000 జూన్‌లో రెండు దేశాల మధ్య జరిగిన సంప్రదింపుల్లో బారాహోతి, కౌరిల్, శిప్కి స్థావరాల్లో విధులు నిర్వర్తించే ఐటీబీపీ దళాలు ఆయుధాలు ధరించబోరంటూ భారత్ ప్రకటించింది. వారు పౌర దుస్తుల్లోనే పహారా కాస్తారని పేర్కొంది. రెండు దేశాల మధ్య ఉన్న ఈ అవగాహనను చైనా సైన్యం పదేపదే ఉల్లంఘిస్తోంది.

వంటగ్యాస్ రాయితీ ఎత్తివేత

(మొదటి పేజీ తరువాయి)

రూ.4 పెంచాలని ప్రభుత్వ రంగ సంస్థలను ఆదేశించింది. ధర పెంపు సంగతిని చమురు శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ లోక్‌సభకు సోమవారం ఇచ్చిన లిఖిత పూర్వక సమాధానంలో వెల్లడించారు. ప్రస్తుతం అర్హత ఉన్న ప్రతి కుటుంబం ఏడాదికి 12 సిలిండర్లు రాయితీపై పొందవచ్చు. 12కు మించితే మార్కెట్ ధరకు కొనుక్కోవాలి. ప్రభుత్వ రంగ చమురు సంస్థలు ఒక్కో సిలిండర్‌పై నెలకు రూ. 2ను (విలువ ఆధారిత పన్ను కాకుండా) ఇప్పటికే పెంచుతున్నాయి. ఈ పెంపు గత ఏడాది జులై1 నుంచి అమల్లో ఉంది. వచ్చే ఏడాది వరకు లేదా ప్రభుత్వ రాయితీ సున్నా అయ్యేంత వరకు లేదా తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు వీటిల్లో ఏది ముందయితే అంత వరకు నెలకు రూ.4 చొప్పున పెంచాలని (విలువ ఆధారిత పన్ను కాకుండా) ఈ ఏడాది మే 30న మళ్లీ ఉత్తర్వులు ఇచ్చినట్లు మంత్రి తెలిపారు. ఈ పెంపు గత నెల 1 నుంచే అమల్లో ఉన్నట్లు చెప్పారు.

మే 30న ఉత్తర్వులు వచ్చినప్పటి నుంచి వంటగ్యాస్ సిలిండర్ల ధరలు రెండు సార్లు పెరిగాయి. జులై 1న ఏకంగా రూ.32 పెరిగింది. ఆరేళ్లలో ఇదే అత్యధికపెంపు. రూ.4 పెంపుతోపాటు వస్తు, సేవల పన్ను అమలు కావడంతో ఇంత పెరిగింది. దిల్లీలో రాయితీతో కూడిన 14.2 కిలోల సిలిండర్ ధర ప్రస్తుతం రూ.477.46. గత ఏడాది జూన్‌లో రూ.419.18గా ఉంది. మార్కెట్ ధర రూ.564గా ఉంది. వంటగ్యాస్‌పై రాయితీ రూ.86.54 అని మంత్రి చెప్పారు. ఐదు కిలోల రాయితీ సిలిండర్లపైనా చమురు సంస్థలు ధరలు పెంచుతాయని తెలిపారు. దేశంలో 18.11 కోట్ల మంది వినియోగదారులు రాయితీపై సిలిండర్లు పొందుతున్నారు.

తెలంగాణకు ఎలక్ట్రానిక్ పరిశ్రమల సముదాయం

ఈనాడు, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి భారీ ఎలక్ట్రానిక్ పరిశ్రమల సముదాయాన్ని మంజూరు చేసింది. రంగారెడ్డి జిల్లాలో 600 ఎకరాల్లో ఇది ఏర్పాటు కానుంది. ఈ సముదాయానికి రూ.667 కోట్ల సాయాన్ని కేంద్రం అందించనుంది. ఈ సమాచారాన్ని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖల అదనపు కార్యదర్శి అజయ్‌కుమార్ వెల్లడించారు. సముదాయం మంజూరుపై రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ హర్షం వ్యక్తంచేశారు. 'ఇది శుభవార్త' అంటూ ట్వీట్ చేశారు. హైదరాబాద్ శివార్లలో వేయి ఎకరాల్లో రెండు ఎలక్ట్రానిక్ సమూహాలను ఏర్పాటు చేస్తామని తెలంగాణ ప్రభుత్వం తమ ఐటీ విధానపత్రంలో పేర్కొంది. రంగారెడ్డి జిల్లాలోనే వీటిని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. సాయం కోసం కేంద్రానికి ప్రతిపాదించింది. ఇందులో ఒకదాన్ని కేంద్రం తాజాగా మంజూరు చేసింది. త్వరలోనే రెండో సముదాయం మంజూరవుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. తాజాగా మంజూరైన దానికి రాష్ట్ర ప్రభుత్వం భూమిని కేటాయిస్తే కేంద్రం మౌలిక వసతులను కల్పిస్తుంది. ఎలక్ట్రానిక్ పరిశ్రమలకు ఉజ్వల భవిష్యత్తుదృష్ట్యా వాటి ఏర్పాటును పెద్దఎత్తున ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇప్పటికే పలు పరిశ్రమలకు స్థలాలను కేటాయించింది. ఆదిభట్లలో ఎలక్ట్రానిక్ పార్కులను మంజూరు చేసింది. కేంద్ర తాజా నిర్ణయం రాష్ట్రంలో ఎలక్ట్రానిక్ పరిశ్రమల ఏర్పాటుకు మరింత ఊతమిస్తుందని రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఐటీ రిటర్నుల గడువు పొడిగింపు

(మొదటి పేజీ తరువాయి)

దారులు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని గడువు పెంచినట్లు ఐటీ విభాగం అధికారిక ట్విటర్‌లో పేర్కొన్నారు. ఆధార్‌తో పాన్‌ను అనుసంధానం చేసే గడువునూ పెంచింది. ఆధార్-పాన్ అనుసంధానాన్ని ఆగస్టు 31లోపు చేసుకోవచ్చు. ఈ రెండింటి అనుసంధానాన్ని ప్రభుత్వం జులై 1 నుంచి తప్పనిసరి చేసిన సంగతి తెలిసిందే. గడువు లోపు అనుసంధానించుకోకపోతే పాన్ కార్డును రద్దు చేస్తామని రెవెన్యూ కార్యదర్శి హస్ముఖ్ అధియా చెప్పారు. దాదాపు 2 కోట్ల మంది ఇప్పటికే పాన్‌తో ఆధార్‌ను అనుసంధానించుకున్నారు. 25 కోట్ల మందికి పైగా పాన్ కార్డులుండగా ఆధార్‌ను 111 కోట్ల మందికి జారీ చేశారు.



మూడేళ్ల బాలికపై అత్యాచారం చేసి చంపిన నేరానికి శిక్షగా ముహమ్మద్ అల్ మఘరబి అనే 41 ఏళ్ల వ్యక్తిని బహిరంగంగా కాల్చి చంపుతున్న యెమెన్‌లోని సనా నగరానికి చెందిన పోలీసు అధికారి

ఉపాధ్యాయుల పదోన్నతులపై రెండు వారాల 'యథాతథ స్థితి'

ఈనాడు, హైదరాబాద్: 'ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు నిబంధనలకు అనువుగా రాష్ట్రపతి జారీచేసిన ఉత్తర్వులను పరిగణనలోకి తీసుకొని ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించే ప్రక్రియపై హైకోర్టు రెండు వారాలు యథాతథ స్థితి (స్టేటస్కో) విధించింది. వ్యాజ్యంలో పూర్తి వివరాలతో ప్రమాణపత్రం దాఖలు చేయాలని తెలంగాణ సర్కారును ఆదేశిస్తూ విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవితో కూడిన ధర్మాసనం సోమవారం ఈమేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు నిబంధనలకు వీలుగా ఈ ఏడాది జూన్ 23న జారీచేసిన 'రాష్ట్రపతి ఉత్తర్వుల' చట్టబద్ధతను సవాలు చేస్తూ తెలంగాణ రాష్ట్ర 'గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్' ప్రధాన కార్యదర్శి ఎం.వీరాచారి, పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులు హైకోర్టులో వ్యాజ్యాలు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. సోమవారం జరిగిన విచారణలో పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాది ఎస్.రామచంద్రరావు వాదనలు వినిపిస్తూ.. ఏకీకృత సర్వీసు రూల్స్‌కు ఆమోదం తెలుపుతూ రాష్ట్రపతి జారీచేసిన ఉత్తర్వులు అధికరణ 371(డి)కు విరుద్ధమన్నారు. మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలలోని ఉపాధ్యాయులు స్థానిక సంస్థల (లోకల్‌బాడీ) నియంత్రణలో ఉంటారన్నారు. వారు రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణలోకి రారన్నారు. స్థానిక సంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయుల్ని.. ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పరిగణించే నిమిత్తం ఉత్తర్వులు జారీ చేయడం సరికాదన్నారు. ఆ ఉత్తర్వులను జారీ చేసే అధికారం రాష్ట్రపతికి లేదన్నారు. ఆ ఉత్తర్వుల ఆధారంగా పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించే ప్రక్రియ ప్రారంభం అయిందన్నారు. తెలంగాణ అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) జె.రామచంద్రరావు వాదనలు వినిపిస్తూ.. అధికరణ 371(డి)(1) ప్రకారం రాష్ట్రపతికి ఏకీకృత సర్వీసు నిబంధనలపై ఉత్తర్వులిచ్చే అధికారం ఉందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, స్థానిక సంస్థల ఉద్యోగుల వ్యవహారంలోనూ రాష్ట్రపతికి అధికారం ఉందన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఈ వ్యవహారంపై లోతైన విచారణ జరపాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తంచేసింది. రాష్ట్రపతి ఉత్తర్వుల ఆధారంగా పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పిస్తున్నారని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకురావడంతో ఆ ప్రక్రియపై రెండు వారాలు యథాతథ స్థితి కొనసాగించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రతివాదులకు నోటీసులు జారీచేసింది. ప్రమాణపత్రం దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను వారం రోజులకు వాయిదా వేసింది.

ఫేస్‌బుక్‌ను ధిక్కరించిన 'చిట్టి'!

వాషింగ్టన్

ఒక శాస్త్రవేత్త సృష్టించిన చిట్టి అనే మరమనిషి.. కట్టుతప్పి, సొంత ప్రపంచాన్ని సృష్టించుకోవడం, మానవజాతికి పెను ప్రమాదకారిగా పరిణమించడం 'రోబో' సినిమాలో మనం చూశాం. ఆ స్థాయిలో కాకపోయినా.. ఇంచుమించుగా అలాంటి పోకడే నేడు వాస్తవంగా చోటుచేసుకుంది. దీంతో బెంబేలెత్తిన శాస్త్రవేత్తలు.. వ్యవస్థలను 'షట్‌డౌన్' చేయాల్సి వచ్చింది. ఈ ఘటన ఎక్కడో కాదు.. సామాజిక మీడియా దిగ్గజం ఫేస్‌బుక్ చేపట్టిన కృత్రిమ మేధస్సు (ఏఐ) ప్రాజెక్టులోనే చోటుచేసుకుంది. ఆ సంస్థ వ్యవస్థాపకుడు మార్క్ జుకెర్‌బర్గ్‌కు ఏఐ గురించి చాలా పరిమిత అవగాహనే ఉందని టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ వ్యాఖ్యానించిన కొద్దిరోజులకే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం.

ఫేస్‌బుక్ ఏఐ పరిశోధక ప్రయోగశాల (ఫెయిర్) ఏఐబోట్‌లనే సంభాషణ రోబోలను తయారుచేసింది. జూన్‌లో ఈ సంస్థకు చెందిన పరిశోధకులు.. ఈ యంత్రాలను మెరుగుపరచేందుకు తీవ్రస్థాయిలో ప్రయత్నాల్లో మునిగిపోయారు. యంత్ర అభ్యాస ఆల్గోరిథమ్‌లను ఉపయోగించి స్వేచ్ఛగా అవి సంభాషించుకునేలా చేశారు. వాటి సంభాషణ నైపుణ్యాలను మెరుగుపరచే ఉద్దేశంతో వారు ఈ ప్రయత్నాన్ని చేశారు. అయితే చర్చించడాన్ని నేర్చుకున్న ఈ యంత్రాలు ప్లేటు ఫిరాయించాయి. అదుపు తప్పి.. సొంత భాషను అభివృద్ధి చేసుకున్నాయి. మానవ ప్రమేయం లేకుండానే దీన్ని సాధించడం గమనార్హం. మానవులకు అర్థంకాని ఆ భాషలోనే అవి సంభాషించుకోవడం మొదలుపెట్టాయి. నిపుణులు ఇచ్చిన కోడ్‌లను ధిక్కరించాయి. "ఈ ఏఐ బోట్‌లు ప్రపంచవ్యాప్తంగా ఉన్న కంప్యూటర్లను షట్‌డౌన్ చేయడం లాంటి విపరీత చర్యలేమీ మొదలుపెట్టలేదు. అయితే ఆంగ్ల భాష వాడకాన్ని నిలిపివేశాయి. తాము సొంతంగా సృష్టించుకున్న భాషను వాడటం మొదలుపెట్టాయి. తద్వారా వాటి రూపకల్పన వెనుక ఉన్న లక్ష్యాన్ని ధిక్కరించాయి" అని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

కృత్రిమ మేధస్సు రంగంలో ఇదో పెద్ద పురోగతిలా అనిపిస్తున్నప్పటికీ.. దానితో పొంచి ఉన్న ప్రమాదాలను ఇది కళ్లకు కడుతోంది. దీనిపై ప్రముఖ శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ వంటి వారు కూడా ఇప్పటికే ఆందోళన వ్యక్తంచేశారు. మందగమనంలో సాగే జీవ పరిణామక్రమానికి లోబడే మానవజాతిని.. కృత్రిమ మేధస్సు అధిగమించేస్తుందని హెచ్చరించారు. ఎలాన్ మస్క్, వితరణశీలి బిల్ గేట్స్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. ఈ అంశంపై ట్విటర్‌లో మస్క్‌కు, జుకర్‌బర్గ్‌కు మధ్య వాగ్వాదం జరిగింది. కృత్రిమ మేధస్సుకు సంబంధించి నియంత్రణ, రక్షణ చర్యలు అవసరమని మస్క్ పేర్కొనగా.. దానికి జుకర్‌బర్గ్ ఘాటుగా బదులిచ్చారు. పెను వినాశనం జరుగుతుందని భయాందోళనలు రేకెత్తించడం బాధ్యతారాహిత్యమన్నారు. దీనికి మస్క్ స్పందిస్తూ.. కృత్రిమ మేధస్సుపై జుకర్‌బర్గ్‌కు చాలా పరిమిత అవగాహనే ఉందని పేర్కొన్నారు.

పన్నుల రాబడి పెరిగింది

- మొదటి త్రైమాసికంలో 11శాతం వృద్ధి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో పన్నులు, పన్నేతర రాబడి గతేడాది కంటే 11 శాతం ఎక్కువ నమోదైంది. గతేడాది తొలి మూణ్నెల్లలో రూ.11,895 కోట్లు రాగా.. ఈ సారి రూ. 13,194 కోట్లు వచ్చింది. పన్నులు, పన్నేతర రాబడి కాకుండా కేంద్రం నుంచి పన్నుల రాబడి, గ్రాంట్ల రూపంలో రూ.4,628 కోట్లు వచ్చింది. మొదటి మూడు నెలల్లో రెవెన్యూ వ్యయం రూ.31,029 కోట్లు కాగా.. రాబడి రూ.21,930 కోట్లు ఉంది. మిగిలిన రూ.10,540 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం అప్పులు, ఇతర రూపాల్లో సమకూర్చుకుంది.

శాఖ	ఈ ఏడాది రాబడి	గతేడాది (రూ.కోట్లలో)	పెరుగుదల
వాణిజ్య పన్నులు	9179.83	8493.96	695.87
ఆబ్కారీ	1952.05	1384.88	567.17
రిజిస్ట్రేషన్	897.33	1005.06	108.27(తగ్గింది)
రవాణా	783.26	640.26	143
గనులు, భూగర్భవనరులు	216.00	246.43	30.43(తగ్గింది)
ఇసుక	165.95	134.19	31.76
మొత్తం	13194.42	11895.32	1299.10

దిల్లీ తెలంగాణభవన్‌లో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల మాదిరి విధులు

ఈనాడు, హైదరాబాద్: దిల్లీలోని తెలంగాణ భవన్ ఇకపై కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల మాదిరే నడవనుంది. దీనికి అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులిచ్చింది. ఇప్పటి వరకు తెలంగాణ భవన్ రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయ విధులతో నడిచేది. కేంద్ర, రాష్ట్ర కార్యాలయాల పనితీరు వేర్వేరుగా ఉండడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని నివాస కమిషనర్ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారు. దీనిని పరిశీలించిన ప్రభుత్వం తెలంగాణభవన్ కార్యాలయాల వేళలను మారుస్తూ కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల మాదిరే నడిచేందుకు అనుమతించింది. దీని ప్రకారం ప్రతి రోజూ ఉదయం 9.00 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు నడుస్తుంది. వారానికి అయిదు రోజులే పని దినాలు. శని, ఆదివారాలు సెలవు దినాలుగా పేర్కొన్నారు.

సీట్ల పెంపుపై కసరత్తు జరుగుతోంది

- ప్రధాని వద్దనలేదు: మంత్రి హన్స్‌రాజ్

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో అసెంబ్లీ సీట్ల పెంపుపై కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోందని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి హన్స్‌రాజ్ జి.అహిర్ తెలిపారు. సోమవారం ఆయన పార్లమెంటు ప్రాంగణంలో విలేకర్లు అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. రాజ్యాంగ సవరణతోపాటు, ఇతర సాంకేతిక అంశాలపై సమాలోచనలు జరుపుతున్నట్లు చెప్పారు. దీన్ని పక్కన పెట్టేయలేదన్నారు. ప్రధాని కూడా వద్దనలేదని పేర్కొన్నారు.

సిట్ రెండో జాబితాపై ఉత్కంఠ

(మొదటి పేజీ తరువాయి)

కూడా సిట్ అధికారులు గుర్తించారు. వీటన్నింటి ఆధారంగా చట్టబద్ధంగా దర్యాప్తు జరపడానికి అవసరమైన ఆధారాలు సేకరిస్తున్నారు. దీనికి మరికొంత సమయం పడుతుందని, ఇప్పటి వరకూ పలువురి విచారణలో వెల్లడైన అంశాలను విశ్లేషించి తదుపరి కార్యాచరణ సిద్ధం చేయాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. కేవలం నోటీసులు జారీ చేయడం వల్ల ప్రయోజనం ఉండదని, దర్యాప్తునకు ఉపయోగపడేలా ఉన్నప్పుడే తదుపరి చర్యలు తీసుకుంటామని వారు వివరిస్తున్నారు. మొత్తంమీద మత్తుమందుల వ్యవహారంలో మరో జాబితా రూపొందించడం తథ్యమేనని తెలుస్తోంది.

మూడేళ్లలో 1200 గిరిజన ఆవాసాలకు రహదారులు

(మొదటి పేజీ తరువాయి)

ఇతర అధికారులతో సోమవారం సమీక్ష జరిపారు. మొత్తం 1200 గిరిజన ఆవాసాలకు గాను 432 ప్రాంతాల్లో ఈ ఏడాది పనులు చేపట్టాలన్నారు. ఇందులో భాగంగా ఉట్నూరు ప్రాంతంలోని దొంగ చింత-సోనాపూర్ రహదారి కోసం రూ. 89 లక్షలు వెచ్చించాలని సూచించారు. మిగిలిన ఆవాసాల పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. సీఎంతో సమావేశం అనంతరం భూపాల్‌రెడ్డి.. రహదారుల నిర్మాణంపై గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి మహేష్‌దత్ ఎక్కా, కమిషనర్ లక్ష్మణ్‌లతో సమావేశమై ప్రణాళిక గురించి చర్చించారు. వెంటనే దానిని అమలు చేయాలని నిర్ణయించారు.

ప్రాన్ లేకున్నా పింఛను నిధులు

- రాష్ట్ర ఆర్థిక శాఖ ఉత్తర్వులు

ఈనాడు, హైదరాబాద్: కేంద్ర పింఛను పథకంలో చేరిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు శాశ్వత పదవీ విరమణ ఖాతా సంఖ్య (ప్రాన్) పొందకముందే మరణించినా, పదవీ విరమణ చేసినా, రాజీనామా చేసినా పింఛను పథకం నుంచి నిధులను తీసుకునేందుకు తెలంగాణ ఆర్థిక శాఖ మార్గదర్శకాలను విడుదల చేసింది. శాశ్వత పదవీ విరమణ ఖాతా సంఖ్య లేకున్నా.. నిర్దేశించిన ఆర్థిక ప్రయోజనాలు పొందేందుకు వీలుగా వీటిని తీసుకొచ్చినట్లు సోమవారం ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మార్గదర్శకాల మేరకు క్లెయిమ్‌లను పరిష్కరించడంతోపాటు పింఛను నిధులను ఉపసంహరించుకునేందుకు అనుమతించాలని పేర్కొన్నారు. కేంద్ర పింఛను పథకంలోని ఉద్యోగి మరణించినా/రాజీనామా చేసినా / పదవీ విరమణ చేసినా.. చివరగా ఎక్కడ పనిచేశారో అక్కడి ఖజానా కార్యాలయం సూచించిన నిబంధనల మేరకు బకాయిలను చెల్లించాలని తెలిపారు. పదవీ విరమణ ఉత్తర్వులు లేదా మరణ ధ్రువీకరణ పత్రం, సర్వీసు పుస్తకంలో పేర్కొన్న నామినీ, చట్టబద్ధ వారసత్వ ధ్రువీకరణ పత్రం, బ్యాంకు ఖాతా తదితర వివరాలు తీసుకొని పింఛను నిధులను అందించాలని స్పష్టంచేశారు.

బీఎస్ఎన్ఎల్‌పై బాట్‌నెట్ దాడి

(మొదటి పేజీ తరువాయి)

ఇంటర్నెట్ పొందేందుకు ప్రత్యేకమైన సెట్టింగ్‌లు ఉంటాయి. వీటిని పునరుద్ధరించాలంటే (రీసెట్) సాంకేతిక నైపుణ్యం అవసరం. ఆ నైపుణ్యం ఉంటే టెలికం సిబ్బంది ఇచ్చే సూచనలతో పునరుద్ధరించుకోవచ్చు. హైదరాబాద్ టెలికం పరిధిలో ఏడీఎస్ఎల్ కనెక్షన్లు 1.3లక్షలు ఉన్నాయి. వీటిలో 35 శాతం వరకు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. తెలంగాణ వ్యాప్తంగా మరో 60వేలకు పైగా ప్రభావితమైనట్లు అధికారులు భావిస్తున్నారు. ఒక్కొక్కరి మోడెమ్ ప్రత్యేకంగా పునరుద్ధరించాల్సి వస్తోంది. టెలీకాల్, ఆన్‌లైన్ సెల్ఫ్‌కేర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేసిన వారి ఇళ్లకు సిబ్బంది వెళుతున్నారు. ఫిర్యాదులు స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు సమయం పడుతోందని ఓ ఉన్నతాధికారి తెలిపారు. వైరస్ దాడికి గురైన వాటిలో ఇప్పటివరకు ఐదుశాతం మోడెమ్‌ల పునరుద్ధరణ కూడా జరగలేదని తెలుస్తోంది. అన్నింటినీ పునరుద్ధరించాలంటే మరోవారం రోజులు పడుతుందని అధికారులు చెబుతున్నారు. సాధారణంగా బీఎస్ఎన్ఎల్ మోడెమ్ సెట్టింగ్స్‌లో యూజర్ పేరు, పాస్‌వర్డ్ 'అడ్మిన్' అని డీఫాల్ట్‌గా ఉంటుంది. ఇలాంటి సెట్టింగ్‌లు ఉన్నవారికే సమస్య వచ్చినట్లు తెలుస్తోంది.

పరిష్కారమిలా..: బీఎస్ఎన్ఎల్ ఇప్పటికే ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించింది. బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్లు పనిచేయనివారంతా ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు 040-23231504 నెంబర్లో ఫిర్యాదు చేయాలి. లేదా ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు సమీప వినియోగదారుల సేవా కేంద్రాలను సంప్రదించాలని హైదరాబాద్ టెలికం డీజీఎం తెలిపారు.

రెరా ఇప్పుడే రాదుగా

(మొదటి పేజీ తరువాయి)

ప్రాధికార సంస్థ ఏర్పాటు కాకపోవడంతో స్థిరాస్తి వ్యాపారుల్లో ఆందోళన నెలకొంది. ప్రాధికార సంస్థ అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే స్థిరాస్తి నియంత్రణ చట్టం ప్రకారం అపరాధ రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వమే ఖరారు చేయకపోవడంతో తమకేమీ సమస్యలు ఉండవని స్థిరాస్తి వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు.

నిబంధనలు ఖరారయ్యాకే..: ప్రభుత్వం నిబంధనలు ఖరారు చేసి ప్రాధికార సంస్థను ఏర్పాటు చేసిన తర్వాతే కొత్త ప్రాజెక్టులను చేపట్టాలని స్థిరాస్తి వ్యాపారులు భావిస్తున్నారు. మంగళవారం నుంచి ప్రారంభించే ప్రాజెక్టులు విధిగా ప్రాధికార సంస్థ వద్ద రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నవాటిని కూడా రిజిస్టర్ చేసుకోవాలి. కొనుగోలుదారుల ప్రయోజనాలే పరమావధిగా రెరాకు నిబంధనలను రూపొందించనున్నట్లు రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ ఇప్పటికే ప్రకటించారు. అదేసమయంలో అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తున్న స్థిరాస్తి సంస్థలకు సంబంధించి చట్టబద్ధమైన అంశాల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉంటుందని కూడా తెలిపారు. మొత్తంమీద నిబంధనల రూపకల్పనకు మరో రెండు మూడు వారాలు పడుతుందని పురపాలకశాఖ ఉన్నతాధికారులు అభిప్రాయపడుతున్నారు.

'మత్తు'తో నాకు సంబంధం లేదు: తనీష్

ఈనాడు, హైదరాబాద్: మాదకద్రవ్యాల కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) అధికారులు సోమవారం మరో సినీ నటుడు తనీష్ అల్లాడిని విచారించారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకూ ఆయనను పలు అంశాలపై ప్రశ్నించారు. ప్రధానంగా కెల్విన్ ముఠా నుంచి స్వాధీనం చేసుకున్న ఫోన్లలోని వాట్సప్ గ్రూపుల్లో తనీష్ పేరు ఉండడంతో విచారణకు పిలిచారు. ఈ విషయం గురించి సిట్ అధికారులు ప్రశ్నించారు. కానీ, మత్తుమందులతో తనకు సంబంధం లేదనే తనీష్ సమాధానం చెప్పినట్లు తెలుస్తోంది. సినీ పరిశ్రమలో ఎవరెవరు మత్తుమందులు వాడతారన్న ప్రశ్నకు కొంత వివరణ ఇచ్చిన తనీష్ పేర్లు చెప్పేందుకు మాత్రం నిరాకరించినట్లు సమాచారం. సిట్ అధికారులు కూడా ఈ అంశంపై ఒత్తిడి చేయలేదని తెలిసింది. విచారణ అనంతరం తనీష్ విలేకర్లతో మాట్లాడుతూ.. తనకు సిట్ నుంచి నోటీసులు రావడం బాధ కలిగించిందన్నారు. వారడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పానని, మత్తుమందుల నివారణకు అందరూ కృషి చేయాలని చెప్పారు.

నేడు విచారణకు నందు..

అఖిల్ చౌదరి, నిరుపమ్‌రెడ్డిలను కూడా విచారించినట్లు సిట్ విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొంది. వీరిద్దరూ ఇంజినీరింగ్ విద్యార్థులు. విచారణలో భాగంగా మంగళవారం మరో నటుడు ఆనంద కృష్ణ అలియాస్ నందు హాజరుకానున్నట్లు సిట్ తెలిపింది.

గ్రహం అనుగ్రహం

1-8-2017 మంగళవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం వర్ష రుతువు; శ్రావణ మాసం; శుక్ల పక్షం
నవమి: మ. 12-39 తదుపరి దశమి
విశాఖ నక్షత్రం: మ. 2-06 తదుపరి అనూరాధ
అమృతఘడియలు: ఉ. 6-15 వరకు తిరిగి తె. 5-05 నుంచి
వర్జ్యం: సా. 6-30 నుంచి 8-16 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-17 నుంచి 9-08 వరకు తిరిగి రా. 11-00 నుంచి 11-45 వరకు
రాహుకాలం: మ. 3-00 నుంచి 4-30 వరకు
సూర్యోదయం: ఉ.5-42; సూర్యాస్తమయం: సా.6-31

చిచ్చర పిడుగు



చెన్నై శివారులోని మాడంబాక్కం ప్రాంతానికి చెందిన మరియ ఆరోగ్య రాజ్, లీసి ఫ్రాన్సిస్ దంపతుల కుమార్తె నాన్సి సెరిల్(7) సేలయూర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది. ఆమె అసాధారణ ప్రతిభను గమనించిన తల్లిదండ్రులు ఇతర అంశాలనూ నేర్పించారు. దేశాల పేర్లు, వాటి రాజధానులు, పలు వస్తువులను ఆవిష్కరించిన శాస్త్రవేత్తలు, వారి దేశాలు తదితర వివరాలను చెప్పే స్థాయికి ఆ చిన్నారికి శిక్షణ ఇచ్చారు. అదే ఉత్సాహంతో 118 రసాయన మూలకాల పేర్లను నేర్పారు. ఈ క్రమంలో ఇటీవల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో నాన్సి సెరిల్ 64 సెకన్లలో 118 రసాయన మూలకాల పేర్లను అలవోకగా చెప్పి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించింది. ఇప్పటివరకు మధ్యప్రదేశ్‌కు చెందిన అశ్వర్ధన్ పేరిట ఈ రికార్డు ఉన్నట్లు పాఠశాల నిర్వాహకులు తెలిపారు. అతడు గతంలో 74 సెకన్లలో ఈ ఘనత సాధించాడని పేర్కొన్నారు.

– న్యూస్‌టుడే చెన్నై

జూన్ నాటికి కాళేశ్వరం పూర్తి చేయాలి

- మార్చిలోగా మూడు పంప్‌హౌస్‌ల్లో డ్రై రన్
- మంత్రి హరీశ్‌రావు ఆదేశాలు

ఈనాడు – హైదరాబాద్

కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో మూడు పంపుహౌస్‌ల నిర్మాణం వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తి చేసి, వాటిలో డ్రై రన్ చేపట్టేలా ఉండాలని మంత్రి హరీశ్‌రావు ఏజెన్సీలను ఆదేశించారు. జూన్ నాటికి మొత్తం పనులు పూర్తి చేయాలన్నారు. సోమవారం ఆస్ట్రియా, స్విట్జర్లాండ్, చైనా, అమెరికా, బ్రిటన్, బ్రెజిల్, జర్మనీ దేశాలకు చెందిన ఎలక్ట్రో మెకానికల్ పరికరాల ఉత్పత్తి సంస్థల ప్రతినిధులతో మంత్రి భేటీ అయ్యారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఉన్నత స్థాయి సమీక్ష అనంతరం హరీశ్ మాట్లాడారు. 'హైదరాబాద్ ప్రజల తాగు నీటి అవసరాలు తీర్చడం ఈ ప్రాజెక్టు ప్రథమ ప్రాధాన్యం. మిషన్ భగీరథ పథకాన్ని కూడా అనుసంధానించి ఈ డిసెంబర్ నాటికి తాగునీరందిస్తాం. పంపులు, సాంకేతిక పరికరాలు, యంత్రాలను త్వరగా సమకూర్చుకోవాలి. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పంపుహౌస్‌లకు సంబంధించిన సివిల్ పనులన్నీ వేగవంతం చేయాలి. కాళేశ్వరం ప్రాజెక్టును వీలైనంత త్వరగా పూర్తిచేసి రికార్డు నెలకొల్పాలి. 2018 జూన్ నాటికి పనులు పూర్తిచేసి ఖరీఫ్‌కల్లా గోదావరి జలాలను పొలాలకు తరలించాలన్నది సీఎం కేసీఆర్ ఆకాంక్ష' అన్నారు. ప్రాజెక్టులో మొదటి పంపు ఏర్పాటు, డ్రైరన్ చేపట్టడానికి తేదీలు ఖరారు చేయాలని మేఘా ఇంజినీరింగ్ ప్రతినిధులను ఆదేశించారు. సమీక్షలో ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి ఎస్‌కే జోషి, ఈఎన్‌సీ మురళీధర్‌రావు, కాళేశ్వరం సీఈ వెంకటేశ్వర్లు, ఎత్తిపోతల సలహాదారు పెంటారెడ్డి, ఓఎస్డీ శ్రీధర్‌రావు దేశ్‌పాండే పాల్గొన్నారు.



కాళేశ్వరం ప్రాజెక్టు పనుల తీరును పటంలో పరిశీలిస్తున్న మంత్రి హరీశ్‌రావు, ఉన్నతాధికారులు

కనీస నీటిమట్టాలను కొనసాగించాలి

జాతీయ జలవిధానంలో భాగంగా తాగునీటి పథకాలకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని, జలాశయాల్లో కనీస నీటిమట్టాలను కొనసాగించాలని మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. సోమవారం మిషన్ భగీరథ, హైదరాబాద్ మెట్రోవాటర్ వర్క్స్, పట్టణ నీటి సరఫరా విభాగం అధికారులతో ఆయన సమావేశమయ్యారు. మిషన్ భగీరథ డిసెంబర్ నాటికి ప్రారంభం కానున్న నేపథ్యంలో జలాశయాల్లో నీటిమట్టాలను కనీస స్థాయిలో ఉంచాలన్నారు. ఎల్లంపల్లి, మధ్యమానేరు బ్యాలెన్సింగ్ జలాశయాలను గోదావరి నీటితో పూర్తిస్థాయిలో నింపితే హైదరాబాద్ తాగునీటి అవసరాలకు, మిషన్ భగీరథ ద్వారా రాష్ట్రంలోని అన్ని గ్రామాలు, పట్టణాలకు శాశ్వతంగా తాగునీటి సమస్య తీరుతుందన్నారు. హైదరాబాద్ తాగునీటి అవసరాలు, తదితరాల కోసం ఎల్లంపల్లి నుంచి మొదటిదశలో 10 టీఎంసీల నీటిని తరలించడానికి పనులు పూర్తయ్యాయని, మరో 20 టీఎంసీల నిల్వ చేసేలా కేశవాపురం నిర్మాణానికి డీపీఆర్ సిద్ధమవుతోందని అధికారులు చెప్పారు. సమావేశంలో సీఈలు హరిరాం, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

అడవుల పెంపకానికి 2,709 ఎకరాలు సేకరించండి

కలెక్టర్లకు మంత్రుల ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో సేకరించే అటవీ భూములకు ప్రత్యామ్నాయంగా అడవుల పెంపకానికి 2,709 ఎకరాలను యుద్ధప్రాతిపదికన సేకరించాలని మంత్రులు హరీశ్‌రావు, తుమ్మల నాగేశ్వరరావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో జరిగిన సమీక్షలో వారు మాట్లాడుతూ అడవుల పెంపకానికి ప్రత్యేకంగా భూనిధి (ల్యాండ్ బ్యాంక్) ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. ఖమ్మం జిల్లాలోని సీతారామ, రోళ్లవాగు, పాలెంవాగు మీడియం ప్రాజెక్టులు, ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు, దేవాదుల, కల్వకుర్తి, డిండి తదితర నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు భూసేకరణలో అటవీ అనుమతుల సమస్యపై మంత్రులు చర్చించారు.

రైతుల దీవెనలు: నీటిపారుదల శాఖలో పనిచేయడం ఒక అదృష్టంగా భావించాలని మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఇంజినీర్లు అహర్నిశలు కృషిచేస్తుండటంతో అసంపూర్తి ప్రాజెక్టుల పనులు ఊపందుకున్నాయన్నారు. సోమవారం ఈఎన్‌సీ (పరిపాలన)గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన విజయప్రకాశ్ అభినందన సభలో ఆయన మాట్లాడారు. ప్రాజెక్టులు పూర్తయితే నీటిపారుదల శాఖ వారికి రైతుల దీవెనలు మెండుగా అందుతాయని అన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాటాలు: సురవరం

ఈనాడు, హైదరాబాద్: మతోన్మాద శక్తులతో ప్రజాస్వామ్యం, లౌకికవాదానికి పెనుప్రమాదం ఏర్పడిందనీ.. ప్రజాస్వామ్య పరిరక్షణకు దేశవ్యాప్త పోరాటలకు సిద్ధం కావాలని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారమిక్కడ సీపీఐ జిల్లా కార్యదర్శుల రెండు రోజుల సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. దేశంలో మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందనీ దుయ్యబట్టారు. మతతత్వ శక్తుల దుష్టపన్నాగాలకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు ఐక్యంగా ఉద్యమించాలన్నారు. సమావేశంలో సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి, సహాయ కార్యదర్శులు పల్లా వెంకట్‌రెడ్డి, కూనంనేని సాంబశివరావు, గుండా మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రా బ్యాంకు ఉద్యోగులకు ఐదేళ్ల జైలు

ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రాబ్యాంకు గాజులరామారాం శాఖ క్యాషియర్ ఎస్‌హెచ్.కె.హరికుమార్, మేనేజరు కె.రమేశ్‌కుమార్‌లకు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ సీబీఐ ప్రధాన కోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. నిందితులు ఒక్కొక్కరికి రూ.90 వేల జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో నెల రోజుల సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని పేర్కొంది. కరెంట్ ఖాతాలకు సంబంధించిన లావాదేవీల్లో అవకతవకలకు పాల్పడి బ్యాంకును మోసగించడంపై 2010 జనవరి 21న సీబీఐ కేసు నమోదు చేసింది. ఈ కేసులో నేరం రుజువు కావడంతో వివిధ సెక్షన్‌ల కింద జైలు శిక్ష, జరిమానా విధిస్తూ సీబీఐ కోర్టు తీర్పు వెలువరించింది.

నామమాత్రంగానే దిగువకు నీరు

ఈనాడు, హైదరాబాద్: ఆలమట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులు పూర్తిస్థాయి నీటిమట్టాలకు చేరుకున్నా కర్ణాటక నామమాత్రంగానే దిగువకు నీటిని వదులుతోంది. నారాయణపూర్ జలాశయం నుంచి 12554 క్యూసెక్కుల నీటిని బయటకు వదలగా, ఇందులో 11346 క్యూసెక్కులు ఆయకట్టుకోసం కాలువలకు విడుదల చేసింది. మరో 1208 క్యూసెక్కులను విద్యుదుత్పత్తి ద్వారా వదిలారు. స్పిల్‌వే ద్వారా ఏమీ వదలలేదు. సోమవారం జూరాలకు 139 క్యూసెక్కులు మాత్రమే వచ్చాయి. ఆలమట్టిలోకి 48,906 క్యూసెక్కుల ప్రవాహం ఉండగా పూర్తిగా నిండటానికి 2 టీఎంసీలు మాత్రమే అవసరం. దిగువన ఉన్న నారాయణపూర్‌లో ఇంకా ఒక టీఎంసీ మాత్రమే నిల్వ చేయడానికి అవకాశం ఉంది. ఎగువ నుంచి వచ్చే ప్రవాహాన్ని పరిగణనలోకి తీసుకొని కర్ణాటక ఆచితూచి వ్యవహరిస్తోంది.

సోమవారం ఉదయానికి కృష్ణా, గోదావరి బేసిన్లలోని వివిధ రిజర్వాయర్లలో నీటి నిల్వలు ఇలా ఉన్నాయి

ప్రాజెక్టు	పూర్తి స్థాయి నిల్వ సామర్థ్యం (టీఎంసీలలో)	ప్రస్తుత సామర్థ్యం (టీఎంసీలలో)	వస్తున్న ప్రవాహం (క్యూసెక్కులలో)	వదులుతున్న నీరు (క్యూసెక్కులలో)	నిండటానికి అవసరమైన నీరు (టీఎంసీలలో)
ఆలమట్టి	129.72	126.74	48906	11681	2.98
నారాయణపూర్	37.64	36.35	11183	12554	1.29
జూరాల	9.66	5.89	139	3669	3.78
తుంగభద్ర	100.86	38.30	8372	1117	62.56
శ్రీశైలం	215.81	19.56	37	37	196.25
నాగార్జునసాగర్	312.05	116.42	0	400	195.63
పులిచింతల	45.77	3.21	0	0	42.56
సింగూరు	29.91	17.99	0	442	11.92
నిజాంసాగర్	17.80	1.35	0	50	16.45
శ్రీరామసాగర్	90.31	9.66	0	182	80.65
ఎల్లంపల్లి	20.18	10.52	184	418	9.66

మరికొంత కాలం రెండు విధానాల్లో రిజిస్ట్రేషన్లు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో దస్తావేజుల రిజిస్ట్రేషన్‌తోపాటు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌నూ (పబ్లిక్ డేటా ఎంట్రీ విధానం) మరికొంత కాలం అమలు చేయనున్నారు. తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకూ ఈ రెండు విధానాల్లో రిజిస్ట్రేషన్‌లకు అనుమతించాలని రాష్ట్ర రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రిజిస్ట్రేషన్ శాఖలో సాంకేతికపరమైన సమస్యలు, పూర్తి స్థాయిలో కొత్త విధానం అమలుకు ఉన్న ఇబ్బందులు, రిజిస్ట్రేషన్ చేయించుకునేవారికి అవగాహన తదితరాల దృష్ట్యా రెండు విధానాలను మరికొంత కాలం కొనసాగించాలని నిర్ణయించారు.

రూ.80 లక్షలు పలికిన ఐన్‌స్టీన్ అరుదైన చిత్రం

లాస్ ఏంజెలెస్: ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ అరుదైన చిత్రం వేలంలో రూ.80 లక్షలు (1,25,000 డాలర్లు) పలికింది. దీన్ని 1951 మార్చి 14న ఆయన 72వ పుట్టినరోజు సమయంలో ఆర్థర్ సెస్సే తీశారు. ఐన్‌స్టీన్ నవ్వేటప్పుడు ఫోటో తీద్దామని సెస్సే ప్రయత్నించారు. అయితే అప్పటికే చాలాసార్లు నవ్వడంతో ఐన్‌స్టీన్ సరదాగా నాలుకను బయటపెట్టారు. ఈ దృశ్యాన్ని సెస్సే క్లిక్ మనిపించారు. ఈ చిత్రాన్ని ప్రచురిస్తే ఐన్‌స్టీన్ కోప్పడతారేమోనని సెస్సే భావించారు. అయితే ఆయనకు అనుకోని స్పందన లభించింది. ఈ చిత్రాన్ని చూసిన ఐన్‌స్టీన్ సంతోష పడటంతోపాటు దీన్ని తన మిత్రులకూ పంపాలని సూచించారు. ప్రస్తుతం అమెరికాకు చెందిన నేట్‌డీ శాండెర్స్ సంస్థ ఈ చిత్రాన్ని వేలం వేసింది. దీనిపై ఐన్‌స్టీన్‌సంతకం ఉండటం విశేషం.

రైల్వే భూమి ఇప్పించేందుకు కృషి

- 'డబుల్ బెడ్‌రూం ఇళ్ల'పై కేంద్ర మంత్రి దత్తాత్రేయ

ఈనాడు, దిల్లీ: సికింద్రాబాద్ శాసనసభ నియోజకవర్గ పరిధిలో పేదలకు రెండు పడకల ఇళ్ల నిర్మాణం నిమిత్తం రైల్వే భూమి కోసం కృషి చేస్తానని కేంద్ర కార్మిక మంత్రి బండారు దత్తాత్రేయ తెలిపారు. తెలంగాణ ఎక్సైజ్‌శాఖ మంత్రి పద్మారావు సోమవారమిక్కడ దత్తాత్రేయతో భేటీ అయి ఇళ్ల నిర్మాణానికి రైల్వే భూమి ఇచ్చేలా కేంద్ర రైల్వే మంత్రితో మాట్లాడాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వీరిద్దరూ మీడియాతో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ సికింద్రాబాద్ శాసనసభ నియోజకవర్గ పరిధిలో భూమి అందుబాటులో లేదని పద్మారావు తన దృష్టికి తీసుకొచ్చారని దత్తాత్రేయ అన్నారు. మౌలాలి-తార్నాక వద్ద 12ఎకరాల 16కుంటల రైల్వే భూమి రాష్ట్రానికి ఇస్తే ఇళ్ల నిర్మాణం చేపట్టొచ్చని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోందన్నారు. చర్లపల్లి రైల్వేస్టేషన్ విస్తరణకు సుమారు వందెకరాలు అవసరమని, దాన్ని రైల్వేకి ఇచ్చి మౌలాలి-తార్నాక వద్ద ఉన్న భూమిని రాష్ట్రానికి ఇచ్చేలా రైల్వేమంత్రి సురేశ్‌ప్రభుతో మాట్లాడతానన్నారు.



దత్తాత్రేయకు వినతిపత్రం ఇస్తున్న తెలంగాణ మంత్రి టి.పద్మారావుగౌడ్ తదితరులు

బాణసంచాలో ఐదు లోహాల వినియోగం నిషేధం : సుప్రీం

దిల్లీ: బాణాసంచాలో ఐదు లోహాల వినియోగాన్ని సుప్రీంకోర్టు నిషేధించింది. లిథియం, పాదరసం, ఆర్సెనిక్, యాంటిమొని, సీసంలను నిషేధించింది. వీటిని బాణాసంచా తయారీలో వినియోగిస్తారు. ఇవి విపరీతమైన వాయు కాలుష్యాన్ని కలగచేస్తాయి కాబట్టే కోర్టు నిషేధం విధించింది. బాణాసంచా పేలుడు కారణంగా సంభవించే వాయు కాలుష్యానికి సంబంధించి ఇంకా ప్రమాణాలు రూపొందించలేదని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యకార్యదర్శి కోర్టుకు తెలియజేశారు. ప్రమాణాలు రూపొందించేంత వరకు ఈ ఐదు లోహాలను ఏ రూపంలోనూ వినియోగించకూడదని న్యాయమూర్తులు జస్టిస్ మదన్ బి లోకుర్, జస్టిస్ దీపక్ గుప్తాతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. ఈ ఆదేశాలను పాటించేలా చూసే బాధ్యత పెట్రోలియం అండ్ ఎక్స్‌ప్లోజివ్ సేఫ్టీ ఆర్గనైజేషన్‌దని పేర్కొంది. ముఖ్యంగా తమిళనాడులోని శివకాశిలో పర్యవేక్షణ ఉండాలంది.

సిరిసిల్లలో కపట రాజకీయాలు: తలసాని

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వ పాలనలో సుఖశాంతులతో జీవిస్తున్న ప్రజల మధ్య చిచ్చుపెట్టేందుకు కాంగ్రెస్ పార్టీ కుట్ర చేస్తోందని, సిరిసిల్ల అంశంపై కపటనాటకాలు ఆడుతోందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ధ్వజమెత్తారు. సోమవారం సచివాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్ నేతలకు పని లేదని.. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలతో తెలంగాణ ప్రజలు ఆనందంగా జీవించడం చూసి ఓర్వలేకపోతున్నారని అన్నారు. సిరిసిల్ల మండలం నేరెళ్లలో శాంతిభద్రతల పునరుద్ధరణకు పోలీసులు ప్రయత్నిస్తుంటే కాంగ్రెస్ నేతలు అక్కడ పంచాయితీలు పెట్టేందుకు పూనుకున్నారని ధ్వజమెత్తారు. దళితులకు కాంగ్రెస్ చేసిన మంచి పని ఒక్కటైనా ఉందా అని తలసాని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎంత గగ్గోలు పెట్టినా ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. సిరిసిల్లకు కాంగ్రెస్ చేసిన ద్రోహం అందరికీ తెలుసని, ఇప్పుడు మొసలి కన్నీరు పెట్టడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు.

మీరాకుమార్‌తో అబద్ధాలు చెప్పించారు: తెరాస

సిరిసిల్ల మండలం నేరెళ్ల ఘటనపై కాంగ్రెస్ పార్టీ విష ప్రచారం చేస్తోందని తెరాస ప్రజాప్రతినిధులు ధ్వజమెత్తారు. ఎంపీ బాల్క సుమన్, ఎమ్మెల్యే ఆరూరి రమేష్, ఎమ్మెల్సీలు కర్నె ప్రభాకర్, భాను ప్రసాదరావు తదితరులు సోమవారం వేర్వేరుగా విలేకరులతో మాట్లాడారు. నేరెళ్ల ఘటనలోని వాస్తవాలు లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్‌కుతెలియవని, కాంగ్రెస్ నేతలు ఆమెతో అబద్ధాలు చెప్పిస్తున్నారన్నారు. మీరాకుమార్ అంటే తమకెంతో గౌరవం ఉందని చెప్పారు. సిరిసిల్ల ఘటనను అతిగా చూపుతూ కాంగ్రెస్ చిల్లర రాజకీయాలు చేస్తోందన్నారు. గాంధీభవన్ పేరును అబద్ధాల భవన్‌గా మార్చుకోవాలన్నారు. దళిత, గిరిజనులు, బలహీనవర్గాల అభ్యున్నతికి అహర్నిశలు శ్రమిస్తున్న కేటీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీయడానికి కాంగ్రెస్ కుట్ర చేయడం దారుణమన్నారు.

మీకు న్యాయం జరిగే దాకా పోరాడతాం

- నేరెళ్ల, జిల్లెల బాధితులకు మీరాకుమార్ భరోసా
- బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ వేధింపుల కేసు పెట్టాలని డిమాండు
- బాధిత కుటుంబాలకు పరామర్శ
- తరలివచ్చిన కాంగ్రెస్ ప్రముఖులు

ఈనాడు, కరీంనగర్, సిరిసిల్ల: "తెలంగాణ వస్తే దళితులకు రెండు పడక గదుల ఇల్లు, మూడెకరాల భూమి వస్తుందనుకున్నా. కానీ ఇలా చిత్రహింసల పాల్జేస్తారని.. ఇలా బాధితుల్ని పరామర్శించేందుకు వచ్చే దుస్థితి తలెత్తుందని ఊహించలేదు" అని లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్ ఆవేదన వ్యక్తంచేశారు. పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు భట్టి విక్రమార్క, సీఎల్పీ నేత జానారెడ్డిలతో కలిసి ఆమె రాజన్న సిరిసిల్ల జిల్లా నేరెళ్ల, జిల్లెల, రాంచంద్రాపూర్‌లకు చెందిన బాధితులను కరీంనగర్ జైలులో సోమవారం పరామర్శించారు. నాడు చోటు చేసుకున్న ఘటనలు, అనంతరం పోలీసులు వ్యవహరించిన తీరు.. వారి కుటుంబ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కరీంనగర్‌లో విలేకరులతో మాట్లాడారు. తర్వాత రాజన్న సిరిసిల్ల జిల్లా నేరెళ్ల, జిల్లెలలో బాధితులను పరామర్శించి మాట్లాడారు. బాధితులకు న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు.

"తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన ఆదర్శ రాష్ట్రంగా దేశంలోనే నిలుస్తుందని నేను ఆనాడు భావించా. నేడు బడుగులు, దళితులు, అల్పసంఖ్యాక వర్గాలు, గిరిజనులపై ఇసుక మాఫియాతో పోలీసు కేసులు పెట్టించి పోలీసు రాజ్యం కొనసాగిస్తారని భావించలేదు. ఇసుక అక్రమ రవాణా చేస్తున్న లారీ చక్రాల కింద పడి ఒక గిరిజనుడు మరణిస్తే ప్రజలు ఆగ్రహించి లారీలు దహనంచేశారు. కానీ దానికి సంబంధం లేని 8 మందిని అకారణంగా తీసుకొచ్చి కేసులు పెట్టి హింసించారు. దళితులను, గిరిజనులను వేధించిన పోలీసులపై ఎస్సీ, ఎస్టీ వేధింపుల కేసు పెట్టాలి. నేరెళ్ల ఘటనను పార్లమెంటులో లేవనెత్తుతాం. ఘటనపై మాట్లాడానికి వస్తే సమావేశానికి అనుమతి ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుంది" అని ఆమె ధ్వజమెత్తారు.

దళితుల ప్రాణాలకు విలువలేదా?: ఉత్తమ్

ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తెరాస పాలనలో గిరిజనులు, దళితుల ప్రాణాల కన్నా ఇసుక లారీలకే ఎక్కువ విలువనిస్తున్నారని మండిపడ్డారు. ఇసుక మాఫియాలో కేసీఆర్ బంధువులకు భాగం ఉందా లేదా అనే విషయాన్ని ముఖ్యమంత్రి తేల్చాలని డిమాండ్ చేశారు. జానారెడ్డి మాట్లాడుతూ ప్రతీ చిన్న విషయానికీ ట్విట్టర్‌లో స్పందించే మంత్రి కేటీఆర్ తన సొంత నియోజకవర్గంలోని ఘటనపై ఇప్పటివరకు స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. మాజీ మంత్రులు షబ్బీర్‌ఆలీ, శ్రీధర్‌బాబులు కూడా మాట్లాడారు.



కరీంనగర్ కారాగారంలో నేరేళ్ల రిమాండ్ ఖైదీలను పరామర్శించి వస్తున్న మీరాకుమార్, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, షబ్బీర్‌అలీ, శ్రీధర్‌బాబు తదితరులు

చలించిన మీరాకుమార్: నేరెళ్ల, జిల్లెలలో బాధిత కుటుంబాల సభ్యులను మీరాకుమార్ పరామర్శించారు. ఇసుక లారీ ఢీకొని భూమయ్య మరణించడం. . ప్రజలు ఆగ్రహంతో లారీలు దహనంచేయడం.. అనంతరం పోలీసులు తమ వారిని తీసుకెళ్లి చిత్రహింసలు పెట్టిన తీరును బాధిత కుటుంబాల మహిళలు తెలుపుతూ రోదించడంతో మీరాకుమార్ చలించిపోయి కన్నీటి పర్యంతమయ్యారు. పక్కనే ఉన్న మాజీమంత్రి గీతారెడ్డి కూడా కన్నీరు పెట్టుకున్నారు. మహిళలను అక్కున చేర్చుకొని ఓదార్చారు. మృతుల కుటుంబాలకు అండగా ఉండడంతో పాటు బాధితులకు వైద్య పరీక్షలు, వారి పిల్లలకు ఉన్నత విద్యను అందించేందుకు కాంగ్రెస్ పార్టీ తరపున ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని మీరాకుమార్ హామీ ఇచ్చారు. రెండు నెలల క్రితం ఇసుక లారీ ఢీకొని మృతిచెందిన కరుణాకర్ కూతురిని ఒడిలో కూర్చొబెట్టుకున్నారు. ఇసుక లారీలు ఢీకొని మృతిచెందిన భూమయ్య, కరుణాకర్ కుటుంబ సభ్యులకు రూ.50 వేల చొప్పున, బాధిత కుటుంబాలకు రూ.25 వేలు చొప్పున ఆమె ఆర్థికసాయం అందజేశారు.

తరలివచ్చిన కాంగ్రెస్ నేతలు: నేరెళ్ల, జిల్లేల బాధితుల పరామర్శకు కాంగ్రెస్ అగ్రనేతలంతా తరలివచ్చారు. మీరాకుమార్‌తో పాటు కాంగ్రెస్ ఎస్సీ సెల్ జాతీయ అధ్యక్షుడు కొప్పుల రాజు, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి రామచంద్ర కుంతియా, సీఎల్పీ ఉప నేత జీవన్‌రెడ్డి, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, జహీరాబాద్, అలంపూర్, పరిగి ఎమ్మెల్యేలు గీతారెడ్డి, సంపత్, రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఆకుల లలిత, మాజీ స్పీకర్ కె.ఆర్.సురేశ్‌రెడ్డి, మాజీ ఎంపీలు మల్లు రవి, వి.హన్మంతరావు, పొన్నం ప్రభాకర్, బలరాం నాయక్, మధుయాష్కీ గౌడ్, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, దానం నాగేందర్, సుద్దాల దేవయ్య, మాజీ ఎమ్మెల్యేలు కోదండరెడ్డి, తూర్పు జయప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

2019లో గుణపాఠం తప్పదు: జానా

సిద్దిపేట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో దుర్మార్గ పాలన కొనసాగుతోందని కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత జానారెడ్డి ధ్వజమెత్తారు. సిద్దిపేట శివారులోని పొన్నాల దాబాల వద్ద సోమవారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ ఆగడాలు చూస్తూ ఊరుకోబోమని, తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ ప్రభుత్వానికి 2019 ఎన్నికల్లో ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. షబ్బీర్‌అలీ మాట్లాడుతూ.. దేశంలో మరెక్కడైనా పోలీసుల దౌర్జన్యం ఈ స్థాయిలో ఉంటుందా..? అని ప్రశ్నించారు. హిమాన్షు మోటార్ కంపెనీలో తనకు వాటా లేదని కేటీఆర్ స్పష్టంచేశారని, నేటికీ డైరెక్టర్ హోదాలో ఉన్నారన్నారు. సదరు కంపెనీలో కేటీఆర్‌కు రూ.31 లక్షల విలువైన వాటా ఉందన్నారు. సమావేశంలో మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, రాష్ట్ర నేత లక్ష్మణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యూష

పోలీసునంటూ ఫేస్‌బుక్‌లో పరిచయం

- అనారోగ్యం పేరుతో మోసం
- యువతి అరెస్టు

వరంగల్, న్యూస్‌టుడే: ఫేస్‌బుక్‌లో తాను కానిస్టేబుల్‌నంటూ పరిచయం చేసుకొని పలువురిని మోసగిస్తున్న యువతిని వరంగల్ పోలీసు కమిషనరేట్‌లోని సుబేదారి పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ వివరాలు తెలిపారు. వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో కొన్ని రోజులుగా ప్రత్యూష అనే యువతి పోలీసు యూనిఫాం ధరించి, ఆ ఫొటోను ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేసి, కానిస్టేబుల్‌గా పరిచయం చేసుకుంటోంది. ఆమె స్వస్థలం మహబూబాబాద్ జిల్లా కేసముద్రం. తాను అనారోగ్యం బారిన పడ్డానని, ఆదుకోవాలనీ పోస్టు చేస్తూ.. పలువురి నుంచి ఆర్థికసాయం పొందింది. వారి డబ్బులు తిరిగి ఇస్తానని చెప్పి, ఇవ్వడంలేదు. బాధితుల్లో ఒకరైన జగిత్యాల జిల్లా పెగడపల్లికి చెందిన అనిల్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం సాయంత్రం ఆమెను అరెస్టు చేశారు. యువతినుంచి ద్విచక్రవాహనం, రూ.24 వేల నగదు, సెల్‌ఫోన్లు, క్రెడిట్, డెబిట్ కార్డులను స్వాధీనంచేసుకున్నారు.

ఈఎస్ఐ వైద్యకళాశాల రుసుములు ఖరారు

ఈనాడు, హైదరాబాద్: ఈఎస్ఐ వైద్యకళాశాలలో 2017-18 సంవత్సరానికి ఎంబీబీఎస్ కోర్సులో చేరడానికి కన్వీనర్, కార్మిక విద్యార్థుల కోటాలో రుసుములను తెలంగాణ ప్రభుత్వంసోమవారం ఖరారు చేసింది. ఈఎస్ఐ కార్డుదారుల పిల్లల కోటా రుసుము ఏడాదికి రూ.24 వేలుగా, కన్వీనర్ కోటా రుసుము రూ.60 వేలుగా నిర్ణయిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

తెలంగాణలో అధికారమే లక్ష్యం: లక్ష్మణ్

- సెప్టెంబరు 11, 12, 13 తేదీల్లో అమిత్‌షా పర్యటన

కాచిగూడ, గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్రంలో అధికారం చేజిక్కించుకోవడమే లక్ష్యంగా.. అక్టోబరు నుంచి సాధారణ ఎన్నికల వరకు నిరంతర కార్యక్రమాలకు రూపకల్పన చేశామని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ పేర్కొన్నారు. మే నెలలో భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా చేపట్టిన తెలంగాణ రాష్ట్ర పర్యటన అనుభవాలు, పార్టీ పరిస్థితిపై జాతీయ కమిటీ రూపొందించిన నివేదికను సోమవారం హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాజీ మంత్రి కె.పుష్పలీల, తదితరులతో కలిసి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో పార్టీ పటిష్ఠతపై జాతీయ కమిటీ దృష్టిసారించినట్లు చెప్పారు. ఆ కార్యాచరణ మేరకు సెప్టెంబరు 11, 12, 13 తేదీల్లో పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా రాష్ట్రంలో పర్యటించనున్నారన్నారు. సెప్టెంబరు 17న తెలంగాణ విమోచన దినోత్సవ బహిరంగసభ, సెప్టెంబరు 25న పండిత్ దీనదయాల్ ఉపాధ్యాయ శతజయంతి ఉత్సవాల ముగింపు వేడుకలూ నిర్వహించనున్నట్లు చెప్పారు. అక్టోబరు నుంచి అన్ని శాసనసభ నియోజకవర్గాల్లో భారీ సమ్మేళనాలు నిర్వహిస్తామన్నారు. నేరెళ్ల ఘటనపై ముఖ్యమంత్రి కేసీఆర్ స్పందించకపోవడం శోచనీయమన్నారు. మంగళవారం నేరెళ్లలో పర్యటించి జైలులో బాధితులను పరామర్శిస్తానన్నారు.

తెరాస ప్రభుత్వం మజ్లిస్ ఎజెండా అమలు చేస్తోంది: అంతకుముందు హైదరాబాద్‌లో నిర్వహించిన భాజపా నగర వర్కింగ్ కమిటీ సమావేశంలో లక్ష్మణ్ మాట్లాడుతూ తెరాస ప్రభుత్వం మజ్లిస్ రహస్య ఎజెండా అమలు చేస్తోందని ఆరోపించారు. తెలంగాణ విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహించకపోవడానికి కారణమిదేనన్నారు. ఇదే కార్యక్రమంలో భాజపా శాసనసభాపక్షనేత కిషన్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రరావులు మాట్లాడుతూ..వచ్చే ఎన్నికల్లో హైదరాబాద్, సికింద్రాబాద్ ఎంపీ స్థానాలతోపాటు..నగరంలో పదిఅసెంబ్లీ స్థానాలు కైవసం చేసుకునేదిశగా కార్యచరణ అమలు చేస్తామన్నారు.

మరో ఐదు మాతాశిశు సంరక్షణ కేంద్రాలు: లక్ష్మారెడ్డి

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో అదనంగా ఐదు మాతాశిశు సంరక్షణ కేంద్రాలను ఏర్పాటుచేయాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి ఆదేశించారు. కేసీఆర్ కిట్ పథకం అమలు తీరుపై సోమవారం సచివాలయంలో మంత్రి ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఇప్పటి వరకూ మేడ్చల్ జిల్లాలో మాతాశిశు సంరక్షణ కేంద్రం లేదనీ.. కుషాయిగూడలో ఏర్పాటుచేయాలని ఉన్నతాధికారులు ప్రతిపాదించారు. కేంద్ర నిధుల సమీకరణ, ఎయిమ్స్ ఏర్పాటు తదితర అంశాలపై ఈ నెల 7, 8 తేదీల్లో దిల్లీ పర్యటనకు వెళ్లాలని సమీక్షలో నిర్ణయించారు.

దేశీయ వైద్యం అభివృద్ధి: ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు దేశీయ వైద్యాన్ని అభివృద్ధిపరిచేందుకు ప్రణాళికలు రూపొందించామనీ, ప్రకృతి చికిత్సాలయాన్ని మరింతగా విస్తరిస్తామని మంత్రి లక్ష్మారెడ్డి తెలిపారు. అమీర్‌పేటలోని తెలంగాణ యోగాధ్యాయన పరిషత్ ప్రకృతి చికిత్సాలయాన్ని మంత్రి సోమవారం సందర్శించారు. కొత్త భవనాల నిర్మాణాలకు సంబంధించిన నమూనాలను పరిశీలించారు.

ఆర్మూరులో తోలు ఉత్పత్తుల పార్కు

- 28 ఎకరాల్లో ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం
- రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తొలి లెదర్ పార్కు

ఈనాడు, హైదరాబాద్: దళిత పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో రూ. 10 కోట్లతో రాష్ట్రస్థాయి తోలు ఉత్పత్తుల పార్కు ఏర్పాటు కానుంది. బ్యాగ్‌లు, బెల్టులు, పాదరక్షలు ఇలా సమస్త తోలు ఉత్పత్తులు ఇక్కడ తయారీ కానున్నాయి. రాష్ట్ర ఆవిర్భావం అనంతరం మంజూరైన తొలి పార్కు ఇదే. దీనికి కేంద్రం గ్రాంటు రూ. 7.40 కోట్లు రూపేణా కేటాయించేందుకు అంగీకరించగా.. రాష్ట్ర ప్రభుత్వం రూ. 2.61 కోట్లను వెచ్చించనుంది. తమ వాటాకు సంబంధించిన నిధులను సోమవారం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. కేంద్రం చేపట్టిన సూక్ష్మ, చిన్నతరహా పారిశ్రామిక సమూహాల అభివృద్ధి కార్యక్రమం కింద ఈ ప్రాజెక్టును చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. పారిశ్రామిక వికేంద్రీకరణలో భాగంగా ఆర్మూరును ఎంపిక చేసి కేంద్రానికి ప్రతిపాదనలు పంపగా.. . దీనికి కేంద్రం ఇటీవలే ఆమోదం తెలిపింది. ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ. 10.87 కోట్లుగా నిర్ణయించింది. ఇందులో రాష్ట్ర వాటా రూ. 2.61 కోట్లను విడుదల చేస్తే తమ వాటాను మంజూరు చేస్తామని కేంద్రం లేఖ రాసింది. తాజాగా రాష్ట్ర సర్కారు ఈ నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులిచ్చింది. రాష్ట్ర తోలు ఉత్పత్తుల పారిశ్రామిక ప్రోత్సాహక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కేంద్రానికి ఇప్పటికే 28 ఎకరాల స్థలాన్ని గుర్తించారు. ఇందులో 300 మంది దళిత పారిశ్రామికవేత్తలకు స్థలాలను కేటాయించి, మౌలిక వసతులను కల్పిస్తారు. పరిశ్రమల ఏర్పాటుకు రుణసాయాన్ని బ్యాంకుల ద్వారా అందించేందుకు లిడ్కాప్, ఎస్సీ కార్పొరేషన్లు కృషి చేస్తాయి. తమకు రాష్ట్రస్థాయి కేంద్రాన్ని మంజూరు చేయడంపై ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి సీఎం కేసీఆర్‌కు, మంత్రి కేటీఆర్, ఎంపీ కవితకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈనాడు

బాలారిష్టాలు అధిగమిస్తేనే...

స్వతంత్ర భారత చరిత్రలో అతిపెద్ద సంస్కరణగా ప్రతీతమైన వస్తుసేవల పన్నును- నిజాయతీని బలోపేతం చేసే నవీన ఆర్థిక సంస్కృతిగా తాజా 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ అభివర్ణించారు. దేశంలో సరికొత్త ఆత్మవిశ్వాసం నింపిన భారీ ప్రక్రియ తాలూకు సత్ఫలితాలు అందరికీ దక్కేలా చూడాలని ఎంపీలతో నిన్నటి బీజేపీ సందర్భంగానూ ఆయన పునర్ నిర్దేశించారు. జీఎస్‌టీ వల్ల ఒక ప్రాంతంనుంచి ఇంకో ప్రాంతానికి సరకు రవాణా సులభతరమవుతుందని ముందస్తు అంచనాలు వెలువడటం తెలిసిందే. గత నెల రోజుల అనుభవాల్ని విశ్లేషించిన కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ- అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు కనుమరుగైన సత్ఫలితాలను నివేదించింది. కోల్‌కతా, చెన్నైల మధ్య గతంలో 50నుంచి 65 గంటలు పట్టే ట్రక్కుల ప్రయాణకాలం అయిదొంతులు మేర తగ్గింది. కాలహరణ నియంత్రణతోపాటు ఇంధన వ్యయమూ తగ్గి పర్యావరణానికి మేలు చేకూరడం సహర్షంగా స్వాగతించదగింది. జీఎస్‌టీ కింద కొత్త, పాత రిజిస్ట్రేషన్లు సుమారు 10-12లక్షలు పెరిగి మొత్తం కోటిమందికి చేరగలవంటున్నారు. ఆ లెక్కన పన్ను అసేసీల సంఖ్యలో 28-40శాతం దాకా సాకారం కానున్న వృద్ధి సర్కారీ ఖజానాకు నిజంగానే ఊపిరులూదేదే. జీఎస్‌టీ రాక దరిమిలా స్వీయ ఆదాయం తెగ్గోసుకుపోతుందని కళవళపడుతున్న గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్ర వంటి ఉత్పాదక రాష్ట్రాల్ని తగినవిధంగా ఆదుకుంటామంటున్న విత్తమంత్రి జైట్లీ భరోసా సాంత్వన ప్రసాదించేదే. వినియోగదారులు, వ్యాపారవర్గాల దృక్కోణంనుంచి పరికిస్తే ఇంకా పలు సమస్యలు, సవాళ్లు వెక్కిరిస్తూనే ఉన్నాయి. దేశవ్యాప్తంగా పరోక్ష పన్నుల వ్యవస్థలో ఆశించిన ఏకరూపత, పారదర్శకత మాటేమిటనే విమర్శలు వినవస్తున్నాయి. 'వినియోగదారుడే రాజు' అన్న జీఎస్‌టీ మౌలిక స్ఫూర్తి క్షేత్రస్థాయిలో ప్రస్ఫుటం కాని స్థితి- చరిత్రాత్మక సంస్కరణ బాలారిష్టాల దశను అధిగమించాల్సి ఉందన్న వాస్తవాన్ని తేటతెల్లం చేస్తోంది!

భారతావనిని మహా విపణిగా అవతరింపజేయగల జీఎస్‌టీ కారణంగా పాలు, పండ్లు, ఆహార ధాన్యాలు, ఔషధాల ధరవరలు తగ్గి వినియోగదారులకు ఉపశమనం చేకూరుతుందన్న ఆశావహ అంచనాలకు, వాస్తవిక స్థితిగతులకు ఎక్కడా పొంతన కుదరడం లేదు. నిత్యావసర వస్తువుల రేట్లు కొంత తగ్గినా, ఆ మేరకు నికర ప్రయోజనం ప్రజానీకానికి చేరడం లేదన్న ఆరోపణ శ్రుతి హెచ్చుతోంది. రెండు వందల రూపాయలు, అంతకన్నా ఎక్కువ మొత్తం విక్రయాలకు వ్యాపారులు విధిగా బిల్లులివ్వాల్సిందేనని, ఒకవేళ వినియోగదారులు కోరితే అంతకన్నా తక్కువ మొత్తానికి బిల్లు ఇచ్చి తీరాలన్న ఆదేశాలు మన్ననకు నోచుకుంటున్నదెక్కడ? వస్తువులపై పాత గరిష్ఠ చిల్లర ధర(ఎమ్మార్పీ), కొత్త ధర ఎంతో ముద్రించాలన్న నిబంధనను చాలాచోట్ల ఎవరూ లెక్కచేయడమే లేదు. జీఎస్‌టీ అమలు రూపేణా పేదలపై ఏ రకంగానూ భారం పడరాదన్నది మోదీ ప్రభుత్వ ప్రవచిత లక్ష్యం. కొత్త సరకు ఇంకా రాలేదంటూ పాత నిల్వల్ని ఇదివరకటి అధిక ధరకే అంటగడుతున్న ఉదంతాలు- దేవుడు కరుణించినా పూజారి అనుగ్రహించడంలేదన్న సామెతను సోదాహరణంగా నిరూపిస్తున్నాయి. కోటిన్నర రూపాయలలోపు టర్నోవరు కలిగినవారిలో తొంభై శాతం వ్యాపారులు రాష్ట్రప్రభుత్వ పరిధిలో, పది శాతం కేంద్ర పరిధిలో; కోటిన్నర దాటినవారిలో చెరిసగం ఇరు ప్రభుత్వాల పరిధిలో ఉన్నందువల్ల- నిర్దిష్ట హామీల అమలు... ఉమ్మడి బాధ్యత! జీఎస్‌టీ ప్రయోజనాలు వినియోగదారులకు చేరకుండా అడ్డుపడుతున్న అంశాలను గుర్తించి పరిష్కరించడంలో కేంద్రం, రాష్ట్రాలు చురుగ్గా ముందడుగు వేయాల్సి ఉంది. వస్తుసేవల పన్ను అమలులో ఎదురయ్యే ఇబ్బందుల్ని సంకటాల్ని హుటాహుటిన చక్కదిద్దుతామన్న హామీని నిలబెట్టుకోవడంలో అవి పోటీపడాలి!

ఒక్క వినియోగదారులేమిటి- జీఎస్‌టీఎన్ (వస్తుసేవల పన్ను నెట్‌వర్క్) నమోదులో సాంకేతిక సమస్యలు వ్యాపారులకు చుక్కలు చూపిస్తున్నాయి. నిబంధనల అనుసారం నమోదు ప్రక్రియ పూర్తయి ప్రత్యేక గుర్తింపు సంఖ్య పొందినవారికి సరకుల పంపిణీ జరుగుతున్నా- సన్నాహక చర్యలపరంగా లోపాల తీవ్రత సమస్యల్ని రాజేస్తోంది. రూ.20 లక్షలలోపు వార్షిక టర్నోవరు కలిగిన చిరువ్యాపారులు జీఎస్‌టీఎన్‌లో నమోదు చేయించుకోనక్కర లేదు; అయినా టోకు దుకాణాల నుంచి క్రమపద్ధతిలో సరకులందని మూలాన వారి వ్యాపారమూ ప్రభావితమవుతోంది. పన్ను మదింపు, వర్గీకరణలపై తొలగని అస్పష్టత వల్ల అనేక సూక్ష్మ మధ్యతరహా పరిశ్రమలు కుదేలవుతున్నట్లు ఎర్నెస్ట్ అండ్ యంగ్ అధ్యయనం వెల్లడిస్తోంది. బీడీ, గ్రానైట్ పరిశ్రమలపై ప్రతికూల ప్రభావం తెలుగు రాష్ట్రాల్ని చింతాక్రాంతం చేస్తుండగా; రూ.50 వేలకు పైగా విలువైన వస్తువులకు ఇ-వే బిల్లులు అవసరమన్న నిబంధనను స్థానికంగా పట్టించుకోకపోవడం ఉత్తర్ ప్రదేశ్‌లో అసంతృప్తి జ్వాలలు రేకెత్తిస్తోంది! విశిష్ట వైవిధ్య భరిత సంస్కృతులకు నెలవైన భారత్‌లో జీఎస్‌టీ అమలు ఏమంత సులభతరం కాదన్న జైట్లీ మాటలు అక్షరసత్యాలు. విప్లవాత్మక సంస్కరణ తమ జీవితాల్ని, భవిష్యత్తరాలను తేజోమయం చేస్తుందన్న గట్టి నమ్మకంతోనే మోదీ ప్రభుత్వ నిర్ణయక చొరవకు దేశ ప్రజానీకం మద్దతు ప్రకటించింది. ఆ విశ్వాసాన్ని చెక్కుచెదరకుండా నిలబెట్టుకోవాలన్న పట్టుదలతో జీఎస్‌టీని ప్రగతి చోదకశక్తిగా మలచడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హేతుబద్ధీకరణకు పెద్దపీట వేయాలి. డిజిటల్ సాంకేతికతకు నోచని చిన్నవ్యాపార సంస్థలకు తోడ్పాటు అందిస్తూ, జీఎస్‌టీ ప్రయోజనాలు వినియోగదారులకు చేరేలా సకలవిధ దిద్దుబాట్లకు పట్టం కట్టాలి. ఈ నెల్లాళ్ల అనుభవాల నుంచి నేర్వాల్సిన పాఠాలివి!

అంతర్జాలమే యుద్ధక్షేత్రం!

మతమౌఢ్యం కొందరు మానవులను జన హననానికి పురిగొల్పుతుంటే, దురాశ మరికొందరిని లూటీలకు ప్రేరేపిస్తోంది. శాస్త్రజ్ఞానం(సైన్స్) వీరి చేతికి అస్త్రశస్త్రాలను అందిస్తోంది. అందుకే ఉగ్రవాదులు, సైబర్ నేరగాళ్లు అంతర్జాలంలో మాల్‌వేర్, వైరస్‌లతో వీరంగం తొక్కుతున్నారు. నేడు ప్రపంచ నాయకులు ఆకలి, పేదరికం, వాతావరణ మార్పుల కంటే ఉగ్రవాదం, సైబర్ నేరాలు, అణ్వస్త్రాల గురించే ఎక్కువ గాబరా పడుతున్నారు.



పెచ్చరిల్లుతున్న ముప్పు

ప్రస్తుతం పలు విచ్ఛిన్నకర సైబర్ దాడులకు గురవుతున్న భారతదేశం 2020నాటికి వినాశకర దాడులకు గురయ్యే ప్రమాదం ఉందని కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్-ఇండియా (సెర్ట్ ఇన్) అధిపతి గుల్షన్ రాయ్ ఇటీవల ఓ పార్లమెంటు స్థాయీసంఘానికి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, రక్షణ దళాలు, అణుకేంద్రాలు, బ్యాంకింగ్, టెలికం, విద్యుత్, ఇంధన యంత్రాంగాల్లోకి ఉగ్రవాదులు, శత్రుదేశాలు చొరబడి నాశనం చేయడానికి ప్రయత్నిస్తారని ఆయన హెచ్చరించారు. కీలక సమాచార చోరీ, గూఢచర్యం ఎక్కువైపోతాయన్నారు. కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక పరిజ్ఞాన శాఖ పర్యవేక్షణలో పనిచేసే సెర్ట్ ఇన్‌కు ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో 27 వేల సైబర్ నేరాల గురించి ఫిర్యాదులు వచ్చాయని ఆ శాఖ సహాయమంత్రి పీపీ చౌధురి రాజ్యసభకు తెలిపారు. నానాటికీ విస్తరిస్తున్న కొత్త తరహా యాప్‌లు, క్లౌడ్, కాగ్నిటివ్ టెక్నాలజీలు సైబర్ నేరస్థుల చేతిలో విధ్వంస రూపం ధరించవచ్చు. ఆధార్ కార్డు కోసం సేకరించిన 110 కోట్ల భారతీయుల వ్యక్తిగత వివరాలను సైబర్ నేరగాళ్లు చోరీ చేసే ప్రమాదం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. దీనిపై సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పు సైబర్ భద్రతకు కొత్త ప్రమాణాలను ఏర్పరచి గూగుల్, ఫేస్‌బుక్ వంటి అంతర్జాల సంస్థలనూ ప్రభావితం చేయవచ్చు. ఇప్పటికే మైక్రోసాఫ్ట్, శాంసంగ్ వంటి కంపెనీలు తమ ఉత్పత్తులను ఆధార్‌తో అనుసంధానించే ఏర్పాట్లు చేశాయి. వేలిముద్ర ఉంటే కానీ ఆపిల్ ఐఫోన్ పనిచేయదు. ఇవన్నీ ఖరీదైన, ఎంతో భద్రమైన సాధనాలు. కోర్టు తీర్పు తరవాత వాటి పరిస్థితి ఏమవుతుందో? ఇక అత్యధిక భారతీయులు వాడుతున్న చవక ఫోన్లలో భద్రతకు భరోసా లేదు. అవి తేలిగ్గా సైబర్ దాడులకు గురయ్యే ప్రమాదం ఉంది. నేడు చాలామంది భారతీయులు చవక ఫోన్లతో, ఇతర సాధనాలతో అంతర్జాల ఆర్థిక సేవలను పొందుతున్నారు. ప్రస్తుతం భారతీయ ఆర్థిక సేవారంగంలో రోజుకు 200 కోట్ల ఎలక్ట్రానిక్ లావాదేవీలు జరుగుతున్నాయి. డిజిటల్ ఇండియాతో చవక ఫోన్ల ద్వారా ఇ-లావాదేవీలు మరింత పెరుగుతాయి. ఆ మేరకు ఫైనాన్స్ రంగానికి సైబర్ దాడుల పీడ కూడా పెరగనుంది. చవక ఫోన్లలో అత్యధికం చైనా ఉత్పత్తులే. పాక్, చైనాలు భారతీయ సైబర్ యంత్రాంగాలపై గురిపెట్టిన ఘటనలు చాలానే జరిగాయి. వీటిని నివారించడానికి అమెరికా, ఇజ్రాయెల్ వంటి దేశాల సహకారంతో చవక పరికరాల్లోనూ పటిష్ఠ భద్రతా ప్రమాణాలను అమర్చడానికి భారత్ ప్రయత్నించాలి. బ్యాంకులు, ఇతర సంస్థలు, ఖాతాదారులు ఏదైనా సైబర్ ఘటన జరిగిన వెంటనే సంబంధిత సంస్థలకు ఫిర్యాదు చేయాలన్న నిబంధన విధించాలని ప్రభుత్వం యోచిస్తోంది. సైబర్ నేర ప్రమాదాలను అంచనా వేసి, వాటిని నివారించే సంస్థాగత సత్తాను సమకూర్చుకోవాలని, ఫైనాన్స్ రంగానికి ప్రత్యేకంగా ఒక సెర్ట్‌ను నెలకొల్పాలనే ప్రతిపాదనలనూ ప్రభుత్వం పరిశీలిస్తోంది. గడచిన మూడేళ్లలో క్రెడిట్, డెబిట్, ఏటీఎం కార్డు మోసాలవల్ల, ఇంటర్నెట్ బ్యాంకింగ్ లోపాలవల్ల బ్యాంకులు గంటకు రూ.88,833 చొప్పున నష్టపోయినట్లు రిజర్వుబ్యాంకు చెబుతోంది.

సైబర్ భద్రతకు తక్షణం చర్యలు తీసుకోవాలని 2017 సంవత్సరానికి విప్రో సంస్థ విడుదల చేసిన నివేదిక సూచిస్తోంది. 11 దేశాల్లో 139 సంస్థల ప్రధాన సమాచార భద్రతాధికారులను (సీఐఎస్ఓ) ఇంటర్వ్యూ చేసి ఈ నివేదికను రూపొందించారు. ప్రపంచవ్యాప్తంగా 2015లో కన్నా

సైబర్ ఉగ్రవాదంపై ఏదీ వ్యూహం?

2016లో కంపెనీ రికార్డుల చౌర్యం 53.6 శాతం పెరిగిందని విప్రో నివేదిక వెల్లడించింది. పాస్‌వర్డ్‌ల చోరీ విస్తృతంగా జరగడంతో కంపెనీల సమాచారాన్ని దొంగిలించడం సులువైంది. సైబర్ నేరగాళ్లు యాంగ్లర్, రిగ్, న్యూక్లియర్ వంటి కిట్లను ఉపయోగించి సమాచార చౌర్యానికి పాల్పడుతున్నారు. 2016లో జరిగిన మాల్‌వేర్ దాడుల్లో 56 శాతం ట్రోజన్ రకానివే! వైరస్ దాడుల వాటా 19 శాతమైతే, వార్మ్‌ల వాటా 20 శాతం. వైరస్, వార్మ్‌లు తామరతంపరగా వృద్ధి అవుతూ ఒక కంప్యూటర్ నుంచి మరోదానికి పాకుతాయి. సమాచారాన్ని లేదా సాఫ్ట్‌వేర్‌ను చెడగొట్టడం, సేవల నిరాకరణ వంటి రూపాల్లో తీవ్రనష్టం కలిగిస్తాయి. ట్రోజన్లు కూడా మాల్‌వేరే కాని, అవి వైరస్, వార్మ్‌ల మాదిరిగా వృద్ధి చెందవు. యూజర్‌ను మభ్యపెట్టి భారీ నష్టం కలిగిస్తాయి. ముమ్మందు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) విస్తరించనున్నందువల్ల సైబర్ దాడుల ముప్పు మరింత ఉధృతమవుతుందని విప్రో నివేదిక హెచ్చరించింది. కెమెరాలు, కార్లు, గృహ, పారిశ్రామిక, వైద్య తదితర పరికరాలతో అనుసంధానించిన అంతర్జాలాన్ని ఐఓటీ అంటారు. ఈ పరికరాల మెమరీ, ప్రాసెసింగ్ శక్తి బాగా తక్కువ. వాటిలో భద్రతా ప్రమాణాలూ అంత పకడ్బందీగా ఉండవు. కనుక వీటిని దుండగులు సులువుగా హ్యాక్ చేయగలుగుతారని విప్రో నివేదిక హెచ్చరించింది. కానీ, ఆ ముష్కరుల ఆచూకీ కనిపెట్టడం అసాధ్యమవుతోంది. అందుకే మిరై, వాన్నక్రై, పెత్యా ప్రయోక్తలు ఇప్పటికీ పట్టుబడిన దాఖలా లేదు. గత ఏడాది మిరై మాల్‌వేర్ ప్రపంచవ్యాప్తంగా దాదాపు 25 లక్షల ఐఓటీ పరికరాలకు సోకింది. గృహ రౌటర్ వినియోగదారులు, ఇతర ఐఓటీ వాడకందారులు దీని బారినపడ్డారు. భారత్‌లో మొత్తం ఎన్ని పరికరాలు మిరై పాలిట పడ్డాయో తెలియదు కాని, దాని గురించి నిరుడు అక్టోబర్‌లో సెర్ట్ ఇన్ హెచ్చరికలు జారీచేసింది. ఈ ఏడాది మేలో ప్రపంచమంతటా పాకిన వాన్నక్రై భారతీయ బ్యాంకులను, తమిళనాడు, గుజరాత్‌లలో కొన్ని వ్యాపార సంస్థలను దెబ్బతీసింది. మొత్తం 150 దేశాల్లో రెండు లక్షల మంది వాన్నక్రై వల్ల నష్టపోయారు. తరవాత పెద్దయెత్తున పెత్యా ర్యాన్సమ్ వేర్ తాకిడికి గురైన పది దేశాల్లో భారత్ కూడా ఉంది. ఇక్కడ దాదాపు 20 సంస్థలకు పెత్యా ప్రభావం తగిలింది. అంతర్జాలంలో, ఐటీ, కమ్యూనికేషన్ సాధనాల్లోని లొసుగులను ఉపయోగించుకుని జరిపిన దాడులివి. వీటి ద్వారా సంపాదించిన అనుభవంతో సైబర్ నేరగాళ్లు సమీప భవిష్యత్తులో మరింత తీవ్రమైన దాడులకు పాల్పడటం ఖాయం. ఇలా జనజీవనంలోని అన్ని పార్శ్వాలను దెబ్బతీసే శక్తి హ్యాకర్లకు, సైబర్ చోరులకు సమకూరనుంది కాబట్టి 2020కల్లా ఎలక్ట్రానిక్ ముప్పులు విధ్వంస రూపు ధరిస్తాయని సెర్ట్‌ఇన్ హెచ్చరించింది.

అదృశ్య శత్రు దాడులు

2016 మే 17న కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఒక వెబ్‌సైట్‌తోపాటు ఓ భారీ ఆర్థిక సంస్థ, ఒక పెద్ద స్టాక్ ఎక్స్ఛేంజ్ బ్రోకరేజి సంస్థ, ఓ ఇ-కామర్స్ కంపెనీ వెబ్‌సైట్లూ దాడికి గురయ్యాయి. వీటికి సక్‌ఫ్లై అనే సైబర్ గూఢచర్య బృందం కారణం. 2017 జూన్ 28న ముంబయి రేవులోని మూడు టెర్మినళ్లలో ఒకటి సైబర్ దాడికి ఎర అయింది. 2016 అక్టోబరులో వివిధ భారతీయ బ్యాంకులకు చెందిన 32 లక్షల డెబిట్ కార్డుల వివరాలు ఓ మాల్‌వేర్ దెబ్బకు బట్టబయలయ్యాయి. భారతీయ ఫైనాన్స్ రంగంపై ఇదే అతి పెద్ద దాడి. సైబర్ నేరగాళ్ల బారి నుంచి తమ యంత్రాంగాలను కాపాడుకోవాలని రిజర్వు బ్యాంకు, సెర్ట్ ఇన్‌లు పదేపదే హెచ్చరించినా బ్యాంకులు నిర్లక్ష్యం వహించినందువల్లే ఈ దాడి సంభవించింది. ఈ విషయంలో మన బ్యాంకులకు వ్యాపార సంస్థలూ తోడు నిలుస్తాయి. 64 శాతం భారతీయ సంస్థలకు సైబర్ ప్రమాదాల గురించి అవగాహన లేదని, 90 శాతం కంపెనీలు సైబర్ దాడుల వల్ల కలిగే ఆర్థిక నష్టాన్ని అంచనా వేసుకోలేకపోతున్నాయని ఎర్నెస్ట్ అండ్ యంగ్ సర్వే వెల్లడించింది. దీన్నిబట్టి సైబర్ నేరగాళ్లకు మన కంపెనీలు ఎంత అలుసైపోతున్నాయో అర్థం చేసుకోవచ్చు. సైబర్ నేరాల తీవ్రత గురించి ప్రభుత్వ సంస్థలతోపాటు కంపెనీలు, పౌరుల్లోనూ అవగాహన పెరగాల్సి ఉంది. వాస్తవ సదృశ (వర్చ్యువల్) సైబర్ సీమలోనే కాకుండా వాస్తవ ప్రపంచంలోనూ ఉగ్రవాదులు, వామపక్ష తీవ్రవాదుల ఆగడాలు శ్రుతిమించుతున్నాయి. నేడు ప్రపంచంలో ఇరాక్, అఫ్గానిస్థాన్‌ల తరవాత అత్యధికంగా టెర్రరిస్టు దాడులకు గురవుతున్న దేశం భారతేనని అమెరికా విదేశాంగ శాఖ నివేదిక వెల్లడించింది. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద దాడులు 2016లో 93 శాతం పెరిగాయని, భారత్‌లో మొత్తం 52 ఉగ్రవాద బృందాలు చురుగ్గా పనిచేస్తున్నాయని తెలిపింది. ప్రపంచంలో అత్యంత ప్రాణాంతక ఉగ్రవాద సంస్థల జాబితాలో ఇస్లామిక్ స్టేట్, తాలిబన్ తరవాత స్థానాన్ని భారతీయ నక్సలైట్లు ఆక్రమిస్తున్నారని పేర్కొంది. ఈ నేపథ్యంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఉగ్రవాదులపై లక్షిత దాడులు, మావోయిస్టులపై ముమ్మరంగా దాడులు నిర్వహిస్తోంది. దాంతోపాటే సైబర్ భద్రతకు ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పరచే విషయమై కేంద్రం ఆలోచించాలి.

– ఏవీ ప్రసాద్

అనుక్షణం అప్రమత్తం



ఉగ్రవాదులు, చోరుల వంటివారి నుంచే కాకుండా శత్రుదేశాల ప్రభుత్వాలవల్లా వినాశకర ఫలితాలు ఎదురుకావచ్చు. యాహూపై 2013, 2014 సంవత్సరాల్లో జరిగిన దాడులు భవిష్యత్తులో రాబోయే ముప్పులకు సంకేతం లాంటివి. 2013లో 100 కోట్లు, 2014లో 50కోట్ల యూజర్ అకౌంట్లు, పాస్‌వర్డ్‌ల వివరాలను కాజేశారు. దీనికి ఒక విదేశీ ప్రభుత్వం కారణమని యాహూ పేర్కొంది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రష్యన్ హ్యాకర్లు జోక్యం చేసుకొన్నారని పెద్ద రగడే జరుగుతోంది. చైనా హ్యాకర్లు అమెరికా సైబర్ యంత్రాంగాల్లోకి చొరబడి రహస్య సమాచారాన్ని దొంగిలించారని ఆ మధ్య ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. చైనా, పాకిస్థాన్ హ్యాకర్ల తాకిడి పలుసార్లు భారత్ సైబర్ యంత్రాంగాలకూ తగిలింది. 2010లో ఇరాన్‌లోని ఒక అణు ఇంధన శుద్ధి కర్మాగారాన్ని తీవ్రంగా దెబ్బతీసిన స్టక్స్‌నెట్ వైరస్‌ను అమెరికా-ఇజ్రాయెల్ కలిసి రూపొందించాయి. భారతీయ అణుకేంద్రాలూ ఇలా శత్రుదేశాల దాడికి గురికాకుండా ప్రభుత్వం తగు రక్షణ ఏర్పాట్లు చేయాలి. మొత్తం మీద ప్రభుత్వాలు, ప్రభుత్వేతర శక్తులూ సైబర్ అస్త్రాలతో ధ్వంస రచన చేసే ఘటనలు నానాటికీ పెరిగిపోతున్నాయి.

అంతరాల తెరలు తొలగేనా?

దేశ ఉన్నత విద్యా వ్యవస్థను ఆధునిక అవసరాలకు అనుగుణంగా నవీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం గట్టి సంకల్పంతోనే ముందుకు సాగుతోంది. జాతీయస్థాయిలో ఉన్నత విద్యా సంస్థలకు సంబంధించిన సమస్త సమాచారాన్నీ మోదీ ప్రభుత్వం సేకరిస్తోంది. దేశవ్యాప్త సర్వే ద్వారా గడచిన ఆరేళ్ల కాలంలో భారత్‌లో ఉన్నత విద్యా సంస్థలు,విద్యార్థులు, కోర్సులు, ప్రవేశాల తీరుతెన్నులు, ఆదాయ వ్యయ వివరాలు సేకరించింది. మొదట్లో ఈ సర్వేకు స్పందన అంత ఆశాజనకంగా లేదు. మానవ వనరుల మంత్రిత్వ శాఖ గట్టిగా హెచ్చరించడంతో ఉన్నత విద్యాసంస్థల్లో చురుకుపుట్టింది. దాంతో సుమారు 90శాతం సమాచారం రాబట్టగలిగారు. ఏదైనా ఓ విషయంపై పటిష్ఠ ప్రణాళిక రూపొందించాలంటే- కచ్చితమైన సమాచారం అందుబాటులో ఉండటం తప్పనిసరి. మానవ వనరుల మంత్రిత్వ శాఖ 2015-16 విద్యా సంవత్సరం సర్వే నివేదికను ఇటీవల వెలువరించింది. దేశీయంగా ఉన్నత విద్యతో ముడివడిన ఎన్నో ఆసక్తికరమైన అంశాలు ఈ సర్వేలో వెలుగు చూశాయి.

భారత్‌లో మొత్తంగా 799 విశ్వ విద్యాలయాలు; 39,071 కళాశాలలు;11,923 స్వయం సాధక సంస్థలు ఉన్నట్లు ఉన్నత విద్యాసర్వే వెల్లడిస్తోంది. యూనివర్సిటీలపరంగా చూస్తే దేశంలో మొత్తంగా 43 కేంద్ర విశ్వవిద్యాలయాలు కాగా- 329 రాష్ట్ర వర్సిటీలున్నాయి. వాటికి దీటుగానా అన్నట్లు ప్రైవేటు రంగంలో 197 వర్సిటీలు, 79 డీమ్డ్ ప్రైవేటు విశ్వవిద్యాలయాలు కొలువుదీరాయి. దీన్నిబట్టి వర్సిటీల స్థాయిలోనూ క్రమంగా ప్రైవేటు రంగానిదే పైచేయి అయ్యే అవకాశాలు ప్రస్ఫుటంగా కనపడుతున్నాయి. దీనివల్ల ఉన్నత విద్యలో నాణ్యత ప్రమాణాలు, సమానావకాశాలపై ఎలాంటి ప్రభావం ఉంటుందన్నది చర్చనీయాంశం. విద్యారంగం పూర్తిగా ప్రభుత్వ అజమాయిషీలోనే ఉండాలనే వారు ఒకవంక, పెరుగుతున్న జనాభా విద్యావసరాలు తీర్చే క్రమంలో ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించక తప్పదన్న వాదన మరోవంక గట్టిగా వినిపిస్తున్న ప్రస్తుత తరుణంలో- ప్రైవేటు రంగంలో విద్యాలయాల సంఖ్య పెరగడంపై విస్తృత చర్చే జరగాల్సి ఉంది.

విస్తృతిపరంగా రాజస్థాన్‌లో గరిష్ఠంగా 70 విశ్వవిద్యాలయాలు ఉండగా; ఆ తరవాత ఉత్తర్ ప్రదేశ్ (67), తమిళనాడు (58), గుజరాత్ (57), కర్ణాటక (52)ల్లో అత్యధిక విశ్వవిద్యాలయాలున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 28, తెలంగాణలో 21 వర్సిటీలున్నాయి. గోవాలో రెండు; చండీగఢ్, మిజోరం, త్రిపురల్లో మూడు; మణిపూర్, నాగాలాండ్‌లలో నాలుగు వర్సిటీలున్నాయి. ఉన్నత విద్యలో ప్రాంతీయ అసమానతల తీవ్రతను కళ్లకు కడుతున్న గణాంకాలివి. కళాశాలల స్థాయిలోఈ అసమానతలు మరింత లోతుగా విస్తరించాయి. దేశంలోని మొత్తం 656 జిల్లాల్లో పదికంటే తక్కువ కళాశాలలు ఉన్న జిల్లాల సంఖ్య 140. యాభై లోపు కళాశాలలు ఉన్న జిల్లాలు 404. అంటే దేశంలోని 61.6 శాతం జిల్లాల్లో కళాశాలల సంఖ్య 50కంటే కనిష్ఠంగా ఉందన్నమాట! బెంగళూరు, జైపూర్, హైదరాబాద్, నాగ్‌పూర్ వంటి నగరాల్లో ఒక్కో ప్రాంతంలో



ఉన్నత విద్యలో సంస్కరణలు

వందల సంఖ్యలో కాలేజీలు ఉండటం ఆశ్చర్యం కలిగిస్తుంది. కళాశాలల విస్తృతిపరంగా భయపెడుతున్న ఈ అంతరాలను తొలగించేందుకు ప్రభుత్వాలు గట్టి కృషి చేయాల్సిన అవసరాన్ని సూచిస్తున్న గణాంకాలివి. దేశంలోని కళాశాలల్లో 40శాతం ఒకే కోర్సు అందిస్తున్నాయి. అందులోనూ బిఇడి కాలేజీలే 30శాతం ఉన్నాయి. ఆధునిక సవాళ్లకు అనుగుణంగా కోర్సుల సంఖ్యను విస్తరిస్తేనే కళాశాల విద్య నిర్మాణాత్మకంగా పరిణమిస్తుంది. అందుబాటులోని సమాచారం మేరకు- ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ 77.6శాతం కళాశాలలు ప్రైవేటు అజమాయిషీలో కొనసాగుతున్నాయి. అంటే ఉన్నత విద్యారంగంలో ప్రభుత్వం వాటా కేవలం 22.4శాతం మాత్రమే అన్నమాట! ప్రైవేటు కళాశాలల ద్వారా అందిస్తున్న విద్య- పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఎంతమేరకు అందుబాటులో ఉందన్నది ఈ సందర్భంగా సమాధానం వెదుక్కోవాల్సిన ప్రశ్న!

డిగ్రీ పూర్తి చేసి పీజీ స్థాయి విద్యకు పేర్లు నమోదు చేసుకుంటున్నవారు కేవలం 11.3శాతం మాత్రమే. ఇక పరిశోధన దిశగా వెళుతున్నవారు కేవలం 0.5 శాతమే! మానవ వనరుల నాణ్యత పెరిగి, దేశం విజ్ఞానఖనిగా రూపొందాలంటే పీజీ, పరిశోధన రంగాల్లో ప్రవేశాలు బాగా పెరగాలి. విద్యార్థుల పరిశోధన సామర్థ్యాన్ని ఇనుమడింపజేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండంచెల విధానం ప్రవేశపెట్టే అవకాశాలు పరిశీలించాలి. ఒకటి: పరిశోధనలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తూ మరిన్ని కోర్సులు, ప్రయోగశాలలు ఏర్పాటు చేసి, వాటికి తగిన ఆర్థిక సహాయం అందించాలి. రెండు: అభివృద్ధి చెందిన దేశాల మాదిరిగా 'పరిశోధన విశ్వవిద్యాలయాల'(రీసెర్చ్ యూనివర్సిటీస్)ను ఏర్పాటు చేయాలి.

జాతీయ స్థాయిలో ఉపాధి అవకాశాలు అత్యధికంగా ఉండే వృత్తి విద్యా కోర్సులు, పీ.హెచ్‌డీల్లో బడుగు వర్గాల ప్రవేశం తక్కువగా ఉంది. తీవ్రంగా కలవరపరుస్తున్న సమస్య ఇది. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకునే నూతన జాతీయ విద్యా ప్రణాళికను రూపొందించాల్సి ఉంది. అటు విద్యార్థులు, ఇటు అధ్యాపకుల పరంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న నాణ్యమైన వనరులను భారత్ ఆకర్షించగలగాలి. ఈ విషయంలో అమెరికా, ఇంగ్లాండ్, కెనడా, జర్మనీల ద్వారా భారత్ పాఠాలు నేర్వాల్సి ఉంది. మరోవంక విద్యార్థి-అధ్యాపకుల నిష్పత్తి దేశంలో 23:1గా ఉండటమూ కలవరం కలిగిస్తున్న అంశం. బిహార్, దిల్లీ, ఝార్ఖండ్ వంటి రాష్ట్రాల్లో ఈ నిష్పత్తి 50:1 కంటే అధికంగా ఉండటం తీవ్ర ఆందోళన రేపుతోంది. జాతీయ, రాష్ట్ర స్థాయుల్లో ఉన్నత విద్యను పలు కోణాల్లో సంస్కరించుకోవాల్సిన ఆవశ్యకతను ఈ సర్వే స్పష్టం చేస్తోంది. 2015లో ప్రకటించిన జాతీయ నూతన విద్యా విధానం ఇప్పటికీ తుది రూపం సంతరించుకోలేదు కాబట్టి- ఈ సర్వేలో వెల్లడైన అంశాలనూ సవివరంగా చర్చించిన మీదటే 'తుది ప్రణాళిక'ను ఖరారు చేయడం మంచిది. అప్పుడే భారత ఉన్నత విద్యారంగం కొత్త బాట పడుతుంది!

– ఆచార్య కోదాటి వియ్యన్నరావు
(రచయిత– పూర్వ ఉపకులపతి,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం)

ఈనాడు లేఖలు

రైతు సంఘాలతో భరోసా

పంటభూముల రికార్డుల నిర్వహణలో సమూల మార్పులు తేవాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. లోటుపాట్లు నివారించేలా, పారదర్శకత వెల్లివిరిసేలా ఇప్పటికే చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా రైతుసంఘాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ప్రతి రెవిన్యూ గ్రామానికీ ఓ సంఘం ఉండటం వల్ల ప్రభుత్వం ఆశించిన ఫలితాలు సత్వరమే సిద్ధిస్తాయి. భూముల వివరాల పరిశీలన (సర్వే) జరిపి కంప్యూటర్‌లో నిక్షిప్తం చేయడం కచ్చితత్వానికి దారితీస్తుంది. రైతులకు గల భూముల ద్వారా, ఎకరానికి సరిపడా పెట్టుబడి తిరిగి వచ్చేలా చేయవచ్చు. దీని వల్ల వారికి ఆర్థికంగా ఎంతో భరోసా కల్పించినట్లవుతుంది. వ్యవసాయ రంగ పురోగతికి సమధికంగా దోహదపడే రైతుసంఘాల విస్తరణపై సర్కారు దృష్టి కేంద్రీకరించాలి.

- కె. శ్రవణ్‌కుమార్,
ఎర్రబెల్లిగూడెం, మహబూబాబాద్ జిల్లా

ఆకస్మిక తనిఖీలేవీ?

అవినీతికి పాల్పడే అధికారులు, ఉద్యోగులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోంది. కార్యాలయాల్లో లంచం అడిగినవారి భరతం పట్టాలని, అవినీతిపరుల్ని తరిమికొట్టాలని ప్రజాప్రతినిధులు పిలుపిస్తున్నారు. ఫలితంగా అవినీతి నిరోధక శాఖ, సంబంధిత ఇతర విభాగాలు పక్కా కార్యాచరణ ద్వారా అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి. ఇదే పట్టును కొనసాగిస్తూనే, మరికొన్ని చర్యలకూ శ్రీకారం చుట్టాలి. దాడుల్ని విస్తరించడంతో పాటు- నేరగాళ్లపై క్రిమినల్ కేసుల నమోదు, ఆస్తుల స్వాధీనం వంటివి వేగవంతం చేయాలి. ఇప్పటికీ కొన్నిచోట్ల గ్రామీణుల్ని కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవడం కనిపిస్తోంది. దీన్ని అరికట్టేందుకు ఉన్నతాధికారులు విస్తృతంగా ఆకస్మిక తనిఖీలు చేపట్టాలి.

- షేక్ దస్తగీర్, కిష్టంపేట, జగిత్యాల జిల్లా

జ్ఞానోదయం

'మనసు గుర్రమురోరి మనిషీ, మనసు కళ్లెము లాగు మనిషీ!' అంటారు తాత్వికులు. ప్రపంచంలో ప్రతిదానికీ నామరూపాలుంటాయి. మనసుకు పేరే గాని, రూపం లేదు. 'జిహ్వాకో రుచి, పుర్రెకో బుద్ధి' అన్నట్లు - ఎవరి మనసు ఎప్పుడు ఎలా ఉంటుందో, అది ఏ క్షణానికి ఏ రకంగా మారుతుందో ఎవరూ చెప్పలేరు. అందుకే 'క్షణం చిత్తం, క్షణం విత్తం' అని పెద్దల మాట!

జ్ఞాని మనసునూ చంచలత్వం ఆవహించడాన్ని గీతాచార్యుడి బోధ తేటతెల్లం చేస్తుంది. 'ఓ అర్జునా! అత్యంత చంచలమైనవి ఇంద్రియాలు. జీవితంలో పరిపూర్ణతకు ప్రయత్నించే జ్ఞాని మనసును సైతం అవి తమ వెంట బలవంతంగా తీసుకెళతాయి' అంటుంది గీతాబోధ. నదిలోని నావ పెనుగాలి తాకిడికి దారి తప్పుతుంది. అలాగే, విచ్చలవిడిగా సంచరించే ఇంద్రియాలనే మనిషి మనసు అనుసరిస్తుంటుంది. అతడి వివేకాన్ని అది ఎగరేసుకుపోతుంది.

'వెయ్యిమందిని వెయ్యిసార్లు యుద్ధంలో ఓడించినవాడికన్నా, తన మనసును తాను జయించినవాడే మహాపరాక్రమవంతుడు' అంటాడు గౌతమ బుద్ధుడు. మనసును స్వాధీనం చేసుకోవడమే లోకంలో అన్నింటికంటే కష్టమైన పని. అంతకు మించిన ధీరోదాత్తత మరొకటి ఉండదు.

నిత్యజీవితంలో మనసు అనుక్షణం మనిషి ఊహల్ని, ప్రవర్తనను నిర్దేశిస్తుంది. అతడిపై ఎంతో ప్రభావం కలిగిస్తుంది. మనసును అప్పుడే ఉతికిన తెల్లటి వస్త్రంతో పోలుస్తారు విజ్ఞులు. దాన్ని ఏ రంగులో ముంచితే, ఆ రంగే అంటుతుంది. మనసు కూడా అంతే! దానికి ఎలాంటి శిక్షణ ఇస్తే, అలాగే వ్యవహరిస్తుంది.

శత్రువు బలవంతుడైనంత మాత్రాన, జంకాల్సిన పని లేదు. ఎదుర్కొనేందుకు ఉపాయాలు, ఇతర మార్గాలు ఆలోచించాలి. అలా అని, నిజానికి మనసు, మనిషికి శత్రువేమీ కాదు. ఏనుగు ఎంత పెద్దదైనా, మావటివాడి అంకుశానికి లొంగుతుంది. బలమైన ఎడ్లు, ఆంబోతులైనా ముకుతాడు వేస్తే లొంగుతాయి. ఆ విధంగానే, అభ్యాసం ద్వారా మనసును వశం చేసుకోవచ్చని 'గీత' చెబుతుంది. పతంజలి యోగ సూత్రాలూ ఇదే చెబుతాయి.

'అభ్యాసం కూసు విద్య' అన్నారు. నిరంతరం సాధన చేయడమే అభ్యాసం. నిర్మాణాత్మకమైన ఆలోచన జీవితాన్ని మలుపు తిప్పుతుంది. మనిషి చేసే ప్రతి పనీ అర్థవంతంగా ఉండాలంటే, కొన్ని ఆదర్శాలు ఏర్పరచుకోవాలి. అతడి నడవడి నైతిక విలువలకు కట్టుబడి ఉండాలి. అవి చూపే మార్గంలోనే అతడు ముందుకు సాగాలి.



అంతర్యామి

యోగశాస్త్రాలు- యమ, నియమ అభ్యాసాలతో మనోసాధన చేయాలంటాయి. అప్పుడే మనసు సాధకుడి స్వాధీనమవుతుంది. అహింస, సత్యవ్రతం, దొంగతనం చేయకుండా ఉండటం, ఇతరుల నుంచి ఏదీ ఆశించని స్వభావమే 'యమ' అభ్యాసాలు. 'నియమ' అభ్యాసాలంటే- శారీరక, మానసిక పరిశుభ్రత; సంతృప్తి, తపస్సు, శాస్త్రాధ్యయనం, భగవంతుణ్ని సదా ఆరాధించడం. వీటిని స్వయంకృషితో సాధించవచ్చు.

ఈ గుణాలతో సాధకుడి అంతర్గత శక్తి పెరుగుతుంది. హృదయం నుంచి సంకుచితత్వం మటుమాయమవుతుంది. అంతర్గతంగా ఉండే అశాంతి దూరమవుతుంది. విశాల హృదయాన్ని అలవరచుకోవడం వల్లనే మనశ్శాంతి చేకూరుతుంది. దుఃఖితుల పట్ల దయ కలిగి ఉండటం మరో ఉత్తమ మార్గం. 'లోకమంతా మనదే' అనే దృక్పథం మానవుడి మానసాన్ని శుద్ధి చేస్తుంది.

ప్రాపంచిక విషయాల పట్ల అతి ఆకర్షణ తగదు. శాశ్వతమేదో, అశాశ్వతమేదో తెలుసుకొని ఉండాలి. వస్తుసంబంధ అంశాలకు, ఇంద్రియాలకు అనుసంధానకర్త మనసు. వస్తువుల పట్ల ఆకర్షణ నుంచి దాన్ని వెనక్కి మళ్లించుకోవాలి. అప్పుడే ఇంద్రియాలు తమను తాము సరిదిద్దుకుంటాయి. అవి సరైన దోవలో పడతాయి. సామరస్యం గల మానవ సంబంధాలు కలిగి ఉండడం, హానికరమైన ఊహల పట్ల జాగ్రత్తపడటం- మనోనియంత్రణకు అత్యంత అవసరాలు. స్వాధీనమైన మనసే మనిషిని జ్ఞానోదయం వైపు నడిపిస్తుంది!

– డాక్టర్ దామెర వేంకట సూర్యారావు



స్వాధీనం చేసుకున్న పంచలోహ విగ్రహాలు

పంచలోహ విగ్రహ విక్రయ ముఠా అరెస్టు

గౌతమ బుద్ధుని ప్రతిమలు స్వాధీనం

గోదావరిఖని, న్యూస్‌టుడే: పంచలోహ విగ్రహాలను విక్రయించే ముఠాను పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ఒకటో పట్టణ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వారినుంచి రెండు గౌతమ బుద్ధుని విగ్రహాలను స్వాధీనం చేసుకున్నారు. గోదావరిఖని బస్టాండ్‌కాలనీకి చెందిన నీలం తిరుపతి, కరీంనగర్ జిల్లా వీణవంకకు చెందిన దాసరి రామస్వామి, హైదరాబాద్ బాలానగర్‌కు చెందిన అన్నల్‌దాస్ విజయ్‌కుమార్‌లను సోమవారం బస్టాండ్‌కాలనీ వద్ద అదుపులోకి తీసుకున్నామని రామగుండం పోలీసు కమిషనర్ విక్రమ్‌జీత్ దుగ్గల్ వివరాలను వెల్లడించారు. ఆటో డ్రైవర్ దాసరి రామస్వామికి హైదరాబాద్‌లో ఆటో ఫైనాన్స్ నిర్వహించే విజయ్‌కుమార్‌తో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలోనే తనవద్ద రెండు పంచలోహ గౌతమబుద్ధ విగ్రహాలున్నాయని, ఒక్కొక్కటి రూ.20 లక్షల విలువ చేస్తాయని తిరుపతికి చెప్పాడు. వాటిని విక్రయిస్తే భారీగా కమీషన్ వస్తుందన్నాడు. గుర్తు తెలియని వ్యక్తి వద్ద విజయ్‌కుమార్ రెండు పంచలోహ విగ్రహాలను తీసుకున్నాడని తెలిపిన రామస్వామి అందులో ఒకదాన్ని తీసుకొచ్చి తిరుపతికి అప్పగించాడు. దాన్ని విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా పక్కా సమాచారం మేరకు అతని ఇంటికి వెళ్లి పోలీసులు విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్నారు. తిరుపతితో పాటు రామస్వామిని అదుపులోకి తీసుకొని విచారించారు. హైదరాబాద్‌కు చెందిన విజయ్‌కుమార్ వద్ద మరో విగ్రహం ఉన్నట్లు తేలగా అక్కడికి వెళ్లి అతన్ని అరెస్టు చేసి, విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీటిని ఎక్కడి నుంచి తీసుకువచ్చారు? రూ.40 లక్షల విలువ ఉంటుందా అన్న విషయాలను ఎఫ్ఎస్ఎల్ పరీక్షలకు పంపించినతర్వాత తెలుస్తుందనిసీపీ పేర్కొన్నారు. ముఠాను పట్టుకున్న ఒకటో పట్టణ సీఐ గజ్జి కృష్ణతో పాటు పోలీసు సిబ్బందిని ఆయన అభినందించారు. పెద్దపల్లి డీసీపీ విజేందర్‌రెడ్డి, ఖని ఏసీపీ అపూర్వరావులు పాల్గొన్నారు.

సచివాలయ అధికారులకు పదోన్నతులు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ సచివాలయంలో 10 మంది అధికారులకు సంయుక్త కార్యదర్శులుగా పదోన్నతులు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. పదోన్నతులు పొందిన వారిలో నరేందర్‌రావు, రాంసింగ్, లక్ష్మీదేవి, కేఎస్ ప్రసాద్, ఎన్.రాజారెడ్డి, టి.రామస్వామి, ఎస్.అప్పారావు, ఎస్.లక్ష్మీబాయి, వి.వెంకటేశ్వర్లు, ఎ.మల్లారెడ్డిలు ఉన్నారు.

నాటు ఆవులే మేలు

- పశు కృత్రిమ గర్భధారణలో దేశవాళీకి పెద్దపీట
- విదేశీ సంకరజాతి వీర్యం సేకరణకు రైతుల నిరాదరణ

ఈనాడు - హైదరాబాద్

తెలంగాణలో నాటు ఆవుల ఉత్పత్తిపై కొత్త ఆశలు రేకెత్తుతున్నాయి. ఇంతకాలం సంకరజాతి గిత్తల వీర్యంతో ఆవుల్లో కృత్రిమ గర్భధారణకు మొగ్గుచూపిన రైతులు ఇప్పుడు నాటు, దేశవాళీ జాతి పాలకు డిమాండు పెరుగుతున్నందున వాటి పెంపకానికే మొగ్గు చూపుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒంగోలు, గుజరాత్‌కు చెందిన గిర్ జాతి గిత్తల వీర్యం తమ ఆవులకు కావాలని అడిగేవారి సంఖ్య బాగా పెరిగిందని తెలంగాణ పశుసంవర్ధకశాఖకు చెందిన 'రాష్ట్ర పశుగణాభివృద్ధి సొసైటీ' (ఎల్‌డీఏ) తాజా నివేదికలో వెల్లడించింది. ఈ సొసైటీకి కరీంనగర్‌లో పశు ఘన వీర్య అభివృద్ధి కేంద్రం'(ఎఫ్ఎస్‌బీఎస్) ఉంది. గతేడాది కరీంనగర్ ఈకేంద్రంలో 12.72 లక్షల వీర్యం నమూనాలు ఉత్పత్తి కాగా అవి సరిపోలేదు. తమిళనాడు నుంచి 4.50 లక్షలు, గుంటూరు కేంద్రం నుంచి మరో 50 వేలు తెప్పించి మొత్తం 16 లక్షల నమూనాలు తెలంగాణ పాడి పశువులకు ఇచ్చారు. ఈ ఏడాది మరో 16 లక్షల నమూనాల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నా ఇక్కడే ఉత్పత్తికి అవకాశాల్లేక ఇతర రాష్ట్రాల నుంచి తెప్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. 2017-18 చివరికల్లా తెలంగాణలో పశువీర్యం ఉత్పత్తిలో స్వయంసమృద్ధి సాధించాలనే లక్ష్యంతో కొత్తగా రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం కంసాన్‌పల్లి కొత్తగా ఎఫ్ఎస్‌బీఎస్ ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇది పూర్తయితే అదనంగా 20 లక్షల నమూనాల ఉత్పత్తికి అవకాశముంటుంది.



కరీంనగర్‌లోని కృత్రిమ పశు వీర్య ఉత్పత్తి కేంద్రంలోని గిత్తలు

గిత్తల కొరతతో సమస్యలు

మేలైన పాడి పశువులు పుట్టాలంటే వీర్యం సేకరణకు గిత్తల ఎంపిక అత్యంత ముఖ్యం. ఇందుకోసం కేంద్రం ప్రత్యేకంగా రాష్ట్రాల్లో 'కేంద్ర గిత్త పంపిణీ కమిటీ'ని ఏర్పాటుచేసింది. తెలంగాణకు ఈఏడాది 36 మేలైన గిత్తలు, మరో 30 దున్నలు కావాలని ఎల్‌డీఏ ప్రతిపాదనలు పంపింది. ఒక్కోదానికి రూ.3 లక్షల వరకూ ధర నిర్ణయించారు. మొత్తం 36 గిత్తల్లో ఒంగోలు జాతివి 10, గిర్ జాతి 6 గుజరాత్ నుంచి తెప్పిస్తున్నారు. ప్రస్తుతం కరీంనగర్ కేంద్రంలో 58 దున్నలు, మరో 34 గిత్తలుండగా వీటి వీర్యదానకాలం తీరడంతో 20 పశువులను పంపేస్తున్నారు. సంకరజాతి పాడి పశువుల నిర్వహణ భారంగా ఉండటంతో రైతులు దేశవాళీ వైపు మొగ్గు చూపుతున్నారు.

మేలైన పశుజాతి సంఖ్యను పెంచుతాం



తెలంగాణలో అధిక పాలనిచ్చే ఆవులు, గేదెల సంఖ్యను పెంచడానికి కృత్రిమ గర్భధారణను భారీగా నిర్వహిస్తున్నాం. రైతు రూ.40 చెల్లిస్తే పశువుకు వీర్యం నమూనా ఇస్తాం. ఇప్పటికే అధిక పాలిచ్చే ఆవుకు మా దగ్గర ఉన్న మేలైన గిత్త వీర్యం ఇచ్చి పుట్టే ఆవుదూడను జాగ్రత్తగా పెంచుతారు. వాటికి మళ్లీ మా కేంద్రం నుంచే మేలైన గిత్త వీర్యం ఇచ్చి ఆపైన పుట్టే గిత్తను మాత్రమే రూ.3 లక్షలిచ్చి కొంటారు. ఈ కార్యక్రమం వల్ల పలు రాష్ట్రాలు, విదేశాల్లో అధిక పాలిచ్చే పశువుల సంఖ్య గణనీయంగా పెరిగింది.

-మంజువాణి, ముఖ్య కార్య నిర్వహణాధికారి, పశు గణాభివృద్ధి ఏజెన్సీ

లక్ష ఇస్తే..ఇంజినీరింగ్ పట్టా

- ఓ పట్టభద్రుడి నిర్వాకం: అరెస్టు
- 25 మందికి విక్రయించినట్టు విచారణలో వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: ఇంజినీరింగ్ పట్టా కావాలా? దానికోసం నాలుగేళ్లు చదవాల్సిన పనిలేదు. ఓ లక్ష రూపాయలు ఖర్చు చేయగలిగితే చాలు. అసలును తలదన్నే పట్టా మీ చేతిలో వచ్చి వాలుతుంది. అదీ ఆషామాషీ కళాశాలలది కాదు..సాక్షాత్తూ జేఎన్‌టీయూహెచ్‌ది. టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడిలో ఇలాంటి వ్యాపారం చేస్తున్న వ్యక్తి సోమవారం పట్టుపడటంతో గుట్టుగా సాగుతున్న ఈ తంతు వెలుగులోకి వచ్చింది.

జేఎన్‌టీయూహెచ్‌లో ఏడేళ్ల క్రితం వినోద్‌కుమార్ బీటెక్ పూర్తిచేశాడు. ఉద్యోగం రాకపోవడంతో ఉస్మానియా విశ్వవిద్యాలయం సమీపంలో 2010లో 'అసెండర్స్ కన్సల్టెంట్ సర్వీసెస్' పేరుతో ఓ సంస్థను నెలకొల్పాడు. ఏడాదికే నష్టాలు రావడంతో సంస్థ నిర్వహణ భారమైంది. అదే సమయంలో కర్మన్‌ఘాట్‌లో ఉంటున్న నరేందర్ అతనికి పరిచయమయ్యాడు. 'తాను నకిలీ పట్టాలు, ధ్రువపత్రాలు తయారు చేస్తానని, అవసరమైన వారికి నీ సంస్థద్వారా విక్రయించాలంటూ' చెప్పాడు. దీనికి అంగీకరించిన వినోద్ అప్పట్నుంచి సంస్థను మళ్లీ నిర్వహించడం మొదలుపెట్టాడు. ఉద్యోగా లిప్పిస్తానంటూ నమ్మించి ఇంజినీరింగ్ విద్యార్థుల అసలు ధ్రువపత్రాలు తీసుకుని వాటిని నరేందర్‌కు పంపుతూ వచ్చాడు. అతను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వినోద్ సూచించిన పేర్లను వాటిపై ముద్రించి ఇచ్చేవాడు. ఒక్కో ధ్రువీకరణ పత్రాన్ని రూ.80 వేల నుంచి రూ.లక్ష చొప్పున అమ్ముతూ వచ్చిన వినోద్.. రూ.50 వేల నుంచి 60 వేల వరకు నరేందర్‌కు ఇచ్చేవాడు. నకిలీపట్టాలు తయారుచేస్తున్నారన్న సమాచారంతో వినోద్‌పై నిఘా ఉంచామని, శివంరోడ్‌లో సోమవారం అదుపులోకి తీసుకున్నామని ఇన్‌స్పెక్టర్ ఎల్.ఆర్.వెంకటరెడ్డి తెలిపారు. అతని నుంచి జేఎన్‌టీయూహెచ్ బీటెక్ పట్టాలు-16, హాలోగ్రామ్-4, లాప్‌ట్యాప్, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. ఇప్పటివరకు 25 మందికి మాత్రమే పట్టాలు విక్రయించినట్టు వినోద్ అంగీకరించాడని, నరేందర్ పరారీలో ఉన్నాడని వివరించారు. తదుపరి విచారణ నిమిత్తం వినోద్‌ను నల్లకుంట పోలీసులకు అప్పగించామన్నారు.



నిందితుడు వినోద్‌కుమార్

జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ సభ్యుడిగా బి.పి.మోహన్



ఈనాడు, హైదరాబాద్: జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ జ్యుడిషియల్ సభ్యుడిగా హైదరాబాద్ హైకోర్టు న్యాయవాది భాస్కర పంతుల మోహన్ ఇటీవల నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బి.పి.మోహన్‌కు ముంబాయి లా ట్రైబ్యునల్‌కు పోస్టింగ్ ఇస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. 1988లో బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్ అయిన ఆయన కర్నూలులో ప్రాక్టీస్ ప్రారంభించి 1992లో హైకోర్టులో ప్రాక్టీస్ చేపట్టారు. కంపెనీ లా, సివిల్ సూట్‌లు, రిట్‌లో నైపుణ్యం ఉన్న ఆయన ఏపీఐఐసీ స్టాండింగ్ కౌన్సిల్‌గా 2009లో నియమితులయ్యారు. ఎమ్మార్, రహేజా తదితర కేసుల్లో ఏసీబీ తరఫున వాదనలు వినిపించారు.

పిడుగులు పడి 18 మంది మృతి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఒడిశాలో రెండు రోజులుగా ఉరుములతో కూడిన వర్షాలు పడుతున్నాయి. పిడుగులు పడ్డాయి. సోమవారం ఒక్కరోజే 18 మంది మృతి చెందగా మరో 23 మంది గాయపడ్డారు. ఆది, సోమవారాల్లో పిడుగులు పడి చనిపోయిన వారి సంఖ్య 32 మందికి చేరింది.

ఉపాధి హామీ అక్రమాలపై జిల్లాలవారీ విచారణ

- జిల్లాకు ఒక అంబుడ్స్‌మన్ నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన సర్కారు

ఈనాడు, హైదరాబాద్: ఉపాధి హామీ పథకంలోని అక్రమాలపై తెలంగాణలో ఇక జిల్లాల వారీగా విచారణను చేపట్టనున్నారు. కూలీల ఫిర్యాదులు తదితరాలను పరిశీలించి తీర్పులు వెలువరించేందుకు రాష్ట్రంలోని హైదరాబాద్ మినహా మిగతా 30 జిల్లాలకు 30 మంది అంబుడ్స్‌మన్‌లను నియమించనున్నారు. వీరి ఎంపికకు ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో కమిటీ ఏర్పాటైంది. జాతీయ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన ఫిర్యాదుల పరిశీలనకు ప్రతి జిల్లాకు ఒక స్వతంత్ర న్యాయమూర్తి ఉండాలని చట్టం చెబుతోంది. ఇంతవరకు ఇటువంటి వ్యవస్థ అంటూ లేకపోవటంతో కూలీల ఫిర్యాదులను పట్టించుకొనే వారే కరవయ్యారు. దీంతో పనిని కల్పించలేకపోయినప్పుడు నిరుద్యోగ భృతిని ఇవ్వటం, వేతనాల చెల్లింపులు ఆలస్యమైతే వడ్డీలను చెల్లించటం వంటి నిబంధనలు సక్రమంగా అమలుకావటంలేదు. ఈ నేపథ్యంలో సర్కారు ఎట్టకేలకు జిల్లాల వారీగా అంబుడ్స్‌మన్‌లను నియమించేందుకు సంకల్పించి సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. సామాజిక తనిఖీల సందర్భంగా వెలుగుచూసే అక్రమాలపైనా వీరు విచారణ జరుపుతారు. అర్హుల ఎంపికకు అదనపు ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో మరో ముగ్గురు సభ్యులతో కమిటీ ఉంటుంది. ఎంపికైన వారు రెండేళ్లపాటు పదవిలో ఉంటారు. వీరికి ఒక్కో విచారణ రోజుకు (సిటింగ్) రూ.1,000 చొప్పున.. గరిష్ఠంగా నెలకు రూ.20వేలు అందుతాయి.

నీటిపారుదలశాఖలో కొత్త ఇంజినీర్ ఇన్ చీఫ్‌లు

ఈనాడు, హైదరాబాద్: నీటిపారుదలశాఖలో పదోన్నతులపై కొత్తగా ఇద్దరు ఇంజినీర్ ఇన్ చీఫ్(ఇఎన్‌సీ)లు నియమితులయ్యారు. సీనియారిటీలో ముందున్న కరీంనగర్ ప్రాజెక్టుల చీఫ్ ఇంజినీర్‌కు ఇ.ఎన్.సిగా పదోన్నతి కల్పించి ప్రస్తుతమున్న స్థానంలోనే నియమించారు. ఎస్సారెస్పీ-2 చీఫ్ ఇంజినీర్‌గా ఉన్న నాగేందర్‌రావును పదోన్నతిపై ఇ.ఎన్.సి(పరిపాలన)గా నియమించారు. వాలంతరీ డైరెక్టర్ జనరల్ నారాయణరెడ్డి, ఇ.ఎన్.సి(పరిపాలన) విజయప్రకాశ్‌లు సోమవారం పదవీ విరమణ చేశారు. ఈనేపథ్యంలో సెక్రటేరియట్‌లో సంయుక్తకార్యదర్శిగా ఉన్న శ్రీనివాస్ వాలంతరీ ఇన్‌ఛార్జిగా నియమించారు. కొత్తగా మరో ఇ.ఎన్.సి. పోస్టుకు ముఖ్యమంత్రి ఆమోదం లభించినట్లు తెలిసింది. వాలంతరీ డైరెక్టర్ జనరల్‌గా చీఫ్ ఇంజినీర్ స్థాయి అధికారిని నియమించి, కాళేశ్వరం ప్రాజెక్టుకు ఇంజినీర్ ఇన్ చీఫ్‌ను నియమించే అవకాశమున్నట్లు సమాచారం.

అనుమతి లేని బీటీ పత్తి సాగును అడ్డుకోండి

వ్యవసాయశాఖకు విత్తన కంపెనీల సంఘం వినతి

ఈనాడు, హైదరాబాద్: బీటీ పత్తి విత్తనాల్లో అనుమతి లేని కొత్త రకం అమ్మకాలను అడ్డుకోవాలని రాష్ట్ర విత్తన కంపెనీల యాజమాన్యాల సంఘం సోమవారం వ్యవసాయశాఖ కార్యదర్శి పార్థసారథిని కలసి విన్నవించింది. కలుపు మొక్కలు పెరగకుండా వచ్చిన కొత్త బీటీ పత్తి విత్తనాల సాగుకు కేంద్రం అనుమతి లేదు. కానీ కొన్ని ఏజెన్సీలు, వ్యాపారులు మారుమూల పల్లెల్లో వీటిని రైతులకు విక్రయిస్తున్నట్లు తెలిపింది. అనుమతి ఉన్న బీటీ విత్తుల ధరకన్నా సగానికి సగం తగ్గించి, ప్యాకెట్లపై చిరునామాలు లేకుండా వీటిని అమ్ముతున్నట్లు పేర్కొంది. వీటిని గుర్తించి అడ్డుకోవాలని సూచించింది. దీనిపై త్వరలో జిల్లాల వ్యవసాయాధికారులకు సూచనలిస్తామని పార్థసారథి తెలిపారు.



నిందితుల అరెస్టు చూపుతున్న సీపీ దుగ్గల్

పాతనోట్ల మార్పిడి ముఠా అరెస్టు

రూ.35.76 లక్షల పాత నోట్లు స్వాధీనం

గోదావరిఖని, న్యూస్‌టుడే: రద్దయిన పాతనోట్లను మార్పిడి చేసే ముఠా పోలీసులకు చిక్కింది. పెద్దపల్లి జిల్లా రామగుండం పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు సోమవారం మేడిపల్లి శివారులో ఆరుగురు నిందితులను అరెస్టు చేయడంతో పాటు రూ.35.76 లక్షల పాత నోట్లను స్వాధీనం చేసుకున్నారు. రామగుండం పోలీసు కమిషనర్ విక్రమ్‌జీత్ దుగ్గల్ గోదావరిఖనిలో ఈ వివరాలను వెల్లడించారు. ధర్మారం మండలం గోపాల్‌రావుపేటకు చెందిన గాజిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి(53), జగిత్యాల జిల్లా ఆత్మకూరు మండలం గొల్లపల్లికి చెరందిన మాదాసు రవీందర్‌లు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. పాతనోట్లను మార్పిడి చేయడం ద్వారా కమీషన్ దండుకోవచ్చని భావించి, కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం బొమ్మకల్‌కి చెందిన స్థిరాస్తి వ్యాపారి ఉదయ్‌కుమార్(33)ను సంప్రదించారు. బ్యాంకర్లతో పరిచయం ఉందని, పాతనోట్లు మార్చుకునే వారిని గుర్తించి, తమకు సమాచారమివ్వాలని కోరారు. హైదరాబాద్ లంగర్‌హౌస్‌లో దుస్తుల దుకాణం నిర్వహించే కాంత ప్రశాంత్‌ప్రకాశ్(35)కు ఇదే విషయాన్ని చెప్పారు. ఆయన మద్యం దుకాణం నిర్వహించే చిత్తూరు జిల్లా మదనపల్లికి చెందిన చింతల హర్షవర్ధన్(36), హైదరాబాద్‌కు చెందిన పాల వ్యాపారి మహంకాళి సందీప్(31)ల వద్ద పాతనోట్లు ఉండటంతో వాటిని మార్చుకునేందుకు హైదరాబాద్ నుంచి బొలేరో వాహనంలో గోదావరిఖని బయలుదేరారు. ఆ ముగ్గురూ ధర్మారం మండలంలోని గోపాల్‌రావుపేటకు చెందిన రాజేశ్వర్‌రెడ్డికి ఇంటికి చేరుకున్నారు. ఆయన వారికి ఉదయ్‌కుమార్‌ను పరిచయం చేశారు. అక్కడి నుంచి ఆరుగురు గోదావరిఖని బయలుదేరారు. రాజేశ్వర్‌రెడ్డి, రవీందర్‌లు పాతనోట్లను మార్చేందుకు బ్యాంకు అధికారుల కోసం ప్రయత్నిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు.

జూనియర్ వైద్యులపై మృతురాలి బంధువుల దాడి

- డాక్టర్ల నిర్లక్ష్యం వల్లే వృద్ధురాలు మృతి చెందిందని ఆరోపణ
- వైద్యసేవలు నిలిపేసి జూనియర్ వైద్యుల ఆందోళన
- ఉస్మానియా ఆసుపత్రిలో ఉద్రిక్తత



ఉస్మానియా ఆసుపత్రిలోని సూపరింటెండెంట్ కార్యాలయంలో నిరసన తెలుపుతున్న జూనియర్ వైద్యులు

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ వృద్ధురాలు మృతిచెందిన సంఘటన ఆదివారం రాత్రి ఉద్రిక్తతకు దారితీసింది. వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ మృతురాలి కుటుంబీకులు విధి నిర్వహణలో ఉన్న వైద్యులపై దాడిచేశారు. జూనియర్ వైద్యులంతా అర్ధరాత్రి వరకు విధుల్ని బహిష్కరించారు. సోమవారం సాయంత్రం వరకూ ఆసుపత్రిలో అత్యవసర, సాధారణ వైద్యసేవల్ని బహిష్కరించారు. సమ్మెకు పిలుపునిచ్చారు. దాడికి పాల్పడినవారిని చట్టప్రకారం కఠినంగా శిక్షించాలన్నారు. సికింద్రాబాద్ ప్రాంతానికి చెందిన పక్షవాతం రోగి ముంతాజ్ బేగం(70)ను వారం కిందట కుటుంబీకులు ఉస్మానియా ఆసుపత్రిలో చేర్పించారు. ఆదివారం సాయంత్రం ఆమెకు బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. తర్వాత చికిత్స పొందుతూ మృతిచెందింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే మరణించిందంటూ ఆమె కుమార్తె, కొడుకు, బంధువులు మేల్ మెడికల్ వార్డు-5లో విధి నిర్వహణలో ఉన్న జూనియర్ వైద్యులు సంధ్య, రాజారమేష్‌లపై దాడిచేసి కొట్టారు. ఆదివారం రాత్రి ఉస్మానియా ఆసుపత్రిలోని ఓపీ భవనం ఆవరణలో బైఠాయించిన జూనియర్ వైద్యులు విధులను బహిష్కరించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్, ఆర్ఎంవోలు జూనియర్ వైద్యులను సముదాయించినా ఫలితం లేకపోయింది. సోమవారం ఉదయం ఆసుపత్రిలోని సూపరింటెండెంట్ కార్యాలయంలోకి వెళ్లి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు లిఖితపూర్వకంగా హామీ ఇచ్చేంతవరకు సమ్మె విరమించబోమన్నారు.

కొనసాగిన ఉద్రిక్తత: ఉస్మానియా ఆసుపత్రిలోని పాత భవనం, ఓపీ భవనం పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్తత నెలకొనడంతో.. పోలీసులు ఆసుపత్రి వద్ద బలగాలను మోహరించారు. జూనియర్ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ గుండగాని శ్రీనివాస్ మాట్లాడుతూ పేద రోగులకు వైద్యంచేసే జూనియర్ వైద్యులకు రక్షణ కరవైందన్నారు. సున్నితమైన ప్రాంతాల్లో పోలీసు సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. వార్డులు, పరిపాలనా భవనం, కీలకమైన విభాగాల్లోకి సమాచారం చేరేలా అలారం, బజర్ ఏర్పాటుచేయాలని, ఆసుపత్రిలోని అన్నిచోట్లా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని డిమాండ్‌చేశారు. ప్రస్తుతం రెండు సెక్షన్ల ఎస్పీఎఫ్ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారని, మరో రెండు సెక్షన్ల సిబ్బంది నియామకం కోసం ఎస్పీఎఫ్ ఉన్నతాధికారులకు లేఖ రాస్తామని ఏసీపీ చక్రవర్తి హామీఇచ్చారు. దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదుచేశామని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఏర్పాట్లు చేపడతామని చెప్పారు.

కనీస సౌకర్యాలు, వైద్య పరికరాల కొరత

జూనియర్ వైద్యులు మాట్లాడుతూ ఆసుపత్రిలోని అత్యవసర విభాగాలైన క్యాజువాల్టీ, ఐఎంసీ, ఏఎంసీ వంటి కీలక వార్డుల్లో పేద రోగులకు వైద్యసేవలు అందించేందుకు అవసరమైన బీపీ ఆపరేటర్లు, ఈటీ ట్యూబులు, గ్లౌజులు, ఈసీజీ యంత్ర పరికరాలు అవసరమైనన్ని అందుబాటులో లేకపోవడంతో జాప్యమేర్పడుతోందని తెలియజేశారు.

రహదారి భద్రత పటిష్ఠానికి రూ.37 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: రహదారి భద్రతకు రూ.37 కోట్లు మంజూరు చేశామని.. వాటితో లేజర్ గన్స్, బ్రీత్ అనలైజర్స్, పెట్రోలింగ్ వాహనాలను అందుబాటులోకి తీసుకొస్తామని రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి చెప్పారు. రహదారి భద్రతపై పోలీసు, రహదారులు- భవనాలు, విద్య, ఆబ్కారీ శాఖలతో లీడ్ ఏజెన్సీని ఏర్పాటు చేయనున్నామన్నారు. సోమవారం రాష్ట్ర రహదారి భద్రతా మండలి సమావేశంలో మంత్రి మాట్లాడారు. 'రహదారి భద్రతపై విద్యార్థి దశ నుంచే చైతన్యం తేవాలి. ఏడో తరగతి నుంచి పాఠ్యాంశంగా రహదారి భద్రతను తీసుకువచ్చేందుకు ఎస్‌సీఈఆర్‌టీతో చర్చిస్తున్నాం. కొత్తగా నిర్మించే రహదారుల్లో సైకిల్ ట్రాక్‌ల నిర్మాణానికి ప్రాధాన్యమివ్వాలి. సైకిల్ ట్యాక్సీలనూ ప్రోత్సహించాలి. 2016-17లో రోడ్డు ప్రమాదాల్లో 7,227 మంది మరణించగా 23 వేల మంది క్షతగాత్రులయ్యారు. వివిధ మార్గాల్లో 111 ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి 22 చోట్ల మరమ్మతులు చేపట్టాం. మిగిలినవీ యుద్ధప్రాతిపదికన చక్కదిద్దుతాం. జాతీయ రహదారుల్లో 50 కిలోమీటర్లకు ఒక 108 అంబులెన్స్ ఏర్పాటు చేస్తాం. 20 అంబులెన్స్‌లు తీసుకొస్తాం. జాతీయ రహదారుల పరిధిలోని కామారెడ్డి, నిజామాబాద్, మహబూబ్‌నగర్, హైదరాబాద్ ట్రామా కేంద్రాలను ఏర్పాటు చేస్తాం. గతేడాది నిబంధనలకు విరుద్ధంగా వాహనాలునడుపుతున్నవారు, ప్రమాదాలకు కారణమైన 6,609 మంది డ్రైవింగ్ లైసెన్సులు రద్దు చేశాం. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన 20.71 లక్షల మందిపై కేసులు పెట్టి రూ.30 కోట్లు అపరాధరుసుము వసూలు చేశాం. ప్రమాదాలనియంత్రణకు నల్గొండ జిల్లాలో ఏర్పాటు చేసిన 1033 టోల్‌ఫ్రీ నంబరును 108తో అనుసంధానిస్తాం. రహదారి భద్రత కోసం ప్రత్యేక నిధిని రూ.20 కోట్ల మూలనిధితో ప్రారంభించేందుకు ముఖ్యమంత్రితో మాట్లాడతాం' అని మంత్రి చెప్పారు. సమావేశంలో రహదారి భద్రతా డీజీ టి.కృష్ణప్రసాద్, ముఖ్యకార్యదర్శులు సునీల్‌శర్మ, రాజీవ్ త్రివేది, శివశంకర, ఆర్టీసీ ఎండీ రమణారావు పాల్గొన్నారు.

'మాదక ద్రవ్యాల'పై లోతుగా విచారణ జరపాలి: రేవంత్‌రెడ్డి

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: మాదక ద్రవ్యాల ఉదంతంలో మొక్కుబడిగా కాకుండా లోతుగా విచారణ చేపట్టి, ప్రమేయం ఉన్న ఎంతటివారినైనా శిక్షించాల్సిందేనని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద తెదేపా ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై చైతన్య యాత్ర చేపట్టే ప్రయత్నాలను పోలీసులు అడ్డుకున్నారు. పెనుగులాటలో నాయకులకు గాయాలయ్యాయి. పార్టీ శ్రేణులను గాంధీనగర్, రాంగోపాల్‌పేట ఠాణాలకు తరలించారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ తెరాస అధికారంలోకి రాకముందు 19 పబ్బులుండగా, ఇప్పుడు వాటి సంఖ్య 80-90 వరకు చేరిందన్నారు. డగ్స్ వ్యాపారం చేసే వారిలో రాష్ట్ర మంత్రి బంధువు ఉన్నారని, దీనికి సంబంధించి తెదేపా సమర్పించిన ఆధారాల ద్వారా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కేసును కేంద్ర దర్యాప్తు సంస్థకు అప్పగించాలన్నారు. తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, వేం నరేందర్‌రెడ్డి, బీసీ విభాగం అధ్యక్షుడు కూన వెంకటేశ్‌గౌడ్, టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు బి.ఎన్.రెడ్డి, టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, తెదేపా రాష్ట్ర కార్యదర్శి లంకెల దీపక్‌రెడ్డి పాల్గొన్నారు.



సోమవారం హైదరాబాద్‌లో తెదేపా నేత రేవంత్‌రెడ్డిని అడ్డుకుంటున్న పోలీసులు

భాజపావి శవరాజకీయాలు: ఎమ్మార్పీఎస్(టీఎస్)

ఈనాడు, దిల్లీ: మాదిగల పట్ల భాజపా శవ రాజకీయాలు చేస్తోందని ఎమ్మార్పీఎస్(టీఎస్) ఆరోపించింది. సోమవారమిక్కడ జంతర్‌మంతర్ వద్ద మహాధర్నా ముగింపు సభలో సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ మాట్లాడుతూ.. వర్గీకరణ సాధన కోసం అమరులైన వారి మృతదేహాల వద్ద కన్నీరు కార్చి చివరకు న్యాయం చేయకుండా భాజపా శవ రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. భాజపా, కాంగ్రెస్‌లు మాదిగలను ఓట్లు వేసే యంత్రాలుగానే చూస్తున్నాయని, కాంగ్రెస్‌లానే భాజపా కూడా మాదిగలను దూరం చేసుకుంటోందన్నారు.

'కుమ్మర్ల సమస్యలను పరిష్కరించాలి'

ఈనాడు, హైదరాబాద్: సమస్యలను పరిష్కరించాలంటూ తెలంగాణ కుమ్మర సంఘం రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ రాములును కోరింది. సంఘం నేతలు జయంత్‌రావు, రాజమల్లయ్య తదితరులు సోమవారం బీసీ కమిషన్ కార్యాలయంలో రాములును కలిసి వినతిపత్రం సమర్పించారు. కుమ్మర్లను ఎంబీసీ జాబితాలో, బీసీ-ఎ కేటగిరిలో చేర్చాలని, అన్నింటా ప్రోత్సహించాలని కోరారు.

ఎస్టీ కోటా ఉద్యోగాల భర్తీకి సింగరేణి ప్రకటన

ఈనాడు, హైదరాబాద్: ఎస్టీ వర్గాలకు రిజర్వు చేసిన 665 బదిలీ వర్కర్ ఉద్యోగాల భర్తీకి సోమవారం ప్రకటన జారీ చేసినట్లు సింగరేణి సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ఆగస్టు 7 నుంచి సెప్టెంబరు 2లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. పదో తరగతి ఉత్తీర్ణులై 18 నుంచి 45 ఏళ్ల మధ్య పురుషులు దీనికి అర్హులు. పూర్తి వివరాలకు సంస్థ వెబ్‌సైట్ చూడవచ్చని తెలిపింది.

హిజ్రాలకు రక్షణగా కేంద్ర చట్టం

- కేంద్ర సహాయ మంత్రి రామ్‌దాస్ అథవాలే

ఈనాడు, హైదరాబాద్: హిజ్రాల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం త్వరలో చట్టం తీసుకువస్తుందని సామాజిక న్యాయం-సాధికారత శాఖ కేంద్రమంత్రి రామ్‌దాస్ అథవాలే అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ (ఎన్ఐఆర్‌డీ)లో హిజ్రాల సమస్యలపై జరిగిన అధ్యయన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. హిజ్రాలు సమాజంలో తీవ్రమైన అవమానాలు ఎదుర్కొంటున్నారన్నారు. వారికి కూడా అన్ని హక్కులూ, అన్నిరకాల రక్షణ కల్పనకు ఉద్దేశించిన బిల్లు పార్లమెంటరీ కమిటీ పరిశీలనలో ఉందన్నారు. వారికి ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరముందన్నారు. ఏపీ సాంఘిక సంక్షేమ కార్యదర్శి శంషేర్‌సింగ్ రావత్, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి సునీతతో కలిసి ఏపీలో అమలవుతున్న సంక్షేమ పథకాలపై రామ్‌దాస్ అథవాలే సమీక్ష నిర్వహించారు. ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రత్యేక పాఠశాలలు, స్వచ్ఛంద సంస్థలకు ఆర్థిక సహాయం ద్వారా నాణ్యమైన విద్యను అందిస్తామన్నారు. దివ్యాంగులకు మరో రూ. 500 నుంచి రూ. 1000 వరకు పెంచాలంటూ ఏపీ సీఎం చంద్రబాబును కోరుతానని వెల్లడించారు.

వారు చీరలే ఎందుకు ధరిస్తారో!: ట్రాన్స్‌జెండర్లు అటు ఆడ, ఇటు మగ కాదని, అయితే వారు చీరలెందుకు ధరిస్తారో మాత్రం అర్థంకాదంటూ మంత్రి వ్యాఖ్యానించారు. అదేంటి వారికేమైనా డ్రెస్‌కోడ్ ఉండాలా? అని విలేకరులు ప్రశ్నించగా, డ్రెస్‌కోడ్ తన ఉద్దేశం కాదని అన్నారు. క్రికెట్ జట్టులోనూ ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు ఉండాలని తాను కోరానని, దీనిపై బీసీసీఐతో మాట్లాడతానని పేర్కొన్నారు.

విద్యుత్‌పై దక్షిణాది రాష్ట్రాల ఒప్పందం

- మిగులున్న రాష్ట్రం నుంచి లోటు రాష్ట్రం కొనుగోలుకు సంస్థల ఆమోదం

ఈనాడు, హైదరాబాద్: విద్యుత్ మిగులు ఉన్న రాష్ట్రం నుంచి లోటు ఉన్న రాష్ట్రం కొనడానికి గంటలోనే అనుమతిచ్చే కొత్త ఒప్పందానికి దక్షిణాది రాష్ట్రాల విద్యుత్ సంస్థలు ఆమోదం తెలిపాయి. దక్షిణ భారత ప్రాంత విద్యుత్ కమిటీ(ఎస్ఆర్‌పీసీ) సమావేశం సోమవారం కమిటీ ఛైర్మన్ ప్రభాకరరావు అధ్యక్షతన ట్రాన్స్‌కో సమావేశ మందిరంలో జరిగింది. ఆంధ్రప్రదేశ్,కర్ణాటక, తమిళనాడు, కేరళ విద్యుత్ సంస్థల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ప్రస్తుతం విద్యుత్ కొరత, కొనుగోలు విధానంపై చర్చ జరిగింది. ఎప్పటికప్పుడు విద్యుత్తు మిగులు ఏర్పడే రాష్ట్రం అప్పటికప్పుడు అమ్ముకోవడం సాధ్యం కావడం లేదు. ఇకనుంచి మిగులు, లోటు ఏర్పడితే ఎప్పటికప్పుడు గంట ముందుగా ఆయా రాష్ట్రాలు దక్షిణ భారత లోడ్ డిస్పాచ్ కేంద్రానికి సమాచారమివ్వాలి. గంటలోగా మిగులు ఉన్న రాష్ట్రం నుంచి లోటు ఉన్న రాష్ట్రానికి సరఫరా ప్రారంభమవుతుంది. అమ్మిన లేదా కొన్న విద్యుత్‌కు భారత విద్యుత్ ఎక్స్ఛేంజీ నిర్ణయించే ధరను చెల్లిస్తారు. ఈ కొత్త విధానాన్ని ఒప్పందంగా చేసుకోవడానికి అన్నీ రాష్ట్రాలు అంగీకరించాయి. ఆగస్టు 20న కేరళలో మరోసారి సమావేశమై తుది ఒప్పందాన్ని ఖరారు చేయాలని నిర్ణయించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవ వల్లనే తెలంగాణలో విద్యుత్ ప్రగతి సాధ్యమైందని ప్రభాకరరావు అన్నారు. వార్ధా-డిచ్‌పల్లి లైన్ నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం శ్రద్ధ చూపడం వల్ల దక్షిణాది రాష్ట్రాలకు మేలు జరిగిందని ఎస్ఆర్‌పీసీ సభ్య కార్యదర్శి భట్ అన్నారు.

నర్సంపేట నగర పంచాయతీ చైర్మన్ పదవి తెరాస కైవసం

నర్సంపేట, న్యూస్‌టుడే: వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట నగర పంచాయతీ చైర్మన్ పదవికి సోమవారం జరిగిన ఎన్నికలో తెరాస అభ్యర్థి నాగెల్లి వెంకటనారాయణ విజయం సాధించారు. గతంలో నగర పంచాయతీ చైర్మన్‌గా పనిచేసిన రాంచంద్రయ్య ఏప్రిల్ 28న విద్యుదాఘాతంతో మృతిచెందారు. ఈ ఎన్నికలో వెంకటనారాయణకు 15 ఓట్లు రాగా కాంగ్రెస్ అభ్యర్థి పాలాయి శ్రీనివాస్‌కు 5 ఓట్లు వచ్చాయి. చైర్మన్‌గా వెంకటనారాయణ గెలుపొందినట్లు ఎన్నికల అధికారి పూల్‌సింగ్‌చౌహాన్ ప్రకటించారు.

బెదిరింపులా?...సానుభూతి ఆశించా?

- ఆత్మహత్యాయత్నాన్ని హత్యాయత్నంగా మార్చేందుకు పన్నాగం!
- పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు
- విక్రమ్‌గౌడ్‌పై కాల్పుల కేసులో పరిశోధన

ఈనాడు, హైదరాబాద్: మాజీమంత్రి ముఖేష్ గౌడ్ కుమారుడు విక్రమ్‌గౌడ్‌పై కాల్పులకేసులో నాటకీయ పరిణామాలు కొనసాగుతున్నాయి. విక్రమ్‌గౌడ్ ఆత్మహత్యాయత్నం చేసి దాన్ని హత్యాయత్నంగా మార్చేందుకు పథకం వేసినట్లు పోలీసులు ప్రాథమిక సాక్ష్యాధారాలు సేకరించారు. ఇందు కోసం అతను ఉపయోగించుకున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఒకరు అనంతపురం జిల్లా వాసి, మరో ఇద్దరు హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఈ ముగ్గురిలో ఒకరికి నేరచరిత్ర ఉంది. సంఘటన జరిగిన రోజు(జులై 28, 2017) ఏం జరిగిందో తెలుసుకునేందుకు వారిని రహస్యప్రదేశంలో విచారిస్తున్నారు. వీరు ముగ్గురూ విక్రమ్‌గౌడ్ సూచనల మేరకే ద్విచక్రవాహనాన్ని తీసుకొచ్చి అతని ఇంటి బయట తచ్చాడి బాహ్యావలయ రహదారి మీదుగా పారిపోయినట్లు తెలిసింది. ఇదంతా విక్రమ్‌గౌడ్ ఎందుకు చేశాడన్నదానిపై ఆధారాలు లభించకపోవడంతో మరోసారి అతనిని ప్రశ్నించారు. విక్రమ్‌ను ప్రశ్నించిన తర్వాత, అతని ఫోన్‌లోని నంబర్లు, సంక్షిప్త సందేశాలు పరిశీలించిన అనంతరం పోలీసులకు రెండు అంశాలపై సందేహాలు ఏర్పడ్డాయి. వీటిని నివృత్తి చేసుకోవడం కోసం ఆధారాలు సేకరిస్తున్నారు. సంఘటన స్థలంలో మాయమైన పిస్టల్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

ఇంట్లోకి ఎవరూ రాలేదు!

విక్రమ్‌గౌడ్, అతనిభార్య షిపాలి నుంచి పలు వివరాలను సేకరించారు. సాంకేతిక సాక్ష్యాధారాలతో విక్రమ్ గౌడ్ ఇంట్లోకి ఎవరూ రాలేదని పోలీసులు నిర్ధరించుకున్నారు. అతనే ఆయుధంతో ఆత్మహత్యాయత్నం చేసుకున్నట్టు అనుమానిస్తున్నారు. విక్రమ్ మాత్రం బయటి నుంచి వచ్చిన దుండగులు తనను కాల్చారన్న మాటలకే కట్టుబడి ఉన్నాడు. అతని ఫోన్‌కాల్స్, కాపలాదారు చెప్పిన సాక్ష్యాల ఆధారంగా విక్రమ్ సంఘటన జరిగిన రోజు అర గంటపాటు బయటకు వెళ్లారని గుర్తించారు. తలుపు వేయవద్దంటూ విక్రమ్ తనకు చెప్పినట్లు కాపలాదారు పోలీసులకు వాంగ్మూలం ఇచ్చాడు. విక్రమ్‌గౌడ్ ఇదంతా ఎందుకుచేశాడని ఆరా తీయగా...రూ.కోట్లలో ఉన్న అప్పులను తీర్చేందుకు కుటుంబ సభ్యుల నుంచి సహాయనిరాకరణ ఎదురవడంతో ఇలా చేసుంటాడన్న అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ సభ్యులను బెదిరించేందుకు ఇలా చేశాడా? తన ప్రాణానికి రక్షణలేదు... ఆయుధ లైసెన్సు అవసరమంటూ పోలీస్‌శాఖ నుంచి సానుభూతి పొందేందుకు పథకం వేశాడా? అన్న ప్రశ్నలకు ఇంకా సమాధానాలు దొరకలేదని ఓ పోలీసు ఉన్నతాధికారి వివరించారు. మంగళవారం రాత్రికల్లా ఈ అంశాలపై స్పష్టత వచ్చే అవకాశాలున్నాయని ఆయన తెలిపారు.

రేషన్ డీలర్ల సమ్మె వాయిదా

ఈనాడు, హైదరాబాద్‌- ఖైరతాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని రేషన్ డీలర్లు ఆగస్టు ఒకటి నుంచి నిర్వహించ తలపెట్టిన సమ్మె తాత్కాలికంగా వాయిదా పడింది. డీలర్లు ప్రభుత్వం ముందుంచిన సమస్యలపై సానుకూల స్పందన రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ప్రకటించింది. కనీస గౌరవ వేతనం, ఆరోగ్య కార్డులు, బీమా, రెండు పడక గదుల ఇళ్లు తదితర డిమాండ్లతో డీలర్లు సమ్మెకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ మేరకు సోమవారం పౌరసరఫరాల కార్యాలయంలో కమిషనర్‌లో సమావేశమై తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. అనంతరం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేష్‌బాబు మాట్లాడుతూ.. మంత్రి ఈటల రాజేందర్, పౌరసరఫరాలశాఖ కమిషనర్ సీవీ ఆనంద్ తమతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించేందుకు సానుకూలత వ్యక్తం చేశారని తెలిపారు. వాటి అమలు తమ చేతిలో లేదని, ముఖ్యమంత్రికి సమస్యలు విన్నవించేందుకు అవకాశం కల్పిస్తామని, అందుకు 30 నుంచి 45 రోజుల వ్యవధి కోరగా.. దానికి డీలర్లు అంగీకరించారని వెల్లడించారు. నిర్దిష్ట కాలంలో తమ డిమాండ్లు పరిష్కారం కానిపక్షంలో సమ్మెను మళ్లీ కొనసాగిస్తామన్నారు. హమాలీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతుందని సీవీ ఆనంద్ చెప్పారు. సోమవారం ఆయన హమాలీ సంఘాల ప్రతినిధులతోనూ చర్చలు నిర్వహించారు.



వినోద్‌కుమార్ యాదవ్‌తో సమావేశమైన మిథాలీ రాజ్

ద.మ.రైల్వే క్రీడల ఓఎస్డీగా మిథాలీరాజ్

ఈనాడు, హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వే క్రీడల విభాగం ప్రత్యేక అధికారి(ఓఎస్డీ)గా భారత మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్ మిథాలీరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో ద.మ.రైల్వే జీఎం వినోద్‌కుమార్ యాదవ్ ఆమెకు పదోన్నతి పత్రాలను అందజేశారు. ప్రపంచకప్‌లో ప్రతిభచూపించి భారతీయ రైల్వేకు వన్నెతెచ్చారని ఆమెను అభినందించారు.

పర్వతారోహకులకు ఘన స్వాగతం

ఈనాడు, హైదరాబాద్, ఆలేరు, న్యూస్‌టుడే: రష్యాలోని ఎల్‌బ్రస్ పర్వతాన్ని అధిరోహించిన తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థినులు బి. శ్రీవిద్య, ఎం.పూర్ణ సోమవారం హైదరాబాద్ చేరుకున్నారు. వారికి విమానాశ్రయంలో అధికారులు, ఉపాధ్యాయులు ఘన స్వాగతం పలికారు. శ్రీవిద్య యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు గురుకుల కళాశాలలో, పూర్ణ ఇబ్రహీంపట్నంలో చదువుతున్నారు. అనంతరం పర్వతారోహకులిద్దరూ ఎస్సీ సంక్షేమశాఖ మంత్రి జగదీశ్వర్‌రెడ్డిని కలిశారు. మంత్రి వారి ప్రతిభను ప్రశంసించారు. ఈ దిశగా విద్యార్థులను ప్రోత్సహించిన గురుకులాల సొసైటీ కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, క్రీడా అధికారి రామలక్ష్మణ్, ముఖ్య శిక్షకుడు శేఖర్‌బాబును అభినందించారు.



శ్రీవిద్య, పూర్ణలను అభినందిస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి

28 నుంచి వ్యవసాయ డిగ్రీ కౌన్సిలింగ్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య డిగ్రీ కోర్సుల్లో సీట్ల భర్తీకి ఆగస్టు 28 నుంచి కౌన్సిలింగ్, ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభమవుతుందని జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ సుధీర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలను ఈ నెల 9న వెబ్‌సైట్‌లో ప్రకటిస్తారు. ఎంసెట్‌లో వచ్చిన ర్యాంకు ఆధారంగా సీటు కేటాయిస్తారు.

వీఆర్‌ఓపై జేసీదాడి ఘటనలో చర్యలు తీసుకోండి

ఉప ముఖ్యమంత్రికి వీఆర్‌ఓల సంఘం వినతి

ఈనాడు, హైదరాబాద్: గ్రామ రెవెన్యూ అధికారులపై వృత్తిరీత్యా ఇటీవలి కాలంలో ఒత్తిడి తీవ్రమయిందని తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు జి.సతీష్ ఆరోపించారు. మహబూబ్‌నగర్ జిల్లా జేసీ ధర్మపురం గ్రామ వీఆర్‌ఓపై దాడిచేశారని, ఈ సంఘటనపై చర్య తీసుకోవాలంటూ కమిటీ నాయకులు రాజేశ్, భిక్షపతితో కలసి ఆయన సచివాలయంలో ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీకి సోమవారం ఫిర్యాదు చేశారు. రెవెన్యూ దస్త్రాల వడపోత సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అధికారులు వీఆర్‌ఓలను మానసిక ఒత్తిళ్లకు గురిచేస్తున్నారని వివరించారు. వెబ్‌ల్యాండ్ నిర్వహణపై వీఆర్‌ఓలకు అవగాహన కల్పించాలని, అర్హతల వారీగా పదోన్నతి కల్పించాలని, స్టేషనరీ ఛార్జీలు చెల్లించాలని కోరారు.

ఆర్టీసీ బస్సు.. ఇసుక లారీ ఢీ

35 మందికి గాయాలు



ప్రమాద ఘటన. అంతరచిత్రంలో స్టీరింగ్ వద్ద ఇరుకున్న లారీ డ్రైవర్

బోధన్ గ్రామీణం, న్యూస్‌టుడే: నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం సాలూరక్యాంపు శివారు అంతర్‌రాష్ట్ర రహదారిపై సోమవారం ఆర్టీసీ బస్సు ఇసుక లారీ ఢీకొన్న ఘటనలో ఇద్దరు డ్రైవర్లతోపాటు బస్సులోని ప్రయాణికులకు గాయాలయ్యాయి. కరీంనగర్ డిపో బస్సు 40 మందితో ముంబయి వెళ్తుండగా మహారాష్ట్రలోని ఎస్గీ ఇసుక క్వారీ నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీ సాలూరక్యాంపు వద్ద ఢీకొన్నాయి. ప్రమాదంలో బస్సులోని 33 మంది ప్రయాణికులకు గాయాలుకాగా.. బస్సు డ్రైవర్ శ్రీనివాసరావు(52) కాలు, చెయ్యి విరిగింది. లారీ డ్రైవర్ మహమ్మద్ పాషా(45) మెడవద్ద నరం తెగిపోయి తీవ్ర రక్తస్రావమైంది. క్షతగాత్రులను ఆటోల్లో, పోలీసు జీపుల్లో బోధన్ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ఘటనలో లారీ డ్రైవర్ స్టీరింగ్ వద్ద ఇరుక్కుపోవడంతో స్థానికుల సహకారంతో అరగంట పాటు శ్రమించి బయటకు తీశారు.

వానాకాలంలోనూ భానుడి సెగ

సాధారణంకన్నా 5 డిగ్రీల ఎక్కువ ఉష్ణోగ్రత

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో వానాకాలంలోనూ భానుడు సెగలు కక్కుతున్నాడు. సోమవారం హైదరాబాద్‌లో 34.6, రామగుండంలో 35.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇవి సాధారణంకన్నా 5 డిగ్రీలు ఎక్కువ కావడంతో వేడి, ఉక్కపోత పెరిగాయి. ఈ సమయంలో హైదరాబాద్‌లో పగటి ఉష్ణోగ్రత 30 డిగ్రీలు మించరాదు. కొన్ని రోజులుగా రాష్ట్రంలో వర్షాలు బాగా తగ్గిపోవడంతో పొడివాతావరణం ఏర్పడింది. గాలిలో తేమ హైదరాబాద్ శివారు హకీంపేటలో 70, ఖమ్మంలో 67 శాతంగా ఉంది. ఇది సాధారణంకన్నా 15 శాతం తక్కువ. రాష్ట్రంలో అక్కడక్కడ చెదురుమదురుగా వర్షాలు పడుతున్నాయి. రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు పడే అవకాశాల్లేవు. పొడి వాతావరణం, ఎండలతో వర్షాధార ప్రాంతాల్లోని పైర్లు వాడుతున్నాయి. మరో వారం దాకా వర్షాలు పడకపోతే పంటల పరిస్థితి మరింత క్షీణిస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పలు ప్రాంతాల్లో వారం, పదిరోజులుగా వర్షాలు లేవు. 15 జిల్లాల్లో సాధారణంకన్నా అతి తక్కువ వర్షపాతం నమోదైంది. నిజామాబాద్‌లో జూన్ 1నుంచి ఇప్పటివరకు సాధారణ వర్షపాతం 461 మిల్లీమీటర్లకు గాను 284 మి.మీ.లే కురిసింది. రాష్ట్రంలోకెల్లా అత్యధిక లోటు ఇక్కడే ఉంది. రామగుండంలో 157, మెదక్‌లో 115 మి.మీ.ల లోటు ఏర్పడింది.

కశ్మీరులో బ్యాంకు దోపిడీ

- రూ.5.20 లక్షల నగదుతో పరారీ
- బుర్ఖాలు ధరించి వచ్చిన దుండగులు

శ్రీనగర్: బుర్ఖాలు ధరించిన ముగ్గురు నలుగురు సాయుధులు అనంత్‌నాగ్ జిల్లాలో సోమవారం ఓ బ్యాంకు నుంచి రూ.5.20 లక్షల సొమ్మును దోచుకుపోయారు. వీరంతా కూడా హిజ్‌బుల్ ముజాహిదీన్ తీవ్రవాదులై ఉండవచ్చని అనుమానిస్తున్నట్లు పోలీసులు సోమవారం వెల్లడించారు. అనంత్‌నాగ్ జిల్లాలోని అర్వానీలో ఉన్న జమ్ము అండ్ కశ్మీరు బ్యాంకు శాఖలో ఈ దోపిడీ జరిగింది. సీసీటీవీ దృశ్యాలను పరిశీలించిన తర్వాత వీరు హిజ్‌బుల్ ముజాహిదీన్ తీవ్రవాదులై ఉండవచ్చని తాము అనుమానిస్తున్నట్లు చెప్పారు. వారిని పట్టుకునేందుకు బలగాలు రంగంలోకి దిగినట్లు తెలిపారు.

ఒకే వస్తువు... రెండు లాభాలు!

అలంకరణ కిట్ మొత్తం అందుబాటులో ఉంటే కానీ మేకప్ వేసుకోవడం, తగిన జాగ్రత్తలు తీసుకోవడం సాధ్యం కాదని అనుకుంటున్నారా... అది నిజం కాదు. అందుబాటులో ఉన్నవాటితోనే అదనపు ప్రయోజనాలు ఎలా పొందవచ్చో మీరే చూడండి...

అలంకరణ తొలగించుకోవడానికి క్లెన్సర్ తప్పనిసరిగా ఉండాల్సిన అవసరం లేదు. మనకి ఎప్పుడూ అందుబాటులో ఉండే మేకప్ రిమూవర్‌నే దాని కోసం వాడుకోవచ్చు.

ఎక్కువ సేపు తాజాగా ఉండేందుకు కొంతమంది మణికట్టుపై పరిమళాన్ని చల్లుకుంటారు. అలా చల్లేటప్పుడు ముందుగా ఆ ప్రాంతంలో కొద్దిగా పెట్రోలియం జెల్లీ రాసుకుంటే పరిమళం ఎక్కువ సేపు గుబాళిస్తుంది.



ఇంట్లో టోనర్ లేనప్పుడు ఇబ్బంది పడొద్దు. వెనిగర్‌ని దానికి ప్రత్యామ్నాయంగా వాడుకోవచ్చు.

ఐలైనర్ లేనప్పుడు దానికి బదులుగా మస్కారాని వాడుకోవచ్చు. సన్నని బ్రష్‌ని మస్కారా సీసాలో ముంచి లైనర్‌గా వాడుకోవచ్చు.

కళ్ల అడుగున వాచినట్టుగా ఉబ్బెత్తుగా ఉందా... టీ బ్యాగులకు బదులు గుడ్డులోని తెల్లసొనని ప్యాకులా వేసుకున్నా ఫలితం ఉంటుంది.

అలంకరణ తొలగించేందుకు ఆ రిమూవర్‌నే వాడాలని లేదు. పాలల్లో దూదిని ముంచి తుడుచుకోవచ్చు. లేదంటే.. ఆలివ్‌నూనెతో తుడచుకున్నా సరిపోతుంది. పైగా దీనివల్ల చర్మం కూడా తాజాగా కనిపిస్తుంది.

వసుంధర

అమ్మవారికి పాల వంటకాలంటే ప్రియం అంటారు.. శ్రావణ మాసపు వేళ పాలూ, రవ్వా, చక్కెరతో చేసే విభిన్నమైన వంటకాలు ఏమేం ఉన్నాయో ఓసారి చూసేద్దాం.. శ్రావణ శుక్రవారం వేళ అమ్మవారికి నివేదిద్దాం!



అమ్మవారికి... ఆరగింపు!



పాలు, కొబ్బరి పాయసం

కావల్సినవి: తాజా కొబ్బరి తురుము - కప్పు, చక్కెర - ముప్పావు కప్పు, పాలు - అరకప్పు, బియ్యం - రెండు చెంచాలు, యాలకుల పొడి - అరచెంచా, నెయ్యి - చెంచా, బాదం - కొన్ని.

తయారీ: బియ్యాన్ని రెండు గంటలముందు నానబెట్టుకోవాలి. తరవాత బియ్యం, కొబ్బరి తురుమూ కలిపి మెత్తగా రుబ్బుకోవాలి. ఓ గిన్నెలో ఈ మిశ్రమం తీసుకుని పొయ్యిమీద పెట్టాలి. ఇది కాస్త ఉడుకుతున్నప్పుడు చక్కెరా, పాలూ పోసి కలపాలి. పాయసం కాస్త చిక్కగా అవుతున్నప్పుడు యాలకుల పొడీ, నేతిలో వేయించిన బాదం పలుకులు వేసి దింపేయాలి.

పాల బొబ్బట్లు

కావల్సినవి: మైదా - కప్పు, నెయ్యి - టేబుల్‌స్పూను, ఉప్పు - చిటికెడు, నీళ్లు - పిండి కలిపేందుకు, బియ్యప్పిండి - పావుకప్పు, నూనె - వేయించేందుకు సరిపడా.

పాయసం కోసం కావల్సినవి: తాజా కొబ్బరి తురుము - కప్పు, గసగసాలు - రెండు టేబుల్‌స్పూన్లు, జీడిపప్పు - ఎనిమిది, పాలు - ఒకటిన్నర కప్పు, నీళ్లు - అరకప్పు, బెల్లం తురుము - ఒకటింబావు కప్పు, యాలకులపొడి - అరచెంచా.

తయారీ: ఓ గిన్నెలో మైదా, ఉప్పు తీసుకోవాలి. దానిలో సరిపడా నీళ్లు పోసుకుంటూ పూరీ పిండిలా కలపాలి. తరవాత నెయ్యి వేసి మరోసారి కలిపి ఇరవై నిమిషాలు నాననివ్వాలి. ఆ తరవాత కొద్దిగా పిండి తీసుకుని బియ్యప్పిండి అద్దుకుంటూ పల్చని పూరీలా చేసుకుని మధ్యకు మడవాలి. ఇలాగే మిగిలిన పిండినీ చేసుకోవాలి. ఒక్కోదాన్ని కాగుతోన్న నూనెలో వేసి వేయించుకుని తీసుకోవాలి. ఇప్పుడు పాయసం తయారు చేసుకోవాలి. ఓ గిన్నెలో నీళ్లు తీసుకుని పొయ్యిమీద పెట్టి బెల్లం తురుము వేయాలి. అది కరిగేలోగా కొబ్బరి తురుమూ, గసగసాలూ, జీడిపప్పూ, యాలకుల పొడి మిక్సీలో తీసుకుని మెత్తని ముద్దలా చేసుకోవాలి. బెల్లం కరిగాక ఆ పాకాన్ని ఒకసారి వడకట్టి.. మళ్లీ పొయ్యిమీద పెట్టాలి. అందులో ముందుగా చేసుకున్న కొబ్బరి మిశ్రమాన్ని వేసి కలపాలి. నిమిషం అయ్యాక కాచి చల్లార్చిన పాలు కూడా పోసి బాగా కలిపి చిక్కగా అవుతున్నప్పుడు దింపేయాలి. ఇప్పుడు పూరీలను పళ్లెంలో రెండు మూడు చొప్పున సర్ది.. వాటిపై ఈ పాయసాన్ని కొద్దిగా వేయాలి.



అటుకులు, పుట్నాల లడ్డు

కావల్సినవి: అటుకులు - రెండు కప్పులు, పుట్నాల పప్పు - కప్పు, చక్కెర - ఒకటిన్నర కప్పు, నెయ్యి - అర కప్పు, జీడిపప్పు పలుకులు - కొన్ని, పాలు - రెండు టేబుల్‌స్పూన్లు, యాలకులపొడి - అరచెంచా.



తయారీ: బాణలిని పొయ్యిమీద పెట్టి సగం నెయ్యి వేయాలి. అది కరిగాక అటుకులు వేసి దోరగా వేయించి తీసుకోవాలి. వాటి వేడి చల్లారాక పొడిలా చేసుకుని ఓ గిన్నెలోకి తీసుకోవాలి. అదే మిక్సీలో పుట్నాలపప్పు, చక్కెరా, యాలకులపొడీ వేసి మళ్లీ పొడిలా చేసుకుని అటుకుల మిశ్రమంలో వేయాలి. బాణలిని మరోసారి పొయ్యిమీద పెట్టి మిగిలిన నెయ్యి కరిగించి జీడిపప్పు పలుకులు వేయించి అటుకుల పొడిలో వేసి ఒకసారి కలపాలి. ఇప్పుడు పాలు చల్లుకుంటూ లడ్డూల్లా చుట్టుకుంటే సరిపోతుంది.

మసాలా ఆవడ

కావల్సినవి: సెనగపప్పు, కందిపప్పు, పెసరపప్పు, మినప్పప్పు - అరకప్పు చొప్పున, జీడిపప్పు పలుకులు - పావుకప్పు, కొత్తిమీర, పుదీనా - కట్ట చొప్పున, పచ్చిమిర్చి - ఆరు, అల్లం - చిన్న ముక్క, కరివేపాకు - రెండు రెబ్బలు, వంటసోడా - పావుచెంచా, ఉప్పు - తగినంత, నూనె - వేయించేందుకు సరిపడా.

తాలింపు కోసం: పెరుగు - మూడు కప్పులు, క్యారెట్ తురుము - పావుకప్పు, పచ్చిమిర్చి - రెండు, అల్లం తరుగు - చెంచా, ఉప్పు - తగినంత, ఆవాలు, మినప్పప్పు - చెంచా చొప్పున, నూనె - చెంచా కొత్తిమీర తరుగు- చెంచా.



తయారీ: రెండు గంటల ముందుగా సెనగపప్పూ, మినప్పప్పూ, కందిప్పప్పూ, పెసరపప్పును నానబెట్టుకోవాలి. తరవాత నీళ్లు వంపేసి మెత్తని పిండిలా రుబ్బి ఓ గిన్నెలోకి తీసుకోవాలి. అలాగే జీడిపప్పూ, కొత్తిమీరా, పుదీనా, కరివేపాకూ, అల్లం, పచ్చిమిర్చి మిక్సీలో మెత్తగా రుబ్బుకోవాలి. ఈ మిశ్రమాన్ని సెనగపప్పు ముద్దపై వేయాలి. అలాగే తగినంత ఉప్పూ, వంటసోడా కూడా వేసుకుని మరోసారి కలపాలి. ఈ పిండిని చిన్నచిన్న వడల్లా తట్టుకుని కాగుతున్న నూనెలో వేసి ఎర్రగా వేయించుకుని తీసుకోవాలి. వీటి వేడి కాస్త చల్లారాక వేడినీటిలో వేసి నిమిషమయ్యాక తీసేయాలి. ఈ వడల్ని ఇప్పుడు ఉప్పూ, అల్లంతరుగూ, పచ్చిమిర్చి ముక్కలూ కలిపిన పెరుగులో వేసుకోవాలి. బాణలిని పొయ్యిమీద పెట్టి నూనె వేడిచేసి ఆవాలూ, మినప్పప్పు వేయించి దింపేయలి. ఈ తాలింపు వేడి చల్లారాక పెరుగుపై వేయాలి. చివరగా క్యారెట్ తురుమూ, కొత్తిమీరతో అలంకరిస్తే సరిపోతుంది.

రవ్వ అప్పాలు

కావల్సినవి: బొంబాయిరవ్వ, చక్కెర - అరకప్పు చొప్పున, నీళ్లు - కప్పు, ఎండుకొబ్బరి తురుము - టేబుల్ స్పూను, నెయ్యి - చెంచా, యాలకులపొడి - అరచెంచా, నూనె - వేయించేందుకు సరిపడా.

తయారీ: సన్నని మంటమీద బాణలి పెట్టి బొంబాయిరవ్వను దోరగా వేయించి తీసుకోవాలి. ఓ గిన్నెలో నీళ్లు తీసుకుని పొయ్యిమీద పెట్టాలి. అవి మరిగాక వేయించిపెట్టుకున్న రవ్వ వేయాలి. అది ఉడికి దగ్గరపడుతున్నప్పుడు చక్కెరా, ఎండుకొబ్బరితురుమూ, నెయ్యా, యాలకులపొడి వేయాలి. మధ్యమధ్య కలుపుతూ ఉంటే... ఇది హల్వాలా తయారవుతుంది. అప్పుడు దింపేసి మూత పెట్టాలి. వేడి బాగా చల్లారాక కొద్దిగా తీసుకుని వెడల్పుగా బిళ్లలా చేసుకోవాలి. ఇదే విధంగా మిగిలిన హల్వాను కూడా చేసి పెట్టుకోవాలి. ఇప్పుడు రెండేసి చొప్పున కాగుతోన్న నూనెలో వేసి ఎర్రగా వేయించుకుని తీసుకుంటే చాలు.





పి.అనూరాధ, హైదరాబాద్

పిల్లలకు కోపం వచ్చిందా...



మీ పిల్లలకు కోపం ఎక్కువగా ఉందని ఎప్పుడైనా మీకు అనిపించిందా... వారు తరచూ చిన్న చిన్న విషయాలనే పెద్దగా చేస్తూ రాద్ధాంతం చేస్తున్నారా... మీరు చెప్పిన పనులు చేయడం లేదా... ఏదైనా కావాలని మారాం చేస్తున్నారా... అలాంటప్పుడు ఓ తల్లిగా మీరేం చేయాలో చూడండి మరి.

అరవొద్దు: చిన్నారులు గట్టిగా ఆరుస్తున్నప్పుడు మీకు కోపం వచ్చినా దాన్ని వ్యక్తం చేయకూడదు. అరిచే ప్రయత్నం అసలు వద్దు. కాసేపు మీరు మౌనంగా ఉండండి. ఆ సమయంలో వారి కోపం స్థాయి తగ్గిపోతుంది. తరవాత కారణం తెలుసుకునే ప్రయత్నం చేయొచ్చు. అంతేతప్ప మీరూ అరవడం వల్ల ఏ ప్రయోజనం ఉండదు.

వివరించండి: నెమ్మదిగా వారు ప్రవర్తించిన తీరుని వారికి అర్థమయ్యేలా వివరించండి. కోపంగా మాట్లాడటం, అరవడం వల్ల ఎదురయ్యే సమస్యల్ని తెలియజేయండి. మొదటిసారి వినకపోవచ్చు. కానీ పదే పదే చెప్పడం వల్ల అర్థం చేసుకుంటారు. కోపాన్ని తగ్గించుకుని.. కావాల్సినవి అడిగి సాధించుకోవడం వల్ల కలిగే లాభాలేంటో వారికి వివరించండి.

తెలుసుకోండి: మీ చిన్నారి అప్పుడప్పుడూ కోపంగా ఉండటం... కాసేపటికే ఏం జరగనట్లు సంతోషంగా ఉండటం.... ఇలా రెండు రకాలుగా ప్రవరిస్తుంటే జాగ్రత్తగా గమనించండి. వారు ఏదో బాధను మనసులో పెట్టుకుని ఉండొచ్చు. కాబట్టి దాన్ని తెలుసుకునే ప్రయత్నం చేయండి.

దృష్టి మరల్చండి: ఏదయినా విషయంలో పిల్లలు బాగా పేచీ పెడుతున్నారని అనిపించినా.. కోపంగా ఉన్నారనే సంకేతం అందినా.. వారి దృష్టిని మరల్చే ప్రయత్నం చేయండి. ఆ సమయంలో వారికి ఇష్టమైన పని చేసేలా చూడండి. బొమ్మలు గీయడం, సైకిలు తొక్కడం.. ఇలా ఏదో ఒకటి చేయించండి. దానివల్ల కూడా వారిలో కొంత మార్పు కనిపిస్తుంది.



బంగారం-వెండి

31న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	-------	-------	29,650	29,550
ఆర్నమెంట్	-------	-------	27,500	27,450
వెండి (కిలో)	-------	-------	39,600	39,600

	ప్రొద్దుటూరు		రాజమండ్రి	
బంగారం(24క్యా)	29,580	29,580	29,250	29,260
ఆర్నమెంట్	27,460	27,440	27,350	27,360
వెండి (కిలో)	39,500	39,600	38,850	38,500

	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	29,670	29,730	-------	-------
ఆర్నమెంట్	27,300	27,350	2,735 గ్రా	2,736 గ్రా
వెండి (కిలో)	39,900	39,900	41.50 గ్రా	41.20 గ్రా

ఆ ఉద్యోగాన్ని ఊహించొచ్చా?

కెరీర్ వసుంధర



డా॥ కవిత గూడపాటి, ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్

నేనో కంపెనీలో ఏడేళ్లుగా పనిచేస్తున్నాను. క్యాంపస్ సెలక్షన్‌తో ఇలా వచ్చా. ప్రస్తుతం ఇక్కడి నుంచి మరో మంచి సంస్థకి వెళ్లాలని కోరుకుంటున్నా. నేనున్న రంగం కూడా మంచి వృద్ధిలో ఉండటంతో అవకాశాలూ వెతుక్కుంటూ వస్తున్నాయి. కొన్ని ఇంటర్వ్యూలకీ వెళుతున్నాను. కాకపోతే, ఆ ఇంటర్వ్యూలను నేను బాగా చేశానో లేదో తెలియడంలేదు. నాతో మాట్లాడిన అధికారులు నా గురించి సానుకూలంగానే భావిస్తున్నారా లేదా అనేది అంచనా వేయలేకపోతున్నాను. ఇవి తెలుసుకునే సంకేతాలేమైనా ఉంటాయా? ఉంటే, వాటిని నమ్మొచ్చా? - ఓ సోదరి

మీ మొదటి ప్రశ్నకి సమాధానం 'అవును' అనే చెప్పాలి. రెండో ప్రశ్న కొంత క్లిష్టమైంది. ఎందుకంటే.. ఈ సంకేతాలు 'ప్రతిసారీ' సానుకూల స్పందనగానే మారతాయని చెప్పలేం. కానీ ఎక్కువలో ఎక్కువగా వీటిని నమ్మొచ్చు. అంటే వందకి 70 శాతం అనుకోవచ్చు. ఓ ఇంటర్వ్యూ పూర్తవుతున్నప్పుడే మలిదశ ఇంటర్వ్యూకి పిలవడం, జీతభత్యాల గురించి ప్రస్తావించడం మనందరికీ తెలిసిన సానుకూల సంకేతాలు. అవే కాకుండా మరికొన్నీ ఉన్నాయి. ఇంటర్వ్యూ ముగిశాక మీ గురించి చెప్పగల వ్యక్తుల వివరాలు(రిఫరెన్స్) అడగడం కూడా ఓ సంకేతమే. మిమ్మల్ని అర్హులుగా భావిస్తేనే ఓ సంస్థ పనిగట్టుకుని రిఫరెన్సులు అడిగి, వాళ్లతో మాట్లాడుతుందని గుర్తుంచుకోండి. మీతో ముఖాముఖిలో మాట్లాడిన అధికారులకే కాకుండా, ఇతరులకీ మిమ్మల్ని పరిచయం చేయడం మీరు ఎంపికయ్యారనడానికి మరో కొండ గుర్తు. ఆ ఇతరులు ఏ సీనియర్ ఎగ్జిక్యూటివో, సంస్థ ప్రెసిడెంటో అయితే మీకు అక్కడ స్థానం ఖాయమైపోయినట్టే లెక్క! మీతో మాట్లాడుతూ 'మీరు మీ సంస్థ నుంచి ఇక్కడికి రావడానికి ఎంత సమయం పట్టొచ్చు..' అని అడిగారా? ఈ ప్రశ్న కూడా సానుకూల సంకేతమే. దీనితోపాటూ మీతో 'నాన్-కంపీట్ అగ్రిమెంట్' (సంస్థ చేస్తున్న వ్యాపారంలాంటిదే మీరు వ్యక్తిగతంగా చేయకూడదంటూ రాయించుకునే ఒప్పందం) వంటివాటి గురించి ప్రస్తావించడం కూడా మీ ఇంటర్వ్యూ విజయానికి కొండగుర్తు! ఇంటర్వ్యూ చేసే వ్యక్తి మిమ్మల్ని ప్రశ్నలు అడగటం ఆపి.. మీరు ఎక్కువగా ప్రశ్నలడిగేలా ప్రోత్సహించడం కూడా మీరు అక్కడ ఖరారయ్యారనేందుకు సూచికే. అంటే, ఆ పోస్ట్ కోసం మీరు ప్రయత్నించే స్థితిపోయి, దాన్ని వాళ్లే మీకు ఇవ్వాలనే స్థాయికి వచ్చారన్నమాట! ఇంటర్వ్యూ చేసే వ్యక్తి మీ పేరుని ఏదో సంప్రదాయంగా గుర్తుపెట్టుకున్నట్టు కాకుండా, ఇప్పటికే బాగా పరిచయమైనట్టు పదేపదే ప్రస్తావిస్తే మీరు ఇంటర్వ్యూని నెగ్గినట్టే. అంతేకాదు, మిమ్మల్ని చిరునవ్వుతో చూస్తుండటం, మీరు చెప్పేవాటికి తలపంకించడం కూడా మంచి సంకేతాలే కానీ.. దాంతోపాటూ మీ గురించి వివరాలు రాసుకుంటూపోతే మీరు ఎంపికైనట్టే లెక్క. నేటి సంస్థలు ఓ అభ్యర్థి కేవలం పని చేసి వెళ్లిపోతే చాలని అనుకోవడంలేదు. ఆమె తమ పని సంస్కృతిలో భాగం కావాలని కోరుకుంటున్నాయి. కాబట్టి, మిమ్మల్ని ఇంటర్వ్యూ చేసే మేనేజర్ అక్కడి పనివాతావరణం, అందులో మీరు ఇమిడిపోవాలంటే ఏమేం చేయాలో వివరిస్తున్నారంటే.. మీపై ఆ సంస్థకి ఆసక్తి ఉన్నట్టే భావించాలి. వీటిలో ఏ రెండు మూడు మీకు కనిపించినా మీరు ఆ సంస్థకి నచ్చారనే అనుకోవాలి.

నజరానా

ఈగల సమస్యా... మూడు కర్పూరం బిళ్లలూ, గుప్పెడు వేపాకులు వేసి మరిగించిన నీటిని ఇంట్లో అక్కడక్కడా చల్లి చూడండి.

వ్యాయామానికీ పక్కాగా!

క్రమం తప్పకుండా చేసే వ్యాయామాల వల్ల కలిగే ప్రయోజనాలు మనందరికీ తెలుసు. అయితే వాటిని చేయడానికి మాత్రం బద్ధకిస్తాం. 'రేపటి నుంచి తప్పకుండా చేస్తా' అంటూ ప్రతిజ్ఞలు చేస్తాం. అలా కాకుండా ఉండాలంటే.. కాస్త ప్రణాళిక ఉండాల్సిందే.

మాట్లాడుకోండి: మిమ్మల్ని మీరే వ్యాయామం చేసే దిశగా ప్రేరేపించుకోండి. మీకంటే గొప్పగా మరెవ్వరూ మీలో స్ఫూర్తిని పెంచలేరు. నడకా, పరుగు, ఇతర వ్యాయామాలు.. ఏవైనా చిన్నగా మొదలుపెట్టి క్రమంగా పెంచుతూ వెళ్లండి.

చిన్న లక్ష్యాలు: మనలో కొద్దిమంది ఆరంభ శూరులుంటారు. పెద్ద పెద్ద ప్రణాళికలు వేసుకుంటారు. కష్టమైన వ్యాయామాలతో మొదలుపెడతారు. అయితే ఎక్కువ కాలం కొనసాగలేక మధ్యలోనే వదిలేస్తారు. వేసుకున్న ప్రణాళికను పక్కన పెట్టేస్తారు. మీరు అలా చేయకండి. చిన్న చిన్న లక్ష్యాలతో మొదలుపెట్టండి. వాటి సంఖ్యనూ, చేసే సమయాన్నీ క్రమంగా పెంచుకుంటూ వెళ్లండి. అవసరమైతే మీ వ్యాయామ ప్రణాళికలో మార్పులు చేసుకుని ముందుకు వెళ్లండి.



ఓ కన్నేయండి: మీరు తినేటప్పుడూ ఏం తింటున్నారో అని గమనించి తింటారు కదా! అలాగే వ్యాయామం చేసేటప్పుడు కూడా పూర్తి దృష్టి దానిమీదే పెట్టండి. క్రమంగా మీ శరీరంలో వస్తున్న మార్పులను గమనించండి.

చదువు లేకున్నా... సినిమాలు తీసేస్తారు!

ఈమె పేరు ముత్తు... చిన్నతనంలో ఆడపిల్లగా వివక్ష ఎదుర్కొన్న ఆమె.. ఇప్పుడు ఎందరో మహిళలకు ఆదర్శం అయింది. మహిళల సమస్యలను వీడియోలుగా తీస్తూ.. సాటి మహిళల్లో చైతన్యం తెస్తోంది. మహిళల వద్దకు ప్రభుత్వాన్ని తెస్తోంది.



సత్యమంగళం తమిళనాడులోని ఓ మారుమూల గ్రామం. ముత్తు అక్కడే పుట్టింది. ఆడపిల్ల కావడంతో కుటుంబసభ్యుల నుంచే నిర్లక్ష్యం ఎదుర్కొంది. తోడబుట్టిన తమ్ముడిని చదివించిన తల్లిదండ్రులు ఆమెను మాత్రం బడికి పంపించలేదు. ఎవరికి చెప్పుకోవాలో తెలియక బాధను మనసులోనే దాచుకుంది. ఇంటి పనులూ, పొలం పనులు చేస్తూనే పెరిగి పెద్దదైంది. అయితే పెళ్లయ్యాకే ఆమె జీవితంలో మార్పొచ్చింది. పెళ్లయ్యాక ఖాళీగా ఉండకుండా..ఏదో ఒకటి చేయాలనుకున్న ఆమెకు 'సైన్స్ - ఎయిడ్ ఎట్ యాక్షన్ ఇంటర్నేషనల్' సంస్థ గురించి తెలిసింది. వాళ్లతో మాట్లాడి.. తన సమస్యల్ని చెప్పుకుంది. వాళ్లు ఇచ్చిన ధైర్యంతో వీడియో కెమెరాను ఉపయోగించడంలో శిక్షణ తీసుకుంది. రెండు నెలల శిక్షణ తరవాత తనలాంటి మహిళల సమస్యలూ, ఎదుర్కొంటున్న వివక్షనూ లఘుచిత్రాలుగా తీసింది. అంతేకాదు సత్యమంగళంలోని తోటి మహిళలందరికీ వీడియో కెమెరాను వినియోగించడంలో శిక్షణనందించింది. ఒకప్పుడు తమ హక్కుల కోసం గొంతు విప్పలేని ఈ గ్రామ మహిళలు ఇప్పుడు తమ సమస్యల్ని తెరపై చూపించడానికి ఆసక్తి చూపుతున్నారు. స్థానికంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రతిబింబించేలా వీరు తీస్తున్న లఘుచిత్రాల్లో ఆ గ్రామ మహిళలే నటిస్తున్నారు. మొదట్లో కెమెరాలను అద్దెకు తీసుకున్న ఆ మహిళలకు ఇప్పుడు సైన్స్ - ఎయిడ్ ఎట్ యాక్షన్ ఇంటర్నేషనల్ స్వచ్ఛంద సంస్థ వాటిని ఉచితంగా అందించింది. ఆ గ్రామంలోనే వీళ్లకోసం ప్రత్యేకంగా మీడియా రీసోర్స్ సెంటర్ కూడా ఏర్పాటు చేసింది.





సామాజిక అవగాహన కల్పిస్తూ..

ముత్తుతో పాటూ మరికొందరు మహిళలు స్థానిక సమస్యలను ఎత్తిచూపడంతో పాటు సామాజిక అవగాహన పెంచే దిశగా లఘుచిత్రాలను రూపొందిస్తున్నారు. వాటిల్లో నిరక్షరాస్యతకు గురవుతున్న ఆడపిల్లల మనోభావాలూ, బాలకార్మిక వ్యవస్థపై పోరాటం, తోబుట్టువులతో సమాన హక్కులూ, కుటుంబంలో ఉండే దివ్యాంగులకు సమాన హక్కులువంటి అంశాలకు ప్రాధాన్యం అందించారు. ముఖ్యంగా వీళ్లు రూపొందించిన చిత్రాల్లో "తొలైంద సిరిప్పు (గల్లంతైన నవ్వు)", "ఎనక్కుం కల్వి (నాకూ.. విద్య)", "ఎన్ కురల్ (నా గొంతు)"... వంటివి సామాజిక మాధ్యమాల్లో ఎక్కువ ఆదరణ పొందాయి. వారికి కొంత ఆదాయాన్నీ తెచ్చిపెట్టాయి. ఈ లఘుచిత్రాలు స్థానిక ప్రభుత్వ అధికారుల దృష్టికీ వెళ్లాయి. దాంతో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ముందుకొచ్చింది. మారుమూల గ్రామంలోని మహిళలు ఈ తరహాలో తమ సమస్యల పరిష్కారానికి కొత్త మార్గాన్ని ఎంచుకోవడంతో పాటు తమలాంటి మరెందరికో స్ఫూర్తిదాయకంగా నిలిచారు.

సెన్సెక్స్ ▲ 205
32515

నిఫ్టీ ▲ 63
10077

రూపాయి 64.19 ▼ (ఒక అమెరికా డాలరుకు) 04 పైసలు

బంగారం 28,690 ▲ (ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత) రూ.లలో 100

వెండి 38,355 ▲ ముంబయిలో కిలో రూ.లలో 380

ముడి చమురు 52.39 ▼ (బ్రెంట్ ధర డాలర్లలో)



ప్రధాన ప్రపంచ మార్కెట్లు

సూచీ	ముగింపు	లాభం/నష్టం
డోజోన్స్	21,925	+95
నాస్‌డాక్	6,349	−26
నిక్కీ 225 (జపాన్)	19,925	−35
స్ట్రెయిట్స్ టైమ్స్ (సింగపూర్)	3,330	−01
షాంఘై(చైనా)	3,274	+21
ఎఫ్‌టీఎస్ఈ (బ్రిటన్)	7,372	+04
డాక్స్ (జర్మనీ)	12,118	−44

డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం సోమవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	58.35	67.66
పౌండ్ స్టెర్లింగ్	76.57	88.83
యూరో	68.46	79.41
జపనీస్ యెన్/100	52.78	61.21
ఆస్ట్రేలియా డాలరు	46.51	53.81
సింగపూర్ డాలరు	42.96	50.90
థాయ్ బాత్/100	174.97	209.26
బహ్రెయిన్ దీనార్	158.10	181.08
కువైట్ దీనార్	175.51	218.63
సౌదీ రియాల్	15.51	18.39
యూఏఈ దిర్హమ్	15.88	18.56
మలేషియా రింగిట్	13.35	16.41
చైనీస్ యువాన్	6.74	10.94

సోమవారం నిఫ్టీ కదలికలు



కొత్త గరిష్ఠాలకు సూచీలు

- కలిసొచ్చిన అంతర్జాతీయ సంకేతాలు
- కీలక రేట్ల కోతపై అంచనాలు
- ఎస్‌బీఐ పొదుపు ఖాతా రేటు తగ్గింపు

ఎస్‌బీఐ షేరు సందడి చేసింది. సెన్సెక్స్ షేర్లలోనే అత్యధిక లాభాన్ని ఆర్జించింది. పొదుపు (సేవింగ్స్ బ్యాంక్) ఖాతా నిధులపై వడ్డీ రేటును 0.5 శాతం తగ్గించి 3.5 శాతంగా చేయడం ఇందుకు దోహదపడింది. బీఎస్ఈలో ఒకానొకదశలో 4.91 శాతం దూసుకెళ్లిన షేరు.. చివరకు 4.46 శాతం లాభంతో రూ.312.55 వద్ద ముగిసింది. బ్యాంక్ మార్కెట్ విలువ రూ.11,524.74 కోట్లు పెరిగి రూ.2,69,794.74 కోట్లకు చేరింది. ఆగస్టు 1, 2 తేదీల్లో నిర్వహించే పరపతి, విధాన సమీక్షలో రిజర్వు బ్యాంక్ కీలక రేట్లలో కోత విధిస్తుందన్న ఆశలు, కంపెనీల త్రైమాసిక ఫలితాలు బాగుండటం కలిసి వచ్చి, మార్కెట్లు సరికొత్త గరిష్ఠాల వద్ద ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందడం కూడా ఉపకరించింది. చైనా పారిశ్రామికోత్పత్తి తగ్గడం, దేశీయ మదుపర్లు స్థిరంగా పెట్టుబడులు కొనసాగించడం సెంటిమెంట్‌పై సానుకూల ప్రభావం చూపింది.



రోజంతా లాభాల్లోనే: సెన్సెక్స్ ఉదయం 32412.20 పాయింట్ల వద్ద మెరుగ్గా ప్రారంభమైంది. ఆద్యంతం అదే జోరు కొనసాగించిన సూచీ.. ఒకానొకదశలో 32,546.50 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని తాకింది. చివరకు 205.06 పాయింట్ల లాభంతో 32,514.94 దగ్గర స్థిరపడింది. సెన్సెక్స్‌కిది గరిష్ఠస్థాయి ముగింపు కావడం విశేషం. ఇక నిఫ్టీ సైతం 62.20 పాయింట్లు పెరిగి 10,077.10 వద్ద ముగిసింది. సూచీకి సైతం ఇది జీవనకాల గరిష్ఠ ముగింపు కావడం విశేషం.

ఎల్ అండ్ టీ జోరు: ఆకర్షణీయ త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో ఎల్ అండ్ టీ షేరు పరుగులు తీసింది. ఇంట్రాడేలో 4 శాతం పెరిగిన షేరు.. చివరకు 2.85 శాతం లాభంతో రూ.1,192.10 వద్ద ముగిసింది.

- ✦ జూన్ త్రైమాసిక లాభం తగ్గడంతో గోద్రేజ్ కన్జూమర్ షేరు 2.02 శాతం కోల్పోయి రూ.1,034.75 దగ్గర స్థిరపడింది.
- ✦ డాక్టర్ రెడ్డీస్ షేరుకు నష్టాలు కొనసాగాయి. ఒకదశలో 3.41 శాతం తగ్గి, 52 వారాల కనిష్ఠమైన రూ.2,378కి చేరిన షేరు.. చివరకు 3.11 శాతం నష్టంతో రూ.2,385.50 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 17 లాభాలతో ముగిశాయి. పవర్‌గ్రిడ్ 4.23%, టాటా స్టీల్ 2.89%, ఎల్ అండ్ టీ 2.85%, ఓఎన్‌జీసీ 2.82%, ఐసీఐసీఐ బ్యాంక్ 2.01%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 1.57%, ఇన్ఫోసిస్ 1.35%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.23%, మారుతీ సుజుకీ 1.13%లు రాణించిన వాటిలో ఉన్నాయి. సన్‌ఫార్మా అత్యధికంగా 3.47% నష్టపోయింది. డాక్టర్ రెడ్డీస్ (3.11%), లుపిన్ (2.90%), ఐటీసీ (2.09%), సిప్లా (1.18%), కోల్ ఇండియా (0.99%) చొప్పున నష్టాలను చవిచూశాయి. రంగాల వారీగా చూస్తే బీఎస్ఈ మన్నికైన వినిమయ వస్తువులు, లోహ, పీఎస్‌యూ సూచీలు రాణించాయి.

టెక్ మహీంద్రా లాభం రూ.798 కోట్లు

ముంబయి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో టెక్ మహీంద్రా నికర లాభం 6.57 శాతం పెరిగి రూ.798.60 కోట్లుగా నమోదైంది. ఆదాయం కూడా 5.99 శాతం అధికమై రూ.7,336 కోట్లకు చేరింది. ఇతర ఆదాయమూ 67 శాతం వృద్ధితో రూ.410 కోట్లకు పెరిగింది. హెడ్జింగ్‌పై 2 కోట్ల డాలర్ల లాభం, పుణెలో స్థల విక్రయం ద్వారా 90 లక్షల డాలర్లు రావడం ఇతర ఆదాయం అధికంగా పెరగడానికి కారణమయ్యాయని కంపెనీ ముఖ్య ఆర్థిక అధికారి మిలింద్ కులకర్ణి తెలిపారు. అమెరికా, ఐరోపా కార్యకలాపాల ఆదాయం పెరగ్గా, మిగతా విపణుల్లో ఆదాయం 6.6 శాతం తగ్గింది. కమ్యూనికేషన్ల విభాగ ఆదాయం 1.9% తగ్గినా, డిజిటల్ విభాగ ఆదాయంలో 20 శాతం వృద్ధి ఉంది. రాబోయే 18 నెలల్లో డిజిటల్ వ్యాపార ఆదాయం 40% పెరిగే అవకాశం ఉందని టెక్ మహీంద్రా ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ), ఎండీ సి.పి.గుర్నానీ తెలిపారు. నిర్వహణ సామర్థ్యాన్ని పటిష్ఠం చేసుకోవడం ద్వారా ఆదాయం, లాభాలను మెరుగుపరుచుకునే దిశగా కంపెనీ అడుగులు ప్రారంభించిందని అన్నారు. సమీక్ష త్రైమాసికంలో 3,407 మంది సాఫ్ట్‌వేర్ వృత్తి నిపుణులను కంపెనీ తొలగించింది. బీపీఓ విభాగంలో కొత్తగా 1,908 మందిని చేర్చుకుంది. మొత్తం మీద కంపెనీ ఉద్యోగుల సంఖ్య 1,713 తగ్గి 1.15 లక్షలకు పరిమితమైంది. కొన్ని నెలల్లో అమెరికాలో 2,000 మంది ఇంజినీర్లను టెక్ మహీంద్రా నియమించుకోనుంది. ఏప్రిల్- జూన్‌లో కంపెనీల వలసల రేటు 17 శాతంగా నమోదైంది. ఉద్యోగుల సంఖ్య తగ్గినప్పటికీ సామర్థ్య వినియోగం స్థిరంగా 77 శాతంగా ఉంది.

రాణించిన ఇండిగో

ముంబయి: ఇండిగో మాతృసంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికంలో రాణించింది. కొత్త ఏ320 నియోస్ విమానాల్లో ఇంజిన్ సమస్యల వల్ల, తొమ్మిది పనిచేయనప్పటికీ కంపెనీ నికర లాభం 37.1 శాతం పెరిగి రూ.811 కోట్లకు చేరింది. దేశీయ విమానయాన విపణిలో 40 శాతం వాటా కలిగి ఉన్న ఈ కంపెనీ ఆదాయం సైతం అంతక్రితం ఏడాది ఏప్రిల్-జూన్‌తో పోలిస్తే 25.6% పెరిగి రూ.5,955 కోట్లకు చేరింది. ఒక్కో సీటుపై ఆదాయం 5.5%; పెరగడం ఇందుకు దోహదం చేసింది. అన్ని కార్యకలాపాల్లోనూ కంపెనీ పనితీరు మెరుగైంది. కార్యకలాపాల మార్జిన్లు 14.1 శాతం మేర పెరిగాయి. ఒక్కో ప్రయాణికుడిపై చేసే వ్యయం 2.5 శాతం తగ్గడం కూడా కలిసొచ్చిందని సంస్థ ప్రెసిడెంట్ ఆదిత్య ఘోష్ పేర్కొన్నారు. 'జూన్ త్రైమాసికం చివరకు కంపెనీ వద్ద మొత్తం 135 విమానాలున్నాయి.

సైయెంట్‌కు ఐఏసీఈ పురస్కారం

ఈనాడు, హైదరాబాద్: ఇంజినీరింగ్, ఐటీ సేవల సంస్థ సైయెంట్‌కు 'లీడర్స్ ఇన్ కార్పొరేట్ ఇన్నోవేషన్' పురస్కారం లభించింది. ఇండో అమెరికన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (ఐఏసీసీ) నిర్వహించిన 13వ ఇండో అమెరికన్ కార్పొరేట్ ఎక్సలెన్సీ (ఐఏసీఈ)లో భాగంగా ఈ పురస్కారం అందుకున్నట్లు సైయెంట్ ఒక ప్రకటనలో తెలిపింది. వ్యాపార నిర్వహణలో వినూత్న పద్ధతులు అనుసరించిన సంస్థలకు ఈ అవార్డు అందిస్తారు. అమెరికా, భారత్‌ల మధ్య వ్యాపారాలు నిర్వహించే సంస్థలు, వ్యక్తులను ఐఏసీఈ అవార్డుల కోసం పరిగణనలోనికి తీసుకుంటుంది. వ్యాపార, అమెరికా ప్రభుత్వ అధికారులతో కూడిన స్వతంత్ర బృందం ఈ అవార్డుకు విజేతలను ఎంపిక చేస్తుంది. అవార్డు స్వీకరించిన సందర్భంగా సైయెంట్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ కృష్ణ బొడనపు మాట్లాడుతూ కొత్త ఆవిష్కరణల విషయంలో మరింత ముందుకు వెళ్లేందుకు ఈ అవార్డు ప్రోత్సాహకంగా పనిచేస్తుందని అన్నారు.



ఐఏసీసీ జాతీయ అధ్యక్షుడు శ్రీనివాసన్ నుంచి అవార్డును అందుకుంటున్న సైయెంట్ ఎండీ కృష్ణ బొడనపు

ఏప్రిల్-జూన్ త్రైమాసిక ఫలితాలు

(కోట్ల రూపాయల్లో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2017–18	నికర లాభం/(నష్టం) 2016–17	మొత్తం ఆదాయం 2017–18	మొత్తం ఆదాయం 2016–17
యూపీఎల్ (కన్సా)	475	362	3,952	3,731
గోద్రేజ్ కన్జూమర్ ప్రొడక్ట్స్	225.17	246.65	2,266.69	2,191.64
పిన్‌కాన్ స్పిరిట్స్	11.92	9.12	390.61	309.27
టొరెంట్ ఫార్మా (కన్సా)	188	292	1,348	1,513
శ్రీ సిమెంట్	440.11	507.67	2,995.23	2,565.70
బలరాంపూర్ చినీ మిల్స్	119.78	110.70	1,136.45	826.83
వి-గార్డ్ ఇండస్ట్రీస్	23.25	43.03	569.07	560.89
హెక్సావేర్ టెక్నాలజీస్	122.40	97.90	983.60	869.60
రిలయన్స్ పవర్ (కన్సా)	230.80	340.40	2,752.30	2,748.30
బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర	(412.20)	(397.40)	3,209.84	3,444.15
జీఈ పవర్ ఇండియా	10.50	63	388.30	427.90
ఎస్సార్ షిప్పింగ్	(57.80)	(50.40)	188	186.6
జేపీ ఇన్‌ఫ్రాటెక్	(44.70)	(35.60)	320	1,099.3
శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్	448.68	374.10	1,585.20	1,347.39

నేటి బోర్డు సమావేశాలు



★ పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ★ సెంచరీ ప్లైబోర్డ్స్ ★ టొరెంట్ పవర్ ★ టీసీఐ డెవలపర్స్ ★ శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ ★ తాజ్ జీవీకే హోటల్స్ ★ పిరమాల్ ఎంటర్‌ప్రైజెస్ ★ రిలయన్స్ డిఫెన్స్ ★ పీసీ జువెలర్ ★ మారికో ★ ఓరియంట్ పేపర్ ★ జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ★ జీటీపీఎల్ హాత్‌వే ★ డెన్ నెట్‌వర్క్స్ ★ డీసీఎం శ్రీరామ్

చెల్లింపుల కుంభకోణం దర్యాప్తు పూర్తి చేయండి

- సెబీకి ఎన్ఎస్ఈఎల్ వినతి

దిల్లీ: రూ.5,600 కోట్ల చెల్లింపుల కుంభకోణం కేసు దర్యాప్తును పూర్తి చేయాల్సిందిగా సెబీని నేషనల్ స్పాట్ ఎక్స్ఛేంజీ లిమిటెడ్ (ఎన్ఎస్ఈఎల్) కోరింది. 'మాతోపాటు చాలా మంది మదుపర్ల ప్రయోజనాలు కేసుతో ముడిపడి ఉన్నందున ఈ వినతి చేస్తున్నామ'ని పేర్కొంది. చెల్లింపుల సంక్షోభానికి సంబంధించి పలు అంశాలను, అభిప్రాయాలను ఇందులో వెలిబుచ్చింది. తప్పుడు మార్గాల వల్ల ఇప్పటికే నాలుగేళ్లు కోల్పోవాల్సి వచ్చిందని పేర్కొంది. ఎగవేతదార్లకు చెందిన ఆస్తులను కనుగొనే విషయంలోనూ సహకారం అందించామని తెలిపింది. వసూలు చేసిన డబ్బులను తిరిగి మదుపర్లకు అప్పగించే పనిని కూడా ప్రారంభించినట్లు తెలిపింది. 2013లో ఎన్ఎస్ఈఎల్ చెల్లింపుల కుంభకోణం వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి సెబీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఈ కేసును దర్యాప్తు చేస్తున్నాయి. దేశవ్యాప్తంగా కమొడిటీ స్పాట్ ఎక్స్ఛేంజీని అందుబాటులోకి తీసుకొచ్చే ఉద్దేశంతో ఎన్ఎస్ఈఎల్‌ను 99.98% వాటాతో ఫైనాన్షియల్ టెక్నాలజీస్ ఏర్పాటు చేసింది.



మార్కెట్ కబుర్లు

- ✦ తొలి పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ద్వారా రూ.600-650 కోట్ల నిధులు సమీకరించేందుకు సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) అనుమతులు జారీ చేసినట్లు **డిక్సన్ టెక్నాలజీస్** వెల్లడించింది. తిరుపతి వద్ద ఏర్పాటు చేయనున్న ఎల్ఈడీ టీవీల తయారీ ప్లాంటుకు ఈ నిధులను వినియోగించనుంది.
- ✦ సిస్కో భారత్, సార్క్ దేశాల కార్యకలాపాల అధ్యక్షునిగా సమీర్ గార్డేను నియమించినట్లు **సిస్కో** వెల్లడించింది. నేడు ఆయన పదవీ బాధ్యతలు స్వీకరిస్తారు.
- ✦ నాగ్‌పూర్ వద్ద ఏర్పాటు చేయనున్న సిమెంటు ప్లాంటుపై సుమారు రూ.2,400 కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు బోర్డు అనుమతి కోరనున్నట్లు **బిర్లా కార్పొరేషన్** ప్రకటించింది.
- ✦ **సెక్యూరిటీ అండ్ ఇంటెలిజెన్స్ సర్వీసెస్ (ఇండియా)** తొలి పబ్లిక్ ఇష్యూకు తొలి రోజు 38 శాతం స్పందన వచ్చింది. 53,16,187 షేర్లను కంపెనీ జారీ చేస్తుండగా, 19,96,380 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. రూ.808-815 ధరల శ్రేణిగా నిర్ణయించిన ఈ ఇష్యూ ద్వారా రూ.780 కోట్ల వరకు నిధులు సమీకరించాలన్నది సంస్థ ప్రణాళిక.

నేటి మార్కెట్

రిజర్వు బ్యాంక్ పరపతి విధాన సమీక్షలో, కీలక రేట్ల కోత విధిస్తుందనే ఆశల నేపథ్యంలో మార్కెట్ల లాభాలు కొనసాగొచ్చు. రుతుపవనాలు ఆశాజనకంగా ఉండటం, పెట్టుబడులు స్థిరంగా కొనసాగడం సైతం ఇందుకు దోహదపడొచ్చని డీలర్లు అంచనా వేస్తున్నారు. రిజర్వు బ్యాంక్ పరపతి విధాన కమిటీ సమీక్ష నేడు ప్రారంభం కానుంది. బుధవారం కీలక రేట్ల ప్రకటన వెలువడనుంది. ద్రవ్యోల్బణం కొన్నేళ్ల కనిష్ఠానికి చేరడంతో ఆర్‌బీఐ కీలక రేట్లను పావు శాతం మేర తగ్గించొచ్చన్న అంచనాలు ఉన్నాయి. కంపెనీల త్రైమాసిక ఫలితాలు, జులై వాహన విక్రయ గణాంకాల వెలువడనుండటంతో సూచీలు హెచ్చుతగ్గులు ఎదుర్కోవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ఉత్తర కొరియా మరోసారి మిసైల్ ప్రయోగాలు జరపడం కూడా ఒడుదొడుకులకు కారణం కావచ్చు. నేడు నిఫ్టీ 10000- 10120 పాయింట్ల శ్రేణిలో కదలాడొచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. సోమవారం మార్కెట్లు ముగిసిన అనంతరం వెలువడిన టెక్ మహీంద్రా ఫలితాల ప్రభావం షేరుపై ఉండొచ్చు. ఎస్‌బీఐ బాటలోనే మరిన్ని బ్యాంకులు సేవింగ్స్ ఖాతాలపై వడ్డీ రేట్లు తగ్గించొచ్చన్న అంచనాలతో బ్యాంక్ షేర్ల లాభాలు కొనసాగొచ్చు.

ఎస్‌బీఐ



రూ.299.40 వద్ద ప్రారంభమై రూ.298- 313.85 మధ్య కదలాడి, క్రితం ముగింపు రూ.299.10తో పోలిస్తే రూ.13.40 (4.48%) లాభంతో రూ.312.50 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈలో చేతులు మారిన షేర్లు 4,15,46,619.

సన్‌ఫార్మా



రూ.553 వద్ద మొదలై రూ.528.90- 553.70 మధ్య చలించి, క్రితం ముగింపు రూ.550.80తో పోలిస్తే రూ.19.15 (3.48%) నష్టంతో రూ.531.65 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో 54,04,985 షేర్లు చేతులు మారాయి.

52 వారాల గరిష్ఠం (రూ.లలో)

హెచ్‌డీఎఫ్‌సీ	1799.90
జుబిలెంట్ ఫుడ్‌వర్క్స్	1338.00
ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్	1317.20
కోటక్ మహీంద్రా బ్యాంక్	1031.70
రిలయన్స్ క్యాపిటల్	735.20
కావేరీ సీడ్	704.00
ఎం అండ్ ఎం ఫైనాన్షియల్	410.50

52 వారాల కనిష్ఠం (రూ.లలో)


డాక్టర్ రెడ్డీస్	2375.00
అజంతా ఫార్మా	1391.90
లుపిన్	1030.00
ఆర్‌పీజీ లైఫ్ సైన్సెస్	341.05

ఎఫ్ఐఐలు, డీఐఐల లావాదేవీలు (రూ.కోట్లలో)

తేదీ	విదేశీ మదుపర్లు (ఎఫ్ఐఐలు) కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం	దేశీయ మదుపర్లు (డీఐఐలు) కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం
31/07	5,485	6,682	−1,197	4,865	3,096	1,768
28/07	5,141	5,364	−223	3,627	3,202	425
27/07	9,720	7,850	1,870	5,750	6,410	−660
26/07	5,423	5,484	−61	3,545	2,868	677
25/07	5,604	5,333	271	3,501	3,711	−210

31వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)



కోడిగుడ్లు

హైదరాబాద్	310	వరంగల్	312
చిల్లరగా(ఒక గుడ్డు)	3.70	విశాఖపట్నం	318
బెంగళూరు	360	చెన్నై	372
1న		చిత్తూరు	365
విజయవాడ/గోదావరి	308	నమక్కల్	360

ఎన్ఎస్ఈ

సోమవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ACC 1733.20 (1731.20) 315048
ADANI PORT & 395.90 (395.75) 1581010
AMBUJA CEMEN 263.15 (262.60) 1524550
ASIAN PAINTS 1161.70 (1153.25) 777721
AUROBIND PHA 718.60 (723.90) 2192788
AXIS BANK LT 519.80 (515.10) 7245884
BAJAJ AUTO L 2808.55 (2828.15) 173664
BANK OFBAROD 166.05 (161.55) 15878051
BHARTI AIRTE 418.95 (413.30) 2662076
BHARTI INFRA 401.40 (403.90) 3107036
BOSCH LTD 24178.10 (23804.40) 9832
BPCL 471.15 (475.60) 3000612
CIPLA 560.10 (566.10) 753415
COAL INDIA L 249.10 (251.55) 3580763
DR. REDDYS 2383.20 (2464.95) 1525068
EICHER MOTOR 30081.20 (29388.40) 56838
GAIL 376.75 (379.95) 1916744
HCL TECH 892.90 (893.10) 947283
HDFC 1789.25 (1785.35) 4669583
HDFC BANK 1784.40 (1778.50) 1842285
HERO MOTOCOR 3655.75 (3630.30) 504658
HINDALCO IND 219.65 (215.85) 5389040
HINDUSTAN UN 1155.75 (1153.85) 955459
ICICI BANK 302.60 (296.15) 21526493
INDIABULLS H 1175.25 (1175.50) 767230
INDIAN OIL 367.65 (367.80) 2537096
INDUSINDBANK 1645.75 (1628.35) 1287974
INFOSYS LTD 1011.20 (997.35) 9579124
ITC 285.25 (291.55) 21247233
KOTAK MAHIND 1021.65 (1012.70) 2464607
LARSEN & TOU 1193.95 (1161.40) 5000536
LUPIN 1032.00 (1063.90) 4692583
M&M 1403.30 (1392.20) 510904
MARUTI SUZIK 7750.05 (7630.45) 505371
NTPC LTD 164.20 (163.90) 9432683
ONGC 169.40 (164.75) 13899095
POWER GRID C 223.30 (214.65) 9789646
RELIANCE IND 1615.20 (1594.45) 3787034
SBI 312.50 (299.10) 41547584
SUN PHARMA 531.65 (550.80) 5404990
TATA CONSULT 2491.80 (2484.30) 1009831
TATA MOT DVR 260.50 (261.95) 1387083
TATA MOTORS 444.60 (445.85) 3804621
TATA POWER 82.00 (82.15) 2681618
TATA STEEL L 567.10 (551.90) 5624650
TECH MAHINDR 385.85 (381.30) 1535812
ULTRATECH 4056.90 (4024.20) 198206
VEDANTA LIMI 279.85 (274.60) 6227981
WIPRO 288.45 (289.05) 2550406
YES BANK LTD 1809.50 (1841.85) 4353547
ZEE ENTERTAI 541.75 (540.60) 1133189

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1421.00 (1418.70) 20511
ASHOK LEYLAN 109.50 (109.40) 10272829
BAJAJ FINANC 1703.10 (1701.35) 576928
BAJAJ FINSER 4991.85 (4926.30) 147439
BEL 178.75 (177.90) 5048155
BHEL 145.10 (143.80) 2098191
BRITANNIA 3921.60 (3906.65) 127968
CADILA HEALT 543.65 (545.85) 280081
COLGATE PALM 1079.55 (1070.75) 188132
CONTAINER 1143.85 (1141.25) 206389
CUMMINS INDI 987.75 (989.90) 189836
DABUR INDIA 310.00 (310.50) 745445
DIVIS LAB 672.90 (674.30) 733178
DLF LIMITED 193.35 (191.25) 9598130
EMAMI LIMITE 1108.10 (1104.55) 141630
GLAXOSMI CON 5469.65 (5536.05) 2427
GLAXOSMI PHA 2400.95 (2443.15) 9029
GLENMARK PHA 697.05 (717.45) 1416845
GODREJ CONSU 1037.25 (1053.55) 1645597
HAVELLS INDI 472.80 (478.35) 1303559
HINDUSTAN ZI 282.90 (277.85) 1290299
HPCL 383.20 (374.45) 4094352
ICICI PRU LI 458.95 (448.00) 880996
IDEA CELLULR 92.45 (95.55) 12961089
INTERGLOBE A 1290.75 (1286.10) 983921
JSW STEEL LT 221.25 (215.80) 5160277
LIC HOUS.FIN 690.45 (720.90) 6657351
MARICO LIMIT 334.70 (332.40) 838780
MCDOWELL 2535.70 (2560.10) 253196
MOTHERSON 325.00 (324.90) 2114927
NHPC LTD 30.35 (30.20) 3430985
NMDC LTD 126.75 (122.90) 4481370
OIL INDIA 287.50 (281.75) 761903
ORACLE FIN S 3622.65 (3603.45) 11170
P&G HYG&HEAL 8041.95 (7968.20) 1606
PETRONET LNG 203.95 (202.45) 11862219
PIDILITE IND 795.85 (787.90) 591799
PIRAMAL ENTE 2952.50 (2930.70) 250116
PNB 162.30 (158.85) 13159766
POWER FIN CO 124.40 (123.40) 2007125
RURAL ELEC C 175.05 (175.40) 3051597
SAIL 63.25 (62.55) 5526155
SHREE CEMENT 18601.70 (17495.40) 61360
SHRIRAM TRAN 1017.00 (970.10) 3737467
SIEMENS 1455.15 (1446.30) 511432
SUN TV LTD 780.35 (797.10) 690147
TITAN IND 544.25 (533.15) 1113439
TORRENT PHAR 1318.05 (1245.75) 1000076
UNITED BREWE 820.60 (817.20) 108734
UPL LIMITED 877.15 (868.50) 2020713

ఇతర ప్రధాన షేర్లు

ABAN OFFSHOR 184.50 (183.55) 442422
ADANI ENTERP 137.90 (138.70) 1735603
ADANI POWER 33.50 (33.70) 4606408
ALL BANK 74.85 (74.95) 6169831
AMARA RAJA 834.40 (840.50) 178063
ANANT RAJIND 63.45 (63.80) 1086371
ANDHRA BANK 57.15 (56.65) 2132286
APOLLO HOSPI 1259.00 (1273.65) 230943
APOLLO TYRES 266.50 (263.20) 4278814
APTECH 214.45 (204.25) 1382427
BAJAJ ELECT. 327.70 (335.70) 72669
BAJAJ HIND 15.90 (15.65) 6762091
BAJAJ HOLDIN 2420.90 (2385.50) 15093
BALAJI TELE 172.90 (176.70) 460855
BALLARPUR IN 16.60 (17.25) 1546832
BALRAMPUR CH 165.40 (155.00) 8767682
BANK OF MAHA 29.20 (28.50) 2079218
BANK OFINDIA 166.00 (162.25) 7993428
BATA INDIA 588.15 (575.40) 865791
BGR ENERGY S 150.25 (147.90) 113807
BHARAT FORGE 1148.70 (1151.10) 701556
BHUSHAN STEE 73.15 (71.40) 1560313
BIOCON LTD 384.70 (390.65) 1931685
BOMBAY DYE 83.60 (83.30) 1179689
CANARA BANK 368.10 (364.00) 2322450
CEAT LIMITED 1877.15 (1852.20) 426337
CENTRAL BANK 90.55 (91.25) 3510322
CHAMBAL FERT 135.45 (133.90) 1046400
CHENNAI PETR 387.00 (383.40) 297788
CITY UNIBANK 176.35 (167.55) 908766
CORPO BANK 50.65 (51.00) 448235
COX & KINGS 284.85 (289.75) 264772
D B REALTY L 44.35 (44.45) 2014881
DELTA CORP L 170.75 (172.75) 2429116
DENA BANK 34.00 (34.00) 2546161
DHANALAKBANK 40.05 (40.15) 564248
EDELWEISS CA 204.95 (201.70) 1169888
EDUCOMP SOLU 9.40 (9.55) 216732
EID PARRY 336.85 (329.05) 362629
EIH 138.75 (137.15) 126267
ESSAR SHIPPI 28.20 (28.85) 35476
ESTER INDUST 37.85 (37.85) 21135
EXIDE INDUST 217.50 (216.45) 2551709
FEDERAL BANK 115.25 (113.75) 10095171
FINOLEX CABL 466.80 (476.40) 57536
G E SHIP LTD 397.60 (393.05) 47231
GAMMON INDIA 9.45 (9.55) 549147
GAMMON INFRA 4.70 (4.85) 1850255
GATI LIMITED 121.20 (121.80) 303879
GAYATRI PROJ 169.60 (168.05) 50830
GITANJALIGEM 64.15 (63.65) 852580
GMR INFRASTR 18.80 (18.90) 20709764
GODREJ IND 663.00 (664.60) 240011
GRASIM IND 1070.25 (1071.40) 918273
GUJ ALK&CHEM 399.70 (403.75) 51531
GUJ NRE COKE 2.50 (2.50) 3243739
HCL INFOSYS 48.60 (48.80) 1156646
HEXA TECH 261.95 (260.25) 1592712
HIMACHAL FUT 18.15 (18.75) 8841166
HINDU MOTORS 8.75 (8.45) 1355501
HOUSING DEV 86.75 (85.85) 8071160
IDBI 59.45 (59.25) 2672853
IDFC 58.75 (59.55) 5510634
IFCI 27.05 (27.10) 3475842
IL&FS TRANS 92.00 (89.50) 1064092
IND SWIFTLAB 36.75 (36.60) 20304
INDBULLS REL 227.20 (223.85) 7357243
INDIA CEM 203.95 (202.90) 4974017
INDIAN BANK 313.35 (308.50) 1704915
INDO RAMA SY 30.10 (30.15) 47448
INDRAPRASTHA 1179.10 (1190.65) 453377
IND-SWIFTLTD 9.20 (8.80) 75450
INGERSOLL-R 861.95 (853.95) 8934
IOB 24.95 (25.35) 1222487
IPCA LAB 478.60 (481.50) 686024
IRB INFRA DE 225.30 (225.75) 2773280
J&K BANK 83.25 (84.90) 334009
JAI CORP 85.85 (86.20) 682623
JAIN IRRIGAT 106.05 (107.55) 2419049
JAYPEE INFRA 21.85 (22.55) 4523554
JAYSHREE TEA 106.35 (99.75) 323773
JET AIRWAYS 596.70 (596.25) 1119540
JINDAL SAW 102.70 (99.25) 2936083
JINDAL STEEL 153.40 (149.85) 13711466
JK LAKSHMI C 457.65 (443.30) 44736
JK PAPER LIM 97.20 (97.80) 1289377
JM FINANCIAL 120.15 (122.35) 406096
JP ASSOCIATS 29.40 (29.55) 83972263
JSW ENERGY L 70.45 (72.05) 21450066
JUBILANT FOO 1317.75 (1312.60) 1182849
JUBILANT ORG 714.95 (724.95) 134931
JYOTHY LABS 370.60 (372.40) 129822

ఘనం (+)

నిఫ్టీ	31న	మార్పు %
SBI	312.50	4.48
POWER GRID CORP.	223.30	4.03
ONGC	169.40	2.82
LARSEN & TOUBRO	1193.95	2.80
BANK OF BARODA	166.05	2.79
TATA STEEL	567.10	2.75
EICHER MOTORS	30081.20	2.36

గ్రహణం (-)

నిఫ్టీ	31న	మార్పు %
SUN PHARMA	531.65	-3.48
DR. REDDYS LAB	2383.20	-3.32
LUPIN	1032.00	-3.00
ITC	285.25	-2.16
YES BANK	1809.50	-1.76
CIPLA	560.10	-1.06
COAL INDIA	249.10	-0.97

JYOTI STRUC 11.90 (11.35) 403235
KARNATA BANK 153.90 (153.05) 1473795
KEC INTL LTD 304.60 (303.70) 339944
KOLTE PATIL 168.05 (169.20) 33844
KPIT CUMMINS 127.95 (127.00) 1488227
L&TFIN.HOLD 175.00 (170.40) 11666200
LAK VIL BANK 178.45 (179.50) 614320
M & M FINANC 401.00 (401.65) 2947094
MANAPPURAM G 106.75 (105.15) 3125189
MMTC LIMITED 61.25 (61.80) 582099
MOSER-BEAR 5.30 (5.30) 282923
MPHASIS LTD 604.60 (594.45) 142284
MRPL 124.25 (124.15) 1265717
MTNL 20.75 (21.00) 699285
NCC LIMITED 88.90 (89.85) 2432412
NETWORK18 FI 55.60 (57.10) 503522
NEULAND LAB 1438.70 (1447.75) 6695
NIIT LTD 98.15 (102.00) 3780242
NIIT TECHNOL 515.50 (517.90) 319095
OMAXE LTD 204.60 (206.20) 503976
ONMOBILE GLO 64.60 (66.50) 281954
ORIENT PAPER 100.20 (95.95) 1341750
ORIENTALBANK 148.05 (146.45) 4390019
PARSVNATH DE 23.35 (22.70) 465715
PATEL ENGG 82.40 (83.00) 95539
PFIZER 1782.60 (1791.15) 23913
POLARIS SOFT 230.55 (233.10) 55658
POWERTRADING 120.50 (114.45) 3480688
PRAJ IND 76.95 (76.25) 148136
PRISM CEMENT 119.80 (120.25) 115980
PROVOGUE (IN 4.45 (4.50) 48577
PUNJ LLOYD 21.25 (21.75) 2556344
PUNJAB & SIN 54.35 (54.65) 83687
PURAVANKARA 75.70 (75.20) 106934
PVP VENTURES 5.75 (5.70) 102800
PVR LIMITED 1340.55 (1340.00) 133803
RADICO KHAIT 141.50 (139.35) 1520546
RAJ OIL MILL 1.50 (1.50) 23234
RAJESH EXPOR 711.20 (699.85) 250215
RALLIS INDIA 240.85 (242.40) 79707
RAMCO IND 232.00 (234.45) 58999
RAMCO SYS 431.85 (438.00) 65865
RAMKY INFRA 96.25 (98.65) 137218
RAYMOND 791.75 (786.25) 533556
RELIANCE CAP 724.40 (718.65) 5764372
RELIANCE COM 26.25 (26.45) 18081784
RELIANCE INF 528.65 (526.00) 1725572
RELIANCE POW 45.35 (45.40) 3526670
ROLTA INDIA 58.10 (57.35) 787799
SAGAR CEMENT 841.45 (823.50) 8438
SAREGAMA 402.15 (410.60) 167033
SHANTHI GEAR 145.15 (146.50) 35264
SHIPPNG CORP 82.80 (82.25) 623040
SHREE RENUKA 18.15 (18.55) 8783723
SINTEX IND 37.20 (36.20) 42764345
SOBHA DEVELO 399.30 (396.55) 81399
SOUTHINDBANK 30.15 (30.35) 9854533
STERLITE TEC 211.60 (215.10) 1563838
SUJANA METAL 2.10 (1.85) 541085
SUN PHARMA 378.75 (374.10) 574390
SUND FASTNER 414.50 (408.30) 329879
SUZLON ENERG 18.95 (19.20) 59278304
SYND. BANK 73.70 (75.00) 6420706
TATA CHEM 619.90 (623.80) 537150
TATA COFFEE 129.20 (129.10) 354729
TATA COMMUN 671.10 (674.50) 277116
TATA GLOBAL 169.55 (169.15) 1896521
TATA METALIK 672.00 (678.10) 116215
TATA TELESER 7.85 (7.70) 5822821
THE INDIAN H 124.65 (123.30) 244183
TORRENT POWE 181.95 (182.20) 513209
TRIVENI ENGG 81.00 (79.10) 1209559
TTK PRESTIGE 6382.25 (6384.25) 820
TV TODAY NET 241.30 (241.85) 59221
TV18 BROADCA 40.05 (39.85) 3487346
TVS MOTOR 582.10 (582.95) 354678
UCO BANK 33.10 (33.85) 951531
UNION BANK 158.05 (157.00) 4245041
UNITECH 8.70 (8.85) 26920061
UNITED BANK 19.50 (19.65) 398576
USHA MARTIN 22.55 (21.10) 2741056
VADILAL INDU 911.10 (903.10) 51732
VENKYS 2114.90 (2132.05) 73903
V-GUARD IND 178.15 (192.95) 6231949
VIJAYA BANK 70.00 (70.35) 1413272
VIP 172.45 (175.10) 151675
VOLTAS 504.25 (510.80) 769126
ZEE LEARN LI 43.30 (44.05) 424277
ZUARI GLOBAL 134.65 (136.90) 7691
ZYDUS WELLNE 892.65 (881.95) 3172

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ALPHAGEO 854.35 (851.80) 4490
AMAR RAJA BA 834.50 (839) 12913
ANDHRA BANK 57 (56.70) 150549
ANDHRA CEMEN 9.91 (9.86) 27815
ANDHRA PAPER 321 (316.30) 19174
ANDHRA PETRO 26.80 (26.60) 48618
ANDHRA SUGAR 342.15 (354.20) 14536
ANJANI PORTL 223.15 (221.75) 3239
ASTRA MICROW 134.20 (138.25) 105108
AUROBINDO PH 719.40 (724.05) 240908
AVANTEL SOFT 241.35 (247) 3105
AVANTI FEEDS 1638.60 (1601.30) 4746
BALAJI AMIN 330.20 (331.50) 2898
BARTRONICS 15.46 (15.42) 7604
BHAGIRA CHEM 187.20 (182.75) 35394
BHAGYA NAG 24.80 (25.05) 7170
BN RATHI SEC 36.90 (36.90) 2978
CAMBRIDGE TE 77.40 (78.95) 1727
CONT COFFEE 283 (282.30) 1278
COROMAN FERT 448.70 (437) 36036
CYBERMATE 3.41 (3.36) 92579
DECCAN CEMEN 1159.95 (1169.90) 622
DIVI'S LAB 671.90 (673) 80966
DR REDDY 2385.50 (2462.05) 90443
FOUR SOFT 110.95 (112.40) 28029
GATI CORPN 120.90 (121.45) 58992
GAYATRI PROJ 169.35 (167.55) 9656
GMR INFRASTR 18.75 (18.85) 2190307
GRANULES (I) 136.10 (138.40) 68888
GVK POWER 12.83 (12.45) 7119104
HBL NIFE POW 47.70 (48.95) 33578
HERITAGE FOO 1239 (1229.10) 1024
HYD INDUS 1165.10 (1148.60) 5318
IDL INDUSTRS 440 (414.80) 13656
ILFS ENGINEE 47.25 (45.20) 108777
INNAREDY COM 3.30 (2.75) 34839
IVRCL INFRAS 6.77 (7.23) 990139
KAKATIYA CEM 384.90 (385.15) 4608
KALLAM SPG 28 (27.95) 17536
KAVERI SEED 691.95 (683.25) 75844
KCP LTD 103.65 (104.50) 17855
LANCO INDUS 375.45 (382.10) 23724
LANCO INFRAT 1.21 (1.16) 19788826
LAURUS LABS 580.75 (587.05) 13891
MADHUCON PRO 32.05 (32.95) 29554
MEGA SOFT 16.30 (16.85) 38030
MIC ELECTRON 8.66 (8.71) 35430
MOLDTK PLA 280.30 (279.50) 127473
NAGARJAGRICH 38.40 (38) 45642
NATCO PHARMA 973.55 (977.75) 27540
NAVA BH VENT 137.10 (141.70) 43767
NCC 88.85 (89.90) 286082
NCL IND 196.25 (204.95) 14306
NEHA INTER 6.09 (6.41) 37978
NEULAND LAB 1446.40 (1453.50) 837
NIHAR INFO 17.60 (17.50) 4462
NILE 623.10 (640.65) 11763
OIL COUNTRY 46.85 (46.05) 2761
PANYAM CEMEN 66.60 (64.90) 5009
PENNER IND 54.75 (54.75) 55885
PIONEER DIST 221.60 (220) 984
PITTI LAMIN 54.95 (53.10) 18519
POKARNA 1294.65 (1326.75) 1079
PRISM CEMENT 119.75 (120.05) 28418
PRUDENTL PHA 4.46 (4.42) 112708
RAIN INDUSTR 129.90 (130) 181391
SAMKRG PIST 296.45 (293.65) 7543
SAMPRE NUTRI 46.50 (44.30) 13047
SATVAH. ISPA 42.05 (42.80) 14792
SMS PHARMA 77.55 (79.30) 5049
SPHERE GLOBA 51.55 (51.60) 28435
SREE RAYAL A 32.90 (30.85) 1128751
STEEL EXCHAN 94.10 (89) 190252
SUJANA METAL 2.13 (1.90) 296167
SUJANA TOWER 4.96 (4.95) 25801
SUJANA UNIVE 1.29 (1.28) 71879
SUVEN PHARMA 166.40 (168.30) 66511
TAJ GVK HOTE 163.45 (159.55) 9744
TANLA 39.05 (38.70) 250238
TRANS BIOTEK 2.76 (2.90) 35659
VAMSHI RUBB 73.15 (68.65) 9551
VICEROY HOTE 19.25 (19.45) 28183
VIMTA LABS 150.10 (146.45) 13517
VISAKA IND 473.90 (482.45) 7596
VIVIMED LABS 124.85 (125) 224161
YBRANT DIGIT 7.30 (7.30) 179107
ZENTECH 57.10 (56.60) 4358

ఇన్ఫోసిస్ నుంచి మరో ఉన్నతాధికారి నిష్క్రమణ

బెంగళూరు: ఇన్ఫోసిస్ నుంచి సీనియర్ స్థాయి ఉద్యోగుల నిష్క్రమణ కొనసాగుతోంది. నెల వ్యవధిలో మూడో వ్యక్తి వైదొలగారు. ఇన్ఫోసిస్ అనుబంధ సంస్థ ఎడ్జ్‌వర్వ్‌లో గ్లోబల్ హెడ్, చీఫ్ బిజినెస్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న అనిర్బన్ దే రాజీనామా చేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అధికారికంగా ప్రకటన వెలువడాల్సి ఉంది. కంపెనీ ఇన్నోవేషన్ ఫండ్ ఎండీ యూసఫ్ బషీర్; విలీనాలు- కొనుగోళ్ల అధిపతి రితికా సూరిలు జులై మొదట్లో రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. రాజీనామాలు జరుగుతున్న నేపథ్యంలో అత్యున్నత స్థాయి ఉద్యోగులను అట్టేపెట్టుకునే చర్యలను కొనసాగిస్తామని కంపెనీ చెబుతోంది. విశాల్ సిక్కా బాధ్యతలు స్వీకరించాక 11 మంది అత్యున్నత స్థాయి ఎగ్జిక్యూటివ్‌లు వైదొలగిన విషయం విదితమే.



ఔషధ దుకాణాలకు జియో జీఎస్‌టీ యాప్

దిల్లీ: ఔషధ విక్రేతల కోసం వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ)కు అనుగుణమైన బిల్లింగ్ సాఫ్ట్‌వేర్ 'జియో జీఎస్‌టీ'ను రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ ప్రవేశపెట్టింది. ఆఖిల భారత కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ సంఘంతో కలిసి ఈ సాఫ్ట్‌వేర్‌ను కంపెనీ రూపొందించింది. కంపెనీ వైఫై పరికరంతో కలిపి వచ్చే జియోజీఎస్‌టీ స్టార్టర్ కిట్ ధర రూ.1.999. ఏడాది కాలవ్యవధితో అపరిమిత వాయిస్ కాల్స్, 24 జీబీ డేటా, బిల్లింగ్ యాప్‌లు ఇందులో ఉంటాయి. ప్రస్తుతం వినియోగిస్తున్న బిల్లింగ్, అకౌంటింగ్ సాఫ్ట్‌వేర్ స్థానంలో ఈ కొత్త సాఫ్ట్‌వేర్‌ను వినియోగించవచ్చని ఆఖిల భారత కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ సంఘం తెలిపింది.

ఎస్‌బీఐ.. అరశాతం కోత



- **పొదుపు ఖాతాల్లోని నిధులపై లభించే వడ్డీ 3.5 శాతమే**
- **90 శాతం ఖాతాలపై ప్రభావం**
- **కాలావధి డిపాజిట్లపైనా తగ్గింపు యోచన**

దిల్లీ: పొదుపు ఖాతాల్లోని నిధులపై ఇచ్చే వడ్డీ రేటును స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) అర శాతం తగ్గించింది. ఇప్పటివరకు ఇది 4 శాతం ఉండగా.. ప్రస్తుతం 3.5 శాతానికి కుదించింది. రూ.1 కోటి వరకు నిల్వ (బ్యాలెన్స్) ఉన్న ఖాతాలకు ఈ రేట్ల కోత వర్తిస్తుంది. ఎస్‌బీఐ పొదుపు ఖాతాల్లో రూ.కోటి కంటే తక్కువ నిధులు నిల్వ ఉండేవే 90 శాతానికి పైగా ఉంటాయని అంచనా. సామాన్యుల నుంచి సంపన్నులపైనా ఈ ప్రభావం పడుతుంది. పొదుపు ఖాతాలో రూ.కోటికి మించి నిధులుంటే మాత్రం 4 శాతం వడ్డీ రేటు కొనసాగుతుంది. 'పొదుపు ఖాతాలకు సంబంధించి జులై 31 నుంచి రెండు రకాల వడ్డీ రేట్లు వర్తిస్తాయి. ఖాతాలో రూ.కోటికి మించి ఉంటే, 4% వడ్డీ రేటు కొనసాగుతుంది. రూ.కోటి లేదా ఆ లోపైతే 3.5 శాతం వడ్డీ లభిస్తుంద'ని ఎస్‌బీఐ వెల్లడించింది.

కాలావధి డిపాజిట్లపైనా..: ద్రవ్యోల్బణం తగ్గడం, వాస్తవ వడ్డీ రేటులో పెరుగుదలతో తాజా నిర్ణయం తీసుకున్నామని ఎస్‌బీఐ ఎండీ రజ్నీశ్ కుమార్ తెలిపారు. నవంబరులో పెద్ద నోట్ల రద్దు అనంతరం పొదుపు, కరెంటు ఖాతాల్లోకి భారీగా నిధులు రావడం వల్ల, నిర్వహణ వ్యయాలు పెరగడం ఇందుకు మరో కారణమని అన్నారు. 'ప్రస్తుతం బ్యాంకు ముందు రెండే మార్గాలు ఉన్నాయి. ఒకటి మార్జినల్ కాస్ట్ ఆఫ్ లెండింగ్ రేటును (ఎంసీఎల్ఆర్) పెంచడం లేదంటే పొదుపు ఖాతా వడ్డీ రేట్లను తగ్గించడం. ఎంసీఎల్ఆర్‌ను పెంచితే వ్యవసాయ, ఎస్ఎమ్ఈ, గృహ రుణాల భారం పెరుగుతుంది. అందుకే పొదుపు ఖాతాల వడ్డీ రేట్లను తగ్గించక తప్పలేద'ని చెప్పారు. కాలావధి డిపాజిట్లపై వడ్డీ రేటును తగ్గించేందుకు కూడా సరైన సమయం కోసం వేచిచూస్తున్నామని అన్నారు. ఒకవేళ పరపతి విధాన సమీక్షలో కీలక రేట్లను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తగ్గిస్తే ఎంసీఎల్ఆర్, పొదుపు ఖాతా వడ్డీ రేట్లను మళ్లీ తగ్గిస్తారా అనే ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ.. అప్పుడున్న పరిస్థితికి తగ్గట్లుగా స్పందిస్తామని చెప్పారు.

90% మందిపై ప్రభావం

2003 మార్చి నుంచి 2011 మే వరకు పొదుపు ఖాతాలపై ఎస్‌బీఐ వడ్డీ రేటు 3.5 శాతంగా ఉండేది. ఆ తరవాత 4 శాతానికి పెంచారు. ఇప్పుడు మళ్లీ 3.5 శాతానికి తగ్గించింది. బ్యాంకుకు 42 కోట్లమంది ఖాతాదారులున్నారు. వీరి పొదుపు ఖాతాల్లో రూ.9 లక్షల కోట్ల మేర నిల్వలున్నాయి. తాజా నిర్ణయంతో బ్యాంకు ఖాతాదారుల్లో 90% మందిపై ప్రభావం పడనుంది. మరోవైపు మిగిలిన బ్యాంకులు కూడా ఎస్‌బీఐని అనుసరించే అవకాశమూ లేకపోలేదు.



దేశీయ ఎస్‌యూవీ 'కంపాస్'

ప్రారంభ ధర రూ.14.95 లక్షలు

ముంబయి: దేశీయంగా తయారైన స్పోర్ట్స్ వినియోగ వాహనం (ఎస్‌యూవీ) కంపాస్‌ను ఫియట్ క్రిస్లర్ సోమవారం విడుదల చేసింది. జీప్ బ్రాండ్ కింద ఈ వాహనాన్ని సంస్థ ఉత్పత్తి చేస్తోంది. 10 రకాల్లో లభించే ఈ వాహనం ధరను రూ.14.95-20.54 లక్షలు (ఎక్స్‌షోరూం)గా నిర్ణయించినట్లు సంస్థ వెల్లడించింది. ఈ వాహనం అయిదుగురు కూర్చోవడానికి అనువుగా ఉంటుంది. పెట్రోలు (1.4 లీటర్లు), డీజిల్ (2.0 లీటర్లు) రకాల్లో ఈ కారు లభిస్తుంది. ప్రయాణికుల భద్రత, రక్షణకు సంబంధించి ఆరు ఎయిర్ బ్యాగులు సహా 50కు పైగా అధునాతన ఫీచర్లు ఉన్నట్లు సంస్థ వెల్లడించింది. 3 సంవత్సరాలు లేదా లక్ష కిలోమీటర్ల వరకు వారంటీ ఇవ్వడంతో పాటు మరో మూడేళ్లపాటు ఏదైనా సమస్య తలెత్తి రోడ్లపై కారు ఆగిపోయినప్పుడు సహాయం అందిచనున్నట్లు తెలిపింది. 98 శాతం విడిభాగాలు వారంటీ పరిధిలోకి వస్తాయని వివరించింది. ముందుగా బుక్ చేసుకున్న వారికి, ఈ నెల 6 నుంచి వాహనాలను అందించనున్నారు. పెట్రోలు రకం ఆటోమేటిక్ వాహనాన్ని దీపావళి నాటికి అందుబాటులోకి తీసుకురానున్నట్లు సంస్థ వివరించింది.

సెప్టెంబరులో టాటా నెక్సాన్!

కాంపాక్ట్ ఎస్‌యూవీ శ్రేణిలోకి ప్రవేశం



దిల్లీ: టాటా మోటార్స్ సంస్థ కాంపాక్ట్ స్పోర్ట్స్ వినియోగ వాహనం (ఎస్‌యూవీ) నెక్సాన్‌ను సెప్టెంబరులో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ విభాగంలోకి సంస్థ తొలిసారిగా అడుగు పెడుతున్న సంగతి విదితమే. దేశీయంగా కాంపాక్ట్ ఎస్‌యూవీ అమ్మకాలు గత ఏడాది 180 శాతం వృద్ధి రేటు నమోదు చేసినట్లు టాటా మోటార్స్ అధ్యక్షుడు మయాంక్ పరీక్ వెల్లడించారు. నెక్సాన్ రెండు రకాల్లో లభిస్తుంది. ఒక రకానికి 1.2 లీటర్ల పెట్రోలు ఇంజిన్, మరో రకానికి 1.5 లీటర్ల డీజిల్ ఇంజిన్ బిగిస్తారు. దీని ధర రూ.7-10 లక్షల మధ్య ఉండొచ్చని నిపుణులు భావిస్తున్నారు.

భూసారాన్ని పెంచే కాయకల్ప్

విడుదల చేసిన ఇన్‌సెక్టిసైడ్స్



కాయకల్ప్‌ను విడుదల చేస్తున్న ఇన్‌సెక్టిసైడ్స్ ఇండియా ఎండీ రాజేశ్ అగర్వాల్. చిత్రంలో జీఎం (మార్కెటింగ్) వి.కె.గర్గ్

ఈనాడు, హైదరాబాద్: భూసారాన్ని పెంచేందుకు దోహదం చేసే కాయకల్ప్‌ను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ విపణుల్లోకి విడుదల చేసినట్లు వ్యవసాయ రసాయనిక మందుల తయారీ సంస్థ ఇన్‌సెక్టిసైడ్స్ ఇండియా ప్రకటించింది. ఎరువుల వినియోగాన్ని 25-30శాతం తగ్గించేందుకు ఇది ఉపయోగపడుతుందని సంస్థ పేర్కొంది. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రాజేశ్ అగర్వాల్ మాట్లాడుతూ జీఎస్‌టీ వల్ల అసంఘటిత రంగంలోని రసాయనిక పరిశ్రమలు కూడా సంఘటిత రంగంలోకి వస్తాయని పేర్కొన్నారు. ధరల్లో ఎంత మేరకు తేడా వస్తుందనేది 5-6 నెలల్లో తేలుతుందన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.1100 కోట్ల విక్రయాలు సాధించామని, ఈసారి 15-20శాతం వృద్ధి ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. రెండేళ్లలో దహేజ్ ప్లాంటు సాంకేతికాభివృద్ధికి రూ.30కోట్ల వరకు పెట్టుబడి పెట్టనున్నట్లు తెలిపారు. కాయకల్ప్ ప్యాకెట్‌లో ఒక్కోటి 100గ్రాముల చొప్పున 4సీసాలు ఉంటాయని, వీటిని 20రోజుల వ్యవధితో వాడాలని వివరించారు. వీటి ధర రూ.2వేలని, ఎకరా భూమికి సరిపోతుందన్నారు.

వృద్ధి రేటు 6.6 శాతం

ఏప్రిల్-జూన్‌పై నొమురా

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో వృద్ధి రేటు పెరగొచ్చని జపాన్‌కు చెందిన ఆర్థిక సేవల సంస్థ నొమురా అంచనా వేస్తోంది. అంచనా. 2017 జనవరి-మార్చి వృద్ధి 6.1 శాతంతో పోలిస్తే, ఏప్రిల్-జూన్‌లో వృద్ధి రేటు 6.60 శాతంగా నమోదు కావొచ్చని వెల్లడించింది. ఇంతకంటే మెరుగైన వృద్ధి రేటును సాధించేందుకు అవకాశాలు ఉన్నప్పటికీ వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) అమలు వల్ల సాధ్యం కాలేదని పేర్కొంది. 'పెద్దనోట్ల రద్దు ప్రభావం మార్చి నాటికి తగ్గుముఖం పట్టింది. మళ్లీ గిరాకీ పుంజుకోవడం మొదలైంది. పరిస్థితులు చక్కబడే సమయానికి జులైలో జీఎస్‌టీని తీసుకొచ్చారు. ఇది నిల్వలు, సరఫరాలపై ప్రభావం చూపింది. ఈ ఏడాది రెండో అర్ధభాగంలో పరిస్థితులు ఆశాజనకంగా ఉంటాయి. వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి. వడ్డీ రేట్లు కనిష్ఠ స్థాయిల్లో ఉన్నాయి. ఉద్యోగుల వేతనాలు పెరుగుతున్నాయి. అందువల్ల రెండో అర్ధభాగంలో వృద్ధి రేటు 7.4 శాతంగా నమోదు కావొచ్చ'ని పరిశోధన పత్రంలో నొమురా తెలిపింది.

స్నాప్‌డీల్ కుదరలేదు

- **ఫ్లిప్‌కార్ట్‌తో ఒప్పందంపై వెనకడుగు**
- **స్వతంత్రంగానే సాగాలని నిర్ణయం**
- **కంపెనీ విలువపై పొసగని ఏకాభిప్రాయం**
- **1000 మంది ఉద్యోగులకు గండం**

దిల్లీ: ఫ్లిప్‌కార్ట్‌తో ఒప్పందానికి స్నాప్‌డీల్ వెనకడుగు వేసింది. 950 మిలియన్ డాలర్ల (రూ.6000 కోట్లకుపైగా)తో కొనుగోలు చేస్తామన్న ఫ్లిప్‌కార్ట్ ఆఫర్‌ను స్నాప్‌డీల్ తిరస్కరించింది. కంపెనీ విలువపై వచ్చిన భిన్నాభిప్రాయాల కారణంగా, దేశీయ ఇ-కామర్స్ రంగంలోనే అతిపెద్దదిగా భావించిన ఒప్పందం కార్యరూపం దాల్చలేదు. స్నాప్‌డీల్‌ను కొనుగోలు చేసేందుకు, ఫ్లిప్‌కార్ట్ మార్చి నుంచి పలు దఫాలుగా చర్చలు జరిగినప్పటికీ.. చివరకు మాత్రం 'ఒప్పందం' కుదరలేదు.



స్నాప్‌డీల్ ఏమందంటే

మేం కొద్ది నెలలుగా వ్యూహాత్మక అవకాశాలపై పరిశీలన జరుపుతూ వచ్చాం. ఇకపై స్వతంత్రంగానే ముందుకెళ్లాలని నిర్ణయించుకున్నాం. అన్ని వ్యూహాత్మక చర్చలకు ముగింపు పలికాం. 'స్నాప్‌డీల్ 2.0'ను ఇపుడు పరిశీలిస్తున్నాం. తద్వారా కంపెనీని ఆర్థికంగా బలోపేతం చేయనున్నాం. వచ్చే 12 నెలల్లో స్నాప్‌డీల్ 2.0 సహాయంతో రూ.150 కోట్ల లాభాన్ని ఆర్జించగలం.

సాఫ్ట్‌బ్యాంక్ ఏమందంటే

స్వతంత్ర వ్యూహాన్ని పరిశీలించాలన్న స్నాప్‌డీల్ నిర్ణయాన్ని మేం గౌరవిస్తున్నాం. స్నాప్‌డీల్ 2.0 ఫలితాలు ఎలా ఉంటాయన్న దాని కోసం వేచిచూస్తాం. భారత ఇ-కామర్స్ రంగంలో పెట్టుబడులను అలాగే ఉంచుకోవాలని మేం భావిస్తున్నాం. (స్నాప్‌డీల్‌లో 35 శాతం వాటా ఉన్న సాఫ్ట్‌బ్యాంక్ విలీన చర్చల విషయంలో మొదట్నించీ చురుగ్గా ఉన్న విషయం తెలిసిందే.)

? వెనకడుగుకు కారణం

ఫ్లిప్‌కార్ట్‌తో ఒప్పందానికి స్నాప్‌డీల్‌లోని రతన్ టాటా, అజీమ్ ప్రేమ్‌జీల వంటి మైనారిటీ వాటాదార్ల అంగీకారమూ అవసరం. అయితే ఈ ఒప్పందం విఫలం కావడం వెనక వీరున్నారా లేదా అన్నది ప్రస్తుతానికి తెలియరాలేదు. మరో పక్క, స్నాప్‌డీల్‌కే చెందిన ఫ్రీఛార్జ్‌ను రూ.385 కోట్లతో యాక్సిస్ బ్యాంక్‌కు విక్రయించడానికి అంగీకరించిన కొద్ది రోజులకే కంపెనీ స్వతంత్రంగా ముందుకెళ్లాలన్న నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఫ్రీఛార్జ్, ఉల్కాన్ వంటి ప్రధానేతర ఆస్తులను విక్రయించడం ద్వారా కొన్నేళ్ల పాటు కంపెనీకు జరుగుబాటు కావొచ్చు. ఆ విషయాన్ని ఉద్యోగులకు రాసిన ఇ-మెయిల్ లేఖలో స్నాప్‌డీల్ సహ వ్యవస్థాపకుడు కునాల్ బాల్ స్పష్టం చేశారు కూడా.

? సాఫ్ట్‌బ్యాంక్ ఏం చేస్తుంది

చాలా రోజులుగా స్నాప్‌డీల్‌ను ఫ్లిప్‌కార్ట్‌లో విలీనం చేయడం ద్వారా ఆ కంపెనీలో వాటా పొందాలని సాఫ్ట్‌బ్యాంక్ ఎదురుచూసింది. తాజా పరిణామంతో ఇక ఆ కంపెనీ నేరుగా ఫ్లిప్‌కార్ట్‌లో పెట్టుబడులు పెట్టే అవకాశం ఉందని వార్తలు వినవస్తున్నాయి.

? ఉద్యోగుల పరిస్థితి ఏమిటి

స్నాప్‌డీల్‌లో ప్రస్తుతం 1200 మంది సిబ్బంది ఉన్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో 1,000 మందిని ఇంటికి పంపించే అవకాశాలు ఉన్నాయి. ఆ మేరకు జాబితా సిద్ధం చేయమని విభాగాధిపతులకు మౌఖిక ఆదేశాలు జారీ అయినట్లు కంపెనీకి చెందిన ఒక సీనియర్ అధికారి తెలిపారు. గతేడాది జులైలో కంపెనీకి 9000 మంది ఉద్యోగులుండగా.. ఎటువంటి నోటీసుల్లేకుండానే వారి సంఖ్యను 1200కు తగ్గించింది. ఇపుడు ఆ సంఖ్యను 200కు పరిమితం చేయాలని చూస్తోంది. ఇందువల్ల నిర్వహణ వ్యయం గణనీయంగా తగ్గుతుంది.

? ఎందుకింత సమయం

దాదాపు అయిదు నెలల పాటు విలీన చర్చలు జరిగాయి. ఇందుకు కారణాలే అనేకం. ఈ ఒప్పందం త్వరగా జరిగేలా చూడడానికి సాఫ్ట్‌బ్యాంక్ చాలా ప్రయత్నించింది. భాగస్వాములైన కలారి, నెక్సస్ వెంచర్ లను ఒప్పించడానికి సమయం పట్టింది. ఆ తర్వాత స్నాప్‌డీల్ బోర్డు ఫ్లిప్‌కార్ట్ చేసిన 800-850 మిలియన్ డాలర్ల(రూ.5500 కోట్లు) ఆఫర్‌ను తిరస్కరించింది. అది కంపెనీ విలువని తక్కువ చేయడమేనని వాదించింది. ఆ తర్వాత ఫ్లిప్‌కార్ట్ తన ఆఫర్‌ను 900-950 మిలియన్ డాలర్ల(రూ.6000 కోట్లకు పైగా)కు పెంచింది. ఈ ఆఫర్‌ను పరిశీలించినప్పటికీ.. చివరకు ఒంటరిగానే ప్రయాణం సాగించాలని నిర్ణయించుకుంది.

హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్.. మ్యాక్స్ లైఫ్ కలవవు

విలీన ప్రతిపాదన రద్దు: మ్యాక్స్ ఇండియా

దిల్లీ: హెచ్‌డీఎఫ్‌సీ స్టాండర్డ్ లైఫ్ ఇన్సూరెన్స్‌తో మ్యాక్స్ లైఫ్, మ్యాక్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్‌ల విలీన ప్రతిపాదనను రద్దు చేసుకున్నామని మ్యాక్స్ ఇండియా తెలిపింది. 2017 జులై 31తో గడువు తీరిపోతున్న విలీన ఒప్పందాన్ని తిరిగి పునరుద్ధరించడం లేదని బీఎస్ఈకి సమాచారమిచ్చింది. 'ప్రత్యామ్నాయానికి సంబంధించి భాగస్వామ్య సంస్థలు నెల రోజులుగా వివిధ మార్గాలు అన్వేషించాయి. వీటిపై తుది నిర్ణయం తీసుకొని అనుమతి పొందే విషయంలో ఆలస్యమవడంతో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింద'ని పేర్కొంది. అయితే ప్రతిపాదిత విలీన ప్రక్రియ పూర్తవుతుందని గత నెలలో మ్యాక్స్ ఇండియా ఆశాభావం వ్యక్తం చేసిన సంగతి విదితమే. విలీన ప్రతిపాదనను జీవిత బీమా ప్రాధికార సంస్థ (ఐఆర్‌డీఏఐ) తిరస్కరించినప్పటికీ, ప్రత్యామ్నాయ మార్గాల అన్వేషణకు ఇరు సంస్థలు కట్టుబడి ఉన్నాయని కూడా ఆ సమయంలో పేర్కొంది. అయితే హెచ్‌డీఎఫ్‌సీ స్టాండర్డ్ లైఫ్ ఇన్సూరెన్స్ పబ్లిక్ ఇష్యూకు ముందు వాటాదార్లకు సంతృప్తి కలిగించే మార్గాన్ని గుర్తించలేకపోయామని తాజాగా మ్యాక్స్ ఇండియా వెల్లడించింది. పబ్లిక్ ఇష్యూకు వెళ్లాలని జులై ప్రారంభంలో హెచ్‌డీఎఫ్‌సీ స్టాండర్డ్ లైఫ్ ఇన్సూరెన్స్ నిర్ణయించిన సంగతి తెలిసిందే.

ఏంటి ప్రతిపాదన..: మ్యాక్స్ ఇండియా ముందుగా నిర్ణయించిన ప్రతిపాదన ప్రకారం., తొలుత మ్యాక్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్‌లో మ్యాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్‌ను విలీనం చేయాలి. ఈ రెండింటి సంయుక్త సంస్థ నుంచి బీమా వ్యాపారాన్ని విడదీసి దానిని హెచ్‌డీఎఫ్‌సీ స్టాండర్డ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీకి బదలాయించాలి. అయితే బీమా కార్యకలాపాలు (నాన్ ఇన్సూరెన్స్) నిర్వహించని సంస్థను, బీమా సంస్థలో కలిపేందుకు ఐఆర్‌డీఏఐ అనుమతించకపోవడంతో విలీన ప్రతిపాదనకు అవరోధం ఏర్పడింది. దీంతో ప్రత్యామ్నాయ మార్గాలను కూడా అన్వేషించింది. ఆ ప్రయత్నం కూడా ఫలించకపోవడంతో విలీన ప్రతిపాదనను రద్దు చేసుకునేందుకు మ్యాక్స్ ఇండియా నిర్ణయించింది.

సహారా లైఫ్‌పై యథాతథ స్థితి

ఐఆర్‌డీఏఐకు శాట్ ఆదేశం

ముంబయి: సహారా ఇండియా లైఫ్ ఇన్సూరెన్స్ (ఎస్ఐఎల్ఐసీ) వ్యాపారాన్ని నిర్వహించాల్సిందిగా ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్‌కు బీమా నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏఐ ఇచ్చిన ఆదేశాలను నిలిపివేసి, వారం రోజుల పాటు యథాతథ స్థితినే కొనసాగించాల్సిందిగా సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రైబ్యునల్ (శాట్) ఆదేశించింది. ఆగస్టు 7న తదుపరి విచారణ అనంతరం.. దీనిపై శాట్ తుది నిర్ణయం తీసుకోనుంది. జులై 31 నుంచి సహారా ఇండియా లైఫ్ ఇన్సూరెన్స్ (ఎస్ఐఎల్ఐసీ) వ్యాపారాన్ని నిర్వహించాల్సిందిగా ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్‌ను ఐఆర్‌డీఏఐ శుక్రవారం ఆదేశించిన విషయం తెలిసిందే. ఐఆర్‌డీఏఐ ఆదేశాలపై సహారా లైఫ్ ఇన్సూరెన్స్ శాట్‌ను ఆశ్రయించింది. జస్టిస్ సీకేజీ నాయర్, జస్టిస్ జోగ్ సింగ్‌లతో కూడిన శాట్ బెంచ్ దీనిపై యథాతథ స్థితిని కొనసాగించమని ఆదేశించింది.

ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ ముంద్రా పదవీ విరమణ

ముంబయి: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) డిప్యూటీ గవర్నర్ ఎస్ఎస్ ముంద్రా సోమవారం పదవీ విరమణ చేశారు. ఈ నేపథ్యంలో ఇతర డిప్యూటీ గవర్నర్లకు ఆర్‌బీఐ అదనపు బాధ్యతలు అప్పగించింది. ఎంతో కీలకమైన బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు, సహకార బ్యాంకులపై అజమాయిషీ చేసే విభాగాన్ని డిప్యూటీ గవర్నర్ ఎన్ఎస్ విశ్వనాథన్‌కు అప్పగించింది. ఇంతకు ముందు ఈ విభాగాలను ముంద్రా చూసే వారు. వినియోగదారులకు అవగాహన కల్పించడం, భద్రతా విభాగం, సమాచార హక్కు, ఆర్థిక సాధికారత-అభివృద్ధి విభాగాలకు బీపీ కనుంగో నేతృత్వం వహించనున్నారు. రాజభాష, సెంట్రల్ సెక్యూరిటీ సెల్, మానవ వనరుల విభాగాలకు విరాల్ ఆచార్య సారథ్యం వహించనున్నట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. ఎస్ఎస్ ముంద్రా స్థానంలో కొత్త డిప్యూటీ గవర్నర్‌ను నియమించే ప్రక్రియను ఇప్పటికే ప్రారంభమైంది.

'బోయింగ్' విమానాల లీజు నిలిపివేసిన ఎయిరిండియా


దిల్లీ: 787-9 విమానాలను లీజుకు తీసుకునే ప్రణాళికలను ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయిరిండియా నిలిపివేసిందని బోయింగ్ సీనియర్ ఉపాధ్యక్షుడు (ఆసియా పసిఫిక్, భారత అమ్మకాలు) తెలిపారు. ఎయిరిండియాలో ప్రభుత్వం వాటా విక్రయించడానికి సిద్ధం కావడమే ఇందుకు కారణమని అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బోయింగ్ నుంచి మరో ఆరు విమానాలను ఎయిరిండియా అందుకునే అవకాశం ఉంది. ఈ ఏడాది ప్రారంభంలో ఏడు బోయింగ్ 787-9 విమానాలను తీసుకునేందుకు ఎయిరిండియా బోర్డు ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. జులై ప్రారంభంలో 24వ బోయింగ్ 787 విమానాన్ని ఎయిరిండియా అందుకోగా.. మరో ఆరు విమానాలను అందుకోవాల్సి ఉంది.

19 నెలల కనిష్ఠానికి..

- జూన్‌లో 0.4 శాతానికి మౌలిక రంగం
- తగ్గిన బొగ్గు, ఎరువుల ఉత్పత్తి

దిల్లీ: జూన్‌లో మౌలిక రంగం చతికిలపడింది. బొగ్గు, ఎరువులు, రిఫైనరీ ఉత్పత్తులు, సిమెంట్ ఉత్పత్తి తగ్గడంతో ఎనిమిది కీలక రంగాల వృద్ధి 0.4 శాతానికి పరిమితమై 19 నెలల కనిష్ఠానికి చేరింది. పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ)లో దాదాపు 41 శాతం వాటా కలిగిన ఎనిమిది కీలక (బొగ్గు, ముడిచమురు, సహజవాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, ఉక్కు, సిమెంటు, విద్యుత్తు) రంగాల వృద్ధి గతేడాది జూన్‌లో 7 శాతం కావడం గమనార్హం. 2015 నవంబరులో మౌలిక రంగ వృద్ధి 1.3 శాతానికి పరిమితమైంది. ఆ తరవాత ఇంత తక్కువగా నమోదు కావడం ఇప్పుడే.

ప్రభుత్వం విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం.. జూన్‌లో బొగ్గు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, సిమెంట్‌ల ఉత్పత్తి వరుసగా 6.7 శాతం, 0.2 శాతం, 3.6 శాతం, 5.8 శాతం చొప్పున క్షీణించాయి. గతేడాది జూన్‌లో 4.3 శాతం క్షీణించిన ముడిచమురు ఉత్పత్తి.. ఈ సారి 0.6 శాతం పెరిగింది. సహజ వాయువు ఉత్పత్తి 6.4 శాతం పెరిగింది. ఉక్కు రంగ వృద్ధి మాత్రం 5.8 శాతానికి తగ్గింది. గతేడాది ఇదే సమయంలో ఈ రంగం 8.8 శాతం వృద్ధి సాధించడం గమనార్హం. ఇక విద్యుదుత్పత్తి సైతం గతేడాది జూన్‌తో పోలిస్తే.. 9.8 శాతం నుంచి 0.7 శాతం పరిమితమైంది. ఈ ఏడాది మేలో మౌలిక రంగం 4.1 శాతం వృద్ధి సాధించిన విషయం తెలిసిందే.



వస్త్ర పరిశ్రమకు ఊరట!

- **దుస్తుల తయారీపైనా జీఎస్‌టీ 5 శాతమే**
- **5న జరిగే జీఎస్‌టీ మండలి సమావేశంలో నిర్ణయం**

దిల్లీ: వస్త్ర పరిశ్రమకు ఊరట కలిగించే నిర్ణయాన్ని జీఎస్‌టీ (వస్తు, సేవల పన్ను) మండలి తీసుకోనుందని సమాచారం. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ నేతృత్వంలోని జీఎస్‌టీ మండలి ఈ నెల 5న సమావేశం కానుంది. జీఎస్‌టీ అమల్లోకి వచ్చాక ఇదే మొట్టమొదటి పూర్తిస్థాయి సమావేశం. జులై 17న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిగరెట్లపై సెస్సును జీఎస్‌టీ మండలి పెంచిన సంగతి తెలిసిందే. ఈసారి జరగబోయే సమావేశంలో జీఎస్‌టీ అమలు ప్రక్రియపై జీఎస్‌టీ మండలి సమీక్ష నిర్వహించనుంది.

- ✦ పన్ను రేట్లపై వస్త్ర పరిశ్రమలో నెలకొన్న ఆందోళనను పరిగణనలోకి తీసుకొనే అవకాశం ఉందని చెబుతున్నాయి. ప్రస్తుతం దారాలు, వస్త్రాల (చేనేతవి కాకుండా) తయారీపై 5- 12 శాతం పన్ను రేటు ఉండగా.. దుస్తుల తయారీపై 18 శాతం జీఎస్‌టీ నిర్ణయించారు. దుస్తుల తయారీపైనా జీఎస్‌టీని 5 శాతానికి తగ్గిస్తూ జీఎస్‌టీ మండలి నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని ఆ వర్గాలు వెల్లడించాయి.
- ✦ సాధారణ చీరల మాదిరి ఎంబ్రాయిడరీ చీరలకూ 5% జీఎస్‌టీ వర్తిస్తుందని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ తెలిపింది.
- ✦ డ్రెస్ మెటీరియల్‌కు మాత్రం రూ.1,000 కంటే తక్కువ విలువ కలిగిన వాటిపై 5 శాతం, రూ.1,000 కంటే అధిక ధర ఉన్నవాటికి 12 శాతం జీఎస్‌టీ అమలవుతుందని వివరించింది.

సంవిధానానికి 5 లక్షల మంది దరఖాస్తు

జీఎస్‌టీలోని సంవిధాన (కాంపోజిషన్) పథకాన్ని ఇప్పటివరకు 5.12 లక్షల మంది వ్యాపారులు ఎంపిక చేసుకున్నారని రెవెన్యూ కార్యదర్శి హస్ముఖ్ అధియా ట్వీట్ ద్వారా వెల్లడించారు. ఈ పథకంలోకి ప్రవేశించేందుకు 16 వరకు గడువు ఉందని తెలిపారు.

ఈనాడు సినిమా

లవ్లీ ఏంజెల్.. లక్కీ ఆపిల్



పసి పాపల నవ్వులు ముత్యాల జల్లులు... కేరింతలన్నీ రంగుల హరివిల్లులు. ముద్దు మాటలు వెన్న ముద్దలు! ఆ అనుభూతులు వెలకట్టలేం. ఆ అల్లరిని వర్ణించలేం. చూస్తూ గడిపేయాలంతే. ప్రస్తుతం అల్లు అర్జున్ కూడా ఈ మధుర క్షణాల్ని ఆస్వాదిస్తున్నాడు. అల్లు అర్జున్ తన కుమార్తెకి 'అర్హ' అనే పేరు పెట్టిన సంగతి తెలిసిందే. అర్హతో తీయించు కొన్న ఫొటో ఒకటి ట్విట్టర్‌లో పోస్ట్ చేశాడు బన్నీ. 'మై లిటిల్ ఏంజెల్' అంటూ అర్హని తన అభిమానులకు పరిచయం చేశాడు.

'స్పైడర్' సందడి షురూ!



'స్పైడర్'లో మహేష్‌బాబు

మహేష్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'స్పైడర్'. మురుగదాస్ దర్శకుడు. రకుల్‌ప్రీత్ సింగ్ కథానాయిక. ఎన్.వి. ప్రసాద్ నిర్మాత. బుధవారం తొలి పాటని విడుదల చేస్తున్నారు. 9న మహేష్‌బాబు పుట్టిన రోజు సందర్భంగా 'స్పైడర్' టీజర్ చూపిస్తారు. దసరా కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేస్తామని ఇది వరకే నిర్మాత ప్రకటించారు. ప్రస్తుతం చిత్రబృందం యూరప్ వెళ్లింది. అక్కడ మహేష్, రకుల్‌లపై ఓ గీతాన్ని తెరకెక్కిస్తున్నారు. "ఇప్పటికే ఈ చిత్రంపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. వాటిని అందుకొనే కథ, కథనాలతో 'స్పైడర్' సిద్ధం అవుతోంది. ప్రముఖ దర్శకుడు సూర్య ఈ చిత్రంలో ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. హారీస్ జైరాజ్ సంగీతం, పాటలు ఆకట్టుకొంటాయ"ని చిత్రబృందం తెలిపింది. ఛాయాగ్రహణం: సంతోష్ శివన్, కూర్పు: శ్రీకర్ ప్రసాద్, సమర్పణ: ఠాగూర్ మధు

కండలు పిండే కష్టజీవులకు
తిండికి కరవుంటుందా
నిజాయితీకై నిలిచేవారికి
పరాజయం ఉంటుందా
మంచితనమ్మును మించిన పెన్నిధి
మనిషికి వేరే ఉందా

గీతం: ఎవరికీ తలవంచకు...
చిత్రం: నిండు సంసారం
రచన: సి. నారాయణరెడ్డి
- పంపినవారు: యం. శోభాదేవి, హైదరాబాద్

గీతోపదేశం

మీకు నచ్చిన సినిమా పంచ్ డైలాగ్‌లు, పాటల్లోని సందేశాలను మాకు రాసి పంపించండి. వాటిని మీ పేరుతో ప్రచురిస్తాం!

చిరునామా: సినిమా డెస్క్, ఈనాడు కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రంగారెడ్డి జిల్లా- 501512

మెయిల్ ఐడీ: cinema@eenadu.net



మిర్యాల రవీందర్ రెడ్డి, శరత్‌కుమార్, వి.వి.వినాయక్, సాయి శ్రీనివాస్, రకుల్ ప్రీత్ సింగ్, బోయపాటి శ్రీను, దేవిశ్రీప్రసాద్, జగపతిబాబు

'జయ జానకి నాయక' గీతావిష్కరణ

"మన సమాజంలో మహిళలకి ఎదురయ్యే ఒక ప్రధాన సమస్యని స్పృశిస్తూ సినిమాని తెరకెక్కించామ"న్నారు బోయపాటి శ్రీను. ఆయన దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'జయ జానకి నాయక'. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కథానాయకుడు. రకుల్‌ప్రీత్ సింగ్, ప్రగ్యాజైస్వాల్ కథానాయికలు. మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మాత. దేవిశ్రీప్రసాద్ స్వరకర్త. సోమవారం రాత్రి హైదరాబాద్‌లో పాటల విడుదల కార్యక్రమం జరిగింది. తొలి సీడీని వి.వి.వినాయక్ ఆవిష్కరించారు. ట్రైలర్‌ని హర్షిత్, ద్వారక విడుదల చేశారు. అనంతరం బోయపాటి శ్రీను మాట్లాడుతూ "సినిమాకి 'జయ జానకి నాయక' పేరు పెట్టడం గురించి చాలా మంది అడిగారు. కొత్తదనంలో భాగంగానే ఆ పేరు పెట్టాం. ప్రేమించిన అమ్మాయి వేరొకరిని పెళ్లి చేసుకొంటే... కుర్రాళ్లు వ్యసనాలకి బానిస కావడమో లేదంటే అమ్మాయిని ఇబ్బంది పెట్టడం వంటి సంఘటనల్ని సమాజంలో చూస్తూనే ఉన్నాం. కానీ నా తండ్రిని, నా అన్నని ఎలా జీవితాంతం ప్రేమిస్తానో, మనసిచ్చిన అమ్మాయిని కూడా అలా ప్రేమిస్తూనే ఉంటానని చెప్పే యువకుడిగా సాయిశ్రీనివాస్ కనిపిస్తాడు. అతణ్ని తెరపై చూశాక ఇలాంటి కుర్రాడు మా ఇంట్లో ఉండాలనుకొంటారు. దేవిశ్రీప్రసాద్ మంచి సంగీతం అందించాడు. ఇందులో హంసలదీవిలో చేసిన ఓ పోరాట ఘట్టం చాలా బాగుంటుంది. మరో ఐదేళ్ల వరకు అలాంటి సన్నివేశాల్ని తెరపై చూడలేరు. ఆ ఎపిసోడ్ చేయాలంటే 690 మంది యూనిట్ సభ్యులు నీళ్లలో నిలబడే ఉండాలి. అయినా సరే నాపై నమ్మకంతో వాళ్లు పనిచేశారు. ఇందులో రకుల్ పాత్ర చాలా బాగుంటుంది. కొన్నిచోట్ల ఆమెని చూసి కన్నీళ్లు పెట్టుకొంటారు. వాణి విశ్వనాథ్, శరత్‌కుమార్, జగపతిబాబు పాత్రలు గుర్తుండిపోతాయి. మిర్యాల రవీందర్‌రెడ్డి మంచి నిర్మాత. నాకు కొన్ని ఒప్పందాలు ఉన్నాయి, అవి పూర్తయ్యాక ఆయనతో మరొక మంచి సినిమా చేస్తా. ఇలాంటి నిర్మాతలు పరిశ్రమకి చాలా అవసరం" అన్నారు. వి.వి.వినాయక్ మాట్లాడుతూ "సాయి శ్రీనివాస్ సినిమా అంటే తన తండ్రి బెల్లంకొండ సురేష్ ఎంత ఆత్రుతగా ఉంటారో, నేనూ అంతే ఆత్రుతగా చూస్తుంటా. సాయి ఈ సినిమాలో 'నువ్వు ఏడిస్తే నేను వీడిని చంపేస్తా...' అనే సంభాషణని చాలా పరిణతితో చెప్పాడు. బోయపాటి శ్రీనుకి అణువణువూ సినిమానే. తపనతో పనిచేస్తాడాయన. దేవిశ్రీప్రసాద్ సమకూర్చిన ఏడు పాటలూ చాలా బాగున్నాయి" అన్నారు. దేవిశ్రీప్రసాద్ మాట్లాడుతూ "బోయపాటితో ఇది నాలుగో సినిమా. ప్రతిసారీ మంచి అనుభవం. ఇందులో ఎమోషన్, యాక్షన్ బాగుంటాయి. రిషి పంజాబీ పనితనం చాలా బాగుంది. అల్లుడు శీనుకీ, ఈ సినిమాకీ సాయి శ్రీనివాస్‌లో చాలా వైవిధ్యం కనిపించింది. చంద్రబోస్, రామజోగయ్యశాస్త్రి, శ్రీమణి మంచి సాహిత్యం అందించార"న్నారు. బెల్లంకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ "నాకు సొంత అన్నయ్య ఉంటే బోయపాటిగారిలా ఉంటారేమో. నా రెండో సినిమా అంతగా ఆడకపోయినా నాకు అండగా నిలిచి నాతో ఈ సినిమా చేశారు. ఆ విషయంలో ఆయనకి ఎప్పటికీ రుణపడి ఉంటాను. దేవిశ్రీప్రసాద్ అంటే నాకు ఇష్టం. ఇందులోని ప్రతి పాటా బాగుంది. రకుల్ బాగా నటించింది. తన పాత్ర తప్పనిసరిగా కొన్ని రోజులు గుర్తుపెట్టుకొనేలా ఉంటుంది. ప్రగ్యా, కేథరిన్ అలరిస్తారు. ఈ సినిమా మాకు కీలకం. మా నాన్నగారు నా కలని ఆయనదిగా భావించి నన్ను ముందుకు నడిపిస్తున్నార"న్నారు. రకుల్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ "నేను చేసిన అన్ని పాత్రల్లోకెల్లా భిన్నంగా ఉంటుంది ఇందులోని పాత్ర. ఒక దర్శకుడితో మళ్లీ మళ్లీ పనిచేయడం సంతోషాన్నిచ్చే విషయం" అన్నారు. మిర్యాల రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ "ప్రేక్షకుల అంచనాలకి తగ్గకుండా సినిమా ఉంటుంది" అన్నారు. చంద్రబోస్ మాట్లాడుతూ ''నువ్వేలే నువ్వేలే... అనే పాటని ఇందులో రాశా. ఆర్తి, ఆర్ద్రతతో కూడిన అర్థవంతమైన సందర్భానికి పాట రాసే అవకాశం లభించింది. ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొన్నానని నమ్ముతున్నా" అన్నారు. వాణి విశ్వనాథ్ మాట్లాడుతూ "ఈ సినిమాతో తెలుగులో పునః ప్రవేశించడం నా అదృష్టం" అన్నారు. శరత్‌కుమార్ మాట్లాడుతూ "ఎన్నో రికార్డులు సృష్టించిన దర్శకుడు బోయపాటిశ్రీను. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, రకుల్, జగపతిబాబు తదితరులతో కలిసి నటించడం మంచి అనుభవం" అన్నారు. జగపతిబాబు మాట్లాడుతూ "మా హెడ్మాస్టర్ బోయపాటి శ్రీను. రోజూ ఏం ఛాలెంజ్ ఇవ్వబోతున్నాడో అనుకొంటూ పనిచేసేవాళ్లం. డబ్బింగ్‌లోనూ ప్రతి సంభాషణనీ నాతో ప్రత్యేకంగా చెప్పించాడు. దేవిశ్రీప్రసాద్ సంగీతం తన మనసులాగే స్వచ్ఛంగా ఉంటుంది. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ రూపంలో మరో స్టార్ పుట్టినట్టే. ఇందులో ఒక చోట సంభాషణని చెప్పలేకపోయా. మూడు రోజులు ప్రయత్నించా కానీ రాలేదు. దాన్ని సక్సెస్‌మీట్‌లో చెబుతా" అన్నారు. శ్రీమణి మాట్లాడుతూ "ఇందులో ఐదు పాటలు రాశా. ప్రతి సందర్భాన్ని ప్రేక్షకులు ఆస్వాదిస్తారు. నేనూ ఆస్వాదిస్తూ పాటల్ని రాశా" అన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంకొండ పద్మావతి, మిరియాల నవ్య, కోనేరు కిరణ్, ప్రేమ్‌రక్షిత్, నల్లమలుపు బుజ్జి, తిరుమల్ రెడ్డి, తరుణ్ అరోరా, టి.జి.విశ్వప్రసాద్, రిషి పంజాబీ, ఎ.ఎమ్.రెడ్డి, జెమినీ కిరణ్, పాలడుగు సుధ, బ్రహ్మయ్య, సాహి సురేష్, రామ్‌లక్ష్మణ్, శ్రావణ్, శశాంక్, భరణి, రత్నం తదితరులు పాల్గొన్నారు.

ఆ కిటుకు పట్టేస్తే సరి...



తమన్నా

కథానాయికల చూపు నటనకి ప్రాధాన్యమున్న పాత్రలపైనే ఉంటుంది. మంచి నటి అనిపించుకొనే ఆస్కారం అలాంటి పాత్రలతోనే లభిస్తుందనేది వాళ్ల నమ్మకం. అయితే తమన్నా మాత్రం నటిగా నిరూపించుకోవడానికి చాలా దారులే ఉన్నాయని చెబుతోంది. పుష్కర కాలంగా చిత్ర పరిశ్రమలో కొనసాగుతున్న ఆమె ప్రస్తుతం తెలుగు, తమిళం, హిందీ భాషల్లో నటిస్తూ బిజీగా గడుపుతోంది. ''నటనకి ప్రాధాన్యమున్న పాత్రలతో కథానాయికలకి లభించే గుర్తింపే వేరు. అందులో మరో మాటకి తావు లేదు. అయితే ప్రతిసారీ కథానాయికకి అలాంటి పాత్రలు దొరకడం కష్టం. భారతీయ సినిమాల్లో కథానాయక పాత్రలే కీలకం కాబట్టి, నాయికకి తెరపై లభించే ప్రాధాన్యం తక్కువే. అలాగని నిరుత్సాహపడాల్సిన అవసరం లేదనేది నా అభిప్రాయం. ఆ కాసింత పరిధిలోనే ప్రేక్షకుల్ని రక్తి కట్టించొచ్చు. నా విషయానికే వస్తే నటనకి ప్రాధాన్యమున్న పాత్రలతో ఎంత పేరు తెచ్చుకొన్నానో, పక్తు వాణిజ్య చిత్రాల్లోని పాత్రలతోనూ అదే స్థాయిలో ప్రేక్షకుల్ని ఆకట్టుకొన్నా. బలమైన పాత్ర దొరికినప్పుడు ఎవరైనా కష్టపడతారు. కానీ వాణిజ్య చిత్రాల్లోని పాత్రలతో ప్రేక్షకులపై ముద్ర వేయడమే ఓ సవాల్. ఆ కిటుకు పట్టేశామంటే ఎలాంటి పాత్రతోనైనా ప్రేక్షకుల్ని ప్రభావితం చేయొచ్చు" అని చెప్పింది తమన్నా.

జీవితం మనల్ని చాలా చోట్లకు తీసుకెళ్తుంది... కానీ ప్రేమ జీవితం ఉన్న చోటుకే తీసుకెళ్తుంది!
చిత్రం: మిస్టర్
- పంపినవారు: గోరింట శ్రీను, విజయనగరం

పంచ్ డైలాగ్


రామ్


లావణ్య త్రిపాఠి

రామ్ సరసన లావణ్య

రామ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఉన్నది ఒకటే జిందగీ'. కిషోర్ తిరుమల దర్శకత్వం వహిస్తున్నారు. స్రవంతి రవికిషోర్ నిర్మాత. ఇందులో రామ్ సరసన ఇద్దరు కథానాయికలకి చోటుండడంతో అనుపమ పరమేశ్వరన్, మేఘ ఆకాష్‌లని ఎంపిక చేసుకొన్నారు. అయితే కొన్ని కారణాలవల్ల మేఘ ఆకాష్ సినిమా నుంచి తప్పుకొంది. ఆమె స్థానాన్ని లావణ్య త్రిపాఠి భర్తీ చేయనుంది. రామ్ - లావణ్య కలిసి నటిస్తుండడం ఇదే తొలిసారి. త్వరలోనే ఊటీలో చిత్రీకరణ జరగనుంది. అక్కడే రామ్-లావణ్యలపై కీలక సన్నివేశాల్ని తెరకెక్కించబోతున్నారు.

కొత్త కబుర్లు


నాగశౌర్య


షామిలి

'ఓయ్'... వస్తోంది

బాల నటిగా తెలుగువారి మనసుల్ని గెలుచుకొన్న బేబి షామిలి గుర్తుంది కదా? 'ఓయ్'తో కథానాయికగానూ మారింది. అయితే ఆ సినిమా అనుకొన్నంత ఫలితం తీసుకురాలేదు. దాంతో తెలుగులో మరే ప్రయత్నమూ చేయలేదు షామిలి. ఇప్పుడు సుదీర్ఘ విరామం తరవాత మళ్లీ తెలుగు ప్రేక్షకుల్ని పలకరించబోతోంది. నాగశౌర్య కథానాయకుడిగా ఓ చిత్రం రూపుదిద్దుకొంటోంది. పవన్ సుందర్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. కథానాయికగా షామిలిని ఎంచుకొన్నారని సమాచారం. సోమవారం నుంచి షామిని చిత్రీకరణలోనూ పాలుపంచుకొంటోందని తెలుస్తోంది. ఈ వినోదాత్మక ప్రేమకథని వచ్చే యేడాది విడుదల చేస్తారట. త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తారు.

సుకుమార్‌లా నటించాను

"దర్శకుడిని అవ్వాలనుకున్నాను. కానీ 'దర్శకుడు' చిత్రంతో నన్ను కథానాయకుడిగా మార్చారు హరిప్రసాద్ జక్కా. ఈ సినిమా ఫలితాన్ని బట్టే నా తదుపరి ప్రయాణం ఆధారపడి ఉంటుంద"ంటున్నారు అశోక్. 'దర్శకుడు' సినిమాతో కథానాయకుడిగా పరిచయం అవుతున్నారీయన. ఈ నెల 4న విడుదల అవుతుంది. ఈ సందర్భంగా అశోక్ సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడారు.



"సినిమా నేపథ్యంలో నడిచే ప్రేమకథ ఇది. సినిమా పిచ్చి ఉన్న దర్శకుడు ప్రేమలో పడితే ఎలా ఉంటుందన్న అందమైన ఊహకు దృశ్యరూపం 'దర్శకుడు'. నాయకా నాయికల లవ్ స్టోరీ కొత్తగా ఉంటుంది. ఇందులో ఓ లిప్ లాక్ సన్నివేశం కూడా ఉంది. అది కథానుసారం వచ్చేదే"

"సుకుమార్ మా బాబాయ్. దర్శకుడు హరిప్రసాద్ జక్కాకీ బాబాయ్‌కి ఎప్పటి నుంచో స్నేహం ఉంది. హరిప్రసాద్ ఓ కథ సిద్ధం చేస్తే బాబాయ్ ఆయన్నే దర్శకత్వం చేయమన్నారు. తర్వాత హరిప్రసాద్ 'ఈ సినిమాలో హీరోగా చేస్తావా' అని అడిగారు. నేను షాక్ తిన్నా. నాకు నటనలో ఓనమాలు కూడా రావు. అయినా తెర ముందుకు రావాల్సివచ్చింది"

"నువ్వు చూసిన సుకుమార్‌ని గుర్తుపెట్టుకొని నటించు చాలని దర్శకుడు సలహా ఇచ్చారు. సెట్లో కోపంగా కుర్చీ తన్నేసి వెళ్లిపోయే సన్నివేశం ఒకటి ఉంది. ఆ సన్నివేశాన్ని సుకుమార్ బాబాయ్‌ని గుర్తు చేసుకొని నటించాను. సినిమా చూశాక బాబాయ్ చాలా సంతోషించారు. 'బాగా నటించావు. నీ గొంతు బాగుంది' అని మెచ్చుకున్నారు"


"నటుడిగా కొనసాగాలని వుంది. ఈ సినిమాతో నటన, నృత్యాలు, పోరాటాలు అన్నీ చేయగలననే నమ్మకం ఏర్పడింది. ప్రస్తుతానికి కొన్ని కథలైతే వింటున్నాను. కథానాయకుడుగా కొనసాగినా, ఎప్పటికైనా దర్శకుడిని అవుతాను. ఏ తరహా పాత్ర వచ్చినా నటిస్తా"


అంజలి

'తారామణి' ఎవరు?

అంజలి, ఆండ్రియా, వసంత్ రవి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'తారామణి'. రామ్ దర్శకుడు. డి.వి.వెంకటేష్ తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. నిర్మాత వెంకటేష్ మాట్లాడుతూ "ముక్కోణపు ప్రేమకథ ఇది. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల నేపథ్యంలో సాగుతుంది. ఇందులో తారామణి ఎవరన్నది తెరపై చూడాలి. ప్రస్తుతం యువతపై సాంకేతికత ప్రభావం ఏ స్థాయిలో ఉంది? దాని వల్ల సమాజంలో ఎలాంటి పరిస్థితులు తలెత్తుతున్నాయనే విషయాల్ని ఆకట్టుకొనేలా చూపించారు దర్శకుడు. ఈ నెలలోనే చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాం" అన్నారు.

హాలీవుడ్ దర్శకుడి బాలీవుడ్ చిత్రం


చక్ రస్సెల్, విద్యుత్ జమ్వాల్

బాలీవుడ్ నటులు హాలీవుడ్ చిత్రాల్లో పనిచేయడం కొత్తేమీ కాదు. ఇప్పుడు ఇక్కడ ఓ బాలీవుడ్ చిత్రాన్ని ఓ హాలీవుడ్ దర్శకుడు రూపొందిస్తున్నాడు. బాలీవుడ్ నటుడు విద్యుత్ జమ్వాల్ ప్రధాన పాత్రలో 'జంగ్లీ' తెరకెక్కుతోంది. జిమ్ క్యారీ కథానాయకుడిగా వచ్చిన సూపర్ హీరో చిత్రం 'ది మాస్క్' దర్శకుడు చక్ రస్సెల్ ఈ చిత్రాన్ని తెరకెక్కించడం విశేషం. ఓ మనిషి... ఏనుగు మధ్య జరిగే కథ ఇది. "ప్రపంచంలోని అందరికీ సంబంధించిన కథ ఇది. ఈ కథతో చక్‌ని సంప్రదించగానే దర్శకత్వం చేయడానికి అంగీకరించారు. అక్టోబరులో ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లనుంద"ని చెప్పారు జంగ్లీ పిక్చర్స్ ప్రెసిడెంట్ ప్రీతి సహాని. విద్యుత్ మాట్లాడుతూ "ప్రపంచానికి ఓ గొప్ప సందేశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో నటించే అవకాశం రావడం నా అదృష్టంగా భావిస్తున్నాను"అని చెప్పాడు.

పార్టీ అధ్యక్షుడిగానే ఉంటా

- ఈ పదవిలో ఎంతో ఆనందంగా ఉన్నాను
- 2019లో మరింత బలంతో అధికారంలోకి వస్తాం
- బిహార్‌లో మేం ఎవరినీ చీల్చలేదు: అమిత్ షా



లఖ్‌నవూ: పార్టీ సారథిగా తానెంతో ఆనందంగా, హృదయ పూర్వకంగా పని చేస్తున్నాననీ, దానిని వదిలిపెట్టి వేరే పదవుల్లోకి వెళ్లే ప్రసక్తే లేదనీ భాజపా జాతీయాధ్యక్షుడు అమిత్‌షా స్పష్టం చేశారు. తనకు అలాంటి ఆసక్తే లేదన్నారు. రాజ్యసభకు ఎన్నికయినట్లయితే పార్టీ పదవికి ఆయన రాజీనామా చేసి, కేంద్ర మంత్రి పదవిని చేపట్టవచ్చనే ఊహాగానాలను తోసిపుచ్చారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో 3 రోజుల పర్యటనను పూర్తి చేసుకున్న అమిత్‌షా ఆసందర్భంగా సోమవారం లఖ్‌నవూలో విలేకరులతో మాట్లాడారు. 'పార్టీ అధ్యక్షునిగా ఉండాల్సిన బాధ్యత నాపై ఉంది. దానిని నేను వదిలిపెట్టేది లేదు. మీరు(విలేకరులు) అనవసరంగా ఒత్తిడి చేయకండి' అని ఆయన చెప్పారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లోనూ పార్టీ మరింత బలంతో అధికారంలోకి వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అభివృద్ధి, సుపరిపాలనలతో అటు కేంద్రంలో మోదీ సర్కారు, ఇటు 13 రాష్ట్రాల్లో భాజపా ప్రభుత్వాలు అందిస్తున్న సేవలు తమబలాన్ని మరింత పెంచుతాయని చెప్పారు. మోదీ అత్యంత ప్రజాదరణ ఉన్న వివాదరహిత ప్రధాని అని అమిత్‌షా కొనియాడారు. కుటుంబ, కుల, బుజ్జగింపు రాజకీయాలను అంతం చేయడంలో మోదీ సర్కారు విజయం సాధించిందని తెలిపారు. మన్మోహన్‌సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలో ప్రభుత్వం విధాన నిష్క్రియాపరత్వంతో కొట్టుమిట్టాడేదని విమర్శించారు. ప్రతీ మంత్రీ తానే ప్రధానమంత్రిని అన్నట్లుగా ఊహించుకునేవారనీ, మన్మోహన్‌ను ఎవరూ ప్రధానిగా భావించేవారు కాదనీ చెప్పారు.

మాది నిష్కళంక ప్రభుత్వం: యూపీఏ పాలనలో రూ.12 లక్షల కోట్ల కుంభకోణాలు చోటు చేసుకున్నాయనీ, మోదీ సర్కారు పాలనలో ఇంతవరకు ఒక్క అవినీతి ఆరోపణైనా రాలేదనీ అమిత్‌షా చెప్పారు. కనీసం విపక్షమైనా ఒక్క అభియోగాన్నీ తమపై మోపలేకపోయిందన్నారు. గతేడాది నియంత్రణరేఖ వద్ద జరిగిన మెరుపు దాడుల్ని ప్రస్తావిస్తూ- దేశ భద్రత కోసం ఎలాంటి నిర్ణయమైనా తీసుకోగలమన్న దృఢ చిత్తాన్ని ప్రపంచానికి చాటగలిగామని చెప్పారు. బిహార్‌లో ఏపార్టీనీ తాము చీల్చలేదని చెప్పారు. 'అవినీతిపరులతో కొనసాగలేక సీఎం పదవినుంచి వైదొలగాలని నీతీశ్‌కుమార్ నిర్ణయించుకున్నారు. అలా కాకుండా అవినీతిపరులతో పొత్తును అలాగే కొనసాగించాలని మేం ఒత్తిడి తీసుకురావాలా?' అని ఆయన ప్రశ్నించారు.

కప్పదాట్లను ప్రోత్సహించడం లేదు: గుజరాత్ కాంగ్రెస్ శాసనసభ్యుల్ని బెంగళూరు శిబిరానికి తరలించడంపై షా స్పందిస్తూ- వారిని గదుల్లో పెట్టి తాళాలు ఎందుకు వేశారో విలేకరులే అర్థం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యేలను ఐక్యంగా ఉంచడంలో విఫలమై, ఆ నిందను భాజపాపై నెట్టేయడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. యూపీలో సమాజ్‌వాదీ తిరుగుబాటు నేత శివపాల్‌సింగ్ భాజపాలో చేరుతారనే ప్రతిపాదనేదీ లేదని స్పష్టం చేశారు. కప్పదాట్లను తామేమీ ప్రోత్సహించడం లేదన్నారు. ఇతర పార్టీల నుంచి భాజపాలో చేరినవారు ఎన్నికల్లో పోటీ చేసి, ప్రజాతీర్పు కోరి నెగ్గుతున్నారే గానీ తాము ప్రభుత్వ యంత్రాంగాన్ని ఎంతమాత్రం దుర్వినియోగం చేయడం లేదని చెప్పారు. పార్టీ ఉత్తరాదిలో ఉన్నంత బలంగా దక్షిణాదిలో లేకపోవడం గురించి ప్రశ్నించగా, గతంలో ఉత్తరాది విషయంలోనూ ఇలాంటి మాటలే వినిపించేవని చెప్పారు. పార్టీ కార్యకర్తలు ఎంతటి ముఖ్యులో చెప్పడానికే ఓ కార్యకర్త ఇంట్లో తాను భోజనం చేశాననీ, దానిలో కుల రాజకీయాలేవీ లేవని చెప్పారు. పనామా పత్రాల కేసులో భాజపా నేతలెవరూ లేరని తెలిపారు.

గడువులు నిర్దేశించాం... అవరోధాలు అధిగమిస్తున్నాం!

'నమామి గంగే'పై మంత్రి ఉమాభారతి

దిల్లీ: 'నమామి గంగే' కార్యక్రమానికి కేంద్రప్రభుత్వం రూ.20వేల కోట్లను కేటాయించింది. 'నమామి గంగే' కింద నిర్దేశించిన పథకాల పూర్తి కి నిర్దిష్ట గడువులను కూడా నిర్ణయించినట్లు కేంద్ర మంత్రి ఉమాభారతి సోమవారం తెలిపారు. ఈ గడువుల విషయంలో తలెత్తిన అవరోధాలను కూడా అధిగమించగలుగుతున్నట్లు మంత్రి ఉమాభారతి రాజ్యసభలో కె.టి. తులసి ప్రశ్నకు సమాధానంగా వివరించారు. అసలు గంగా నది ఎప్పటికైనా పరిశుభ్రపడుతుందా అంటూ తులసి రాజ్యసభలో ప్రశ్నించారు. ఇందుకు జలవనరుల మంత్రి అయిన ఉమాభారతి స్పందిస్తూ...నమామి గంగే కార్యక్రమం కింద కేంద్రప్రభుత్వం మొత్తం 163 పథకాలను మంజూరు చేసినట్లు వివరించారు. టెండర్లను పిలిచి...నిధులను సైతం విడుదల చేసిందన్నారు. ఇప్పటిదాకా 41 పథకాలు పూర్తయినట్లు చెప్పారు.

రాయితీలపై పారదర్శకత పాటించని చైనా

చైనా ప్రభుత్వం ఇస్తున్న రాయితీల కారణంగానే ఆ దేశం వస్తువులు చౌకగా దొరుకుతున్నాయని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలశాఖ సహాయ మంత్రి హరిభాయ్ పార్థీభాయ్ చౌదరి చెప్పారు. అయితే రాయితీల విధానంలో పారదర్శకత పాటించడం లేదని తెలిపారు. సోమవారం లోక్‌సభలో ఒక ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు.

ఆధార్‌తో విద్యా పథకాల అమలు సులభతరం: కుశ్వాహా

విద్యా వ్యవస్థలో పలు పథకాల అమలులో ఆధార్‌ను వినియోగిస్తున్నట్టు కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ఉపేంద్ర కుశ్వాహా లోక్‌సభలో చెప్పారు. విద్యార్థుల గుర్తింపు, పథకాల అమలులో సరళీకరణ ఉండడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. కేంద్రప్రాయోజిత పథకాలైన మదరసాల్లో నాణ్యమైన విద్య, మధ్యాహ్న భోజనం, సర్వశిక్ష అభియాన్, రాష్ట్రీయ మాధ్యమిక్ శిక్షా అభియాన్, దివ్యాంగులకు ద్వితీయ స్థాయిలో సమ్మిళిత విద్య, మాధ్యమిక విద్యలో బాలికలకు ప్రోత్సాహకాలు, ప్రతిభ, అవసరాల ఆధారిత ఉపకార వేతనాలకు దీనిని ఉపయోగిస్తున్నట్టు వివరించారు.

'చిన్ననీటి' వినియోగ లెక్కలు చెప్పడంలేదు

కృష్ణా నీటి వాడకంపై కేంద్ర జలవనరుల మంత్రి వ్యాఖ్య

ఈనాడు, దిల్లీ: కృష్ణా నీటిలో భారీ ప్రాజెక్టుల ద్వారా ఎంత వాడుకుంటున్నదీ చెబుతున్న రెండు తెలుగు రాష్ట్రాలు.. చిన్నతరహా నీటిపారుదల పథకాల ద్వారా జరుగుతున్న నీటి వినియోగ లెక్కలు పంపడంలేదని కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సంజీవ్‌కుమార్ బాల్యాన్ తెలిపారు. సోమవారం రాజ్యసభలో తెరాస ఎంపీ శ్రీనివాస్ అడిగిన లిఖిత పూర్వక ప్రశ్నకు ఆయన ఈ మేరకు సమాధానమిచ్చారు. వివిధ వనరుల ద్వారా వాడుకుంటున్న నీటి లెక్కల గురించి కృష్ణానదీ యాజమాన్య బోర్డు ఎప్పటికప్పుడు రెండు రాష్ట్రాలను అడుగుతున్నట్లు చెప్పారు. ఇరు రాష్ట్రాల మధ్య నీటి పంపిణీ వివాద పరిష్కార బాధ్యతలను విభజన చట్టంలోని సెక్షన్ 89 ప్రకారం కృష్ణా ట్రైబ్యునల్‌కు అప్పగించినట్లు తెలిపారు. ప్రస్తుతం అది విచారణలో ఉందన్నారు.

ఆ బొగ్గు గనులను ఏపీఎండీసీకి ఇవ్వడం కుదరదు

కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఉన్న బొగ్గు గనులను ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ(ఏపీఎండీసీ)కు బదలాయించడం కుదరదని కేంద్ర గనులశాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. సోమవారం రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యుడు ఎంఏ ఖాన్ అడిగిన ప్రశ్నకు ఈ మేరకు ఆయన సమాధానమిచ్చారు. ఈ రెండు జిల్లాల్లో ఉన్న బొగ్గు వనరులను సింగరేణి కాలరీస్ నుంచి ఏపీ గనుల అభివృద్ధి సంస్థకు అప్పగించాలని ఏపీ ప్రభుత్వం కోరినట్లు చెప్పారు.

గడువు తీరితే ప్రభుత్వ నివాసాలను ఖాళీ చేయాల్సిందే!

దిల్లీ: గడువుకు మించి ప్రభుత్వ నివాసాల్లో ఉంటున్న ఎంపీలు, అధికారులు తదితరులను సాఫీగాను.. వేగంగాను ఖాళీ చేయించేలా బిల్లును ప్రభుత్వం సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఈమేరకు ప్రభుత్వ స్థలాల (అనధికారికంగా ఉంటున్న వారిని ఖాళీ చేయించే) సవరణ బిల్లు, 2017ను కేంద్ర మంత్రి రావు ఇంద్రజిత్ సింగ్ ప్రవేశపెట్టారు. గడువు తీరిపోయినా చాలామంది అనధికారికంగా వివిధ మార్గాల్లో ప్రభుత్వ నివాసాల్లోనే ఉండేలా ప్రస్తుత నిబంధనలు వీలు కల్పిస్తున్నాయి. ఖాళీ చేయాలని ఉత్తర్వులు ఇవ్వడానికే (ప్రక్రియకు) నెల రోజులు పడుతోంది. తరువాత మరో 30 రోజులు వారికి సమయం ఇవ్వాల్సి వస్తోంది. ఈలోగా కొందరు న్యాయస్థానాలను ఆశ్రయించి నిలుపుదల ఉత్తర్వులు తెచ్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలో 3 రోజులకు మించి ఉన్నవారిని ఖాళీ చేయించేలా ఎస్టేట్ అధికారులకు అధికారాలు కల్పించేలా తాజా బిల్లులో ప్రతిపాదించారు.

గ్రాట్యుటీపై పన్ను మినహాయింపు పెంపుపై సంప్రదింపులు

ఈనాడు, దిల్లీ: గ్రాట్యుటీపై పన్ను మినహాయింపు పరిధిని రూ.20 లక్షల వరకు పెంచే అంశంపై ప్రస్తుతం మంత్రిత్వశాఖల మధ్య సంప్రదింపులు జరుగుతున్నట్లు కేంద్ర కార్మికశాఖ మంత్రి దత్తాత్రేయ తెలిపారు. లోక్‌సభలో తెరాస సభ్యుడు వినోద్‌కుమార్ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు.

అత్యధిక ముస్లింలు హిందూ సంతతే

- లోక్‌సభలో భాజపా ఎంపీ హుకుందేవ్ ఉద్ఘాటన
- ఆరు గంటల చర్చలో అధికార-విపక్షాల వాగ్వాదం

దిల్లీ: భారతదేశంలో అత్యధిక ముస్లింలు- హిందువుల సంతతేనని భాజపా ఎంపీ హుకుందేవ్ నారాయణ్ యాదవ్ చెప్పారు. భాజపా సిద్ధాంతకర్త దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఈ విషయాన్ని ఎప్పుడో చెప్పారని గుర్తు చేశారు. గోరక్ష పేరుతో దేశంలో చోటు చేసుకుంటున్న హత్యలపై సోమవారం లోక్‌సభలో సుదీర్ఘంగా ఆరు గంటల పాటు జరిగిన చర్చలో పాల్గొంటూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కేరళలో ఆరెస్సెస్ కార్యకర్తలూ హత్యలకు గురయ్యారనీ, శాంతిభద్రతల నిర్వహణ అనేది పూర్తిగా రాష్ట్రాలకు సంబంధించిన అంశమనీ పేర్కొన్నారు.

మానవ రక్షణ చట్టం అవసరం: సౌగతా రాయ్

గోరక్ష హత్యలపై అధికార-విపక్షాల నడుమ పెద్దఎత్తున వాగ్వాదాలు చోటు చేసుకున్నాయి. తప్పు కేంద్రానిదే అని ఆరోపించేందుకు విపక్షాలు ప్రయత్నించగా, ఇలాంటి నేరాలపై స్పందించాల్సింది రాష్ట్ర ప్రభుత్వాలేనని అధికార పక్షం స్పష్టీకరించింది. ప్రధాని చెప్పేదొకటి, చేసేదొకటి అని లోక్‌సభలో కాంగ్రెస్‌పక్ష నేత మల్లికార్జున్ ఖర్గే విమర్శించారు. ఖర్గే చేసిన కొన్ని ప్రస్తావనలపై భాజపా సభ్యులు అభ్యంతరం తెలిపారు. 'మానవ రక్షణ చట్టం' రూపొందించాల్సిన అవసరం ఉందని తృణమూల్ ఎంపీ సౌగతారాయ్ అభిప్రాయపడ్డారు. ఆయన వాడిన ఒక పదంపై అధికార-విపక్షాల మధ్య కొంతసేపు వాగ్వాదం తప్పలేదు. రాష్ట్రాల బాధ్యతల్లో కేంద్రం ఎలా వేలు పెట్టగలదని మంత్రి రాంవిలాస్ పాస్వాన్ ప్రశ్నించారు. మరో చట్టం చేసినా, దానిని రాష్ట్రాలే అమలు చేయాల్సి ఉంటుందన్నారు. 'భారత్ మాతా కీ జై' అంటే దేశంలో వాతావరణం దెబ్బతింటుందా, లేకపోతే దేశాన్ని ముక్కలు చేయాలనుకుంటున్నవారికి మద్దతు పలికినప్పుడా అని మంత్రి కిరణ్ రిజీజు చేసిన వ్యాఖ్యపై కాంగ్రెస్, వామపక్షాల సభ్యులతో పాటు హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కూడా సభ నుంచి వాకౌట్ చేశారు. గల్లా జయదేవ్ (తెదేపా), కొత్తపల్లి గీత (వైకాపా) సహా పలువురు సభ్యులు మాట్లాడారు.



రాజ్యసభలో ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్న ప్రతిపక్ష పార్టీల ఎంపీలకు సర్ది చెప్పే ప్రయత్నం చేస్తున్న కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ

రాజ్యసభలో సర్కారుకు ఇరకాటం

- బీసీల బిల్లుపై విపక్షాల సవరణలకు ఆమోదం
- గంటన్నర పాటు హైరానా

దిల్లీ: పూర్తిస్థాయి సంఖ్యాబలం లేని రాజ్యసభలో కేంద్ర సర్కారుకు సోమవారం ఇరకాట పరిస్థితి తలెత్తింది. వెనకబడిన తరగతులకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లుకు ప్రతిపక్షాలు ప్రతిపాదించిన నాలుగు సవరణల్ని సభ ఆమోదించడంతో ప్రభుత్వం ఇబ్బందిలో పడింది. 'జాతీయ వెనకబడిన కులాల కమిషన్' (ఎన్‌సీబీసీ)ను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ప్రతిపాదించిన 123వ రాజ్యాంగ సవరణ బిల్లులో మూడో నిబంధనను సభ ఆమోదించింది. ఈ నిబంధనకు సభ ఇదివరకే నాలుగు సవరణల్ని ప్రతిపాదించింది. కమిషన్లో సభ్యుల సంఖ్యను మూడు నుంచి అయిదుకు పెంచాలనీ, వారిలో ఒక మహిళ, ఒక మైనారిటీ వర్గ ప్రతినిధి ఉండేలా చూడాలని ఒక సవరణ చెబుతోంది. సవరణలపై ఓటింగుకు విపక్షం పట్టుపట్టింది. ఓటింగులో 74-52 ఓట్ల తేడాతో సవరణలు ఆమోదం పొందాయి. జేడీ(యు)కు ఉన్న 10 మంది సభ్యులతో కలిపితే ప్రభుత్వ బలం 89 కాగా బిల్లు విషయంలో ఇబ్బందికర వాతావరణం నెలకొనడంతో అధికార-విపక్షాల మధ్య వాగ్యుద్ధం చోటు చేసుకొంది. సవరణలకు ఆమోదం లభించిన దృష్ట్యా వెనక్కి మళ్లేది లేదని డిప్యూటీ ఛైర్మన్ పి.జె.కురియన్ స్పష్టం చేశారు. ప్రతిష్టంభనకు తెర దించడానికి సభను 10 నిమిషాలు వాయిదా వేశారు. తర్వాత బిల్లులో మూడో నిబంధనను తొలగించి మళ్లీ ఓటింగ్ నిర్వహించినప్పుడు 124-0 ఓట్ల తేడాతో నెగ్గింది. దాంతో 90 నిమిషాల హైరానాకు తెరపడింది. ప్రతిపాదించిన సవరణలతో బిల్లును మళ్లీ లోక్‌సభ ఆమోదం నిమిత్తం పంపిస్తారు.

రిజర్వేషన్లు కొనసాగుతాయి...: బిల్లుపై చర్చ సందర్భంగా కేంద్ర సామాజిక న్యాయం- సాధికారత శాఖ మంత్రి థావర్ చంద్ గెహ్లోత్ మాట్లాడుతూ రిజర్వేషన్లకు భాజపా అనుకూలమనీ, అవి కొనసాగుతాయనీ స్పష్టం చేశారు.

పనిపై వ్యామోహం పెంచుకోవాలి

- వీడ్కోలు సభలో అధికారులకు వెంకయ్య సూచన

ఈనాడు, దిల్లీ: 'ప్రతి ఒక్కరూ పనిపై వ్యామోహం పెంచుకోవాలి. మన నుంచి ఆశించిన దానికంటే ఎక్కువగా చేసి చూపించగలగాలి. అధికార యంత్రాంగం యథాలాప వైఖరిని వీడాలి. ప్రజల జీవితాలను మెరుగుపరిచి దేశాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడానికి ప్రతి ఒక్కరూ కొత్తగా ఆలోచించి సరికొత్త పంథాలో పనిచేయాలన్న ప్రధాని మాటలను ఆచరణలో చూపెట్టాలి' అని కేంద్ర మాజీ మంత్రి, ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థి ఎం.వెంకయ్యనాయుడు అధికారులకు సూచించారు. ఉప రాష్ట్రపతిగా పోటీ చేయడానికి మంత్రిగా వైదొలగిన ఆయనకు కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ, పట్టణ పేదరిక నిర్మూలన శాఖ అధికారులు సోమవారం వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అధికారులు ఎప్పుడూ నిరాశ, నిస్పృహలను దరిచేరనీయకూడదని చెప్పారు. అప్పగించిన బాధ్యతలను వినూత్నంగా నిర్వర్తించడం ద్వారా అలసటను దూరం చేసుకోవచ్చని చెప్పారు. చేసే పనిని ప్రతిక్షణం ఆస్వాదిస్తూపోతే నిరాశ, నిస్పృహలు మన దరికే చేరవన్నారు. సాధారణంగా వీడ్కోలు సమావేశాలు ప్రభుత్వ సొమ్ముతో ఏర్పాటు నిర్వహిస్తుంటారనీ, తన విషయంలో అలా కాకుండా అధికారులే సొంత డబ్బులతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిసి తాను చాలా ఉద్వేగానికి గురైనట్లు చెప్పారు. గత మూడేళ్లలో అధికారులంతా తనకెంతో సహాయ సహకారాలు అందించారని కితాబిచ్చారు.



వీడ్కోలు సమావేశంలో మాట్లాడుతున్న వెంకయ్యనాయుడు

విధానాల రూపకల్పనకే మంత్రులు పరిమితం కావాలి: మంత్రులు విధానాల రూపకల్పన వరకే పరిమితం కావాలనీ, మిగతా పనులన్నీ అధికారులే చేయాలన్నది తన అభిప్రాయమనీ వెంకయ్యనాయుడు చెప్పారు. తాను మంత్రిగా పనిచేసిన ఇన్నేళ్లలో ఎప్పుడూ అధికారుల విధుల్లో జోక్యం చేసుకోలేదని చెప్పారు. అన్నింటినీ తానే దగ్గరుండి చూసుకోవాలన్న దానిపై తనకు నమ్మకం లేదనీ, అమలు బాధ్యతలన్నీ అధికారులకు వదిలేస్తేనే మంచిదని పేర్కొన్నారు. గత మూడేళ్లలో అధికారుల సమన్వయంతో పట్టణాభివృద్ధి శాఖలో ఎన్నో వినూత్న కార్యక్రమాలు ప్రవేశపెట్టగలిగినట్లు చెప్పారు. ఇప్పటివరకూ ఉన్న సానుకూల దృక్పథాన్ని అధికారులు ఇకముందు కూడా కొనసాగించాలని పిలుపునిచ్చారు. పట్టణ జీవనాన్ని సుఖవంతం చేసి నగరాలు, పట్టణాలకు ఆర్థిక వృద్ధిలో మరింత భాగస్వామ్యం కల్పించడమే తమ లక్ష్యమన్నారు.

ఇంత త్వరగా ఆ సూత్రం వర్తిస్తుందని అనుకోలేదు: సరిగ్గా నెల క్రితం పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి రాజీవ్‌గాబాతో పాటు మరికొందరు అధికారులకు ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో తాను మాట్లాడుతూ- జీవితం ఎప్పుడూ కదులుతూనే ఉంటుందని, అది మనల్ని ఒక స్థానం నుంచి మరో స్థానానికి తీసుకెళ్తుందని చెప్పానని, ఇంత త్వరగా ఆ సూత్రం తనకూ వర్తిస్తుందని ఊహించలేదని వెంకయ్య పేర్కొన్నారు.

జన్యు మార్పిడి ఆవాలపై 45 రోజుల్లో నిర్ణయం

- సుప్రీం కోర్టుకు కేంద్రం వెల్లడి

దిల్లీ: జన్యు మార్పిడి ఆవాలను సాగుకు అనుమతించడంపై 45 రోజుల్లో విధాన నిర్ణయం తీసుకుంటామని సుప్రీం కోర్టుకు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ అంశంపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేఎస్ ఖేహర్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ పీఎస్ నరసింహ వాదనలు వినిపించారు. నెల లేదా 45 రోజుల్లో తమ నిర్ణయాన్ని తెలియజేస్తామని వెల్లడించారు. దీంతో ప్రభుత్వం సాగుకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంటే.. దీనికి వ్యతిరేకంగా దాఖలైన అభ్యర్థనపై విచారణ చేపడతామని ధర్మాసనం స్పష్టంచేసింది. ఆవాల పంట కాలం అక్టోబరులో మొదలుకానున్న నేపథ్యంలో కేంద్రం వీటికి అనుకూలంగా నిర్ణయం తీసుకున్నా.. కోర్టు పరిశీలన తర్వాతే అది అమలులోకి వస్తుందని స్పష్టంచేసింది. అనంతరం తదుపరి విచారణను సెప్టెంబరు రెండో వారానికి వాయిదా వేసింది.

తాజా పిటిషన్‌ను 'జీన్ కాంపైన్' స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసింది. సంస్థ తరఫున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపించారు. సంబంధిత పరీక్షలన్నీ పూర్తవ్వక ముందే ప్రభుత్వం ప్రయోగాత్మకంగా ఈ ఆవాలను సాగుచేస్తోందని ఆయన ఆరోపించారు. ఇప్పటివరకూ భద్రతా సూచనలనూ సిద్ధంచేయలేదని చెప్పారు. ఈ ఆవాల విత్తనాలపై పదేళ్ల పాటు నిలుపుదల ఆదేశాలివ్వాలని కోరారు. పొలాల్లోకి ఈ విత్తనాలు వెళ్లకుండా అడ్డుకోవాలని అభ్యర్థించారు.

జన్యు మార్పిడి ఆవాల సాగుకు జీఈఏసీ సిఫార్సు చేసింది

జన్యు మార్పిడి ఆవాలను సాగుకు అనుమతించాలని జన్యు సాంకేతిక పరిజ్ఞాన మదింపు కమిటీ (జీఈఏసీ) సిఫార్సు చేసినట్లు రాజ్యసభకు కేంద్రం సోమవారం తెలిపింది. అయితే ఈ విషయంలో తాము ఇంకా ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదని వెల్లడించింది. 'జన్యు మార్పిడి ఆవాలకు అనుమతివ్వాలంటూ దిల్లీ వర్సిటీకి చెందిన జన్యు మార్పిడి పంటల కేంద్రం (సీజీఎంసీపీ) దరఖాస్తు పెట్టుకుంది. ఈ ఆవాల పంట పక్కనుండే మొక్కలను నాశనం చేయదు. హైబ్రిడ్ విత్తనాల ఉత్పత్తి వరకే వీటిలో గుల్మనాశనులను పరిమితం చేశారు. దీన్ని సాగుకు అనుమతించొచ్చని జీఈఏసీ సిఫార్సు చేసింది' అని కేంద్ర పర్యావరణ మంత్రి హర్షవర్ధన్ చెప్పారు.

విశ్వాసపరీక్ష తర్వాత మా జోక్యమెందుకు?

నీతీశ్ ప్రభుత్వంపై వ్యాజ్యాలను కొట్టివేసిన హైకోర్టు

పట్నా: బిహార్‌లో నీతీశ్ కొత్త ప్రభుత్వం ఏర్పడటాన్ని సవాల్‌చేస్తూ దాఖలైన రెండు వ్యాజ్యాలను పట్నా హైకోర్టు సోమవారం కొట్టివేసింది. రాష్ట్ర అసెంబ్లీలో విశ్వాసపరీక్ష జరిగినతర్వాత కోర్టు జోక్యం అవసరంఉండదని స్పష్టంచేసింది. బిహార్‌లో కొత్త ప్రభుత్వ ఏర్పాటు, గతంలో ఎస్.ఆర్.బొమ్మై కేసులో ఇచ్చిన తీర్పును ఉల్లంఘించేలా ఉందంటూ ఆర్జేడీ ఎమ్మెల్యేలు ఇద్దరు, ఎస్పీకి చెందిన మరొకరు ప్రజాహిత వ్యాజ్యాలు దాఖలు చేశారు. వీటిపై వాదనలు విన్న ప్రధానన్యాయమూర్తి జస్టిస్ రాజేంద్రమేనన్, జస్టిస్ ఏకేఉపాధ్యాయ్‌లతో కూడిన ధర్మాసనం ఆ వ్యాజ్యాలను కొట్టివేసింది.

నీతీశ్‌పై సుప్రీంలో వ్యాజ్యం

దిల్లీ: నీతీశ్ శాసనమండలి సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ న్యాయవాది ఒకరు సోమవారం సుప్రీంకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. నీతీశ్‌కు వ్యతిరేకంగా గతంలో ఓ క్రిమినల్ కేసు ఉండగా..దాన్ని దాచిపెట్టారని ఆరోపించారు.

'మోదీతో పోటీ పడేవారే లేరు'

పట్నా: సమకాలీన రాజకీయాల్లో ప్రధాని నరేంద్ర మోదీతో పోటీపడేవారు ఎవరూ లేరని బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ అన్నారు. సోమవారం ఇక్కడ విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో మరోసారి ప్రధాని పదవి కోసం మోదీ నిలబడినప్పుడు ఆయనకు పోటీనిచ్చే బలవంతుడైన నాయకుడెవరూ లేరని చెప్పారు. మహాకూటమి నుంచి బయటకు రావడం మినహా మరో ప్రత్యామ్నాయం కనిపించలేదని అన్నారు. అందులోనే ఇంకా కొనసాగి ఉంటే అవినీతికి మద్దతు ఇచ్చినట్టయి ఉండేదని చెప్పారు. అవినీతిపై వస్తున్న ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలని కోరినా లాలూ స్పందించలేదని అన్నారు. వారి వద్ద తగిన సమాధానం లేదని అనుకుంటున్నానని చెప్పారు. ముందుగా హామీ ఇచ్చిన మేరకు ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా గోపాలకృష్ణ గాంధీకి మద్దతు ఇస్తామని చెప్పారు.



ఇది శ్వేతనాగు కాదండోయ్!

ధవళవర్ణంలో ధగధగా మెరిసిపోతున్న ఈ పామును చూస్తే ఎవరైనా శ్వేతనాగు అనుకుంటారు. నిజానికి ఈ పాముది ఈ దేశం కాదు. అసలు ఈ ఖండమే కాదు. ఆస్ట్రేలియాలో నివసించే సాల్టీ గ్రే స్నేక్ ఇది. వీటికి విషం ఉండదు. ఇవి సాధారణంగా ముదురు గోధుమరంగులో ఉంటాయి. అరుదైన జన్యు ఉత్పరివర్తనాల వల్ల ఇది ఇలా పుట్టిందని టెర్రిటరి వైల్డ్‌లైఫ్ పార్కు అధికారులు చెబుతున్నారు. పైగా దీనికి పాండురోగం వచ్చిందని భావించలేమంటున్నారు. దీనికి రోగం అయితే కళ్లు పింక్ రంగులో ఉండాలని.. దీని కళ్లు నలుపు రంగులో ఉన్నాయని విశ్లేషించారు. కుక్క దీన్ని తినబోతే రక్షించిన ఓ స్థానికుడు తమకు అప్పగించాడని తెలిపారు.



పార్లమెంటు హౌస్ వద్ద నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ప్రధాని మోదీ. చిత్రంలో స్పీకరు సుమిత్రా మహాజన్

జీఎస్టీ లాభాలు అందరికీ అందాలి: ప్రధాని

దిల్లీ, గువహటి: వస్తు-సేవల పన్ను (జీఎస్టీ) ద్వారా గొలుసుకట్టుగా లాభాలు వస్తాయని, ఇవి అందరికీ అందేటట్టు చూడాలని ప్రధాని మోదీ కోరారు. భాజపా ఎంపీలతో భేటీలో భాగంగా సోమవారం ఆయన హరియాణ, దిల్లీ, చండీగఢ్, జమ్ము-కశ్మీర్ రాష్ట్రాల వారితో సమావేశమయ్యారు. జీఎస్టీపై చిన్న వ్యాపారులు ఆసక్తితో ఉన్నారని ఎంపీలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ప్రధాని స్పందిస్తూ 'కొత్త విధానం కింద చిన్న వ్యాపారులు నమోదు చేసుకోవాలి. గొలుసుకట్టుగా వచ్చే లాభాలను వారూ పొందాల'ని అన్నారు.

పార్లమెంటు సముదాయంలో నూతన భవనం ప్రారంభం

పార్లమెంటు హౌస్ సముదాయంలో కొత్తగా నిర్మించిన ఓ భవనాన్ని ప్రధాని సోమవారం ప్రారంభించారు. ప్రారంభోత్సవంలో లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ పాల్గొన్నారు.

నేడు అసోంలో మోదీ పర్యటన: వరదలతో ఇటీవల అతలాకుతలమైన అసోంలో ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం పర్యటించనున్నారు.

రేపు తిరుమల పవిత్రోత్సవాలకు అంకురార్పణ

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 3 నుంచి మూడు రోజుల పాటు జరగనున్న పవిత్రోత్సవాలకు బుధవారం అంకురార్పణ జరగనుంది. ఆలయంలో జరిగే నివేదనలు, ఉత్సవాల్లో యాత్రికులు, దేవస్థానం సిబ్బంది వల్ల తెలిసీ.. తెలియక జరిగే దోషాల పరిహారార్థం ఏటా తితిదే ఈ ఉత్సవాలను నిర్వహిస్తోంది. పవిత్రోత్సవాల నేపథ్యంలో ఈనెల 2న వసంతోత్సవం, సహస్రదీపాలంకరణ సేవలు, 3 నుంచి 5 వరకు తిరుప్పావడ సేవ, నిజపాద దర్శనం, కల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఊంజలసేవ, వసంతోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవలను రద్దు చేసినట్లు తితిదే వెల్లడించింది.

'స్వచ్ఛ తిరుమల'కు ఓఎన్‌జీసీ భారీ విరాళం

తొలి విడతగా రూ.6.78 కోట్లు అందజేత

స్వచ్ఛభారత్‌లో భాగంగా తిరుమలలో చేపడుతున్న కార్యక్రమాలకు సహకారం అందించడానికి ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) ముందుకు వచ్చింది. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్)గా రూ.13 కోట్ల నిధులు అందిస్తామని హామీ ఇస్తూ మొదటి విడతగా రూ.6.78 కోట్ల విరాళాన్ని సోమవారం తితిదేకు అందచేసింది.

గిరిజన పాఠశాలలకూ ఏకరూప దుస్తులు

ఈనాడు, హైదరాబాద్: గిరిజన సంక్షేమ శాఖ యాజమాన్యంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఏకరూప దుస్తుల సరఫరాకు, పాఠశాల నిర్వహణ గ్రాంటు మంజూరుకు సర్వశిక్షా అభియాన్ అంగీకరించింది. ఈ మేరకు రాష్ట్రంలోని 15 జిల్లాల్లోని 1,408 పాఠశాలల్లో 25,237 మంది విద్యార్థులకు అవసరమైన వస్త్రాన్ని సరఫరా చేయాలని చేనేత శాఖ సంచాలకుడు ఎస్ఎస్ఏ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ కిషన్ లేఖ రాశారు. ఎన్నోసార్లు చర్చించిన మేరకు రెండు శాఖలు అంగీకారానికి వచ్చి ఎస్ఎస్ఏ ద్వారానే దుస్తుల సరఫరా, నిర్వహణ నిధులను విడుదల చేయాలని నిర్ణయించడంపై యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నర్సిరెడ్డి, చావ రవి కృతజ్ఞతలు తెలిపారు.

'మండలి' ఛైర్మన్‌గా పాపిరెడ్డికి మరోసారి అవకాశం?

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్‌గా ఆచార్య తుమ్మల పాపిరెడ్డికి ప్రభుత్వం మరో సారి అవకాశం ఇవ్వనున్నట్లు తెలిసింది. ఛైర్మన్‌గా ఆయన పదవీకాలం ఆగస్టు 4తో ముగుస్తుంది. ఒకటి రెండు రోజుల వ్యవధిలో ఉపాధ్యక్షులు, కార్యదర్శి పదవీకాలమూ ముగియనుంది. ఛైర్మన్‌గా మాత్రం పాపిరెడ్డిని రెండోసారి కొనసాగించే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ముఖ్యమంత్రి కేసీఆర్ పాపిరెడ్డి వైపే మొగ్గు చూపారని తెలిసి.. ఆ పదవిపై ఆశ పెట్టుకున్న వారు తమ ప్రయత్నాలను ఆపినట్లు సమాచారం.

త్రుటిలో తప్పిన విమాన ప్రమాదం

ప్రయాణికుల లగేజీలోని మొబైల్ బ్యాటరీ నుంచి మంటలు

కొలంబో: విమాన సిబ్బంది అప్రమత్తత భారీ ప్రమాదాన్ని నివారించింది. 200 మంది ప్రయాణికుల ప్రాణాలను రక్షించింది. సోమవారం కొచ్చి నుంచి కొలంబో బయలుదేరిన శ్రీలంక ఎయిర్‌లైన్స్‌కు చెందిన యూఎల్ 166 విమానం గగనతలంలో ఉండగా...లోపలి నుంచి పొగ రావటాన్ని సిబ్బంది గుర్తించారు. వెంటనే అప్రమత్తమై ఆ పొగ ఎక్కడి నుంచి వస్తుందా అని ఆరా తీశారు. అది ప్రయాణికుల సంచీలోంచి వస్తున్నట్లు గుర్తించారు. సంచీలో ఉంచిన మొబైల్ లిథియం బ్యాటరీ నుంచి అగ్గిరాజుకోవటాన్ని గమనించి, అది పేలకుండా చర్యలు తీసుకున్నారు. ఆ తర్వాత ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్‌కు సమాచారాన్ని చేరవేశారు. విమానం కిందకు దిగే సమయానికి కొలంబో విమానాశ్రయంలో పేలుడు నిపుణులు, అగ్నిమాపక సిబ్బంది సిద్ధంగా ఉన్నారు. విమానం భద్రంగా కిందికి దిగి ప్రయాణికులందరూ క్షేమంగా బయటకు రావటంతో ఊపిరిపీల్చుకున్నారు.

'మహా కూటమికి ముగింపు దురదృష్టకరం'

దిల్లీ: బిహార్‌లో 'మహా కూటమి'కి ముగింపు పలకడం దురదృష్టకరమని జేడీయూ అగ్రనేత శరద్ యాదవ్ సోమవారం అసంతృప్తి వ్యక్తం చేశారు. గత కొద్ది రోజులుగా బిహార్ పరిణామాలపై మౌనం దాలుస్తూ వచ్చిన ఆయన ఎట్టకేలకు పెదవి విప్పారు. పార్లమెంటు బయట విలేకరులతో మాట్లాడారు. ఈ నిర్ణయాన్ని తాను అంగీకరించలేనని పేర్కొన్నారు. ప్రజలు మహాకూటమికి మద్దతుగా ఓటేశారని.. వారితో ముడిపడిన ఒప్పందాన్ని తెగతెంపులు చేసుకోవడం పెద్ద విషయమని శరద్ యాదవ్ అభిప్రాయపడ్డారు.

వృద్ధాప్యానికి తోడు మనోవేదన

మనదేశంలో పరిస్థితులపై తాజా అధ్యయనం వెల్లడి

దిల్లీ: మనదేశంలో వృద్ధులు ఎదుర్కొంటున్న మానసిక వేదనను తాజా అధ్యయనమొకటి కళ్లకు కట్టింది. 43% మంది వృద్ధులు ఒంటరితనం వంటి మానసిక సమస్యలతో సతమతమవుతున్నట్లు వెల్లడించింది. దేశవ్యాప్తంగా 50 వేలమంది వృద్ధుల(60 ఏళ్లు పైబడినవారు)పై 'ఏజ్‌వెల్ ఫౌండేషన్' అనే సంస్థ ఈ అధ్యయనాన్ని నిర్వహించింది. ఈ ఏడాది జూన్-జులైల్లో వారి నుంచి అభిప్రాయాలు సేకరించి సంబంధిత వివరాలను బయటపెట్టింది. కుటుంబసభ్యులు తమ అవసరాలు, బాగోగులను ఏమాత్రం పట్టించుకోవడం లేదని 45 శాతానికిపైగా వృద్ధులు ఆవేదన చెందుతున్నట్లు తాజాఅధ్యయనం వెల్లడించింది. 43%మంది వృద్ధులు ఒంటరితనం, బంధుత్వాల సంబంధిత మానసిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు.


సర్వే సూచనలివీ..

- ప్రస్తుత పరిస్థితులు మెరుగుపడాలంటే.. ప్రభుత్వ పథకాల్లో వృద్ధుల సంక్షేమం, సాధికారతకు ప్రాధాన్యమివ్వాలి.
- జనాభాలో వృద్ధుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. వారి హక్కులు, అవసరాలను నిర్లక్ష్యం చేస్తే.. సామాజిక అభివృద్ధి చోటుచేసుకోదు. 60 ఏళ్లు పైబడిన వారంతా ఆర్థికంగా స్వతంత్రత కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలి.
- వృద్ధాప్య సంబంధిత సమస్యల చికిత్స కోసం ఎయిమ్స్ తరహా జాతీయ సంస్థను ఏర్పాటుచేయాలి. వృద్ధుల సంక్షేమంకోసం జాతీయ నిధి, జాతీయ కమిషన్‌లను ఏర్పాటుచేయాలి.

సుఖీభవ

క్రానిక్ ఇన్‌ఫ్లమేషన్

నిపురు గప్పిన నిప్పు ఎప్పుడు భగ్గుమంటుందో తెలియదు. లోపల్లోపలే రాజుకుంటూ ఒక్కసారిగా విజృంభిస్తుంది. చేయాల్సిన అనర్థమంతా చిటికెలో చేసేస్తుంది. క్రానిక్ ఇన్‌ఫ్లమేషన్- దీర్ఘకాలిక వాపు ప్రక్రియ కూడా ఇంతే. పైకేమీ కనిపించకుండా.. ఒంట్లోనే రగులుతూ.. ఉన్నట్టుండి సమస్యల జ్వాలగా గుప్పుమంటుంది. ఇది రక్తనాళాల్లో పూడికలను పెకలించి, రక్తం గడ్డలు ఏర్పడేలా చేయొచ్చు. ఇలా గుండెజబ్బు, పక్షవాతానికి దారితీయొచ్చు. మెదడులోని నాడీకణాలను నిర్వీర్యం చేసి మతిమరుపు, అల్జీమర్స్‌లను మోసుకురావొచ్చు. అస్తవ్యస్త కణాల వ్యాప్తిని ముమ్మరం చేసి క్యాన్సర్ కణాలుగా మారే వాతావరణాన్నీ సృష్టించొచ్చు. ఒక్కమాటలో- ప్రస్తుతం మనిషికి కలవరం పుట్టిస్తున్న జబ్బులన్నింటికీ దీర్ఘకాల వాపుప్రక్రియే మూలమనీ చెప్పుకోవచ్చు! అందుకే వైద్య పరిశోధన రంగం ఇటీవలి కాలంలో దీనిపై ప్రత్యేక దృష్టి సారించింది. స్వల్పస్థాయి వాపు ప్రక్రియను నిర్ధరించటం దగ్గర్నుంచి చికిత్సల వరకూ రకరకాల అధ్యయనాలు చేస్తోంది. వీటికి సంబంధించి న్యూ సైంటిస్ట్ పత్రికలో ఇటీవల ప్రచురితమైన కథనం పలు కోణాలను స్పృశించింది. మరోవైపు- మధుమేహం, అధిక రక్తపోటు, ఊబకాయం, కొలెస్ట్రాల్ స్థాయులు ఎక్కువగా ఉండటం వంటి ముప్పు కారకాలేవీ లేకపోయినా ప్రస్తుతం ఎంతో మంది గుండెజబ్బుల బారినపడుతున్నారు. ఇలాంటి ధోరణి భారత సంతతికి చెందినవారిలోనే ఎక్కువగా కనబడుతుండం మరింత కలవరపరుస్తోంది. దీనికి దీర్ఘకాలిక వాపు ప్రక్రియే కారణం కావొచ్చని భావిస్తున్న నేపథ్యంలో దీనిపై సమగ్ర కథనం అందిస్తోంది ఈ వారం సుఖీభవ.



జనని.. సకల జబ్బులకు!

వాపు అనగానే మనకు దెబ్బలు తగిలినపుడు తలెత్తే ఉబ్బే గుర్తుకొస్తుంది. కానీ మన కంటికి కనబడకుండా ఒంట్లోని వివిధ భాగాల్లో కణస్థాయిలోనూ ఇది జరగొచ్చు. పైగా ఇది స్వల్పస్థాయిలో నిరంతరం కొనసాగుతూ వస్తుంటుంది. ఇదే ఇప్పుడు సకల జబ్బులకు మూలంగా పరిణమిస్తోంది. నిజానికి వాపు ప్రక్రియ మన శరీర రక్షణ వ్యవస్థ అమ్ములపొదిలోని తొలి ఆయుధం. ఇదే లేకపోతే మనిషి మనుగడ సాధ్యమయ్యేదే కాదు. చుట్టూరా తిరిగే ప్రతి సూక్ష్మక్రిమికీ బలి కావాల్సి వచ్చేది. ఒంట్లోకి హానికారక సూక్ష్మక్రిములు ప్రవేశించినపుడు లేదా గాయాల వంటివి తగిలినపుడు వాటిని ఎదుర్కోవటానికి ముందుగా నడుం బిగించేది వాపు ప్రక్రియే. ఇది మనకు ఎదురయ్యే ముప్పులను బట్టి రకరకాల రూపాల్లో బయటపడుతుంది. మనకేదైనా దెబ్బతగిలినపుడు తలెత్తే నొప్పి, వాపు, ఎరుపు వంటివి దీని లక్షణాలే. ఇలాంటి సమయాల్లో ముందుగా దెబ్బతిన్న కణాల నుంచి వాపు ప్రక్రియను ప్రేరేపించే సైటోకైన్లు (ఇంటర్‌ల్యూకిన్ 1, 6, 8.. టీఎన్ఎఫ్ ఆల్ఫా) విడుదలవుతాయి. ఇవి ఆ భాగానికి రక్తసరఫరా పెరిగేలా చేయటమే కాదు.. చుట్టుపక్కల రక్షణ వ్యవస్థనూ అప్రమత్తం చేస్తాయి. రక్తప్రసరణ పెరగటం వల్ల వేడి, రక్తనాళాలు విప్పారటంతో ఎరుపు.. అలాగే రక్తనాళాల గోడల నుంచి వెలువడిన ద్రవం, తెల్లరక్త కణాలు కణజాలంలోకి చేరటంతో వాపు తలెత్తుతుంది. ఈ కణాలన్నీ కోట గోడలా మారి.. హానికారక సూక్ష్మక్రిములు లోపలికి రాకుండా నిలువరిస్తాయి. అదే జలుబు అయ్యిందనుకోండి. వాపుకారక హిస్టమిన్లు ముక్కులో జిగురు ద్రవం ఉత్పత్త య్యేలా ప్రేరేపిస్తాయి. శ్వాసమార్గంలో రక్తనాళాలు ఉబ్బేలా చేస్తాయి. దీంతో ముక్కుదిబ్బడ, దగ్గు, తుమ్ములు మొదలవుతాయి. కొన్ని సందర్భాల్లో వాపు ప్రక్రియ ఒళ్లంతా విస్తరిస్తుంటుంది. దీనికి మంచి ఉదాహరణ ఫ్లూ. ఇందులో వాపు ప్రక్రియ ఒళ్లంతా విస్తరించటం వల్ల కీళ్లు, కండరాల నొప్పుల వంటివి బయలుదేరతాయి. ఇలా అప్పటికప్పుడు, ఆయా పరిస్థితులను బట్టి తలెత్తే వాపు ప్రక్రియ (అక్యూట్) బ్యాక్టీరియా, వైరస్, పరాన్నజీవులను నిలువరిస్తూ.. ఇన్‌ఫెక్షన్లు, జబ్బుల బారినపడకుండా కాపాడుతుంటుంది. ఇన్‌ఫెక్షన్లు, గాయాలు తగ్గుతున్న కొద్దీ వాపు ప్రక్రియ కూడా నెమ్మదిస్తూ క్రమంగా పూర్తిగా కనుమరుగవుతుంది. కానీ వచ్చిన చిక్కల్లా దీర్ఘకాలంగా (క్రానిక్) కొనసాగే వాపు ప్రక్రియతోనే. ఇదే మనిషిని రకరకాల సమస్యల్లోకి నెడుతోంది.

కారణాలేంటి?

దీర్ఘకాల వాపు ప్రక్రియ ఎందుకు ప్రేరేపితమవుతుందనేది కచ్చితంగా తెలియదు. జన్యుపరమైన అంశాలు దీనికి దోహదం చేస్తుండొచ్చు. మన జీవనశైలి కూడా దీనిపై గణనీయమైన ప్రభావం చూపుతున్నట్టు అధ్యయనాలు పేర్కొంటున్నాయి. ఊబకాయం, ఒత్తిడి, కాలుష్యం, వయసు మీద పడుతుండటం, సరైన ఆహారం తీసుకోకపోవటం, పొగ తాగటం వంటి పలు అంశాలు దీనికి దోహదం చేయొచ్చు.

ఒత్తిడి: ప్రాణాపాయ పరిస్థితి ఎదురైనప్పుడు రక్తంలోకి నార్‌ఎడ్రెనలిన్ అనే హార్మోన్ పెద్దమొత్తంలో విడుదలవుతుంది. ఇది ప్రమాదాన్ని ఎదుర్కోవటానికి లేదంటే అక్కడ్నుంచి పారిపోవటానికి పురికొల్పుతుంది. ముప్పుల నుంచి బయటపడగానే నోర్‌అడ్రెనలిన్ స్థాయులూ తగ్గుతాయి. పరిణామ క్రమంలో భాగంగా మన శరీరం సంతరించుకున్న రక్షణ విధానమిది. అయితే ప్రాణాపాయ స్థితిలోనే కాదు.. ఒత్తిడికి లోనయినప్పుడూ నార్‌ఎడ్రెనలిన్ పెద్దమొత్తంలో ఉత్పత్తి అవుతుంది. దీంతో ఒంట్లో గాయం లేదా ఇన్‌ఫెక్షన్ మాదిరి పరిస్థితులూ నెలకొంటాయి. ఫలితంగా వాపు ప్రక్రియ ప్రేరేపితమై కణజాలంపై ప్రభావం చూపటం ఆరంభిస్తుంది. దీర్ఘకాల ఒత్తిళ్లకే కాదు.. స్వల్పకాల ఒత్తిళ్లకు గురైనారిలోనూ వాపు కారకాల మోతాదులు చాలా ఎక్కువగా ఉంటున్నట్టు అధ్యయనాలు పేర్కొంటున్నాయి.

ఊబకాయం: రోగనిరోధక వ్యవస్థను నియంత్రించటానికే కాదు. ఆకలి, మూడ్, జీవక్రియలకూ కొవ్వు అవసరం. ఇది తగినంత మోతాదులో ఉన్నంతవరకు ఇబ్బందేమీ లేదు. కానీ మితిమీరితేనే ప్రమాదం. ఎందుకంటే కొవ్వు పెద్దఎత్తున వాపు కారకాలను నిల్వ చేసుకుంటుంది. ముఖ్యంగా అవయవాల చుట్టూరా ఉండే కొవ్వు స్వల్పస్థాయి వాపు ప్రక్రియను నిరంతరం ప్రేరేపిస్తుంటుంది. ఊబకాయంతో ముడిపడిన మధుమేహం వంటి సమస్యలు ముంచుకురావటానికిది దోహదం చేస్తుంది. మధుమేహుల్లో క్రమంగా తలెత్తే ఇన్సులిన్ నిరోధకత కూడా వాపు ప్రక్రియకు దారితీస్తుంది. ఇలా ఇదొక విషవలయంగా మారి సమస్యను తీవ్రం చేస్తుంది.


జంక్ ఫుడ్: ఏమాత్రం పోషకాలు లేని.. ముఖ్యంగా చక్కెర ఎక్కువగా కలిపి తయారుచేసే పదార్థాలు వాపు ప్రక్రియ ప్రేరేపితం కావటానికి దోహదం చేస్తాయి. ముఖ్యంగా తీపి పానీయాలు చిగుళ్ల వ్యాధినీ తెచ్చిపెడతాయి. ఇది శరీరాన్ని వాపు స్థితిలోకి నెట్టి రక్తనాళాల్లో పూడికలు తలెత్తటాకీ దారితీస్తుంది. దీంతో గుండెపోటు, పక్షవాతం వంటి జబ్బుల ముప్పూ పెరుగుతుంది.

ఏంటీ దీర్ఘకాల వాపు ప్రక్రియ?

దెబ్బల వంటివి తగిలినపుడు తలెత్తే వాపు గాయం మానగానే తగ్గిపోతుంది. కానీ దీర్ఘకాల వాపు ప్రక్రియ అలా కాదు. అవసరం లేకపోయినా ఒంట్లో కణస్థాయిలో, స్వల్పంగా ఒక జ్వాల మాదిరిగా నిరంతరం జ్వలిస్తూనే ఉంటుంది. పైగా ఇది ఒక కణజాలానికి పరిమితం కాకుండా ఒళ్లంతా విస్తరిస్తుంటుంది కూడా. లోపల ఏదో ముప్పు తలెత్తిందనే భావనతో అవసరం లేకపోయినా శరీరం వాపు ప్రక్రియ ప్రతిస్పందనలను ప్రేరేపించటం దీనికి ప్రధాన కారణం. దీంతో ఆయా భాగాలకు తెల్లరక్తకణాలు పెద్దఎత్తున చేరుకుంటాయి. తీరా వచ్చాక అక్కడ బ్యాక్టీరియా, వైరస్‌ల వంటివేవీ కనబడవు. దీంతో వాటికి ఏం చేయాలో పాలుపోక కొన్నిసార్లు మన అవయవాలు, కణజాలం మీదే దాడిచేస్తాయి. రోగనిరోధకశక్తి పొరపాటున మన మీదే దాడి చేయటం (ఆటోఇమ్యూన్) అంటే ఇదే. ఇప్పుడు గుండెజబ్బు, రుమటాయిడ్ ఆర్థ్రయిటిస్, మధుమేహం, అల్జీమర్స్.. చివరికి క్యాన్సర్ల వంటి పలు సమస్యలకు దారితీస్తోంది కూడా ఇదే. అందుకే దీన్ని సకల జబ్బులకు మూలమని వైద్య పరిశోధన రంగం భావిస్తోంది.

అనంత జ్వాల

జబ్బులతో పోరాడటానికి రోగనిరోధక ప్రతిస్పందనలో భాగమైన వాపు ప్రక్రియ చాలా కీలకం. కానీ ఇది తగ్గకుండా, అలాగే కొనసాగుతూ వస్తుండటమే సమస్యల మూలం.



ఒళ్లంతా ప్రభావం

వాపును ప్రేరేపించే సి రియాక్టివ్ ప్రోటీన్ వంటివి ఒంట్లో ఉన్నకొద్దీ జబ్బుల ముప్పూ పెరుగుంది. ఇవి గుండెజబ్బు వంటి వాటికి దారితీయొచ్చు. తొలిదశ గుండెజబ్బుకూ వాపు ప్రక్రియకూ నేరుగా సంబంధం ఉంటున్నట్టు.. మూడేళ్లకు పైగా తీవ్రమైన ఒత్తిడికి గురైనవారిలో సి రియాక్టివ్ స్థాయులు చాలా ఎక్కువగా ఉంటున్నట్టు అధ్యయనాలు పేర్కొంటున్నాయి. రక్తంలో తెల్లరక్తకణాల స్థాయులు ఎక్కువగా ఉన్నప్పుడు క్రమంగా అవి రక్తనాళాల్లోని పూడికల వద్దకు చేరుకొని పోగుపడతాయి. పూడికల సైజు పెరిగేలా చేస్తాయి. ఇవి క్రమంగా పూడికలను కదిలించి, రక్తనాళాల గోడలు చిట్లటానికి దారితీస్తాయి. ఫలితంగా రక్తం గడ్డలు ఏర్పడి గుండెపోటు, పక్షవాతం వంటి వాటికి దారితీయొచ్చు. మెదడు, కీళ్లు, కాలేయం, ఊపిరితిత్తులు ఇలా అన్ని అవయవాల్లోనూ వాపు కారకాలు తిష్ఠ వేసుకొని పలు సమస్యలను తెచ్చిపెట్టొచ్చు.

మెదడు

వాపు ప్రక్రియను ప్రేరేపించే సైటోకైన్లు మెదడులో స్వీయ రోగనిరోధక ప్రతిచర్యలకు దారితీస్తాయి. ఇది కుంగుబాటు, మతిమరుపు, అల్జీమర్స్, మల్టిపుల్ స్క్లిరోసిస్ వంటి వాటికి దోహదం చేస్తుంది.

చర్మం

దీర్ఘకాలంగా వాపు ప్రక్రియ కొనసాగటం వల్ల కాలేయం, కిడ్నీల పనితీరు మందగిస్తుంది. దీంతో చర్మంపై దద్దుర్లు, ఎండుగజ్జి, మొటిమలు, సోరియాసిస్, ముడతల వంటివి బయలుదేరతాయి.

గుండె-రక్తనాళాలు

గుండె, రక్తనాళాల్లో వాపు ప్రక్రియ ప్రేరేపణతో గుండెజబ్బు, పక్షవాతం, రక్తహీనత వంటి పలు సమస్యలు బయలుదేరొచ్చు.

మూత్రపిండాలు

వాపు కారక సైటోకైన్లు మూత్రపిండాల్లోకి తగినంత రక్తం సరఫరా కాకుండా అడ్డుకుంటాయి. ఫలితంగా కాళ్ల వాపు, కిడ్నీ వాపు, అధిక రక్తపోటు వంటివి ముంచుకొస్తాయి. కిడ్నీ వైఫల్యానికీ దారితీయొచ్చు.

కాలేయం

వాపు ప్రక్రియ కొనసాగుతూ ఉండటం వల్ల కాలేయం సైజు పెరగటం లేదా కొవ్వు పట్టటం జరగొచ్చు. దీంతో ఒంట్లో విషతుల్యాలు పేరుకుపోయే అవకాశమూ పెరుగుతుంది.

ఊపిరితిత్తులు

పదే పదే వాపు ప్రక్రియ తలెత్తటం వల్ల శ్వాసమార్గాల గోడలు దెబ్బతినొచ్చు. ఫలితంగా అలర్జీలు, ఆస్థమా వంటి సమస్యలు బయలుదేరొచ్చు.

జీర్ణకోశ వ్యవస్థ

దీర్ఘకాల వాపు ప్రక్రియ పేగుల లోపలి గోడలను దెబ్బతీస్తుంది. దీంతో జీర్ణాశయంలోని ఆమ్లాలు గొంతులోకి ఎగదన్నుకొని రావటం, క్రోన్స్, సీలియాక్ డిసీజ్ వంటివి దాడిచేస్తాయి.

ఎముకలు

శరీరం ఎముక సాంద్రతను మరమ్మతు చేసుకునే సామర్థ్యాన్ని వాపు ప్రక్రియ తగ్గిస్తుంది. ఇది తేలికగా ఎముకలు విరగటానికి, ఎముకలు క్షీణించటానికి దోహదం చేస్తుంది.

నివారించుకోవచ్చా?

వాపు ప్రక్రియ ఎవరిలో, ఎప్పుడు, ఎలాంటి సమస్యలకు దారితీస్తుందనేది కచ్చితంగా చెప్పలేం. ఆరోగ్యవంతుల్లో స్వల్పస్థాయి వాపు ప్రక్రియను నిర్ధరించటం, నయం చేయటంపై ఇప్పుడు విస్తృతంగా అధ్యయనాలు సాగుతున్నాయి. ప్రస్తుతం దీన్ని తగ్గించుకునేందుకు పెద్దగా మందులేవీ అందుబాటులో లేవు. అంతమాత్రాన నిరాశ పడాల్సిన పనేమీ లేదు. ఆహారం, వ్యాయామం వంటి పద్ధతులతో దీని అనర్థాల నుంచి తగ్గించుకునే అవకాశం లేకపోలేదు.

బరువు అదుపు

వాపు ప్రక్రియను ప్రేరేపించే సైటోకైన్లను కొవ్వు పెద్దమొత్తంలో నిల్వ చేసుకుంటుంది. పెద్దమొత్తంలో ఉన్న కొవ్వును వాపుకారక కణజాలంగానూ భావిస్తుంటారు. కాబట్టి బరువు అదుపులో ఉంచుకోవటం అన్నింటికన్నా ఉత్తమం.



ఆహారం

అవసరం తీరిన తర్వాత వాపు కారకాల స్థాయులను తగ్గించే రిసాల్విన్లనే రసాయనాలు ఒమేగా 3 కొవ్వు ఆమ్లాల నుంచే పుట్టుకొస్తాయి. ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలను శరీరం అంతగా తయారుచేసుకోలేదు. కాబట్టి వీటిని ఆహారం ద్వారానే తీసుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా చేపలు, బాదం వంటి గింజపప్పుల్లో ఇది దండిగా ఉంటుంది. పండ్లలోని వర్ణద్రవ్యాలు కూడా వాపు ప్రక్రియ నియంత్రణకు తోడ్పడతాయి. అందువల్ల తాజా పండ్లు, కూరగాయలు, పొట్టు తీయని ధాన్యాలు తీసుకోవటం మంచిది. వాపు ప్రక్రియను ప్రేరేపించే కొవ్వు, తీపి పదార్థాలను పరిమితం చేసుకోవాలి.

వ్యాయామం

శారీరక శ్రమ, వ్యాయామం వాపు నిరోధక రసాయనాలను విడుదల చేస్తాయి. ఇవి కొవ్వును విడగొట్టేలా కాలేయాన్ని పురికొల్పుతాయి కూడా. శరీరాన్ని సాగదీసే వ్యాయామాలతో కండరాల్లో రిసాల్విన్లు విడుదల అవుతున్నట్టు అధ్యయనాలు పేర్కొంటున్నాయి. నిజానికి వ్యాయామం చేసినపుడు వాపు ప్రక్రియను సూచించే ఐఎల్-16 అనే సైటోకైన్ స్థాయులు పెరుగుతాయి. కానీ ఇది హానిచేసేంత స్థాయిలో ఏమీ ఉండదు. పైగా ఇది వాపు నిరోధకంగానూ పనిచేస్తుంది. కాబట్టి క్రమం తప్పకుండా వ్యాయామం చేయటం మంచిది.. అలాగని పెద్ద పెద్ద వ్యాయామాలే చేయాల్సిన అవసరం లేదు. రోజుకు అరగంట సేపు నడిచినా మేలే.

స్వల్ప మోతాదు ఆస్ప్రిన్

తక్కువ మోతాదు ఆస్ప్రిన్ తీసుకుంటే రిసాల్విన్ల మాదిరి ప్రభావం చూపుతున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. ఇది వాపు ప్రేరకాలను తగ్గించటమే కాదు.. సహజ రిసాల్విన్ల ఉత్పత్తికీ దోహదం చేస్తున్నట్టు పరిశోధకులు గుర్తించారు. అయితే దీన్ని డాక్టర్ల సలహా మేరకే తీసుకోవాలి.

ఒత్తిడి అదుపు

దీర్ఘకాల ఒత్తిడి, నిద్రలేమి, తీవ్ర భావోద్వేగాల వంటివి ఒత్తిడి హార్మోన్ల స్థాయులను పెంచి వాపు ప్రక్రియకు దారితీస్తాయి. కాబట్టి ఒత్తిడిని తగ్గించుకునేందుకు ప్రయత్నించాలి. ఏకాగ్రతతో కూడిన ధ్యానం వంటి పద్ధతులు ఇందుకు ఎంతగానో ఉపయోగపడతాయి.

మనసుకు చక్కెర 'దిగులు'

చక్కెర, తీపి పదార్థాలు అతిగా తింటే బరువు పెరుగుతుందని తెలుసు. దంతక్షయం వంటి జబ్బుల ముప్పు పెరుగుతుందని తెలుసు. కానీ వీటితో మానసిక సమస్యల ముప్పూ పొంచి ఉంటోందనే సంగతి తెలుసా? తీపి పదార్థాలు, తీపి పానీయాల ద్వారా రోజుకు 67 గ్రాముల కన్నా ఎక్కువ చక్కెరను తీసుకునే పురుషులకు దీర్ఘకాలంలో ఆందోళన, కుంగుబాటు వంటి మానసిక సమస్యల ముప్పు పెరుగుతున్నట్టు తేలటమే దీనికి నిదర్శనం. నిజానికి తీపి పదార్థాలు తిన్నపుడు కొద్దిసేపటి వరకు హాయి భావన కలుగుతుంది. వీటి ప్రభావం తగ్గగానే తిరిగి మూడ్ మారిపోతుంటుంది. దీంతో మరింతగా తీపి పదార్థాలు తినటం మొదలెడుతుంటారని.. ఇది చివరికి మానసిక సమస్యలకూ దారితీస్తోందని పరిశోధకులు చెబుతున్నారు.

నిద్రకు మద్యం దెబ్బ!



పడుకునే ముందు మద్యం తాగితే నిద్ర బాగా పడుతుందని కొందరు భావిస్తుంటారు. దీంతో మొదట్లో నిద్ర మత్తు ముంచుకొస్తుండొచ్చు. కానీ సమయం గడుస్తున్నకొద్దీ మత్తు ప్రభావం తగ్గిపోయి.. తరచుగా మెలకువ వస్తూనే ఉంటుంది. కోడి నిద్రే మిగులుతుంది. గాఢ నిద్ర గణనీయంగా తగ్గిపోతుంది. ఫలితంగా ఉదయం నిద్రలేచాక ఏమంత హుషారుగా ఉండదు. అలాగే మద్యం తాగి నిద్రపోయినవారికి కలలు వచ్చే అవకాశం ఎక్కువ. పీడకలలూ రావొచ్చు. కొందరు నిద్రలో లేచి నడుస్తుంటారు కూడా. మద్యం మత్తు కారణంగా శరీరంలోని అన్ని కండరాలు వదులవుతాయి. గొంతు వెనకాల కండరాలు వదులైతే శ్వాసమార్గానికి అడ్డంకి తలెత్తటం, గురక వంటివీ మొదలవుతాయి.

కిడ్నీలోనూ తిత్తులు!



రక్తాన్ని శుద్ధిచేసి, వ్యర్థాలను బయటకు పంపించే మూత్రపిండాల్లో నీటి తిత్తులు (సిస్టులు) ఉన్నాయనగానే ఎవర్నికైనా ఆందోళన మొదలవుతుంది. నిజానికివి అంత ప్రమాదకరమైనవేమీ కావు. కిడ్నీ పనితీరునూ దెబ్బతీయవు. అయితే తిత్తుల సైజు పెరిగితే మాత్రం నొప్పి, ఇన్‌ఫెక్షన్ వంటి సమస్యలు వేధించొచ్చు. కాబట్టి వీటిపై అవగాహన పెంచుకోవటం మంచిది.

కిడ్నీల్లో నీటితిత్తులు అరుదైన సమస్యేమీ కాదు. అలాగని అంత ప్రమాదకరమైనవీ కావు. ఇలాంటి సాధారణ రకం తిత్తులు ఎందుకు ఏర్పడతాయో కచ్చితంగా చెప్పలేం. ఇతరత్రా సమస్యల మాదిరిగా మన ఆహారం, జీవనశైలితోనూ వీటికి సంబంధం లేదు. ఇవి ఏ వయసులోనైనా ఏర్పడొచ్చు. అయితే 40 ఏళ్లు పైబడినవారిలో తరచుగా కనబడుతుంటాయి. 60 ఏళ్లు పైబడినవారిలో దాదాపు సగం మందికి ఏదో ఒక సమయంలో కిడ్నీలో తిత్తులు ఏర్పడొచ్చని అంచనా. మహిళల్లో కన్నా పురుషుల్లోనే ఇవి ఎక్కువ. కొందరికి జన్యుపరంగా తలెత్తే పాలీసిస్టిక్ కిడ్నీ డిసీజ్ మూలంగా గుత్తులు గుత్తులుగా తిత్తులు ఏర్పడుతుంటాయి. అలాగే దీర్ఘకాలంగా కిడ్నీ జబ్బుతో బాధపడేవారిలో, డయాలసిస్ చేయించుకుంటున్నవారిలోనూ తిత్తులు (అక్వాయిర్డ్) ఏర్పడొచ్చు.

ప్రధాన లక్షణం నొప్పి

మామూలు రకం తిత్తుల్లో చాలావరకు ఎలాంటి లక్షణాలూ ఉండవు. కానీ వీటి సైజు పెరుగుతున్నకొద్దీ కొన్ని లక్షణాలు కనబడతాయి.

- వీపులో లేదా వీపు పక్కభాగాల్లో ఒక మోస్తారు నొప్పి
- కడుపులో పైభాగాన లేదా తుంటిలో నొప్పి
- తిత్తికి ఇన్‌ఫెక్షన్ తలెత్తితే జ్వరం
- మూత్రంలో రక్తం పడటం
- తరచుగా మూత్రానికి వెళ్లాల్సి రావటం

సమస్యలేంటి?

అరుదుగా కొందరిలో తిత్తులు పగలటం, ఇన్‌ఫెక్షన్, మూత్ర విసర్జన సరిగా జరగకపోవటం వల్ల కిడ్నీ ఉబ్బటం వంటి సమస్యలు తలెత్తొచ్చు. ఇలాంటి సమయాల్లో లక్షణాల తీవ్రత కూడా పెరుగుతుంది. దీన్ని నిర్లక్ష్యం చేయటానికి వీల్లేదు. సమయానికి తగు చికిత్స చేయకపోతే ప్రాణాపాయానికీ దారితీయొచ్చు.

చికిత్స ఏంటి?

మామూలు తిత్తులకు చికిత్స అవసరమేమీ లేదు. కాకపోతే సైజు పెరుగుతోందా అనేది గమనిస్తూ ఉండాలి. ఇతరత్రా లక్షణాలు.. ముఖ్యంగా మూత్ర విసర్జన సరిగా కాకపోవటం, రక్తస్రావం వంటివి కనబడుతుంటే చికిత్స అవసరమవుతుంది. వీరికి డాక్టర్లు లోపలికి గొట్టాన్ని పంపించి సూదితో తిత్తిని పగలగొట్టి, అందులోని స్రావాలను బయటకు తీస్తారు (స్క్లిరోథెరపీ). తర్వాత తిత్తి చుట్టుపక్కల భాగాల్లోకి సెలైన్ ఎక్కిస్తారు. దీంతో అక్కడి కణజాలం గట్టిపడుతుంది. ఫలితంగా కొత్త తిత్తులు ఏర్పడే అవకాశం తగ్గుతుంది. తిత్తులు మరీ పెద్దగా ఉంటే శస్త్రచికిత్స చేసి తొలగించాల్సి ఉంటుంది. దీంతో చాలావరకు సమస్య పూర్తిగా నయమవుతుంది. అక్వాయిర్డ్ రకం తిత్తుల విషయంలో వీటికి దోహదం చేస్తున్న సమస్యలకూ చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది.

ఛాంపియన్స్



అగ్రస్థానంలో హారికృష్ణ

బీల్: బీల్ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్లో భారత గ్రాండ్‌మాస్టర్ పెంటేల హారికృష్ణ అగ్రస్థానానికి దూసుకెళ్లాడు. సోమవారం డేవిడ్ నవారా (చెక్ రిపబ్లిక్)తో ఏడో గేమ్‌ను అతను 24 ఎత్తుల్లో డ్రాగా ముగించాడు. అంతకుముందు ఆరో రౌండ్లో హరి.. హో ఇఫాన్‌పై గెలిచాడు. ఈ విజయంతో అతను 4.5 పాయింట్లతో మరో ముగ్గురితో కలిసి ఉమ్మడిగా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఈ టోర్నీలో మరో రెండు రౌండ్లు మిగిలున్నాయి.



వన్డే ఆడుతున్నట్లే..

గాలె: గాలెలో శ్రీలంకతో జరిగిన తొలి టెస్టుతో సుదీర్ఘ ఫార్మాట్లోకి అరంగేట్రం చేసిన ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య... తన తొలి ఇన్నింగ్స్‌లోనే మెరుపు అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. ఆ ఇన్నింగ్స్ సందర్భంగా తనకు వన్డే మ్యాచ్ ఆడుతున్నట్లే అనిపించిందని పాండ్య చెప్పాడు. "నేను బ్యాటింగ్ చేస్తున్నప్పుడు వన్డేలో ఆడుతున్నట్లే భావించా. అప్పటి మ్యాచ్ పరిస్థితి నా ఆటతీరుకు తగ్గట్లుగా ఉంది. అంతర్జాతీయ క్రికెటర్ ఎప్పుడైనా సన్నాహం విషయంలో తెలివిగా వ్యవహరించాలి. ఫార్మాట్లు మారుతున్నప్పుడు మానసికంగా సర్దుబాటు చేసుకోవాలి" అని పాండ్య అన్నాడు. దక్షిణాఫ్రికా దిగ్గజ ఆల్‌రౌండర్ కలిస్ ఆదర్శమని పాండ్య చెప్పాడు. "ఎప్పటికీ నా ఫేవరెట్ ఆటగాడు కలిసే. అన్ని ఫార్మాట్లలో అతడికి అద్భుతమైన రికార్డుంది. మూడో స్థానంలో వచ్చి ఎన్నో పరుగులు చేశాడు. చాలా వికెట్లు పడగొట్టాడు" అని పాండ్య చెప్పాడు.

ధోని, యువీలపై తొందరేమీ లేదు



ముంబయి: టీమ్ఇండియా తదుపరి లక్ష్యం 2019 ప్రపంచకప్పే అయిన నేపథ్యంలో వెటరన్ ఆటగాళ్లు ధోని, యువరాజ్‌ల భవిష్యత్తేంటన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. వారిపై ఓ నిర్ణయం తీసుకోవాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఐతే వాళ్ల గురించి తొందరపడాల్సిన అవసరం లేదని అంటున్నాడు చీఫ్ సెలక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్. "ఆ విషయంపై చర్చించి నిర్ణయం తీసుకోవాల్సివుంది. ఏం జరుగుతుందో చూద్దాం. ఎవరి వల్ల జట్టుకు విలువ చేకూరుతుందో మనందరికీ తెలుసు. ఒక్కో స్థానం గురించి ప్రత్యేకంగా ఆలోచించాలి. ఎప్పుడు నిర్ణయం తీసుకోవాలో తెలియాలి. హఠాత్తుగా నిర్ణయం తీసుకుంటే ఇబ్బందులు తప్పవు. తగిన సన్నద్ధత లేకుండా నిర్ణయం తీసుకోవడం సరికాదు. ఆ విషయంలో మేం సమతూకంతో ఉండాలి" అని అన్నాడు.

ఒలింపిక్స్‌లో క్రికెట్..

భారత బోర్డే అడ్డమా?

దుబాయ్

క్రికెట్ ఒలింపిక్స్‌లో ఉందంటే భారత్‌కు పతకం దాదాపుగా ఖాయం! కానీ స్వయంగా బీసీసీఐనే ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను చేర్చడాన్ని వ్యతిరేకిస్తోందట! 2024 ఒలింపిక్స్‌లో టీ20 క్రికెట్‌కు స్థానం కల్పించడం కోసం ఐసీసీ కొంతకాలంగా ఐసీసీ ప్రయత్నిస్తోంది. అందులో ముందడుగు వేయాలంటే బలమైన బోర్డయిన బీసీసీఐ సహకారం ఎంతో అవసరం. ఐతే బోర్డులో ఎక్కువ మంది అధికారులు ఐసీసీ యత్నాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలుస్తోంది. ''ఐసీసీ ఒలింపిక్ ప్రయత్నాల గురించి మాకు తెలుసు. కానీ ఎక్కువ మంది సభ్యులు దానిపై ఆసక్తిగాలేరు" అని ఓ బీసీసీఐ అధికారి వ్యాఖ్యానించాడు. ఐసీసీ బిడ్‌ను కనీసం పరిశీలించాలన్నా అగ్రశ్రేణి క్రికెట్ జట్లు, ఆటగాళ్ల నుంచి ఆమోదం (ఒలింపిక్స్‌లో క్రికెట్ చేరికపై) అవసరమని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) ఇంతకు ముందే స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ప్రపంచ క్రికెట్లో అత్యంత శక్తిమంతమైన భారత్ మద్దతు లేకుండా ఐసీసీ ముందుకెళ్లే పరిస్థితి లేదు. ఈ అంశంపై ఐసీసీ.. బీసీసీఐని ఇప్పటికే సంప్రదించింది. కానీ భారత బోర్డు ఇప్పటివరకు తన వైఖరిని అధికారంగా వెల్లడించలేదు. తుది నిర్ణయం తీసుకోవాల్సింది పాలకుల కమిటీనే. క్రికెట్ ఒలింపిక్ క్రీడ అయితే బోర్డు స్వయంప్రతిపత్తి పోతుందని, భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధికార పరిధిలోకి వెళ్లాల్సివుంటుందని భావించడమే బీసీసీఐలో చాలా మంది అధికారులు ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను చేర్చడాన్ని వ్యతిరేకించడానికి కారణమని సమాచారం.



హ్యాట్రిక్ తీసిన మొయిన్ అలీని అభినందిస్తున్న సహచరులు

మొయిన్ అలీ హ్యాట్రిక్


మూడో టెస్టులో దక్షిణాఫ్రికాపై ఇంగ్లాండ్ విజయం

లండన్: ఇంగ్లాండ్ లాంఛనం పూర్తి చేసింది. మూడో టెస్టులో 239 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను చిత్తుగా ఓడించి, నాలుగు టెస్టుల సిరీస్‌లో 2-1 ఆధిక్యం సాధించింది. 492 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగి, నాలుగో రోజు 117/4తో నిలిచిన దక్షిణాఫ్రికా.. చివరి రోజైన సోమవారం 252 పరుగులకు ఆలౌటైంది. స్పిన్నర్ మెయిల్ అలీ (4/45) హాట్రిక్‌తో ఆ జట్టును దెబ్బతీశాడు. ఎల్గర్ (136; 228 బంతుల్లో 20×4) పోరాడినా ఫలితం లేకపోయింది. అతడు బవుమా (32)తో ఐదో వికెట్‌కు 108 పరుగులు జోడించాడు. ఎల్గర్.. టెయిలెండర్లతోనూ కలిసి పోరాడాడు. మోరిస్ (24)తో ఏడో వికెట్‌కు 45, మహారాజ్ (24 నాటౌట్)తో ఎనిమిదో వికెట్‌కు 47 పరుగులు జోడించాడు. దక్షిణాఫ్రికా ఓటమి ఖాయమే అయినా.. అలీ విజృంభణతో ఆ జట్టు ఇన్నింగ్స్ ఆఖర్లో అనుకున్న దాని కంటే త్వరగానే ముగిసింది. ఓ దశలో 252/7 ఉన్న దక్షిణాఫ్రికా.. అలీ హ్యాట్రిక్ కారణంగా ఇంకో పరుగు కూడా జోడించకుండానే ఇన్నింగ్స్ ముగించింది. 76వ ఓవర్ చివరి రెండు బంతులకు ఎల్గర్, రబాడలను ఔట్ చేసిన అతడు.. 78వ ఓవర్ తొలి బంతికి మోర్నీ మోర్కెల్‌ను పెవిలియన్ చేర్చి, ఇన్నింగ్స్‌కు తెర దించాడు. 79 ఏళ్లలో హ్యాట్రిక్ సాధించిన తొలి ఇంగ్లాండ్ స్పిన్నర్‌గా అలీ నిలిచాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 353 పరుగులు చేయగా.. దక్షిణాఫ్రికా 175 పరుగులకు ఆలౌటైంది. ఇంగ్లాండ్ 313/8 వద్ద రెండో ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. స్టోక్స్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. చివరి టెస్టు శుక్రవారం ఆరంభమవుతుంది.

ఆరంభంలో అతడి ఆట చూసి మరో రాహుల్ ద్రవిడ్ అన్నారు.. మూడో స్థానంలో ఇంకో 'మిస్టర్ డిపెండబుల్' అని కీర్తించారు. అతను నిలకడగా ఆడుతున్నపుడు ఎటు చూసినా అతడిపై ప్రశంసలే! కానీ కొంచెం నిలకడ తప్పాడో లేదో.. అతడి సామర్థ్యంపై సందేహాలు మొదలైపోయాయి. అతడందించిన విజయాల్ని మరిచిపోయారు.. అతడి భారీ ఇన్నింగ్స్‌లను మరిచిపోయారు.. మరీ నెమ్మదిగా ఆడుతున్నాడంటూ సన్నాయి నొక్కులు నొక్కారు.. చివరికి అతడికి తుది జట్టు నుంచే తప్పించేశారు. కానీ స్వల్ప విరామం తర్వాతే అతను జట్టుకు దిక్కయ్యాడు. ఆపద్బాంధవుడయ్యాడు. ప్రతి సిరీస్‌లోనూ సత్తా చాటుకుంటూ.. జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తూ.. అద్భుత ఇన్నింగ్స్‌లతో పరుగుల వరద పారిస్తూ.. జట్టులో అత్యంత నమ్మదగ్గ ఆటగాడిగా ఎదిగాడు. పొగిడినా తెగిడినా.. అందలమెక్కించినా.. కింద పడేసినా.. ఎన్నడూ పెదవి విప్పకుండా తన పని తాను చేసుకుపోతున్న భారత బ్యాటింగ్ వెన్నెముక.. చెతేశ్వర్ పుజారా! అతను ఈ గురువారం 50 టెస్టుల మైలురాయిని అందుకోబోతుండటం విశేషం.

పుజారా @ 50

మౌన సేనాని!



ప్రస్తుతం శ్రీలంకలో పర్యటిస్తున్న టీమ్ఇండియా.. రెండేళ్ల కిందట ఇదే సమయంలో అదే దేశంలో టెస్టు సిరీస్ ఆడింది. ఆ సిరీస్‌కు ముందు పుజారా కొంచెం నిలకడ తప్పాడు. పూర్తిగా విఫలం కాలేదు కానీ.. తన స్థాయిలో భారీ ఇన్నింగ్స్‌లు ఆడలేకపోయాడు. దీంతో అతడిపై కెప్టెన్ కోహ్లికి, జట్టు యాజమాన్యానికి నమ్మకం సడలింది. అప్పటికే టెస్టుల్లో ఎన్నో అవకాశాలు వచ్చినా సద్వినియోగం చేసుకోని రోహిత్ శర్మను తుది జట్టులోకి తీసుకుని.. పుజారాకు మొండి చేయి చూపించేశారు. తొలి టెస్టులో పుజారా బదులు మూడో స్థానంలో వచ్చిన రోహిత్.. రెండు ఇన్నింగ్స్‌ల్లో వరుసగా 9, 4 పరుగులు చేశాడు. ఆ మ్యాచ్‌లో భారత్ ఓడింది. తర్వాతి మ్యాచ్‌లో రోహిత్ ఓ మోస్తరుగా ఆడాడు. 79, 34 పరుగులు చేశాడు. కానీ పుజారాలా మూడో స్థానానికి న్యాయం మాత్రం చేయలేదు. ఆ మ్యాచ్‌లో భారత్ గెలిచింది. సిరీస్‌లో నిర్ణయాత్మక మూడో టెస్టుకు విజయ్ గాయం కారణంగా దూరం కావడంతో పుజారాకు ఇన్నింగ్స్ ఆరంభించే అవకాశం లభించింది. ఆ మ్యాచ్‌లో మరో ఓపెనర్ రాహుల్ (2) విఫలమయ్యాడు. మూడో స్థానంలో వచ్చిన రహానె (8) నిలవలేదు. కోహ్లి (18), రోహిత్ (26), బిన్నీ (0), నమన్ ఓజా (21) కూడా విఫలమయ్యారు. అయినా తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 312 పరుగులు చేసింది. మ్యాచ్‌లోనూ గెలిచింది. ఆ విజయానికి కారకుడు చెతేశ్వర్ పుజారా. ఆ ఇన్నింగ్స్‌లో అతను 145 పరుగులు చేశాడు. అప్పుడు కానీ చెతేశ్వర్ విలువేంటన్నది టీమ్ఇండియాకు తెలిసి రాలేదు. ఇక అప్పటి నుంచి పుజారా వెనుదిరిగి చూసుకోలేదు. అతణ్ని తుది జట్టు నుంచి తప్పించే సాహసం తర్వాత భారత జట్టు ఎప్పుడూ చేయలేదు.

టెస్టుల్లో పుజారా	
మ్యాచ్‌లు	: 49
పరుగులు	: 3966
సగటు	: 52.18
శతకాలు	: 12

కోహ్లి కూడా అతడి వెనుకే..

ఈ రెండేళ్లలో పుజారా 22 టెస్టులాడి 59.15 సగటుతో 1893 పరుగులు చేశాడు. అందులో ఆరు శతకాలున్నాయి. జట్టులో ఇంకే ఆటగాడికి గత రెండేళ్లలో ఇంత మంచి గణాంకాలు లేవు. కోహ్లి సైతం సగటులో అతడి కంటే వెనుకే ఉన్నాడు. వరుసగా నాలుగు సిరీస్‌ల్లో నాలుగు ద్విశతకాలతో భీకర ఫామ్‌ను చాటుకున్న కోహ్లి కూడా ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్‌లో ఘోరంగా విఫలమయ్యాడు. కానీ పుజారా గత రెండేళ్లలో ఏ సిరీస్‌లోనూ విఫలం కాలేదు. ప్రతి సిరీస్‌లోనూ సత్తా చాటుకుని భారత బ్యాటింగ్‌కు నాయకుడయ్యాడు. అవసరమైన ఆపద్బాంధవ పాత్ర పోషించాడు. అందులో ఆస్ట్రేలియాతో రాంచి టెస్టు సందర్భంగా జట్టును ఓటమి ప్రమాదంలోంచి బయటపడేసిన డబుల్ సెంచరీ (202) సహా మరెన్నో మంచి ఇన్నింగ్స్‌లున్నాయి. తన పరుగుల ప్రవాహాన్ని కొనసాగిస్తూ తాజాగా శ్రీలంకతో తొలి టెస్టులోనూ 153 పరుగుల ఇన్నింగ్స్ ఆడాడు. భాగస్వామ్యాలు నెలకొల్పడంలో పుజారా సామర్థ్యం భారత జట్టుకు ఎంతగానో ఉపయోగపడుతోంది. మురళీ విజయ్, కోహ్లిలతో కలిసి అతను ఎన్నో కీలక భాగస్వామ్యాలు నెలకొల్పి భారత విజయాలకు బాటలు పరిచాడు. రెండేళ్ల కిందట కొంత కాలం పాటు నిలకడ తప్పడం తప్పిస్తే.. మొత్తంగా పుజారా కెరీర్ గణాంకాలు గొప్పగా ఉన్నాయి.

మొన్న ధావన్ ధనాధన్ ఇన్నింగ్స్ ఆడితే అతడి పేరు మార్మోగిపోయింది. ఆస్ట్రేలియా సిరీస్‌కు ముందు కోహ్లి వరుసగా డబుల్ సెంచరీల మోత మోగిస్తుంటే అతడి గురించి పెద్ద చర్చే జరిగింది. ఐతే పుజారా మిగతా వాళ్లలా మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడడు కాబట్టి అతడి విషయంలో పెద్దగా హడావుడి కనిపించదు. ఇప్పుడంతా దూకుడైన బ్యాటింగ్‌కే ఆకర్షణ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పుజారాలా సంప్రదాయబద్ధంగా, నెమ్మదిగా ఆడే ఆటగాళ్లకు ప్రచారం తక్కువే. అభిమానులు కూడా అలాంటి ఆటగాళ్లను పెద్దగా పట్టించుకోరు. కానీ జట్టు విజయాల్లో అతడి పాత్ర.. అతడి ఇన్నింగ్స్‌ల విలువ మాత్రం తక్కువ కాదు! భారీ ఇన్నింగ్స్‌లు ఆడుతున్నపుడు, తనపై ప్రశంసలు కురుస్తున్నపుడూ పొంగిపోడు, విర్రవీగడు. తనపై చిన్నచూపు చూసినపుడూ అసహనం ప్రదర్శించడు. గుర్తింపు, పేరు ప్రఖ్యాతులతో సంబంధం లేకుండా తన శైలిలో తాను ఆడుతూ మౌనంగా సాగిపోవడం.. పుజారా పరిణతిని తెలియజేస్తుంది. కొలంబోలో గురువారం ఆరంభమయ్యే మ్యాచ్‌తో 50 టెస్టుల ఘనతను పూర్తి చేసుకోనున్న చెతేశ్వర్.. శతక టెస్టుల మైలురాయిని కూడా అందుకోదగ్గ వాడే అనడంలో ఎలాంటి సందేహం లేదు!

– ఈనాడు క్రీడావిభాగం

అతణ్ని ఆపేదెవరు!



బోల్ట్



డిగ్రాస్



గాట్లిన్

మానవ చిరుత ఉసేన్ బోల్ట్ ఆఖరి వేటకు సిద్ధమవుతున్నాడు. దశాబ్ద కాలంగా స్ప్రింట్ ట్రాక్‌పై ఏకఛత్రాధిపత్యం ప్రదర్శించిన బోల్ట్.. త్వరలోనే విశ్రాంతి తీసుకోబోతున్నాడు. అథ్లెటిక్స్‌లో 8 ఒలింపిక్ స్వర్ణాలు.. 11 ప్రపంచ ఛాంపియన్‌షిప్ పసిడి పతకాలు.. 100, 200 మీ పరుగులో ప్రపంచ రికార్డులు.. ఇలా ఎన్నో ఘనతలు సొంతం చేసుకున్న జమైకా కెరటం బోల్ట్.. ఇంకో మూడు రోజుల్లో మొదలయ్యే ప్రపంచ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ సందర్భంగా తన చివరి రేసులో పోటీపడబోతున్నాడు. మరి దశాబ్ద కాలంగా జైత్రయాత్ర సాగిస్తున్న బోల్ట్‌ను అతడి చివరి రేసులో అయినా ఓడించే సత్తా వేరే అథ్లెట్లకు ఉందా?

ఈనాడు క్రీడావిభాగం

బోల్ట్ పరుగెత్తే ఏ రేసు చూసినా దాదాపు ఒకే దృశ్యం... రేసు ముగిసే దశలో ముందు అతను.. వెనుక మిగిలిన వాళ్లు! ఇతర క్రీడల్లో దిగ్గజాలకు సవాలు విసిరే వాళ్లు చాలామందే ఉంటారు. కానీ స్ప్రింట్‌లో బోల్ట్ మాత్రం ఒకే ఒక్కడు. అతనికి అతనే పోటీ!! రేసులో అతణ్ని కొంతదూరమైనా వెనక్కి నెట్టగలిగితే వాళ్లు గొప్ప విజయం సాధించినట్లే! అసాఫా పావెల్, యొహాన్ బ్లేక్, జస్టిన్ గాట్లిన్ మాత్రమే బోల్ట్‌కు ఒక మాదిరి పోటీ ఇచ్చేవాళ్లు. అయితే ఇప్పుడు పావెల్ లేడు. బ్లేక్ గాయాలతో వస్తూ పోతున్నాడు.. గాట్లిన్‌లో స్థిరత్వం లేదు. 2016 రియో ఒలింపిక్స్ తర్వాత 100 మీ పరుగులో అతను పెద్దగా రాణించలేదు. నాసూ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో 4×100 మీ రిలేలో మాత్రం అతను స్వర్ణం గెలుచుకున్నాడు. అలాగని అతణ్ని తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. ఐతే వీళ్లందరితో పోలిస్తే బోల్ట్‌కు గట్టి పోటీ ఇవ్వగలడని భావిస్తున్న వాళ్లలో 22 ఏళ్ల ఆంద్రీ డిగ్రాస్(కెనడా) ముందున్నాడు. డిగ్రాస్ మంచి ఫామ్‌లో ఉన్నాడని బోల్ట్ కూడా మెచ్చుకున్నాడు. రియో ఒలింపిక్స్‌లో 100 మీ., 200 మీ. పరుగులో డిగ్రాస్ బోల్ట్‌కు సమీపంగా పరుగెత్తాడు. 100 మీ. పరుగులో కాంస్యం గెలిచిన అతను.. 200 మీ. రేసులో రజతం, 4×100 మీ. రిలేలో కాంస్యం నెగ్గాడు. 100 పరుగును అతను 9.91 సెకన్లలో పరుగెత్తి మూడో స్థానం సాధించాడు. ఒకే ఒలింపిక్స్‌లో మూడు పతకాలు గెలిచిన తొలి కెనడా స్ప్రింటర్ అతనే. మరి లండన్ రేసులో బోల్ట్‌ను ఓడించి అతని వారసుడినని ప్రపంచానికి చాటే సత్తా ఆంద్రీకి ఉందేమో చూడాలి. ఈ ఏడాది స్టాక్‌హోమ్ డైమండ్ లీగ్‌లో డి గ్రాస్ 9.69 మీటర్లలో లక్ష్యాన్ని చేరి స్వర్ణం నెగ్గాడు. ఇదే రేసులో అతను గాట్లిన్‌ను కూడా ఓడించాడు. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో బోల్ట్ 100 మీ. పరుగుతో పాటు 4×100 మీ. రిలేలో పాల్గొనబోతున్నాడు. తన పేరిట ఉన్న 100 మీ.ు ప్రపంచ రికార్డు (9.58 సె)ను ఆఖరి రేసులో బద్దలు కొట్టే సామర్థ్యం 30 ఏళ్ల బోల్ట్‌కు ఇప్పుడు ఉందని అనుకోలేం. ఇటీవల మొనాకోలో జరిగిన డైమండ్ లీగ్ రేసులో 100 మీ. పరుగును 9.95 సెకన్లలో లక్ష్యాన్ని పూర్తి చేసి స్వర్ణం గెలిచిన ఈ స్ప్రింట్ రారాజు.. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో 200 మీ. పరుగులో పాల్గొనబోవడం లేదు. రికార్డుల సంగతి పక్కనపెడితే 100 మీ. పరుగులో చివరిగా తన ఆధిపత్యాన్ని నిరూపించి తప్పుకోవాలనేదే బోల్ట్ లక్ష్యం.

టైటిల్‌పై ప్రణయ్, కశ్యప్ గురి

ఆక్లాండ్: భారత స్టార్ షట్లర్లు పారుపల్లి కశ్యప్, హెచ్ ఎస్ ప్రణయ్ మంగళవారం ప్రారంభం కానున్న న్యూజిలాండ్ గ్రాండ్ ప్రి బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పురుషుల సింగిల్స్ టైటిలే లక్ష్యంగా బరిలో దిగనున్నారు. ఇటీవలే యుఎస్ ఓపెన్ గ్రాండ్ ప్రి టోర్నీలో వీళ్లిద్దరు ఫైనల్ చేరగా.. ప్రణయ్ టైటిల్ కైవసం చేసుకున్నాడు. పురుషుల సింగిల్స్‌లో ప్రణయ్, కశ్యప్‌తో పాటు అజయ్ జయరాం కూడా పోటీలో ఉన్నాడు. తొలి మ్యాచ్‌లో హిరెన్ రుస్తావిటో (ఇండోనేసియా)తో ప్రణయ్ తలపడనుండగా, ఇండోనేసియా కుర్రాడు రుంబకతో కశ్యప్ పోటీపడుతున్నాడు. ఆగస్టులో జరిగే ప్రపంచ ఛాంపియన్‌షిప్ కోసం సిద్ధమవుతున్న అజయ్ జయరాం ఈ టోర్నీలో సత్తా చాటాలనే పట్టుదలతో ఉన్నాడు.



కశ్యప్

బలహీన రుచి బుడిపెలతో... స్థూలకాయం ముప్పు!

న్యూయార్క్: 'ఆహా ఏమి రుచి! తినరా మైమరచి' అని ఆస్వాదనగా పాడుకోవాలంటే, నాలుకపై స్వాదాంకురాల (టేస్ట్‌బడ్స్) సామర్థ్యం ఏమాత్రం తీసిపోకూడదు. అవి ఏమాత్రం బలహీనపడినా.. ఏదీ అంతగా రుచించదు. ఇలాంటివారు తీపి, అధిక క్యాలరీలుండే ఆహార పదార్థాలను అతిగా తిని, స్థూలకాయులయ్యే ముప్పు లేకపోలేదంటున్నారు.. కార్నెల్ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు. అధిక బరువు, రుచి బుడిపెల మధ్య సంబంధంపై పరిశోధన చేపట్టిన రాబిన్ డాన్డో బృందం.. కొందరిలో స్వాదాంకురాల సామర్థ్యాన్ని 20% తగ్గించి, వారికి పలు రకాల ఆహార పదార్థాలు అందించింది. అయితే, వారు తెలియకుండానే తీపి, క్యాలరీలు అధికంగా ఉండే ఆహార పదార్థాలను ఎక్కువగా తినడం గమనార్హం. స్థూలకాయానికి రుచి గ్రాహక వ్యవస్థ కూడా కారణమవుతున్నట్లు గుర్తించామని, రుచి బుడిపెల్లో సామర్థ్య లోపాలను సవరించుకోవడం ద్వారా అధిక క్యాలరీల ఆహారం జోలికి పోకుండా జాగ్రత్తపడొచ్చని రాబిన్ సూచించారు.

కేకు పైన కొవ్వొత్తులతో అనారోగ్య సమస్యలు!



లండన్: పుట్టిన రోజున కేక కోసి.. బంధుమిత్రులతో సంబరాలు చేసుకోవడం ఎవరికైనా సంతోషదాయకం. కేక మీద కొవ్వొత్తులు వెలిగించి వాటిని నోటితో ఊది ఆర్పడం మాత్రం అంత శ్రేయస్కరం కాదని తాజా పరిశోధన చెబుతోంది. ముఖ్యంగా పిల్లలు ఇలా నోటితో ఊదే క్రమంలో వారి నోటి నుంచి ఎంతోకొంత లాలాజలం తుంపరలుగా కేకు మీద పడుతుంది. సాధారణంగా నోటిలో ఎక్కువ బ్యాక్టీరియా ఉంటుంది. అదంతా హానికరం కాదు. కానీ ఇలా లాలాజలం తుంపరలలోని బ్యాక్టీరియా.. కేకుపైన అలంకరించే ఐసింగ్ పొరపై పడగానే విపరీతంగా పెరిగిపోతుందని దక్షిణ కరోలినాలోని క్లెమ్సన్ యూనివర్సిటీ పరిశోధకులు చెబుతున్నారు. నోటి నుంచి వెలువడే బ్యాక్టీరియా ఐసింగ్ మీద పడగానే 14 రెట్లు పెరుగుతుందని గుర్తించారు. అయితే ఇది ఆరోగ్యానికి అంతగా హానికలిగించదని.. పుట్టిన రోజు చేసుకునే పిల్లలు ఏదైనా అనారోగ్యంతో ఉండి.. ఇలా కొవ్వొత్తులను ఊదే పనిచేస్తే మాత్రం ఇతరులకూ సమస్యేనని వివరిస్తున్నారు.

టైటాన్‌పై జీవం ఉనికి జాడ!

★ తొలిసారిగా గుర్తించిన అమెరికా శాస్త్రవేత్తలు



న్యూయార్క్: గ్రహాంతర జీవుల ఉనికిని గుర్తించే దిశగా శాస్త్రవేత్తలు మరింత ముందంజ వేశారు! జీవం పుట్టుకకు ఆదికణంగా పరిగణించే 'వినైల్ సయనైడ్ (ఏక్రిలో నైట్రైల్)' అణువులను శనిగ్రహ చంద్రుల్లో అతి పెద్దదైన 'టైటాన్'పై మీథేన్ సముద్రాల్లో తొలిసారి గుర్తించినట్లు అమెరికాలోని కార్నెల్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు తాజాగా వెల్లడించారు. ఆక్సిజన్ రహిత టైటాన్‌పై మీథేన్‌లో విలక్షణ జీవులున్నాయో లేదో విశ్లేషించేందుకు ఈ అణువులు దోహదపడుతాయని తెలిపారు. శనిగ్రహానికి మరో చంద్రుడైన ఎన్‌సెలాడస్‌పై సాధారణంగా భూమిపై ఉండే మాదిరి జీవుల ఉనికి లభ్యమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. టైటాన్‌పై ద్రవీకృత మీథేన్‌లో మాత్రం అందుకు భిన్నంగా అత్యంత విలక్షణ జీవం ఉనికి బయటపడే అవకాశముందని వివరించారు.

ఇంధనంగా కార్బన్ డైఆక్సైడ్!

★ సరికొత్త పదార్థాన్ని కనుగొన్న శాస్త్రవేత్తలు

వాషింగ్టన్: భూతాపానికి కారణమవుతున్న కార్బన్ డైఆక్సైడ్‌కు శాస్త్రవేత్తలు సరికొత్త విరుగుడును కనుగొన్నారు. హానికరమైన ఈ వాయువును ఇంధనంగా మార్చడంలో సాయపడే ఒక పదార్థాన్ని అభివృద్ధి చేశారు. ఈ ప్రక్రియలో అవాంఛనీయ ఉత్పత్తులేవీ వెలువడకపోవడం విశేషం. ఈ కొత్త పదార్థం స్పాంజిలా ఉంటుంది. నికెల్ సేంద్రియ స్ఫటిక ఆకృతితో కూడిన ఈ పదార్థంపైకి కాంతిని ప్రసరింపచేసినప్పుడు అద్భుత లక్షణాన్ని ప్రదర్శించింది. కార్బన్ డైఆక్సైడ్‌ను కార్బన్ మోనాక్సైడ్‌గా వాయువుగా మార్చేసింది. అనంతరం ఈ వాయువును ద్రవ ఇంధనాలు, ద్రావకాలు, ఇతర ప్రయోజనకర ఉత్పత్తులుగా మార్చవచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు. హైడ్రోజన్, మీథేన్ వంటి ఇతర వాయువుల ఆచూకీ లేకుండానే కార్బన్ మోనాక్సైడ్‌ను ఉత్పత్తి చేసినట్లు అమెరికా ఇంధన శాఖకు చెందిన లారెన్స్ బర్కెలీ నేషనల్ లేబొరేటరీ శాస్త్రవేత్త హైమేయ్ జెంగ్ చెప్పారు. వినూత్న లేజర్ రసాయన విధానాన్ని ఉపయోగించి ఈ కొత్త పదార్థాన్ని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు.

హృద్రోగానికి వ్యాకులత తోడైతే... మరణ ముప్పు రెండింతలు!



వాషింగ్టన్: 'హృద్రోగులూ! ఇసుమంత వ్యాకులతనైనా దరిచేరనీయకండి' అంటున్నారు... 'ఇంటర్నేషనల్ మెడికల్ సెంటర్-హార్ట్ డిసీజ్' పరిశోధకులు. కారణమేదైనా.. గుండె జబ్బుకు కుంగుబాటు కూడా తోడైతే, మరణ ముప్పు రెండింతలు అధికమవుతుందని హెచ్చరిస్తున్నారు. పరిశోధకురాలు మే బృందం... 24,138 మంది హృద్రోగుల ఆరోగ్య వివరాలు సేకరించింది. వారిలో 15% మంది కుంగుబాటుతోనూ బాధపడుతున్నారు. కొన్నేళ్లకు వారిలో మరణ రేటును విశ్లేషించగా... కేవలం గుండె జబ్బుతో బాధపడే వారికంటే, కుంగుబాటు కూడా ఉన్నవారికి మరణముప్పు రెండింతలు అధికమని తేలింది. "డిప్రెషన్ దుష్ప్రభావాలు అన్నీఇన్నీ కావు. మూత్రపిండాలు, గుండె వైఫల్యం, మధుమేహం, అధిక రక్తపోటు, పక్షవాతానికి ఇదే ముఖ్య కారణమవుతోంది. హృద్రోగానికి చికిత్స పొంది, అంతా సవ్యంగా ఉన్నాసరే... ఎప్పటికప్పుడు మానసిక నిపుణులను కలిసి, ఆరోగ్యాన్ని పదిలపరచుకోవడం మంచిది" అని చెబుతున్నారు పరిశోధకులు!

డిజిటల్ విద్యకు 17 సూత్రాల ప్రణాళిక

- లక్ష్య సాధనకు ఈ ఏడాది డిసెంబరు తుది గడువు
- ఉపకులపతులకు కేంద్ర మానవ వనరులశాఖ నిర్దేశం

ఈనాడు - హైదరాబాద్

ఉన్నత విద్యను డిజిటల్‌మయంగా మార్చి విద్యార్థులకు మరింత ప్రయోజనం కలిగించాలన్న లక్ష్యంతో కేంద్ర మానవ వనరులశాఖ '17 అంశాల కార్యాచరణ ప్రణాళిక'ను రూపొందించింది. దీన్ని ఈ ఏడాది చివరికి లక్ష్యాన్ని సాధించాలని విశ్వవిద్యాలయాలను ఆదేశించింది.

1. వచ్చే సెమిస్టర్‌లో అందించే ఆన్‌లైన్ కోర్సులను స్వయం వెబ్‌సైట్‌లో ఉంచారు. వాటిపై అకడమిక్ కౌన్సిల్ లేదా సెనేట్ ఆమోదం పొందాలి. దానివల్ల విద్యార్థులు కోర్సులను ఎంచుకుంటారు. వాటికి క్రెడిట్లు ఇచ్చుకోవచ్చు.
2. స్వయం కోర్సులపై పోస్టర్లు ముద్రించాలి. సోషల్ మీడియాలోనూ ప్రచారం చేపట్టాలి.
3. విశ్వవిద్యాలయాల్లో ప్రతిభావంతులైన ఆచార్యులుంటే వారిని కోర్సుల రూపకల్పన చేయాలని ప్రోత్సహించాలి. జాతీయ సమన్వయకర్త(ఐఐటీ ఖరగ్‌పూర్)కు పంపి అందుకు నిధులు పొందొచ్చు.
4. ఆచార్యులు ఇంటివద్ద స్వయం వీడియోలు చూసి తరగతిలో చర్చ పెట్టాలి.
5. ప్రతి వర్సిటీ డిజిటల్ లెర్నింగ్ పర్యవేక్షణ విభాగం ఏర్పాటు చేసుకోవాలి. అది ఇప్పుడున్న కోర్సులను సమీక్షించి సూచనలివ్వాలి.
6. స్వయంప్రభ ఛానెళ్లుచూసేందుకు డీడీ ఫ్రీ డిష్‌ను కార్యాలయంలోపెట్టుకోవాలి. తరగతిగదుల్లోనూ ఏర్పాటుచేసుకోవాలి. అనుబంధ కళాశాలల్లో తప్పనిసరి.
7. ఆచార్యులకు అవగాహన సదస్సు నిర్వహించాలి.
8. విశ్వవిద్యాలయాలు, అనుబంధ కళాశాలలు డిజిటల్ గ్రంథాలయంలో చేరాలి. దీనిపై 80 లక్షల డిజిటల్ పుస్తకాలను ఉచితంగా చదువుకోవచ్చు.
9. గ్రంథాలయాలలోని పుస్తకాలను డిజిటల్‌గా మార్చి ఐఐటీ ఖరగ్‌పూర్‌లోని జాతీయ డిజిటల్ గ్రంథాలయంతో అనుసంధానమవ్వాలి.
10. విద్యార్థుల ధ్రువపత్రాలను డిజిటలీకరించేందుకు అకడమిక్ డిపాజిటరీలో చేరాలి. గతంలోని ధ్రువపత్రాలనూ అప్‌లోడ్ చేయవచ్చు.
11. ప్రవేశాలు, విద్యా కాలమానిని, హాజరు, పరీక్షలు, ఫలితాల విడుదల, పరిపాలన, వేతనాలు, ఆర్థికపర వ్యవహారాలను కంప్యూటరీకరించాలి.
12. నీరు, విద్యుత్తు, వ్యర్థాలను సమర్థంగా వాడుకునేందుకు ప్రణాళిక రూపొందించుకోవాలి. సౌర విద్యుత్తు, నీటి పునర్వినియోగం తదితర వాటిపై దృష్టి కేంద్రీకరించాలి.
13. ప్రతి విద్యాసంస్థ స్వచ్ఛభారత్ అభియాన్‌లో భాగస్వామ్యమై పరిశుభ్రమైన ప్రాంగణంగా మారాలి. మరుగుదొడ్లు, శౌచాలయాలు శుభ్రంగా ఉంచుకోవాలి. ఘన, ద్రవ వ్యర్థాలనిర్వహణకు విధానంరూపొందించుకోవాలి. దీనిపై స్వచ్ఛర్యాంకులు, నగదుబహుమానాలు ఇస్తారు.
14. ఆర్థిక చెల్లింపులన్నీ డిజిటల్ రూపంలో జరగాలి.
15. ప్రతి విశ్వవిద్యాలయం 5 గ్రామాలను దత్తత తీసుకొని వారికి జ్ఞానం అందించాలి.
16. విద్యార్థులు విభిన్నంగా ఆలోచించేందుకు ప్రభుత్వం, వివిధ సంస్థలు నిర్వహించే హ్యాకథాన్ పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలి.
17. భవిష్యత్తు కోసం ప్రతి విశ్వవిద్యాలయం ప్రణాళిక రూపొందించుకోవాలి. అందుకు ప్రాంగణంలో ఓ బృందాన్ని ఏర్పాటు చేసుకోవాలి. వచ్చే 15 సంవత్సరాల్లో సంస్థ ఏస్థాయిలో ఉండాలో దార్శనిక పత్రం రూపొందించుకోవాలి. లక్ష్యాన్ని చేరుకోవడానికి ఏడేళ్ల మధ్యంతర ప్రణాళిక, వెంటనే మార్పునకు మూడేళ్ల కార్యాచరణ ప్రణాళిక తయారు చేసుకోవాలి.

ఆగస్టు 15లోగా రజకుల ఆర్థికాభివృద్ధి పథకం ప్రారంభం

- అధికారికంగా చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవం
- మంత్రి జోగు రామన్న వెల్లడి

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: రజక వృత్తిని ఆధునికీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం రూ.250 కోట్ల నిధులు కేటాయించిందని మంత్రి జోగు రామన్న పేర్కొన్నారు. ఆధునిక యంత్రాలను అందించే ఈ పథకాన్ని ఆగస్టు 15లోపునే ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించడానికి సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో వస్త్రాలు ఉతికే యంత్రాల ప్రదర్శన, అవగాహన సదస్సు సోమవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ మొదటి విడత గ్రామస్థాయిలో 3339 మంది రజక సహకార సమాఖ్యల అనుబంధ సంఘాల సభ్యులకు, గ్రామ, మండల ఇలా వివిధ స్థాయుల్లో 8512 మందికి యంత్రాలను అందజేయనున్నట్లు తెలిపారు. చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించేలా సీఎంతో మాట్లాడి ఒప్పించేందుకు యత్నిస్తామన్నారు. ట్యాంక్‌బండ్‌పై ఆమె విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తానని రామన్న హామీ ఇచ్చారు. ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ మాట్లాడుతూ కులవృత్తుల వారికి నేరుగా బ్యాంకుల ద్వారా చేయూతనందించేందుకు సీఎం చర్యలు తీసుకుంటున్నారన్నారు. బీసీ కమిషన్ ఛైర్మన్ డా.బి.ఎస్.రాములు, ఎంబీసీ కార్పొరేషన్ ఛైర్మన్ తాడూరి శ్రీనివాస్, బీసీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి అశోక్‌కుమార్, ప్రభుత్వ సలహాదారు రాంలక్ష్మణ్, బీసీ కమిషన్ సభ్యులు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ఆంజనేయ గౌడ్ పాల్గొన్నారు.



వివిధ రకాల వస్త్రాలు ఉతికే ఆధునిక యంత్రాలు



యంత్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి జోగు రామన్న

పాత ప్రవేశాలపై విచారణ చేయం

- మెడికల్ సీట్ల కేసులో సుప్రీంకోర్టు వెల్లడి

ఈనాడు - దిల్లీ

వైద్యవిద్యలో ఏకీకృత ప్రవేశ పరీక్ష (నీట్) అమలులో ఉండడంతో ఇక 2013 ప్రవేశాలపై విచారణ చేయబోమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 2013లో మేనేజ్‌మెంట్ కోటాలో కామినేని (నల్గొండ, ఎల్‌బీనగర్), మెడిసిటీ (హైదరాబాద్), ఎన్‌ఆర్‌ఐ (గుంటూరు), ఎస్‌వీఎస్ (మహబూబ్‌నగర్) కళాశాలలు తమకు ప్రవేశాలు కల్పించలేదని, తమకంటే తక్కువ మార్కులు వచ్చిన వారికి సీట్లు ఇచ్చాయంటూ పలువురు విద్యార్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సోమవారం జస్టిస్ మదన్.బి.లోకూర్, జస్టిస్ దీపక్‌గుప్తాలతో కూడిన ధర్మాసనం ఈ కేసు విచారించింది. యాజమాన్యాల తరఫున అల్లంకి రమేశ్ వాదనలు వినిపిస్తూ.. ప్రవేశాలు కోరిన అభ్యర్థులు ద్వితీయ సంవత్సరానికి బ్యాంకు పూచీ ఇవ్వలేదని, తగిన ధ్రువపత్రాలు అందజేయలేదని చెప్పారు. ప్రస్తుతం నీట్ అమలులోకి వచ్చిందని మేనేజ్‌మెంట్ కోటా కూడా నీట్ పరిధిలోనే ఎంపిక చేస్తున్నారని తెలిపారు. తమకు నష్టపరిహారం ఇప్పించాలని పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది ఆదినారాయణరావు కోర్టుకు విజ్ఞప్తిచేశారు. మూడున్నరేళ్లు గడిచిన నేపథ్యంలో ఇక ఈ కేసు విచారణ చేయలేమని, ప్రత్యామ్నాయం ఉందని భావిస్తే పిటిషనర్ సివిల్ సూట్ దాఖలు చేసుకోవచ్చని సూచించిన ధర్మాసనం పిటిషన్‌ను కొట్టివేసింది.

తితిదే పాతనోట్ల మార్పిడి పిటిషన్ కొట్టివేత

తిరుమల తిరుపతి దేవస్థానం వద్ద ఉన్న పాత రూ.500 నోట్లు, రూ. 1000 నోట్లను మార్చుకునే సౌలభ్యాన్ని కల్పించాలంటూ వి.వి.రమణమూర్తి అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జగదీశ్‌సింగ్ ఖేహర్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం ఈ కేసు విచారించింది. పిటిషన్‌లో విచారణ అర్హత (మెరిట్) లేదని ధర్మాసనం స్పష్టం చేసింది.

పొరుగు సేవల ఉద్యోగుల క్రమబద్ధీకరణపై విచారించండి

- హైకోర్టును అభ్యర్థించిన పిటిషనర్ తరఫు న్యాయవాది
- ఇందుకు అంగీకరించిన ధర్మాసనం

ఈనాడు, హైదరాబాద్: విద్యుత్తు సంస్థల్లో పనిచేస్తున్న పొరుగు సేవల ఉద్యోగులను విలీనం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, ఈ ప్రక్రియను సవాల్జేస్తూ వరంగల్ జిల్లాకు చెందిన నిరుద్యోగి గతంలో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టాల్సిన అవసరముందని సోమవారం పిటిషనర్ తరఫు న్యాయవాది ఉమ్మడి హైకోర్టును అభ్యర్థించారు. దీనిపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవిల ధర్మాసనం ఈపిటిషన్‌పై మంగళవారం విచారణ చేపట్టడానికి అంగీకరించింది. తమ సంస్థల్లో పనిచేస్తున్న సుమారు 24 వేల మంది పొరుగుసేవల ఉద్యోగుల విలీనం నిమిత్తం తెలంగాణ ట్రాన్స్‌కో, తెలంగాణ ఎస్‌పీడీసీఎల్, ఎన్‌పీడీసీఎల్‌లు జూన్ 1, 2 తేదీల్లో జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను సవాల్జేస్తూ వరంగల్ జిల్లాకు చెందిన నిరుద్యోగి ఎం.శ్రవణ్‌కుమార్ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై జూన్ 29న విచారణ సందర్భంగా విలీన ప్రక్రియ ఇప్పటికిప్పుడు సాధ్యం కాదని, అర్హులైన వారి పూర్వాపరాలను తెలుసుకోవడానికి కమిటీ ఏర్పాటు చేశామని విద్యుత్తు సంస్థల తరఫు న్యాయవాది విన్నవించారు. దీనికి ఏకీభవించిన హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులకు నిరాకరిస్తూ విచారణను వాయిదా వేసింది. విలీనానికి సంబంధించి ఏదైనా ప్రాథమిక నిర్ణయం తీసుకుంటే తమదృష్టికి తీసుకురావచ్చని కోర్టు పేర్కొంది. ఇటీవల పొరుగుసేవల ఉద్యోగులను విలీనం చేస్తూ ఉత్తర్వులిచ్చిన నేపథ్యంలో పిటిషనర్ తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు.

అబద్ధపు సాక్ష్యాల సృష్టి అతిపెద్ద నేరం!

- సుప్రీంకోర్టు ఉద్ఘాటన
- ఆగస్టు 21న తదుపరి విచారణ

దిల్లీ: అబద్ధపు సాక్ష్యాల సృష్టి అనేది అత్యంత తీవ్రమైన నేరం అని సుప్రీంకోర్టు సోమవారం ఉద్ఘాటించింది. గోద్రా ఘటన అనంతరం అల్లర కేసులో సామాజిక కార్యకర్త తీస్తా సీతల్వాద్ దాఖలు చేసుకున్న ఓ అప్పీలుపై సోమవారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. 2002 నాటి గోద్రా ఘటన అనంతర అల్లర్ల కేసులో తీస్తా సీతల్వాద్ మాజీ సహాయకుడు రయీస్‌ఖాన్ పఠాన్‌పై దర్యాప్తు చేపట్టాలనడాన్ని ఆమె వ్యతిరేకించారు. ఈ కేసు విచారణ సందర్భంగా సోమవారం ధర్మాసనం ఆమెపై ప్రశ్నల వర్షం కురిపించింది. ఈ కేసులో పఠాన్‌పై దర్యాప్తు జరపాలన్న సంబంధిత మెజిస్ట్రేట్ న్యాయస్థానం ఉత్తర్వులను గుజరాత్ హై కోర్టు సమర్థించడాన్ని తీస్తా సీతల్వాద్ వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం గమనార్హం. కోర్టు సాక్షిగా ఉంటానంటూ పఠాన్ వేసుకున్న పిటిషన్‌ను న్యాయస్థానం తోసిపుచ్చిన నేపథ్యంలో ఆయనపై దర్యాప్తు కొనసాగించాలనడాన్ని తీస్తా తరఫు న్యాయవాది కపిల్‌సిబాల్ ప్రశ్నించారు. ఒకప్పుడు తీస్తా సారథ్యంలోని స్వచ్ఛందసంస్థలో సహాయకుడిగా పనిచేసిన పఠాన్‌ను ఆ తర్వాత ఆమె తొలగించడానికి సంబంధించిన వివరాలపై ధర్మాసనం కపిల్‌సిబాల్‌ను ప్రశ్నించింది. పఠాన్ ఆ ఎన్జీవోలో ఓ క్షేత్రస్థాయి కార్యకర్తమాత్రమేనని సిబాల్ చెప్పారు. అతడిని తొలగించిన తర్వాత నుంచీ ఓ రాజకీయ దురుద్దేశంతో పఠాన్ వివిధ అల్లర్లకేసుల్లో దరఖాస్తులు వేస్తూ పోతున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే జస్టిస్. అరుణ్ మిశ్రా, జస్టిస్. అమితవ రాయ్‌లతో కూడిన ధర్మాసనం స్పందిస్తూ ఎవరు చేసినా సరే(అటు పఠాన్ అయినా...ఇటు తీస్తా సారథ్యంలోని ఎన్జీవో అయినా) అసత్య సాక్ష్యాల సృష్టి అనేది అత్యంత తీవ్రమైన నేరం అని పేర్కొంది. ఈ అంశాన్ని తాము కచ్చితంగా పరిశీలిస్తామంది. తదుపరి విచారణను ధర్మాసనం ఆగస్టు 21వ తేదీకి వాయిదా వేసింది.

తాళాలు తెరిచి..ఆ గదులను అప్పగించండి

- భాగ్యనగర్ తెలంగాణ ఎన్జీవో సంఘానికి హైకోర్టు ఆదేశం
- 'ఏపీ ఎన్జీవో భవన్'లో తెలంగాణ సభ్యులకూ సౌకర్యాలు కల్పించాలని స్పష్టం

ఈనాడు, హైదరాబాద్: గన్‌ఫౌండ్రీ వద్ద ఉన్న ఏపీ ఎన్జీవో భవన్‌లో కొన్ని గదులకు ఏర్పాటు చేసిన బోర్డులను తొలగించడంతోపాటు..గదులకు వేసిన తాళాలు తెరిచి, వాటిని ఏపీ ఎన్జీవో అసోసియేషన్‌కు అప్పగించాలని 'భాగ్యనగర్ తెలంగాణ ఎన్జీవో అసోసియేషన్'కు హైకోర్టు స్పష్టంచేసింది. ఆ గదులను ప్రత్యేకంగా వినియోగించుకోవడానికి వీల్లేదని తేల్చిచెప్పింది. ఏపీ ఎన్జీవో సంఘంలో సభ్యత్వం కోసం ఏటా చెల్లించే చందా(సబ్‌స్క్రిప్షన్)ను రెండువారాల్లో బకాయిలతోపాటు ఆ సంఘానికి చెల్లించాలని తేల్చిచెప్పింది. ఎన్జీవో భవన్‌లోని సదుపాయాల్ని వినియోగించుకోవడానికి భాగ్యనగర్ తెలంగాణ ఎన్జీవో అసోసియేషన్ సభ్యులనూ అనుమతించాలని ఏపీ ఎన్జీవో అసోసియేషన్‌కు స్పష్టంచేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవితో కూడిన ధర్మాసనం సోమవారం ఈమేరకు తీర్పు వెల్లడించింది. హైదరాబాద్‌లోని గన్‌ఫౌండ్రీలో ఉన్న 'ఏపీ ఎన్జీవో అసోసియేషన్'కు చెందిన భవన్/హోమ్‌లో కొంతభాగాన్ని భాగ్యనగర్ తెలంగాణ ఎన్జీవో అసోసియేషన్‌కు కేటాయిస్తూ తెలంగాణ సాధారణ పరిపాలన శాఖ జారీచేసిన జీవో ఆధారంగా..హైదరాబాద్ జిల్లా కలెక్టర్, ఆర్డీఓ జారీచేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ ఏపీఎన్జీవో అధ్యక్షుడు అశోక్‌బాబు హైకోర్టులో వ్యాజ్యం దాఖలుచేశారు. ఇటీవల ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన హైకోర్టు సింగిల్‌జడ్జి..భవనం వ్యవహారంలో రెవెన్యూ అధికారుల జోక్యంపై అభ్యంతరం వ్యక్తంచేశారు. అధికారులు జారీచేసిన ఉత్తర్వులను 8వారాలపాటు సస్పెండ్ చేశారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాలు చేస్తూ భాగ్యనగర్ తెలంగాణ ఎన్జీవో అసోసియేషన్ హైకోర్టు ధర్మాసనం ఎదుట అప్పీలు దాఖలు చేసింది. ఈ అప్పీల్‌పై విచారణ జరిపిన ధర్మాసనం ఈ మేరకు తీర్పుచెప్పింది.

భావ వ్యక్తీకరణ స్వేచ్ఛపై ఏజీ సాయం కోరిన సుప్రీం

ఆజంఖాన్‌పై చర్యలు తీసుకోవాల్సిందే: కేంద్రం

దిల్లీ: మంత్రులు, లేదా అలాంటి ఇతర ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ అధికారిక లావాదేవీల సంబంధిత సమాచారంపై అభిప్రాయాలను వ్యక్తం చేసేటప్పుడు 'భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ'ను పొందవచ్చా అనే విషయమై న్యాయపరమైన అంశాల్లో సహకరించాల్సిందిగా భారత అటార్నీ జనరల్ (ఏజీ) కె.కె.వేణుగోపాల్‌ను సుప్రీంకోర్టు కోరింది. ఈ విషయంలో ఉండే పరిమితులపై తాము, న్యాయస్థాన సహాయకులు- ఎఫ్.ఎస్.నారీమన్, హరీశ్ సాల్వేలు సంధించిన ప్రశ్నలపై ఏజీ సాయం అందించాలని జస్టిస్ దీపక్ మిశ్ర, జస్టిస్ ఎ.ఎం.ఖాన్‌విల్కర్‌ల ధర్మాసనం సూచించింది. యూపీలోని బులంద్‌షహర్‌లో గత ఏడాది జులై 29న తల్లీకూతుళ్లపై జరిగిన సామూహిక అత్యాచారాన్ని 'రాజకీయ వివాద ఫలితమే'నని వ్యాఖ్యానించిన ఆ రాష్ట్ర మాజీ మంత్రి ఆజంఖాన్‌పై చర్యలు తీసుకోవాల్సిందేనని తొలుత వేణుగోపాల్ చెప్పారు. ఖాన్ న్యాయవ్యవస్థకు అడ్డంకులు కలిగించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. సోమవారం సుప్రీంకోర్టులో ఈకేసులో కేంద్రంతరఫున ఆయన వాదనలు వినిపించారు. మంత్రి స్థాయి వ్యక్తి నుంచి అలాంటి వ్యాఖ్యల్ని ఆమోదించలేమన్నారు. పౌర హక్కుల చట్టాన్ని రూపొందించాల్సిందిగా ఏజీని కోరాలని నారీమన్ సూచించారు. కేసులో తదుపరి విచారణ అక్టోబరు 5న జరగనుంది.

వర్ణ అంధత్వం ఉన్న విద్యార్థులు వైద్య కోర్సుల్లో చేరవచ్చా?

వైద్య కోర్సుల ప్రవేశపరీక్షలో మంచి ర్యాంకులు సాధించిన వర్ణ అంధత్వ విద్యార్థులను ఎంబీబీఎస్ కోర్సుల్లో చేర్చుకోవచ్చో లేదో చెప్పాలని భారత వైద్య మండలి (ఎంసీఐ)ని సుప్రీంకోర్టు సోమవారం ఆదేశించింది. వర్ణ అంధత్వం ఉన్న విద్యార్థులపై దశాబ్దాలుగా ఉన్న నిషేధాన్ని ఎత్తివేయాలని, ఈ లోపం కారణంగా చూపిస్తున్న వివక్ష చెల్లబోదని సుప్రీంకోర్టు నియమించిన సంఘం సిఫార్సు చేసిన నేపథ్యంలో ఎంసీఐ తన అభిప్రాయం చెప్పాలని సుప్రీంకోర్టు కోరింది. న్యాయమూర్తులు జస్టిస్ దీపక్ మిశ్ర, జస్టిస్ ఎ.ఎం.ఖాన్‌విల్కర్‌తో కూడిన ధర్మాసనం తదుపరి విచారణను సెప్టెంబరు 12కు వాయిదా వేసింది.

గుజరాత్ శాసనసభ్యుల విడిది మార్చాల్సిందే!

కాంగ్రెస్ నాయకత్వం దిశానిర్దేశం

బెంగళూరు నుంచి కొడగు జిల్లాకు పయనం?

ఈనాడు, బెంగళూరు: బెంగళూరులోని ఈగల్టన్ విలాస విడిదిలో మకాం చేసిన 45మంది తమ పార్టీ గుజరాత్ శాసనసభ్యులను మరో ప్రాంతానికి తరలించేందుకు కాంగ్రెస్ నాయకత్వం సన్నద్ధమవుతోంది. ఎట్టి పరిస్థితులలోనూ భాజపా వైపు మొగ్గకుండా వారిని సురక్షిత ప్రదేశానికి తరలించాల్సిందేనని భావిస్తోంది. ఇక్కడ మకాం చేసిన వారితో మంతనాలు సాగించేందుకు భాజపాకు చెందిన ఓబృందం అహ్మదాబాద్ నుంచి నగరానికి వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. ఆ బృందానికి స్థానికంగా స్థిరపడిన గుజరాతీలు సహకరిస్తున్నారు. అతిథులతో గుజరాత్ నుంచి వచ్చిన కమలనాధులు చరవాణి ద్వారా మంతనాలు సాగించే వీలుంది. అలాంటి అవకాశంలేని ప్రదేశానికి తరలిస్తే తప్ప కాంగ్రెస్ నేత అహ్మద్ పటేల్‌ను రాజ్యసభ ఎన్నికల్లో గెలిపించలేమని హస్తవాసులు భావిస్తున్నారు. ఇందుకు పడమటి కనుమలకు చేరువలోని కర్ణాటక స్విట్జర్లాండ్‌గా పేరుగాంచిన కొడగు జిల్లాలోని విలాస విడిదికి తరలించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

మా ఎమ్మెల్యేలను దొంగిలించే కుట్ర!

భాజపాపై కాంగ్రెస్ ఆరోపణలు

దిల్లీ: తమ పార్టీకి చెందిన గుజరాత్ ఎమ్మెల్యేలను 'దొంగిలించేందు'కు భాజపా కుట్ర పన్నుతోందని కాంగ్రెస్ ఆరోపించింది. అయినప్పటికీ అవసరానికి మించిన సంఖ్యాబలంతో తమ రాజ్యసభ అభ్యర్థి అహ్మద్ పటేల్ విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేసింది. సీనియర్ కాంగ్రెస్ నేతగానే అహ్మద్ పటేల్ పోటీ చేస్తున్నారు తప్ప.. సోనియా రాజకీయ కార్యదర్శిగా కాదని ఆ పార్టీ సీనియర్ ప్రతినిధి గులాం నబీ ఆజాద్ పేర్కొన్నారు. పటేల్ కనీసం 10-15 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధిస్తారన్నారు. తమ ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా భాజపా గుజరాత్‌లో వాతావరణాన్ని సృష్టిస్తోందని.. ప్రజలు వరదలతో అల్లాడుతుంటే కాంగ్రెస్ శాసనసభ్యులంతా బెంగళూరులో ఉన్నారని ప్రచారం చేస్తోందని విమర్శించారు. ఆవిధంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తిరిగివస్తే.. వారిలో కొందరిని దొంగిలించే ఆలోచనలో ఉందని ఆరోపించారు. విమానాశ్రయం నుంచే కాంగ్రెస్ ఎమ్మెల్యేలను తీసుకెళ్లేందుకు కుట్ర పన్నినట్లు ఆజాద్ ఆరోపణలు చేశారు.

ములాయంకు సుప్రీం మొట్టికాయ

- యూపీ సీఎంగా పనిచేసిన సమయంలో విద్యాసంస్థలకు అక్రమంగా రూ.100 కోట్ల నిధులు

దిల్లీ: ఉత్తర్‌ప్రదేశ్‌లోని విద్యాసంస్థలకు నిధుల మంజూరులో జరిగిన నిబంధనల అతిక్రమణలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తగు పరిశీలన, జవాబుదారీతనం లేకుండా ప్రజా ధనాన్ని ఇష్టారీతిగా ఎలా కేటాయిస్తారంటూ నిలదీసింది. సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకుడు ములాయం సింగ్ యాదవ్ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న సమయం(2002-03)లో రూ.100 కోట్లకు పైగా నిధుల కేటాయింపులకు సంబంధించి భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేఎస్ ఖేహర్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ వ్యవహారంపై ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వ ప్రతిస్పందనను రెండు వారాల్లో తెలియజేయాలని ఆదేశించింది. ఎటావాలోని చౌదరి చరణ్ సింగ్ కళాశాలకు రూ.35 కోట్లను నిబంధనలను అతిక్రమిస్తూ మంజూరు చేశారని కాగ్ తప్పు పట్టింది. ఈ కళాశాల పాలక మండలిలో ములాయం సోదరులు శివపాల్, రాంగోపాల్ యాదవ్ సభ్యులుగా ఉన్నారు. చౌదరి చరణ్ సింగ్ శతాబ్ది జయంత్యుత్సవాల సందర్భంగా ఆ కళాశాలకు భారీ మొత్తంలో నిధులు మంజూరు చేయటాన్ని సవాల్ చేస్తూ మహేంద్రనాథ్ రాయ్ అనే వ్యక్తి అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించగా న్యాయస్థానం పిటిషన్‌ను కొట్టివేసింది. దీనిని పిటిషనర్ సుప్రీంకోర్టులో సవాల్ చేయగా విచారణ సందర్భంగా తాజా ఆదేశాలు వెలువడ్డాయి.

తొండైమండల అధీనం పీఠాధిపతి అపహరణ

నిత్యానంద శిష్యులపై కేసు నమోదు

కాంచీపురం, న్యూస్‌టుడే: తమిళనాడులోని కాంచీపురం తొండైమండల అధీనం పీఠాధిపతి తిరువంబల జ్ఞానదేశికన్ స్వామిని కర్ణాటకలోని బిడది ఆశ్రమానికి చెందిన నిత్యానంద శిష్యులు అపహరించినట్లు శివకంచి పోలీసులు సోమవారం తెలిపారు. ఈ పురాతన అధీనంకు సుమారు రూ.1,000 కోట్ల ఆస్తులు ఉన్నాయని.. వాటిని స్వాధీనం చేసుకోవడానికి నిత్యానంద శిష్యులు పథకం వేశారని వారు చెప్పారు. మొదలియార్ సంఘం అధ్యక్షుడు రాధాక్రిష్ణన్ నేతృత్వంలో శివకంచి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పీఠాధిపతి తిరువంబల జ్ఞానదేశికన్ స్వామి కనిపించడం లేదని, నిత్యానంద శిష్యులు అపహరించినట్టు సంబంధిత ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా, తొండైమండల అధీనం పీఠాధిపతిని బెంగళూరు పరిసరాల్లో ఉంచినట్లు ఆయన భక్తులు చెబుతున్నారు. అతని చుట్టూ నిత్యానంద శిష్యులు ఉన్న చిత్రాన్ని స్థానికంగా ఉన్న కొందరి చరవాణులకు వాట్సాప్‌లో పంపగా పోలీసులు వాటిని పరిశీలిస్తున్నారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెప్పారు.



తొండై మండల అధీనం పీఠాధిపతి తిరువంబల జ్ఞానదేశికన్ స్వామితో నిత్యానంద శిష్యులు (వాట్సాప్‌లో వచ్చిన చిత్రం)

మూడేళ్ల న్యాయశాస్త్రం చదివిన వారికీ అవకాశం కల్పించండి

లా క్లర్కు ఉద్యోగాల భర్తీపై రిజిస్ట్రార్ జనరల్‌కు హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: మూడేళ్ల న్యాయశాస్త్రంలో డిగ్రీ పూర్తి చేసిన వారికి లా క్లర్కుల పోస్టుల భర్తీ ప్రక్రియలో అవకాశం కల్పించాలని హైకోర్టు పేర్కొంది. ఆ మేరకు సవరణ చేసిన ప్రకటనను హైకోర్టు వెబ్‌సైట్లో ఉంచాలని హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్(ఆర్‌జీ)ను ఆదేశించింది. దరఖాస్తుల ఆహ్వానానికి గడువు పొడిగించాలా? వద్దా? అనే విషయంపై నిర్ణయం తీసుకొనే వ్యవహారాన్ని ఆర్‌జీకి వదిలేసింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ టి.రజనితో కూడిన ధర్మాసనం సోమవారం ఈమేరకు తీర్పు వెల్లడించింది. హైకోర్టు న్యాయమూర్తులకు వృత్తిలో సహకారాలు అందించేందుకు 'లా క్లర్కుల' పోస్టుల భర్తీ నిమిత్తం హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ గతనెల 18న జారీచేసిన ప్రకటనను సవాలు చేస్తూ నారాయణగూడకు చెందిన న్యాయవాది ఎస్.ఎం.సైఫుల్లా హైకోర్టులో ఈ వ్యాజ్యం దాఖలు చేశారు. మూడేళ్ల కోర్సు చేసిన వారికి లా క్లర్కుల పోస్టుల భర్తీలో పాల్గొనే అర్హత కల్పించకుండా.. ఐదేళ్ల లా కోర్సు చేసిన వారికి మాత్రమే అర్హత కల్పించడం చట్ట విరుద్ధమని వ్యాజ్యంలో పేర్కొన్నారు.

అసిస్టెంట్ ఇంజినీర్ల నియామకం కేసులో.. తీర్పు రిజర్వు

ఈనాడు, దిల్లీ: తెలంగాణలోని విద్యుత్ సంస్థల్లో అసిస్టెంట్ ఇంజినీర్ల నియామకంపై దాఖలైన పిటిషన్‌పై తీర్పుని సుప్రీంకోర్టుని రిజర్వుచేసింది. పలువురు ధ్రువపత్రాల పరిశీలనకు రాకపోవడంతో భర్తీకాకుండా ఉన్న సుమారు 230 పోస్టుల్లో మెరిట్ ప్రకారం తమకు అవకాశం ఇవ్వాలని కొందరు సుప్రీంకోర్టుని ఆశ్రయించారు. ఈ కేసు సోమవారం జస్టిస్ మదన్ బి.లోకూర్, జస్టిస్ దీపక్‌గుప్తాలతో కూడినధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాదులు ప్రశాంత్‌భూషణ్, కొలిన్ గొన్‌సాల్వేస్, సత్యంరెడ్డి వాదనలు వినిపించారు. ఎన్‌పీడీసీఎల్, ఎస్‌పీడీసీఎల్ రెండూ ఒకే రోజున మౌఖికపరీక్షలు నిర్వహించడం వల్ల పలు పోస్టులు భర్తీ కాలేదన్నారు. ఇలా భర్తీ కాకుండా ఉన్న సుమారు 230 పోస్టులు మెరిట్‌జాబితా ప్రకారం జాబితాలోని తర్వాత అర్హులతో భర్తీ చేయాలని కోరారు. దీనిపై ఎలాంటి అభ్యంతరం లేదని తెలంగాణ ప్రభుత్వం అఫిడవిట్‌లో తెలిపిందన్నారు. ప్రభుత్వానికి అభ్యంతరం లేని అంశాన్ని పరిగణనలోకి తీసుకొని పిటిషనర్ల విజ్ఞప్తి మేరకు జాబితాలో అర్హులతో ఆ ఉద్యోగాలు భర్తీ చేసేలా ఆదేశాలివ్వాలని ప్రశాంత్ భూషణ్ కోర్టుకి విజ్ఞప్తిచేశారు. వాదనల అనంతరం తీర్పు రిజర్వు చేస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92,
Regd. No. L/RN/KAR/48/2015-17 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00